ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋుతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ చతుర్దశి సా. 5.45 వరకు, అనంతరం అమావాస్య; నక్షత్రం: శతభిషం సా. 6.23 వరకు, అనంతరం పూర్వాభాద్ర; అమృతకాలం: ఉ. 10.40 నుండి 12.20 వరకు; వర్జ్యం: రా. 1.06 నుండి 2.47 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, మ. 12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!

సంపుటి:56 • సంచిక: 334 • శుక్రవారం 16 మార్చి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

చీకటి నుంచి వెలుగులోకి...అపనమ్మకం నుంచి ఆత్మ విశ్వాసంలోకి..అణగారిన స్థితి నుంచి అభ్యున్నతిలోకి.. వలస బతుకుల నుంచి వ్యవసాయ ప్రగతి వైపు రాష్ట్ర ప్రజల నడక!



సకల జనుల సంక్షేమ బడ్జెట్




బడ్జెట్ పత్రాల సూట్‌కేసుతో ముఖ్యమంత్రి కేసీఆర్, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

అంచనా వ్యయం: రూ.1,74,453 కోట్లు

రెవెన్యూ వ్యయం: రూ.1,25,454 కోట్లు

ప్రగతి పద్దు: రూ.88,038 కోట్లు

ఇరిగేషన్‌కు నిధుల వరద



కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.5386.41 కోట్లు

కార్పొరేషన్ల ద్వారా నిధుల సేకరణ



జీడీపీలో జాతీయ వృద్ధి రేటుని దాటి మెరుగ్గా ఉన్నాం
పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ సమస్యలను అధిగమించాం
రాష్ట్ర తలసరి ఆదాయాన్ని ఏటికేడాది పెంచుతున్నాం
పంట పెట్టుబడికి రూ.12,000కోట్లు ప్రతిపాదించాం

ఇది అందరి బడ్జెట్: సీఎం కేసీఆర్

ఇది ఓట్ల బడ్జెట్ కాదు: ఈటల

అసాధారణం, అమోఘం: కేటీఆర్

పొంతన లేని బడ్జెట్: కాంగ్రెస్

అంకెల గారడీయే: టీ.టీడీపీ

ఖచ్చితంగా ఎన్నికల బడ్జెట్: బీజేపీ

సొంత వనరులే ఆశాదీపాలు

పవర్‌ఫుల్ స్టేట్‌గా తెలంగాణ

చదువుకు దండిగా నిధులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ప్రాధాన్యత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతు సంక్షేమం, ప్రజాకర్షక పథకాలే లక్ష్యంగా ఐదో భారీ బడ్జెట్‌ను తెలంగాణ సర్కార్ ప్రవేశపెట్టింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం, సంక్షేమానికి పెద్దపీట, నీటి పారుదల రంగానికా, ప్రాజెక్టులకు పెద్దటీట వేస్తూ 2018-19 వార్షిక బడ్జెట్ సకల జనుల సంక్షేమ బడ్జెట్‌గా అలరారింది. సంక్షేమ రంగానికి పెద్దపీట వయడంద్వారా అధిక కేటాయింపులతో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యతనిచ్చింది. గ్రామీణ వృత్తులు, ఆర్థిక ప్రేరణకు వరంగా మారింది. వరుసగా ఐదో ఏడాదికూడా మిగులును సంతరించుకున్న బడ్జెట్ గత నాలుగేళ్ల పంథాను అనుసరిస్తూనే సొంత వనరులపై భారీ ఆశలతో రూ. 1,74,453కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రతిఫలించింది. రూ. 5520 కోట్ల మిగులును ఈ బడ్జెట్ నమోద చేసుకుని వరుసగా ఐదో ఏడాదికూడా మిగులు రాష్ట్రంగా ఘనతను కొనసాగించింది. ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడం, ప్రజా సంక్షేమ పథకాల ప్రాధాన్యత, కొత్త పథకాలు ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో బడ్జెట్ రూపొందింది. ప్రగతి పద్దుకు రూ. 88,038 కోట్లు, నిర్వహణ పద్దుకు రూ. 61,607కోట్లను కేటాయించిన ప్రభుత్వం రాష్ట్ర సొంత వనరుల ఆదాయాన్ని గతేడాది కంటే 20శాతం వృద్ధిరేటు అంచనాలతో రూ. 73,451 కోట్లుగా అంచనా వేసుకుంది. మొత్తం క్యాపిటల్ వ్యయం రూ.33,369.10కోట్లుగా కేటాయింపులు చేయగా, కేంద్ర వాటాగా రూ.29,041 కోట్ల రాబడిని అంచనా వేసుకున్న బడ్జెట్‌లో ద్రవ్యలోటును రూ.29,077 కోట్లను అంచనాగా వేసుకున్నారు. ఇది రాష్ట్ర జిడిపిలో 3.45 శాతంగా అంచనా వేశారు.

గ్రామీణ వికాసం...బలహీనవర్గాల సంక్షేమం...

గ్రామీణ వికాసం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం,



వృత్తిదారుల రక్షణే లక్ష్యంగా ఐదో వార్షిక బడ్జెట్‌ను గురువారం ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో విద్య, వ్యవసాయం, పేదల వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. పేదల సంక్షేమమే లక్ష్యంగా, కులవృత్తుల పరిరక్షణకు ఫెడరేషన్ల బలోపేతం దిశగా నిధులను పెంచింది. మొత్తంగా రాష్ట్ర ప్రగతికి సూచికగా ఎన్నికల ఏడాది దృష్టితో ఈ బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. సకల జనులను ఆకట్టు కనేలా కేటాయింపులు, పథకాల కూర్పు చేసింది. ఈ ఏడాది జీడిపి వృద్ధిరేటు 10.4 శాతంగా ప్రభుత్వం అంచనా వేసింది స్థూల ఉత్పత్తిలో ఘననీయమైన ప్రగతి సాధ్యమని నమ్మిన ప్రభుత్వ చర్యల ఫలితంగా ఆ దిశగా తలసరి వృద్ధిరేటు కూడా అపూర్వంగా పెరిగింది. ఈ ఏడాది రూ. 1,75,534తో జాతీయ తలసరిని కూడా అధిగమించింది. తెలంగాణ రాష్ట్ర జీడిపి 2013-14లో 5.4 శాతం కాగా 2018-19వార్షిక ఏడాదికి గణనీయంగా పుంజుకుంది. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వనరుల సద్వినియోగంతో మెరుగుపడుతూ వస్తోంది. 2014-15లో 6.8 శాతానికి, ప్రస్తుత ఏడాదికి ఇది 10.4 శాతంగా అంచనా వేశారు. మొత్తంగా జీఎస్‌డిపి గతేడాది రూ. 6,41,985 కోట్లుకాగా అది ఈ ఏడాదికి రూ. 7,32,657కోట్లుగా రికార్డు స్థాయిలో 14.1 శాతం వృద్ధిరేటును నోదు చేసుకోవడం విశేషం.

సమతుల్యత...సర్కార్ లక్ష్యాలకు అనువుగా...

రాష్ట్రఆదాయవనరులకు, అవసరాలకు, ప్రభుత్వ లక్ష్యాలకు మధ్య పూర్తి సమన్వయంతో సిద్ధం చేసిన బడ్జెట్ అన్ని వర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి సమతుల్యతను నమోదు చేసుకుంది. వ్యవసాయ రంగానికి అత్యధికంగా మార్కెటింగ్‌తో కలుపుకుని రూ. 15,780కోట్లను కేటాయించడంతోపాటు కీలకమైన అనుబంధ రంగాలకు అత్యంత 2వ పేజీలో...

కాంగ్రెస్ దీక్ష విరమణ.. స్వామిగౌడ్ డిశ్చార్జ్



గురువారం సాయంత్రం కోమటిరెడ్డి, సంపత్ ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష విరమణ దృశ్యం



ప్రతిపక్షం లేకుండా బడ్జెట్టా?

- ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్న
- కేసీఆర్‌కు ధైర్యముంటే నా మీద పోటీ చేసి గెలవాలి: కోమటిరెడ్డి
- అసెంబ్లీ సభ్యత్వాల రద్దుపై హైకోర్టులో పిటిషన్

7

వ్యక్తులపై దాడులతో

సమస్యలు తీరవు

పోరాడి సాధించాలి: స్వామిగౌడ్

ఇంటింటికీ ఓ పథకం!

రైతుల నుంచి మత్స్యకారుల దాకా
సామాన్యుడి నుంచి రోగగ్రస్తుల దాకా
అన్నివర్గాలకు చేరేలా బడ్జెట్ రూపకల్పన
కేసీఆర్ ఎన్నికల వ్యూహరచనకు అద్దం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు పకడ్బందీ వ్యూహం రచించారు. 2018-19 బడ్జెట్ కేటాయింపులు ఈ వ్యూహాన్ని ప్రతిబింబిస్తున్నాయి. బడ్జెట్‌లో వ్యవసాయం, సంక్షేమం, విద్య, వైద్యం తదితర రంగాలకు పెద్దపీట వేశారు. ఇది 2019 ఎన్నికల బడ్జెట్ కాదని టీఆర్ఎస్ మంత్రులు, నాయకులు చెప్పినప్పటికీ, రాబోయే సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీని గెలిపించుకునేందుకు, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీని మట్టి కరిపించేందుకు అసాధారణ స్కెచ్ వేసినట్లే కనిపిస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్ర జనాభా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో 3.64 కోట్లు కాగా, అందులో ప్రతి ఒక్కరికి ఏదో రకంగా ప్రభుత్వం నుంచి ప్రయోజనం కలిగే విధంగా సీఎం పథక రచన చేశారు. హెల్త్ ప్రొఫైల్ ఆఫ్ తెలంగాణ, అందరికీ కంటి పరీక్షలు, రైతు లక్ష్మి బీమా, డబుల్ బెడ్ రూంఇళ్లు, ఇంటింటికి తాగునీరు అందించే మిషన్ భగీరథ, గొర్రెల కాపరులకు గొర్ల పంపిణీ, మత్స్యకారులకు చేపల పంపిణీ, రైతు సమితులను ఏర్పాటు చేసి 35 లక్షల మంది రైతులకు మద్దతు ధర ఇప్పించడం తదితర పథకాలు ప్రతి ఇంటి గడప తట్టే విధంగా ఉన్నాయి. హెల్త్ ప్రొఫైల్ ఆఫ్ తెలంగాణ పథకం ద్వారా అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడమే ఒక రికార్డుగా చెప్పవచ్చు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి పథకాన్ని గడచిన 60 ఏళ్లలో చేపట్టలేదు. అదే విధంగా ఇంటింటికి తాగునీరు అందించే మిషన్ భగీరథ పథకం కూడా ఊహకందని హామీ. వేలకిలోమీటర్ల పొడవునా పైపులు వేసి ఇంటింటికి తాగునీరు అందించడమనేది ఆషామాషీ వ్యవహారం కాదు. కానీ, అలాంటి బృహత్తర యజ్ఞానికి కేసీఆర్ మిషన్ భగీరథ పేర శ్రీకారం చుట్టి 95 శాతంపనులను ఇప్పటికీ పూర్తి చేయించారు. ఇంటింటికి సురక్షితమైన తాగునీరు 2019 ఎన్నికల్లోపు అందిస్తామని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ప్రసక్తే లేదని శాసనసభలో ప్రకటించిన సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించడమే గాక, బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పటికే తీసుకున్నారు. నిర్ణయించిన గడువులోగానే తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అదే విధంగా 35 లక్షల మంది రైతులకు 5 లక్షల బీమా సౌకర్యం కల్పించే రైతు లక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు మరింత చేరువ కానుంది. ఇప్పటికే 2వ పేజీలో...



ఔరా..!



ఢిల్లీలో గురువారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి హరీష్ రావు

దేవాదులకు నిధులివ్వండి

నితిన్ గడ్కరీకి హరీష్‌రావు వినతి

సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి

10లో

మోడీ సర్కారుపై అవిశ్వాసానికి

మేం మద్దతిస్తాం

ఏ క్షణమైనా టీడీపీ రెడీగానే ఉంది
మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటన



అమరావతి, ఆంధ్ర ప్రభ: రాష్ట్రానికి మేలు జరుగుతుందంటే పార్లమెంట్‌లో కేంద్రంపై ఎవరు అవిశ్వాసం పెట్టినా టీడీపీ మద్దుతు ఇచ్చి, బలపరుస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజకీయాల్లోకి వచ్చి 40 ఏళ్లు పూర్తయి, 41 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా గురువారం శాసనసభలో ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు అభినందన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు 8వ పేజీలో...

వైకాపా నోటీస్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌తో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ ఎంపీ వైవి.సుబ్బారెడ్డి లోక్‌సభలో అవిశ్వాస తీర్మానానికి సెక్రటరీ జనరల్ కు నోటీసు ఇచ్చారు. వివిధ రాజకీయ పార్టీల నేతలను కలిసి అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన లోక్‌సభ పక్షనేత 8వ పేజీలో...

సంకల్పానికి సెల్యూట్!



మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో కాలివేళ్లతో టెన్త్ క్లాస్ పరీక్ష రాస్తున్న ఓ వికలాంగ విద్యార్థి

వివరాలు 8లో...



రైతుకి పెద్దన్న



• అన్నదాతల అదనపు ఆదాయానికి మరిన్ని ప్రోత్సాహకాలు • అనుబంధ రంగాల బలోపేతం ద్వారా మెరుగైన ఉపాధి • నిధుల కేటాయింపుల్లో సీఎం కేసీఆర్ ముందుచూపు విధానం • 1.6 లక్షల రైతు సమన్వయ సమితుల ద్వారా చేయూత • పెట్టుబడి మద్దతు పథకానికి రూ.12వేల కోట్లు • రూ.500 కోట్ల అంచనాతో కొత్తగా రైతు బీమా పథకం • వ్యవసాయ యాంత్రీకరణకు రూ.522 కోట్లు • రూ.127 కోట్లతో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు విస్తరణ • పాలీహౌస్, గ్రీన్ హౌస్ ప్రాజెక్టులకు రూ.120 కోట్లు • కోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి రూ.132 కోట్లు • వ్యవసాయ మార్కెట్ల ఆధునీకరణ, మద్దతు ధర అమలుకు రూ.15,780 కోట్ల నిధి • అన్నదాత సంక్షేమానికి 26శాతం కేటాయింపులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గత మూడేళ్ళుగా వరుసగా వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో మరింత ప్రాధాన్యత కల్పించింది. అందుబాటులో ఉన్న వనరులన్నింటినీ సద్వినియోగం చేసుకుంటూ సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు ఈ రంగంపై ఆధారపడిన 75 లక్షల రైతు కుటుంబాలకు ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలన్న దిశగా నిధులు కేటాయించారు. దేశంలోనే ప్రప్రథమంగా ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్న పంట పెట్టుబడి పథకం అమలుకు 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు ప్రతిపాదించారు. రాష్ట్రంలో చిన్న సన్నకారు రైతులే అత్యధికులు ఉన్నందున సీఎం కేసీఆర్ వారిపట్ల మరింత సానుకూలంగా స్పందించారు. కొత్తగా రైతు బీమా పథకాన్ని ప్రకటించి బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు.

పంట పెట్టుబడి వ్యయం తగ్గి రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు అందుకు ప్రోత్సహించే రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత కల్పించారు. సంక్షోభం నుంచి రైతులను పూర్తిగా బయట పడేసేందుకు సీఎం కేసీఆర్ వ్యూహాత్మక కార్యాచరణను ఎంచుకున్నారు. రైతు సమన్వయ సమితుల వ్యవస్థ ద్వారా ప్రణాళికేతర నిధులు భారీగా ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు.

రైతు వేదికల నిర్మాణాన్ని ఈ ఏడాది లోనే పూర్తిచేసి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల ద్వారా మెరు గైన సాగు విధానాలను అమలు చేసేందుకు అవసరమయ్యే మొత్తాన్ని కూడా ప్రణాళికేతర వ్యయం కిందే ప్రతిపా దించారు.

దురదృష్టవశాత్తూ ఎక్కడైనా రైతు అకాల మరణం చెందినా, ప్రమాద వశాత్తూ మృతి చెందినా, ఆత్మహత్యకు పాల్పడినా రూ.5లక్షల చొప్పున బీమా సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువస్తూ రైతు బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. అందుకు బడ్జెట్లో రూ.500 కోట్లు ప్రతిపాదించారు. అలాగే నానాటికీ పెరుగుతున్న పంట పెట్టుబడి వ్యయం తగ్గించేందుకు వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ 50 నుంచి 95శాతం ప్రత్యేక సబ్సిడీపై యంత్రాలు, పరికరాలను సరఫరా చేయాలని నిర్ణయించారు. ట్రాక్టర్లు, కోత యంత్రాలు, సేద్య పరికరాలు, నాటు యంత్రాలు, స్ప్రేయర్లు తదితర వాటిని పంపిణీ చేసేందుకు బడ్జెట్‌లో రూ.522 కోట్లు కేటాయించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ బీసీలతో పాటు అన్ని సామాజికవర్గాలకు చెందిన రైతులకు తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. అందుకు 80 నుంచి 100 శాతం సబ్సిడీపై బిందు, తుంపర సేద్యం పరికరాలను పంపిణీ చేసేందుకు బడ్జెట్‌లో రూ.127 కోట్లు ప్రతిపాదించారు.

చిన్న, సన్నకారు రైతులను లాభదా య కమైన ఉద్యాన పంటలవైపు మళ్ళించి వారి ఆదాయం పెంచేం దుకు 75శాతం సబ్సిడీపై గ్రీన్‌హౌస్, పాలిహౌస్ కల్టివేషన్‌ను ప్రోత్సహించేందుకు బడ్జెట్లో రూ.120 కోట్లు ప్రతిపాదించారు.

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ యార్డులను ఆధునీకరించి మోసాలను నియంత్రించడంతో పాటు, రైతు సమన్వయ సమితుల ఆధీనంలో కనీస మద్ధతు ధరలను అమలు చేసేందుకు, అవసరం మేరకు వివిధ పంటలను కొనుగోలు చేసేందుకు రూ.15,780 కోట్లు కేటాయించారు. అలాగే కొన్ని పంటలను నిల్వ చేసేందుకు లింకేజీ కోల్డ్ స్టోరేజీలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రూ.132 కోట్లు ప్రతిపాదించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధి కలుపుకుని 2017-18 బడ్జెట్లో రూ.13,640 కోట్లు కేటాయించగా, రూ.13,512 కోట్లు ఖర్చు చేశారు. ఆ మొత్తాన్ని 2018-19 బడ్జెట్‌లో రూ.20,820 కోట్లకు భారీగా పెంచారు.

గ్రామీణ ప్రాంతాల్లో సంపద సృష్టించేందుకు దోహదపడే బడ్జిడీ గొర్రెల పథకాన్ని రుణ ఆధారిత పథకంగా గుర్తించారు. 2018-19లో సుమారు రూ.6వేల కోట్ల అంచనా వ్యయంతో గొల్ల, కుర్మలకు గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే లక్షలాది కుటుంబాలు ఆధారపడిన చేపల పెంపకం వృత్తిని ప్రోత్సహించేందుకు రూ.2వేల కోట్లు రుణ రూపంలో సమీకరించుకోవాలని బడ్జెట్లో ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ పద్దు కిందనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రానికి ఒకటి చొప్పున 31 హోల్‌సేల్ చేపల మార్కెట్లు, 200 రిటైల్ మార్కెట్లను నిర్మించనున్నారు. ఎగ్ బాస్కెట్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన తెలంగాణాలో పౌల్ట్రీ పరిశ్రమను మరింతగా ప్రోత్సహించేందుకు 2018-19 బడ్జెట్‌లో రూ.109 కోట్లు కేటాయించారు.

ఇది ప్రజల ప్రభుత్వం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్న దృఢ సంకల్పంతోనే తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఆ దిశగానే సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన జరిగిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తెలిపారు. 2018-19 వార్షిక బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాలను సంతృప్తిపరిచే విధంగా ఉన్నా యన్నారు. గురువారం అసెంబ్లీ ఉభయ సభల్లో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన స్పందించారు. పూర్తి సమతుల్యతతో బడ్జెట్ ప్రతిపాదించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఉన్న ఆదాయ వనరులను, ప్రజల అవసరాలను, ప్రభుత్వ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నిధుల సమకూర్పు చేశామన్నారు. అభివృద్ధి ప్రణాళికలు సమర్ధవంతంగా అమలయ్యేలా ఆర్థిక వార్షిక ప్రణాళిక రూపొందించిన మంత్రి ఈటల రాజేందర్, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక సలహాదారు జిఆర్ రెడ్డిని సీఎం కేసీఆర్ అభినందించారు. ఎక్కువ శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగానికి అత్యధిక నిధులు ప్రతిపాదించడంపట్ల సంతోషం వ్యక్తంచేశారు. సాగునీటి ప్రాజెక్టులు, పంట పెట్టుబడి పథకం, విద్యుత్ సబ్సిడీ రంగాలకు ఎక్కువ నిధులు సమకూర్చడంవల్ల తెలంగాణ వ్యవసాయ రంగాభివృద్ధిపట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోందన్నారు. అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో విజయవంతమై రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.



బడ్జెట్ ప్రవేశపెట్టేముందు ఐటీ మంత్రి కేటీఆర్‌ను ఆలింగనం చేసుకుంటున్న ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

బడ్జెట్ కేటాయింపుల స్వరూపం

	(రూ.కోట్లలో)
మొత్తం అంచనా వ్యయం	1,74,453.84
ప్రభుత్వ పథకాల వ్యయం	1,04,757.90
నిర్వహణ వ్యయం	69,695.94
ప్రధాన పథకాలు	
సాగునీరు	25,000.00
రైతులకు పెట్టుబడి రాయితీ	12,000.00
ఆసరా (పెన్షన్లు)	5,366.89
విద్యుత్ సబ్సిడీ	4,984.30
స్కాలర్‌షిప్‌లు	3,282.24
సబ్సిడీ బియ్యం	2,744.43
మిషన్ భగీరథ	1,803.35
ఆర్థిక మద్దతు పథకాలు	1,682.53
పంచాయతీరాజ్ సంస్థలకు గ్రాంట్లు	1,500.00
డబుల్ బెడ్‌రూమ్స్ ఇళ్ళు	1,500.00
కళ్యాణలక్ష్మీ	1,450.46
చేనేతకు ఆర్థికసాయం	1,200.00
పట్టణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు	1,000.00
అత్యంత వెనకబడిన కులాలకు	1,000.00
ఆర్టీసీ	975.55
డ్వాక్రాకు వడ్డీలేని రుణాలు	930.00
జిహెచ్‌ఎంసి రోడ్లకు	750.00
మునిసిపల్ కార్పొరేషన్లకు సాయం	700.00
ఆరోగ్యశ్రీ	699.44
కేసీఆర్ కిట్లు	560.50
వ్యవసాయ యాంత్రీకరణ	522.00
రైతులకు వడ్డీలేని రుణాలు	500.00
కలెక్టరేట్ల నిర్మాణాలు	500.00
నియోజకవర్గాల అభివృద్ధి	480.00
ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ స్కీం	300.00
కమాండ్ కంట్రోల్ సెంటర్ (పోలీస్)	280.80
యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధి	250.00
రజక సహకార సమాఖ్య	200.00
విదేశీ విద్యాపథకం	174.50
వేములవాడ దేవాలయ అభివృద్ధి	100.00
భద్రాచలం దేవాలయం	100.00
బాసర దేవాలయం	50.00
ధర్మపురి దేవాలయం	50.00
విశ్వబ్రాహ్మణ సహకార సంస్థ	10.00

ఆదాయ వనరులు

	(రూ.కోట్లలో)
మొత్తం రెవెన్యూ	**1,30,975.11**
కేంద్ర పన్నుల వాటా	19,207.43
రాష్ట్ర పన్నులు	73,751.88
ఇందులో..	
అమ్మకం పన్ను (జిఎస్‌టితో)	**53,482.00**
ఎక్సైజ్	10,600.00
స్టాంప్స్, రిజిస్ట్రేషన్లు	4,700.00
వాహనాల పన్ను	3,950.00
పన్నురహిత రెవెన్యూ	8,973.92
కేంద్ర నుంచి గ్రాంట్లు	**29,041.88**
ఇందులో...	
స్పెషల్ ప్యాకేజీ	900.00
కేంద్ర ప్రా. పథకాలు	9,723.44
ఆర్థిక సంఘం గ్రాంట్లు	2,720.26
ఇతర గ్రాంట్లు	15,698.18
మొత్తం వ్యయం	**1,74,453.84**
రెవెన్యూ వ్యయం	1,25,454.70
పెట్టుబడి వ్యయం	33,369.10
రుణాలు, అడ్వాన్స్‌లు	9,035.55
ప్రజల ఖాతాలకు చెల్లింపులు	6,594.44
రెవెన్యూ మిగులు	**5,520.41**
ద్రవ్యలోటు	**29,077.07**

భారీ అంచనాలు

• రూ.1,74,453 కోట్లు • సొంత వనరుల రాబడి 73,451 కోట్లు • కేంద్ర వాటా రూ.29,041 కోట్లు • రెవెన్యూ మిగులు రూ. 5520 కోట్లు • ద్రవ్యలోటు రూ.29077 కోట్లు • స్థూల ఆర్థిక వృద్ధి లోటు 10.1శాతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వాస్తవ అంచనాలు, నిర్దేశిత రాబడిలక్ష్యాలతో తెలంగాణ సర్కార్ ఐదో పూర్తిస్థాయి బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టింది. 2018-19 వార్షిక స్థూల బడ్జెట్ గతేడాది కంటే రూ. 24,807 కోట్ల అదనపు మొత్తం పెంపుతో రూ.1,74,453.84 కోట్లను సంతరించుక ుంది.

ఈ వార్షిక ఏడాది రెవెన్యూ మిగులుగా రూ. 5520 కోట్ల అంచనా వేసుకున్న ప్రభుత్వం రాబడులపైభారీగా అంచనాలను పెంచుకుంది. సాగునీటి రంగానికి కేటాయించిన నిధులను నిర్మాణ వ్యయంగా పరిగణించిన కారణంగానే రెవెన్యూ మిగులను అధికంగా అంచనా వేసినట్లు స్పష్టమవుతోంది.

ఈ వార్షిక ఏడాది బడ్జెట్ రూ. 1,74,453 కోట్లలో సొంత వనరుల రాబడిని గతేడాది రూ. 69,220కోట్లనుండి 20 శాతం పెంపుతో రూ. 73451కోట్లకు పెంచుకుంది. అయితే 2017-18లో సవరించిన అంచనా మేరకు రూ. 1,42,506కోట్లు వ్యయం అవుతాయని ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది. ఇందులో రెవెన్యూ వ్యయం రూ. 1,06,603కోట్లుకాగా, క్యాపిటల్ వ్యయం రూ. 25,447కోట్లుగా అంచనా వేశారు. అయితే ఆ మేరకు సాధ్య పడలేదు. సవరించిన అంచనాల్లో ఇది 95 శాతమే నమోదైంది. ఇక కీలక వనరులు భారీగా కోత పడగా, జీఎస్టీ కారణంగా ప్రతికూల స్థితుల్లో రాబడులు మందగించాయి. తద్వారా గతేడాదికంటే ఆదాయం పెరుగుదల స్వల్పంగా తగ్గింది.

వాణిజ్య పన్నుల రాబడి అంచనాలు రూ. రూ. 46,499 కోట్లనుంచి రూ. 25,942 కోట్లకు కుదించారు. జీఎస్టీ రాకతో మొత్తంగా ఈ రాబడిపై ప్రభావం పడింది. కేంద్ర వస్తువు లపై సేవల పన్నును(సీజీఎస్టీ) రూ.6181 కోట్లుగా, ఎస్జీఎస్టీ రూ. 26,040కోట్లు, ఐజీఎస్టీ రూ. 511కోట్లు, పరిహారం రూపంలో రూ 1500కోట్లు అంచనా వేశారు. మరో కీలక ఆదాయ వనరుగా ఉన్న ఆబ్కారీ శాఖ లక్ష్యం రూ. 8999కోట్ల నుంచి రూ. 10,600 కోట్లకు వర్తింపజేసింది.

ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో సొంత వనరుల రాబడి శాఖలనుంచి ఎక్సైజ్ శాఖ మాత్రమే లక్ష్యం చేరింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్లశాఖ రాబడి లక్ష్యం రూ. 3వేల కోట్లనుంచి రూ. 4699 కోట్లకు లక్ష్యాన్ని పెంచుతూ నిర్ణయించారు. వాహన పన్నుల రాబడిని రూ. 3వేల కోట్లనుంచి రూ. 3950 కోట్లకు పెంచింది.


10.1 శాతంగా రాష్ట్ర స్థూల ఆర్థిక వృద్ధి...


రాష్ట్ర స్థూల ఆర్థిక వృద్ధిరేటు జీఎస్టీ తర్వాత రాష్ట్రంలో రెండంకెల వృద్ధిని సాధించింది. 2014-15, 2015-16లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో 9.5 శాతం, 6.3 శాతంగా కుంటుపడినా ఆర్థికంగా రెండంకెల వృద్ధిరేటుకు చేరువైంది.

2017-18తో ముగిసిన ఆర్థిక ఏడాదికి జాతీయ వృద్ధిరేటు తెలంగాణ స్థూల ఆర్థిక వృద్ధిరేటు 10.1 శాతంగా నమోదవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

కేంద్ర వితరణ నిధులు...

ఇక కేంద్ర వితరణ కింద వచ్చే నిధులను 2015-16లో రూ. 25223.49 కోట్లు అయితే 2017-18లో ఇవి రూ. 43,862కోట్లకు అంచనా వేశారు. ప్రారంభ నిల్వను రూ. 560కోట్లతో మొదలు పెట్టిన తెలంగాణ బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులను రూ.1,33,650.04 కోట్లుగా నిర్ధేశించింది.





సకల జనుల సంక్షేమ బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యతనిచ్చింది. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం ఈ ఏడాది కూడా విశేష ప్రాధాన్యతతో రూ. 25వేల కోట్లను కేటాయింపులు చేసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దేశంలోనే తొలిసారిగా విప్లవాత్మకంగా అమలులోకి తెస్తున్న పంట పెట్టుబడి సాయం పథకానికి రూ. 12వేల కోట్లను కేటాయించింది. సాగునీరు, పెట్టుబడి,గిట్టుబాటు ధర సమకూర్చినప్పుడే రైతుల కష్టాలు తీరుతాయని నమ్మిన ప్రభుత్వం ప్రాజెక్టులను శరవేగంగా నిర్మిస్తూనే చెరువులను పునరుద్ధరిస్తున్న ప్రభుత్వం మిషన్ కాకతీయకు రూ. 25వేల కోట్లు కేటాయించింది. రాష్ట్ర అభివృద్ధిలో వ్యవసాయరంగం కీలకమైందని గుర్తించిన ప్రభుత్వం ఆదిశగా అనేక సంస్కరణలకు బీజం వేసింది.

వ్యవసాయరంగ పునరుజ్జీవనంతోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టం చేయాలని యోచించి ఆదిశగా బడ్జెట్‌లో ఆయా రంగాలకే సింహ భాగం కేటాయింపులు చేసి తన ప్రాధాన్య తలను స్పష్టం చేసింది. ఈ ఏడాదినుంచే రైతుకు పెట్టుబడి సాయంగా ఎకరాకు ఏడాదికి రూ.8వేలను అందించే పథకానికి శ్రీకారం చుట్టింది, ఇందుకుగానూ రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం నిధులనూ కేటా యించింది. రైతు ప్రభుత్వంగా పేరుగాంచిన సర్కార్ రూ.15 వేల కోట్లను కేటా యింపులు చేయడం విశేషం. రైతు బీమా కోసం రూ.500కోట్లను కేటాయించడం కూడా రైతు ఉద్ధరణకే కావడం గమ నార్హం. ఇవి కాకుం డా వ్యవసాయ యాంత్రీకరణకు రూ.522కోట్లు, కోల్డ్ స్టోరేజీలు, లింకేజీలకు రూ.132కోట్లు. బిందు, తపర సేద్యానికి రూ.150కోట్లు, పాలీ గ్రీన్ హౌస్‌కు రూ.120కోట్లను కేటాయించింది.

ప్రధాన పథకాలకు నిధులు ఇలా...

-నీటి పారుదల రంగం	రూ.25వేల కోట్లు
-మిషన్ కాకతీయ	రూ. 25 వేల కోట్లు
-వ్యవసాయ, మార్కెటింగ్	రూ.15780కోట్లు
-మిషన్ భగీరథ	రూ.1801కోట్లు
-రెండు పడక గదులకు	రూ.2643కోట్లు
-పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	రూ.15,563కోట్లు
-గురుకులాలు	రూ.2283కోట్లు
-ఆర్ అండ్ బి	రూ.5575కోట్లు
-విద్యుత్ రంగం	రూ.5650కోట్లు
-చేనేత, జౌళి	రూ.1200కోట్లు
-పరిశ్రమలు	రూ.1286కోట్లు
-ఐటీ	రూ.289కోట్లు
-పురపాలక శాఖ	రూ.7251కోట్లు
-గ్రామీణ సంస్థలకు	రూ.1500కోట్లు
-పట్టణాభివృద్ధికి	రూ.1000 కోట్లు
-ఎస్సీ ప్రగతికి	రూ. 16,453కోట్లు
-ఎస్టీప్రగతినిధి	రూ. 9693కోట్లు
-సాంస్కృతిక శాఖ	రూ.58కోట్లు
-యాదాద్రి అభివృద్ధికి	రూ. 250కోట్లు
-వేములవాడ ఆలయ అభివృద్ధికి	రూ. 100కోట్లు
-భద్రాద్రికి	రూ. 100కోట్లు
-బాసర, ధర్మపురికి	రూ.50కోట్ల చొప్పు
-దళితుల 3ఎకరాలకు	రూ.1469కోట్లు
-ఎస్టీ సంక్షేమానికి	రూ. 8063కోట్లు
-బిసి సంక్షేమానికి	రూ. 5920 కోట్లు
-ఎంబిసి కార్పొరేషన్‌కు	రూ.1000కోట్లు
-విద్యాశాఖకు	రూ. 10,830కోట్లు
-వరంగల్ కార్పొరేషన్‌కు	రూ.300కోట్లు
-కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్	రూ. 1450కోట్లు
-మైనార్టీ సంక్షేమానికి	రూ. 2500కోట్లు
-వైద్య, ఆరోగ్య శాఖకు	రూ.7375కోట్లు

రికార్డు స్థాయిలో తలసరి ఆదాయం

• 10.3 శాతంతో ముందంజలో తెలంగాణ
• జాతీయ సగటు 9.3శాతం
• తెలంగాణ తలసరి రూ.1,36,905
• జాతీయ తలసరి రూ.94,731

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ధనిక రాష్ట్రం తెలంగాణ ప్రజల ఆదాయ స్థితిగతులు కూడా అదే స్థాయిలో నమోదయ్యాయి. జాతీయ తలసరి ఆదా యం 9.3 శాతం ఉండగా దీనిని అధిగమించిన తెలంగాణలో ఇది 10.3 శాతంగా నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను తేటతెల్లం చేస్తోంది. 2015- 16లో తెలంగాణ తలసరి ఆదాయం 10.3 శాతంగా రూ. 1,36,905కి చేరింది. జాతీయ సఘటు రూ. 94,731గా ఉంది. 2011-12లో రూ. 91,121 తలసరి ఆదాయం తెలంగాణలో ఉండగా జాతీయ స్థాయిలో ఇది రూ. 63460 నమో దైంది. 2012-13లో తెలంగాణలో తలసరి ఆదాయం రూ. 1,00,979తో 10.8శాతం నమోదుచేసుకుంది. అదేసమయంలో జాతీయ స్థాయిలో రూ. 71,011తో 11.9శాతంకాగా, 2013-14లో తెలంగాణకు 1,12,328తో 11.2శాతం జాతీయ సఘటు రూ. 79146తో 11.5 శాతం నమోదైంది. 2014-15లో తెలంగాణలో 1,25,832తో 12.0శాతం, జాతీయస్థాయిలో 86,513తో 9.3శాతం, 2015-16లో 11.8 శాతం ఉండగా 2016-17లో అది తెలంగాణ రాష్ట్రంలో 1,58,360తో 12.6 శాతంగా నమోదవగా, జాతీయ స్థాయిలో 1,03,818తో 10.2 శాతంగా ఉంది. 2013-14 ఒక్క ఏడాదిలో మాత్రమే జాతీయ సఘటుకంటే తెలంగాణ తలసరి ఆదాయం తక్కువగా నమోదుకాగా రాష్ట్ర అవతరణ తర్వాత ఏనాడు వెనుదిరిగి చూడలేదు.

ఇంటింటికీ ఓ పథకం!

(మొదటి పేజీ తరువాయి)

35 లక్షల మంది రైతుల పంట రుణాలను మాఫీ చేసిన సర్కార్ ఆ దిశలో రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేసి రైతుల నుంచి తిరుగులేని అభిమానం చూరగొంటోంది. ఈ సమితుల ద్వారా రైతులకు మద్దతు ధర కల్పించడం,ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే బాధ్యతలు అప్పగించింది. ఇప్పటికే రాష్ట్రంలో 1.61 లక్షల రైతు సమితులను ఏర్పాటు చేసింది. వెనుకబడిన వర్గాలలో అత్యధికంగా ఉన్న గొల్ల కురుమలు, మత్స్యకారులకు ఇప్పటికే వరాలు ప్రకటించి అమలు చేస్తోంది. 4 లక్షల గొర్ల, కురుమ కుటుంబాలకు గొర్లను పంపిణీ చేసి ఆదరణ పొందారు. మత్స్యకారులకు కోట్లాది చేప పిల్లలను పంపిణీ చేసి ఈ వర్గం ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తోంది. రాష్ట్ర జనాభాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న మాదిగల ఓట్లకు సైతం కేసీఆర్ గాలం వేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ న్యాయమైన అంశమని, వచ్చే ఎన్నికల్లో గెలిచాక తానే వర్గీకరణ ఉద్యమానికి నాయకత్వం వహిస్తానని శాసనసభ సాక్షిగా ప్రకటించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రే నాయకత్వం వహిస్తానని చెప్పడంతో మాదిగ వర్గాలు ఆనందోత్సాహాలతో ఉన్నాయి. గత ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు పూర్తి సహకారం అందించిన ఈ వర్గం,ఇటీవల కాలంలో దూరమయ్యారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగతో రిజర్వేషన్ల వర్గీకరణ సాధ్యం కాదని చెప్పడంతో ఈ వర్గానికి గాలం వేసినట్లు కనిపిస్తోంది. ఒక వ్యూహం ప్రకారమే మందకృష్ణతో వర్గీకరణ సాధ్యం కాదని కేసీఆర్ ప్రకటించారని చెబుతున్నారు. అదే విధంగా మైనారిటీలు, బ్రాహ్మణులు, రజకులు, నాయీ బ్రాహ్మణులు తదితర సామాజిక వర్గాలకు ఇప్పటికే నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో ఎన్నడూ లేని విధంగా పీఆర్‌సీ ప్రకటించారు. వచ్చే పీఆర్‌సీలో సైతం ఉద్యోగులు కోరుకునే విధంగానే ఉంటుందని ఇప్పటికే ఉద్యోగ సంఘాల నాయకులకు సీఎం హామీ ఇచ్చారు.



తెలంగాణ బడ్జెట్ 2018-19

బడ్జెట్ అసాధారణం.. అమోఘం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్థిక శాఖా మంత్రి ఈటల రాజేందర్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అసాధరణమని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖా మంత్రి కేటీఆర్ అన్నారు. 2018- 19బడ్జెట్‌పై మంత్రి ట్విట్టర్ ద్వారా స్పందించారు. వరుస ట్వీట్లతో ప్రశంసలు కురిపించారు. ఒక్కొక్క రైతుకు ఎకరాకు రూ.8వేల చొప్పున ఇచ్చే చారిత్రాత్మక పథకం రైతులక్ష్మికి రూ.12వేల కోట్లు కేటాయించడం అద్భుత మన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి గణనీయంగా పెరుగుతుందన్నారు. 2013-14లో 5.4శాతం ఉన్న జిడిపి, 2014-15లో 6.8శాతం, 2015-16లో 8.6 శాతం, 2016-17లో 10.1 శాతం, 2017-18లో 10.4 శాతంకు చేరుకుందని, జాతీయ వృద్ధిరేటు కంటే ఇది ఎక్కువన్నారు.

దేశం రుణం తీర్చుకునేందుకే కేసీఆర్ కొత్త ఫ్రంట్

తెలంగాణ సాధించి ఈ ప్రాంత బిడ్డగా రుణం తీర్చుకున్న కెసిఆర్ దేశ రుణం తీర్చుకునేందుకు భారత పౌరుడిగా కొత్త ఫ్రంట్ ఏర్పాటుచేయబోతున్నారని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖా మంత్రి కెటిరామారావు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన కెసిఆర్ సరికొత్త రాజకీయాలకు దేశమంతా స్పందిస్తున్నదన్నారు.

రైతు బడ్జెట్: మంత్రి జగదీష్‌రెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది రైతుబడ్జెట్ అని విద్యుత్‌శాఖా మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌పై గురు వారం స్పందించిన ఆయన తెలంగాణ బడ్జెట్ యావత్ భారత దేశానికి తలమానికమన్నారు. సీఎం కెసిఆర్ రైతు పక్షపాతి అని, ఆయన మనోభావాలకు ఈబడ్జెట్ అద్దం పట్టిందన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్ళలో రంగరించిన బడ్జెట్ ఇదన్నారు.

ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్: కొప్పుల ఈశ్వర్

తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్‌ను రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిందని, వరుసగా నాలుగో ఏడాది దేశంలోనే గొప్ప వృద్ధిరేటును అధిగమించడం చారిత్రాత్మకమని రాష్ట్రప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ అన్నారు. టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజికసేవల రంగానికి రూ.55వేలకోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. ధర్మపురి ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించిన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

చారిత్రాత్మక బడ్జెట్: పల్లా

రైతులకు ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడిని ఉచితంగా అందించే చారిత్రక పథకానికి రూ.12వేల కోట్లు కేటాయించడం అద్భుతమని రాష్ట్ర శాసనమండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డి అన్నారు. బడ్జెట్‌పై ఆయన స్పందించారు. సకల వర్గాలకు మేలుచేసేలా, ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. వృద్ధిరేటులో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందని, రూ.1.74 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టే స్థాయికి తెలంగాణను తీసుకెళ్ళిన సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

భూముల అమ్మకాలతో రూ.3వేల కోట్లు
పన్నేతర రాబడులపై ఆశలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మరోసారి భూముల అమ్మకాలతో ఆదాయం ఆర్జించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది పన్నేతర ఆదాయార్జనలో భాగంగా భూముల విక్రయాలతో రూ.3వేల కోట్లను సముపార్జించాలని బడ్జెట్‌లో పొందుపర్చుకుంది. పన్నేతర ఆదాయాలపై ప్రభుత్వం ఈ వార్షిక ఏడాదిలో భారీ అక్ష్యాలనే నిర్దేశించుకున్నది. రాష్ట్ర పన్నేతర రాబడులను రూ. 8793.92 కోట్లుగా అంచనా వేసుకున్న ప్రభుత్వం గనులు, మినరల్స్ రూపంలో రూ. 4060కోట్లు, భూముల విక్రయంతో రూ. 3వేల కోట్లు, రూ. 108.08 కోట్లు అటవీ శాఖద్వారా ఆర్జించాలని బడ్జెట్‌లో పొందుపర్చింది. ఇందులో భాగంగా గనులపై రాయల్టీ, ఫీజులను పెంచుకోవాలని భావిస్తోంది. ఇసుక పాలసీలో అక్రమాలను అరికట్టి పన్ను ఆదాయం సరళం చేయాలని చూస్తోంది. పన్ను ఎగవేతలను అరికట్టడం వంటి చర్యలు తీసుకోనుంది.

ఇది ఓట్ల బడ్జెట్ కాదు

- రాష్ట్రంలోని ఏ ఒక్కరు అనాథలా మారకూడదు
- తండ్రిలా ప్రభుత్వమే అండగా ఉంటుంది: ఆర్థిక మంత్రి ఈటల

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా ఆనాథగా ఉండాల్సిన పరిస్థితి రాకూడదని, ప్రభుత్వమే తండ్రిగా అండగా ఉంటుందని ఆ దిశలోనే నూతన బడ్జెట్‌ను ఆవిష్కరించామని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. కొత్త బడ్జెట్‌ను ఓట్ల కోసం రూపొందించలేనేలేదని, అంత చిన్నబుద్ధి తమది కానేకాదన్నారు. 2018 -19 కి సంబంధించి రూ. 1,74,453.84 కోట్లతో బడ్జెట్‌ను శాసనసభలో సమర్పించిన అనంతరం కమిటీ హాలులో ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు, కార్యదర్శి ఎన్ శివశంకర్‌తో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. గడచిన రెండు నెలలుగా సమీక్షలు, చర్చల తర్వాత ఈ భారీ బడ్జెట్‌కు తుది రూపం ఇచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు సూచనలు, లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేశామన్నారు. ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాత కూడా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు గడచిన నాలుగేళ్లుగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తమకు ఎన్నికలు అవసరం లేదని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తికి ప్రయోజనం కలిగేలా కార్యక్రమాలు చేపట్టడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో



బడ్జెట్ సమావేశాలంటే ప్రజలు పట్టించుకునే వారు కాదనీ, బడ్జెటా ...మాకేం ఒరుగుతుందనే వారని, ఎమ్మెల్యేమైన తామే పట్టించుకునే వారం కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక పరిస్థితి మారింది.. బడ్జెట్‌లో మాకేమైనా కేటాయింపులు జరిగాయా ? అని అడిగే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రతి వ్యక్తి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇంకా చెప్పాలంటే గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయం, సంక్షేమం, మిషన్ భగీరథ, అన్ని వర్గాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని రూపొందించామని ఈటల చెప్పారు. ప్రస్తుతం దేశంలోని అనేక రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, ఇక్కడ చేపడుతున్న మిషన్ భగీరథ, రైతులకు 24 గంటల విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, కేసీఆర్ కిట్ ఇతర కార్యక్రమాలను ఎలా అమలు జరుగుతున్నాయో చూసేందుకు ఇతర రాష్ట్రాల అధికారులు, మంత్రులు వచ్చి ప్రశంసలు కురిపిస్తున్నారని

అప్పులతో అస్తులను సృష్టిస్తున్నాం.....

అప్పులు తీసుకోవడాన్ని కొన్ని పక్షాలు విమర్శిస్తున్నాయని, అప్పులు తీసుకొని తామేమీ నిధులు దుర్వినియోగం చేయడం లేదని, సరికదా అప్పులతో ఆస్తులను సృష్టిస్తున్నామని ఈటల చెప్పారు.

తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి బడ్జెట్ కేటాయింపులపై స్వేచ్ఛ ఉంటుందని, రాష్ట్రాలకు ఆ స్వతంత్రత ఉండదని, అయినప్పటికీ ఉన్నంతలో ఎఫ్ఆర్‌బిఎం పరిధి మేరకు రుణాలు తీసుకుంటూ, సొంత రాబడులతో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపులు చేస్తున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 2014-15 బడ్జెట్‌ను రూపొందించేందుకు రాష్ట్ర రాబడులు, వ్యయాలు ఎంతో పూర్తిగా తెలిసేది కాదని, అయినప్పటికీ, ఒక్కోఅడుగు వేసి సుస్థిరాభివృద్ధివైపు రాష్ట్రాన్ని తీసుకు పోగలిగామన్నారు. గడచిన నాలుగు బడ్జెట్‌లు కూడా బంగారు తెలంగాణ అనే సుదూర లక్ష్యం... దిశ... ప్రాధమ్యాలతోనే రూపకల్పన చేశామని ఈటల చెప్పారు. పిల్లలున్న పుట్టికీ తల్లిదండ్రులను పట్టించుకోలేని పరిస్థితుల్లో ప్రభుత్వమే పెద్ద కొడుకులాగా ఆసరా పించన్లు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

జీఎస్టీ నోట్ల ఇబ్బందులు అధిగమిస్తాం...

భారీ మొత్తంలో బడ్జెట్ జరిపిన బడ్జెట్ కేటాయింపులకు నిధుల కొరత ఉండదని ఈటల ధీమా వ్యక్తం చేశారు. జీఎస్టీ, నోట్ల రద్దు ప్రభావంతో ఆదాయం కొంత మందకొడిగా సాగినప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరంలో అధిగమిస్తామన్న నమ్మకం ఉందన్నారు.

కాళేశ్వరం మహాద్భుతం

దశాబ్దాలుగా సాగునీరు లేక తెలంగాణ అల్లాడి పోయిందని, వాస్తవంగా ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాకు కూడా సాగునీరందాల్సి ఉండేదని, కానీ, తన నియోజకవర్గమైన హుజూరాబాద్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు కూడా నీరందడం లేదని విమర్శించారు. అన్నింటిని గమనించిన సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. నిజంగా కాళేశ్వరం ఒక మహాద్భుతం... అని ఈటల అభివర్ణించారు.

బీసీ బిడ్డగా, కష్టాలు తెలుసు..

వెనుకబడిన వర్గాలకు చెందిన బిడ్డగా తనకు కష్టాలు తెలుసునని ఈటల చెప్పారు. వెనుకబడిన వర్గాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు భారీగా లేవని విలేఖరుల అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా ప్రతిస్పందించారు. రీయింబర్స్ మెంట్, రెసిడెన్షియల్ స్కూల్స్, కేసీఆర్ కిట్స్, కళ్యాణ లక్ష్మి తదితర పథకాల ద్వారా జనాభాలో 52 శాతానికి పైగా ఉన్న బీసీ లకు లబ్ధి చేకూరుతోందని, సంబంధిత పథకాలకు విని యోగించుకునే నిధులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

వృద్ధిరేటులో మహారాష్ట్ర, హర్యానాలను అధిగమిస్తాం

వృద్ధి రేటు విషయంలో త్వరలో మహారాష్ట్ర ,హర్యానా తదితర రాష్ట్రాలను అధిగమిస్తామని ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. 2017-18 లో రాష్ట్ర వృద్ధిరేటు 10.4 శాతంగా నమోదైందని, ఇకపై మరింత వృద్ధి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తక్కువ కాలంలో గొప్ప విజయం సాధించామని ఈటల రాజేందర్ వివరించారు.

పట్టణాలకు మహర్దశ!

- మున్సిపల్ శాఖకు భారీగా నిధులు
- పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత
- రూ.7,251 కోట్ల కేటాయింపు
- వరంగల్ కార్పొరేషన్‌కు ఈ దఫా కూడా రూ.300 కోట్లు
- మిగతా కార్పొరేషన్లకు 400 కోట్లు కేటాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఊహించినట్లుగానే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో మున్సిపల్ శాఖకు భారీగా నిధులను కేటాయించారు. పట్టణాల అభివృద్ధి, మౌలిక వసతులను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యతను కల్పించారు. మున్సిపల్ శాఖకు రూ. 7,251 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. గత సంవత్సరం (2017-2018)బడ్జెట్‌లో రూ. 5,599 కోట్లను కేటాయించగా, ఈ సారి రూ. 1,652 కోట్ల నిధులను అదనంగా జోడించారు. అయితే హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేయాలన్న సంకల్పంతో గత వార్షిక బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకీ రూ. 1000 కోట్లను కేటాయించింది. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం కోసం మాత్రం ఎలాంటి కేటాయింపులు లేకపోవడం విస్మయం కలుగుతోంది. రోడ్ల నిర్వహణ, మరమ్మత్తుల కోసం సుమారు రూ. 725 కోట్లను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జీహెచ్ఎంసీ కోరింది. కాగా రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు మాత్రం రూ. 566 కోట్లను కేటాయించింది.కాగా ఎస్ఆర్‌డీపీ, స్కైవేల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంటుందని ఆశించినప్పటికీ....నిధుల వరద పారలేదు. దీంతో



మున్సిపల్ బాండ్లద్వారానే పూర్తిగా నిధులను సమీకరించుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

అలాగే ప్రతి బడ్జెట్‌లో వరంగల్ కార్పొరేషన్‌లో మౌలిక వసతులను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లను కేటాయిస్తూ వస్తోంది. ఈ సారి కూడా అంతే మొత్తంలో నిధులను కేటాయించారు. కాగా మిగిలిన కార్పొరేషన్లలో అభివృద్ధి పనుల కోసం గత బడ్జెట్‌లో కేటాయించినట్లుగానే...ఈ సారి కూడా రూ. 400 కోట్లను ప్రతిపాదించారు.

పట్టణాలలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం మున్సిపల్ శాఖకు బడ్జెట్‌లో కేటాయింపుల మొత్తాన్ని పెంచుకుంటూ వస్తోంది. 2016-2017 ఆర్థిక సంవత్సరానికి రూ. 4,815 కోట్లను కేటాయించగా, 2017-2018 సంవత్సరానికి 5, 599 కోట్లను కేటాయించింది. కాగా రానున్న ఆర్థిక సంవత్సరం కోసం బడ్జెట్‌లో ఏకంగా రూ.7,251 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లకు దశా, దిశను నిర్దేశించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి కేటీఆర్ కొద్ది నెలల క్రితం ఆదేశించిన విషయం తెలిసిందే. గ్రేటర్ పరిధిలో జీహెచ్ఎంసీ నిర్మిస్తున్న లక్షఇళ్ళ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణం కోసం రూ. 607 కోట్లు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొత్తంగా మున్సిపల్ శాఖకు పెద్దమొత్తంలో నిధుల వరద పారినప్పటికీ జీహెచ్ఎంసీకీ ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేకపోగా మెట్రోరైల్ నిర్మాణ పనులకు అసలు నిధుల ప్రతిపాదనలు లేకపోవడం ఆశ్చర్యం కలుగుతోంది.

ఆర్థిక మంత్రి ఈటలకు సీఎం, మంత్రుల అభినందనలు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : శాసనసభలో 2018 -19 కి సంబంధించిన బడ్జెట్‌ను సమర్పించిన అనంతరం ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అభినందించారు. మంత్రి రాజేందర్‌ను తన వద్దకు పిలిపించుకుని కరచాలనం చేసి భేష్ అని అభినందించారు. ఆ తర్వాత బయటకు వెళుతూ అధికారుల క్యాబిన్‌లో ఉన్న ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావుతో కరచాలనం చేసి అభినందించారు. సీఎంతో పాటు మంత్రులు టీ హరీష్‌రావు, కె తారకరామారావు, జోగురామన్న, తలసాని శ్రీనివాస్ యాదవ్, హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ , విప్ గొంగిటి సునీత పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు ఈటలకు కంగ్రాట్స్ చెప్పారు. జనరంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని కితాబిచ్చారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత తన ఛాంబర్‌కు వచ్చిన తర్వాత ఈటలకు మంత్రులు,ఎమ్మెల్యేలు, అధికారులు, టీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి అభినందించడమే గాక స్వీట్లు తినిపించారు. ఈటల కుమారుడు నితిన్ రాజేందర్, కుమార్తె నీనాతో పాటు కోడలు ఇతర బంధువులు శాసనసభకు వచ్చి వీఐపీ గ్యాలరీ నుంచి ఈటల బడ్జెట్ ప్రసంగాన్ని చూశారు. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఈటల ఛాంబర్‌కు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి జగదీష్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్ రావు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐదోసారి బడ్జెట్ సంతోషదాయకం




ఈటల కుటుంబం హర్షం

తన భర్త, ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ఐదోసారి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందని మంత్రి సతీమణి జమున అన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు గురువారం ఇంటి నుంచి శాసనసభకు వస్తున్న ఈటలకు ఆమె శుభాకాంక్షలు చెప్పారు. ప్రత్యేకంగా హారతి ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తన భర్త రాజేందర్ సామాజికస్పృహ ఉన్న వ్యక్తియనీ, పేదల కన్నీళ్లు చూడలేరని చెప్పారు.ఏం చేస్తే పేదలు బాగుపడతారని నిరంతరం తపిస్తారని తెలిపారు. వివక్షలేని సమాజం కోసం తపించిన ఆయన పిల్లల్లో కూడా ఆ భావాలను నూరిపోశారని తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి భారీ నిధులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పలు దేవాలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ వార్షిక బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించారు. ముఖ్యంగా యాదగిరి గుట్ట దేవాలయ ప్రాంత అభివృద్ధి అధికారిక సంస్థ ద్వారా చేపట్టిన ఆలయ, పరిసర ప్రాంతాల పునర్నిర్మాణ అభివృద్ధి పనులు అత్యంత కీలకమైనవి. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 250 కోట్లను ప్రతిపాదించింది. అదే విధంగా వేములవాడ దేవాలయ ప్రాంత అభివృద్ధి అధికారిక సంస్థకు రూ.100 కోట్లు, భద్రాచలం దేవాలయం అభివృద్ధికి రూ.100 కోట్లు, బాసర, ధర్మపురి దేవాలయ ప్రాంతాల అభివృద్ధికి రూ. 50 కోట్ల చొప్పున కేటాయించారు. ఆదాయ వనరులు లేని దేవాలయాల అభివృద్ధికి పెద్దఎత్తున వస్తున్న విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని ఎండోమెంట్ చట్టం కింద ఏర్పాటు చేసిన కామన్ గుడ్ ఫండ్ నిధికి సహాయంగా రూ. 50 కోట్లను ప్రతిపాదించారు. ఇక దేవాలయాలలో పనిచేస్తున్న అర్చక, ఇతర సిబ్బందికి పీఆర్సీ 2015 సమాన వేతనాలు అమలు చేయడం కోసం రూ.72 కోట్లు ప్రతిపాదించారు.

'పవర్'ఫుల్ తెలంగాణ
28275 మె.వా. విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: మౌలిక మైన సదుపాయాల అభివృద్ధిద్వారా తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రం మారిపోతోంది. విద్యుత్ రంగంలో అభివృద్ధి చెందితేనే మరే రంగంలోనైనా పురోగమిచంగల అన్న సత్యాన్ని వంటబట్టించుకున్న టీఆర్ఎస్ సర్కారు ఆదిశగా వినూత్న ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. విద్యుత్ రంగంలో సాధిస్తున్న అభివృద్ధి రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల పురోభివృద్ధికి బాటలు వేసింది. వర్తక వాణిజ్య రంగాలకూ చేయూత నిచ్చింది. బంగారు తెలంగాణపై ముఖ్యమంత్రి కేసీఆర్ పెట్టుకున్న ఆశయాల సాఫల్యతకు విద్యుత్ రంగం అభివృద్ధి అద్దం పట్టింది. కోతల్లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా విద్యుత్ వినియోగంపై ఆధారపడ్డ అన్నిరంగాల స్థిరమైన ఆదాయానికి భరోసా కల్పించింది. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలపాలన్న లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం 2018-19 వార్షిక బడ్జెట్‌లో ఇంధన శాఖకు రూ5650కోట్లు కేటాయించింది. వ్యవసాయంతోపాటు ఇతర మరికొన్ని రంగాలకు అందచేస్తున విద్యుత్ సబ్సిడీలను 15శాతం పెంచింది. రాష్ట్రంలో వ్యవసాయరంగానికి 24గంటల విద్యుత్ సరఫరా వల్ల విద్యుత్ పీక్‌డిమాండ్ 10వేల మెగావాట్లకు పెరిగినా తట్టుకునేలా విద్యుత్ సరఫరా , పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేసింది. వేసవిలో పెరిగే విద్యుత్ వినియోగపు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని విద్యుత్ పంపిణీ సామర్థ్యాన్ని 15344మెగావాట్లకు సిద్ధం చేసివుంచింది. రాష్ట్రం ఏర్పడే నాటికి సౌర విద్యుత్ రంగంలో కేవలం 31 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే ఉన్న ఈ రంగాన్ని 3283మెగావాట్లకు పెంచి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపింది. రానున్న రోజుల్లో 28275 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు అమలు చేస్తోంది. అందులో భాగంగానే ఈనెల చివరినాటికి కెటిపిఎస్‌ద్వారా 800మెగావాట్లు , ఈ ఏడాది చివరినాటికి భద్రాద్రి ద్వారా 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బడ్జెట్లో ప్రాధాన్యత కల్పించింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 16 మార్చి 2018

నిత్య కృషీవలుడు!

నారా చంద్రబాబునాయుడు...ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ...అరవై ఎనిమిదేళ్ళ వయసు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం. దేశంలో ముఖ్యమంత్రులందరిలో సీనియర్‌గా తన అనుభవాన్ని నవ్యాంధ్ర నిర్మాణానికి వినియోగిస్తున్నారు. అమరావతి రాజధానిగా పాలన సాగిస్తున్న . ఆయన రాజకీయ జీవితంలో ఎన్నో మెట్ట పల్లాలు. దాదాపు పదేళ్ళ పాటు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. మరో పదేళ్ళు ప్రతిపక్ష నాయక ునిగా వ్యవహరించారు. ఏ సందర్భంలోనూ ఆయన పొంగిపోలేదు, కుంగిపోలేదు. సుదీర్ఘ పాలనానుభవం జాతీయ రాజకీయాల్లో కీలక భూమిక వహించేందుకు దోహదం చేసింది. తెలుగు ప్రజలకే తన సేవలను ఆయన పరిమితం చేశారు. దేశ ప్రధానమంత్రులను నిర్ణయించే స్థాయినీ చూశారు. మాజీ ప్రధానులు పీవీ, వాజ్‌పేయిలతో సన్నిహితంగా మెలగడమే కాకుండా వారు కోరినప్పుడు సలహాలు ఇచ్చారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోడీతో నాలుగేళ్ళపాటు సత్సంబంధాలు కొనసాగించారు. ప్రత్యేక హోదా కోసం, విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీలను సాధించేందుకు అనేక పర్యాయాలు ఢిల్లీ వెళ్ళి మోడీని కలిశారు. ఎన్నో మహజర్లు సమర్పించారు. మిత్రధర్మాన్ని పాటించారు. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో కేంద్రంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. తాను తలపెట్టిన కార్యక్రమాలకు ఎన్ని అవాంతరాలు ఎదురైనా, ఎన్ని విమర్శలు, ఆరోపణలు వచ్చినా, వాదనకూ, వివాదాలకూ దిగకుండా తన పని తాను చేసుకుని పోవడం చంద్రబాబు నైజం. తన కన్నా వయసులో, అనుభవంలో చిన్నవారు విమర్శించినా చలించని మనస్తత్వం ఆయనది. రాష్ట్రాభివృద్ధికి ఎన్నో అవమానాలను భరిస్తున్నానని అనేక సందర్భాల్లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి తనను నిర్లక్ష్యం చేస్తుంటే, చేష్టలుడిగి చూస్తూ ఊరుకోకుండా ఎప్పటికప్పుడు వ్యూహాలు మార్చుకుంటూ ముందుకెళ్తున్నారు. రాజకీయంగా వ్యూహాత్మకంగా అడుగులేస్తూ వచ్చారు. హోదా కన్నా ఎక్కువ సాయాన్ని అందిస్తామని కేంద్ర నాయకులు చెప్పిన మాటలు విశ్వసించి, ఇంతకాలం ఓరిమి వహించారు. ఆ హామీలనూ కేంద్రం నెరవేర్చకపోవడంతోనే ఘర్షణ పంథాను ఎంచుకున్నారు. కేంద్రంతో తాను రాజీ పడలేదని స్పష్టం చేయడమే కాకుండా, పార్లమెంటు వేదికగా ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేయమని పార్టీ ఎంపీలకు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తున్నారు. ఈ వయసులో కూడా ఆయన రోజుకి 18 గంటలు శ్రమిస్తూ, అధికారులు, సిబ్బందిని పరుగులెత్తిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో కనీస వసతులూ, సౌకర్యాలు లేకుండా పాలన సాగించడం అసాధ్యమైనప్పటికీ, దానిని సుసాధ్యం చేసేందుకు ఆయన మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్నారు. ప్రతి సంక్షోభాన్నీ ఒక సవాలుగా తీసుకుని ముందుకు సాగడం చిన్నప ్పటి నుంచి తనకు అలవాటేనని ఆయనే అనేక సందర్భాల్లో ప్రకటించారు.

కొత్త విషయాలు ఎక్కడున్నా, కొత్త ఆవిష్కరణలు ఎక్కడ జరిగినా వాటిని ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టేందుకు ఆయనలోని తపన ఆర్థిక సంస్కరణల అమలులో ముందంజ వేయడానికి పురికొల్పింది. విద్యుత్ రంగంలో ఆయన తీసుకుని వచ్చిన సంస్కరణలు ఆ సంస్థ అభ్యున్నతికి బాటలు వేశాయి. ఈ విషయంలో ఎన్ని విమర్శలు ఎదురైనా, ఆయన వెరవలేదు. నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాల్లో నిర్మించేందుకు ఆయన వివిధ దేశాల్లో పర్యటించి నమూనాలు సేకరించారు. భావితరాల వారి అవసరాలను, అభిరుచులను దృష్టిలో పెట్టుకుని రాజధానిని నిర్మించాలన్న పట్టుదలతో విమర్శలను లెక్కచేయకుండా, వివిధ ఆకృతులూ, ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో పెట్టుబడుల కోసం అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారు. అనేక విదేశీ సంస్థలతో ఒప్పందాలు క ుదిరాయి. వాటి ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. వాజ్‌పేయి హయాంలో ఏర్పాటైన నదుల అనుసంధానం టాస్క్ ఫోర్స్ కన్వీనర్‌గా వ్యవహరించారు. అదే అనుభవంతో రాష్ట్రంలో నదుల అనుసంధానానికీ, ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి కృషి చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా మహారాష్ట్రలోని ఆ ప్రాజెక్టు ప్రదేశం వద్ద శాసనసభ్యులు, నాయకులతో ధర్నా నిర్వహించి, పోరాట పంథాకు వెనుకాడనని రుజువు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తనకు ముఖ్యమని ఆయన అనేక సందర్భాల్లో ప్రకటించారు. అందుకు అనుగుణంగానే అడుగులు వేస్తున్నారు. కేంద్రంతో తాను రాజీ పడినట్టు నిత్యం ఆరోపిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్లమెంటులో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి తొలుత మద్దతు ఇవ్వడానికి నిరాకరించినా, మనసు మార్చుకోవడం ఆయన పట్టువిడుపుల వైఖరికి నిదర్శనం.

ఆశలకు అద్దం పట్టిన బడ్జెట్

తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు రాష్ట్ర బడ్జెట్ అద్దం పట్టింది. మంత్రి ఈటల రాజేందర్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆకుపచ్చ తెలంగాణ దిశగా మరికొన్ని అడుగులు పడ్డాయి. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇది రూపుదిద్దుకుంది. సంక్షేమం, ప్రజల అవసరాలే ఎజెండాగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. సంక్షేమ రంగానికి రెండో ప్రాధాన్యం, పరిశ్రమలు, ఐటీ రంగానికి మూడో ప్రాధాన్యంగా కనిపిస్తోంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ఆలోచనతో రూపొందిన వ్యవసాయానికి పెట్టుబడి సాయం పథకానికి ఈసారి బడ్జెట్‌లో 12 వేల కోట్లు కేటాయించారు. రైతులకు బీమా పథకాన్ని వర్తింపజేయడం మరొక సంచలన నిర్ణయం. గతేడాది రూ.1.49 లక్షల కోట్ల బడ్జెట్‌లో దాదాపు రూ.1.20 లక్షల కోట్లు ఖర్చు చేశారు . బడ్జెటేతర నిధులు మరో రూ.25 వేల కోట్లకు వరకు వెచ్చించారు.

రెవెన్యూ రాబడిపై జీఎస్టీ ప్రభావం పడినందున అంచనాలకు అనుగుణంగా ఆదాయ వృద్ధి చెందలేదు. క్రమంగా స్థిరపడుతోంది. వచ్చే ఏడాది మరింత పుంజుకుంటుందని ప్రభుత్వం ఆశాభావంతో ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల పరిస్థితి ఆశాజనకంగా లేదు. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లే పన్నుల వాటా, జీఎస్టీ వాటా తెలంగాణకు వచ్చాయి. రాష్ట్రం చెల్లించిన పన్నుల నుంచి కేంద్రం రాజ్యాంగం ప్రకారం ఇవ్వాల్సిన వాటానే ఇచ్చింది. అదనంగా గ్రాంట్లు రాలేదు. అప్పులు రాష్ట్ర జీఎస్‌డీపీలో 25 శాతం మించకూడదు. తెలంగాణ జీఎస్‌డీపీ దాదాపు రూ.8 లక్షల కోట్లు. అప్పులు రూ.2 లక్షల కోట్ల లోపే ఉన్నాయి. అప్పులను ఆస్తుల కల్పనకు, ప్రాజెక్టులు, రోడ్లు, భవనాల నిర్మాణానికే ప్రభుత్వం ఖర్చు చేసింది. అవన్నీ ప్రజల అవసరాలే. ఎఫ్‌ఆర్‌బీఎం పరిధికి లోబడి అప్పులు తీసుకుంది. తెలంగాణ రెవెన్యూ మిగులు రాష్ట్రం. అందుకే కేంద్రం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితినీ 3.5 శాతానికి పెంచింది. గ్యారంటీలిచ్చి కొన్ని రుణాలు తీసుకుంది. రాష్ట్ర రెవెన్యూ రాబడిలో 90 శాతం మించకుండా గ్యారంటీలు ఇచ్చే వెసులుబాటు ఉంటుంది.

దేశవ్యాప్తంగా 16 ఏళ్లలో 31 వేల మంది రైతులు బలవన్మరణం పాలయ్యారంటే వారి పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటుకాని ధరలే ప్రధాన కారణం. బతుకే భారమనుకుని రైతు తనువు చాలించే పరిస్థితి గతంలో నెలకొంది. 1995 నుంచి 2010 మధ్య... అంటే 16 సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా 31,120 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాంతంలో 2886 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇది జాతీయ నేర సమాచార విభాగం చెప్పిన అధికారిక సమాచారం! దీనికి కారణాలను సుస్థిర వ్యవసాయ కేంద్రం, రైతు సురాజ్య వేదిక, యాక్షన్ ఎయిడ్, జయతీ ఘోష్ కమిటీ తదితర సంస్థలు, సంఘాలు విశ్లేషించాయి. 2003- 2010 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా బలవన్మరణం పాలైన



అన్నదాతల సంఖ్య ఏకంగా 18,404కు చేరింది. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క రైతు కూడా పంట నష్టం కారణంగానో లేక అప్పుల ఊబిలో కూరుకుపోవడం వల్లనో ఆత్మహత్య చేసుకునే దౌర్భాగ్య పరిస్థితి రాకూడదని ముఖ్యమంత్రి కెసిఆర్ మనసా వాచా నిర్ణయించుకున్నారు. భూమిని తలకిందులు

చేసి దేశానికి పట్టెడన్నం పెట్టే రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు, ఆకుపచ్చ తెలంగాణ నిర్మించేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉద్యమ నాయకుడు, స్వయంగా రైతు అయిన కేసిఆర్ రైతు కళ్ళల్లో సంతృప్తే తన లక్ష్యంగా ఖరారు చేసుకొని వ్యవసాయ, నీటిపారుదల, విద్యుత్, మార్కెటింగ్ రంగాలలో సమూల మార్పులు, సంస్కరణలు తీసుకు వచ్చారు. కెసిఆర్‌కు రైతుల ఆత్మ గురించి తెలుసు. రైతుల అంతరాత్మను పసిగట్టిన మనిషి. అందుకే తెలుగుదేశం, కాంగ్రెస్‌ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన సాగునీటి రంగంలో ఇప్పుడు గుణాత్మక మార్పులొచ్చాయి. ఎక్కడికక్కడ ప్రాజెక్టులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడానికి కెసిఆర్ ''జల సంకల్పం''తో ముందుకు పోతున్నారు. తెలంగాణ చుట్టూ ఒక 'జల కవచం' నిర్మిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న నిరవధిక, నిరంతర శ్రమ కెసిఆర్ సంకల్పానికి కొండంత బలంగా చెప్పుకోవాల్సిందే. జయతీ ఘోష్ ఒక ప్రొఫెసర్‌గా రైతాంగం ఎదుర్కుంటున్న కష్టాలను పరిశీలించి, అధ్యయనం చేసి నివేదికలిచ్చారు. కెసిఆర్ తెలంగాణ 'భూమిపుత్రుని'గా ఉద్యమ కాలంలో స్వయంగా, కాలినడకన ప్రజల్లో తిరిగి చూసినవే. రైతుల బలవన్మరణాల వార్తలు వచ్చినపుడల్లా సి.ఎం. కెసిఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనవుతుంటారు. గతంలో ఎన్నడూ, ఎవరూ పట్టించుకోని కారణంగా కాకతీయుల కాలం నాటి 46000 చెరువులు ధ్వంసమైనవి. వాటికి జీవం పోసేందుకు కేసిఆర్ నడుం బిగించారు. చెరువుల పునరుద్ధరణ వల్ల మొత్తం గ్రామీణ సామాజిక, ఆర్థిక రంగాల్లో పెనుమార్పులు వస్తున్నాయి. పొట్టచేతబట్టుకొని ముంబై, దుబాయి, ఇతర నగరాలకు వలసలు వెళ్లి వారంతా వెనక్కి వస్తున్న దృశ్యాలు పాలమూరులో, మెదక్‌లో, మరికొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. తెలంగాణవస్తే ఏం జరుగుతుందనే ప్రశ్నకు ఇంతకన్నా జవాబులింకేమి కావాలి. ఇక ప్రాజెక్టులను రీ డిజైను చేయడం అనేది ఇప్పటిదాకా ఏ రాష్ట్రంలోనూ, ఏ ముఖ్యమంత్రి చేసి ఉండరు. ప్రాణహిత చేవెళ్ళను కాళేశ్వరంగా, రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ లను కలిపి సమీకృత సీతారామ ప్రాజెక్టుగా కెసిఆర్ రీడిజైను చేసిన వైనం మహా, మహా ఇంజనీరింగు నిపుణులను సైతం నివ్వెరపరుస్తోంది.

ముందుగా రైతులకు చెందిన 17 వేల కోట్ల అప్పులను ఒక్క కలం పోటుతో కెసిఆర్ మాఫీ చేశారు. 2014 నుంచి ఆత్మహత్య చేసుకున్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం 6 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు ఆయా కుటుంబాలను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ హయాంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు లక్షా యాభై వేల రూపాయల చొప్పున గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల్లో బహిరంగ సభలు పెట్టి ఎక్స్‌గ్రేషియా చెల్లించారు. ఆ కుటుంబాలకు అదనంగా ఇల్లు మంజూరు చేశారు. 2009 -2014 మధ్య ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోలేదు. టిఆర్ఎస్ ప్రభుత్వం 34.33 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో గిట్టుబాటు ధరల కోసం రైతులు రోడ్డు ఎక్కని రోజు లేదు. ఆర్మూరులో ఎర్రజొన్న రైతుల ఆందోళన కాల్పుల వరకూ వెళ్ళింది. 9 కోట్ల 77 లక్షల బకాయిలు చెల్లించి 5 వేల మంది రైతులను కెసిఆర్ ప్రభుత్వం ఆదుకుంది. తెలంగాణా రాష్ట్ర సమితి ప్రభుత్వం 24 గంట కరెంటు సరఫరా చేస్తోంది. కాంగ్రెస్ హయాంలో తెలంగాణలో 3285 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలుంటే కెసిఆర్ ప్రభుత్వం 5231 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2014 వరకు తెలంగాణలో 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్స్ ఉండగా తెలంగాణవచ్చాక 1000 కోట్లతో 18 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోడౌన్స్ నిర్మించింది. ముఖ్యమంత్రి కెసిఆర్ డైరెక్షన్‌లో మంత్రి

హరీశ్‌రావు మార్కెటింగ్ రంగంలో అనూహ్య మార్పులు తీసుకు వచ్చారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో మార్కెటింగ్ రంగంలో సంస్కరణలు తెచ్చారు. 2013 - 2014 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ లో వ్యవసాయానికి 4040 కోట్లు కేటాయించగా అందులో తెలంగాణా వాటా 1697 కోట్లు. తెలంగాణప్రభుత్వం 2017 - 2018 లో వ్యవసాయ రంగానికి 6812 కోట్లను వ్యవసాయానికి కేటాయించడం రైతాంగం పట్ల కెసిఆర్ కున్న చిత్తశుద్ధి, నిజాయితీ, నిబద్ధతకు నిదర్శనం. ఇక చిన్న, సన్నకారు సహా ఏ రైతుకైనా కుల, మత, జాతి ప్రాంతాలకు అతీతంగా ప్రతి రైతుకు ఎకరానికి పంటకు 4 వేల రూపాయల చొప్పున రెండు పంటలకు 8 వేల రూపాయలు ఇవ్వబోతున్నారు. ఇదొక కొత్త చరిత్ర. కెసిఆర్ పునర్లిఖిస్తున్న తెలంగాణ చరిత్ర ఇది.

-ఎస్.కె.జకీర్.

బీజేపీకి ఏడాదిగా ఎదురు దెబ్బలు



హర్షవాక్కు

-వేటూరి శ్రీహర్ష(న్యూఢిల్లీ)

నరేష్ అగర్వాల్ చాలా కాలం సమాజ్ వాదీ పార్టీలో కొనసాగి రాజ్యసభ టికెట్ ఇవ్వలేదన్న ఆగ్రహంతో బీజేపీలో చేరారు. ఆయన సమాజ్‌వాదీ పార్టీలో ఉన్నప్పుడు ప్రధాని నరేంద్రమోడిపై నిప్పులు చెరిగేవారు. సమాజ్‌వాదీ పార్టీలో తిరిగి తనకు టికెట్ రాకపోవడానికి బిగ్‌బీ సతీమణి, అలనాటి బాలీవుడ్ నటి జయాబచ్చన్ కారణమంటూ ఆమెపై ఆయన తీవ్ర విమర్శలతో పాటు అనుచితమైన వ్యాఖ్యలు చేశారు. ఆమెను నాట్యకత్తె అని అభివర్ణించారు. ఆయన చేసిన వ్యాఖ్యపై అటు రాజకీయ పార్టీల్లోనే కాక, అన్ని వర్గాల్లోనూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మహిళా ఎంపీలు నరేష్ అగర్వాల్‌పై విరుచుకుని పడ్డారు. వారిలో బీజేపీ సీనియర్ నాయకురాలు, విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ కూడా ఉన్నారు. జయాబచ్చన్ రాజ్యసభ సభ్యురాలిగా మంచి పేరు సంపాదించుకున్నారు. ఆమెపై అనుచితమైన వ్యాఖ్యలు చేసిన నరేష్ అగర్వాల్ వల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింది. విలక్షణమైన, స్వచ్ఛమైన రాజకీయాలకూ తమ పార్టీ నెలవు అని కమలనాథులు తరచూ ప్రకటించుకుంటూంటారు. అటువంటి పార్టీలోకి, మహిళా ఎంపీపై అనుచితవాఖ్యలు చేసిన నాయకుణ్ణి చేర్చుకోవడం పార్టీకి అప్రదిష్ఠే. ఉత్తరప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఓటమి పాలు కావడం పార్టీకి ఎదురు దెబ్బే. ఉత్తరప్రదేశ్‌లోని రెండు లోక్ సభ స్థానాలు గోరఖ్‌పూర్, ఫూల్పూర్ ఆ పార్టీకి ప్రతిష్ఠాత్మకమైనవి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఖాళీ చేయడం వల్ల ఈ రెండు లోక్ సభ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లో బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తున్నా, హిందీ ప్రాంతాల్లోనూ, పక్క రాష్ట్రాల్లోనూ లోక్‌సభస్థానాల ఉప ఎన్నికల్లో గడిచిన ఏడాదిగా ఓటమి పాలవుతోంది.

ఉప ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడానికి నరేష్ అగర్వాల్‌ని పార్టీలో చేర్చుకోవడమే కారణమని బీజేపీ మిత్ర పక్షమైన శివసేన అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో సమాజ్ వాదీ, బీఎస్‌పి పొత్తు కుదుర్చుకోవడం వల్ల బీజేపీ ఓడిపోయిందన్న కారణాన్ని చెబుతున్నప్పటికీ, నరేష్ అగర్వాల్ వంటి వారిని పార్టీలో చేర్చుకోవడం వల్లే అయోధ్య రాముడు ఆగ్రహించి బీజేపీని ఓడించారని రౌత్ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో సమాజ్‌వాదీ సభ్యునిగా నరేష్ అగర్వాల్ హిందూ దేవతలపై చేసిన అనుచితమైన, అవమానకరమైన వ్యాఖ్యలను రౌత్ ఈ సందర్భంగా బీజేపీ నాయకులకు గుర్తు చేశారు.

2017 మార్చిలో బీజేపీ అమృతసర్ స్థానాన్ని, నెల రోజుల తర్వాత శ్రీనగర్ సీటునూ, తరవాత అక్టోబర్‌లో గురుదాస్‌పూర్ స్థానాన్ని బీజేపీ కోల్పోయింది. ఈ ఏడాది ఆరంభంలో రాజస్థాన్‌లోని ఆల్వార్, అజ్మీర్ సీట్లను కూడా చేజార్చుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ఉలుబారియాలో కూడా ఓటమిపాలైంది. బుధవారం ఓటమి పాలైన స్థానాలతో కలిపి బీజేపీ గడిచిన ఏడాదిలో పది లోక్‌సభ స్థానాలలో పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. వీటిల్లో గత సంవత్సరం ఏప్రిల్‌లో జరిగిన మల్లాప్పురం నియోజకవర్గం కూడా ఉంది. కేరళలో బీజేపీకి బలం లేనిమాట నిజమే.

గోరఖ్‌పూర్ నియోజకవర్గంలో 1991నుంచి బీజేపీ గెలుస్తూ వస్తోంది. దానిని కోల్పోవడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బే. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఈ నియోజవర్గానికి ఐదు సార్లు నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. గత మార్చిలో ముఖ్యమంత్రి పదవిని చేపట్టేందుకు ఆయన రాజీనామా చేశారు.

2014 ఎన్నికల్లో ఘోరంగా ఓటమి పాలైన ప్రతిపక్షాలు ఇప్పుడు అచ్చేదిన్ కోసం ఎదురుచూస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో బద్ధ విరోధులైన సమాజ్‌వాదీ, బీఎస్పీ ఈ ఉప ఎన్నికలలో జత కట్టాయి. ఈ రెండు పార్టీల నాయకులూ, మాజీ ముఖ్యమంత్రులు అయిన అఖిలేష్ యాదవ్, మాయావతి రాష్ట్రరాజకీయాల్లో కొత్త అధ్యాయాన్ని లిఖించాలని ఆకాంక్షించవచ్చు. గోరఖ్‌పూర్ విజయం మరో ముఖ్యమైన సంకేతాన్నిచ్చింది. ఈ ఉప ఎన్నికలో గెలుపొందిన నిషాద్ అత్యంత వెనకబడిన తరగతులకు చెందిన నాయకుడు. వెనకబడిన తరగతులవారూ, దళితులు అగ్రవర్ణానికి చెందిన ముఖ్యమంత్రి కింద పనిచేయడానికి సిద్ధంగా లేరన్న విషయం ఈ ఉప ఎన్నిక ఫలితాన్ని బట్టి స్పష్టమవుతోంది. యోగి ఆదిత్య నాథ్ అగ్రవర్ణానికి చెందిన వారే కాకుండా హిందుత్వవాదిగా పేరొందారు. అలాంటి వ్యక్తి నాయకత్వాన్ని ఆమోదించేందుకు దళితులు, వెనకబడిన తరగతులు సిద్ధంగా లేరన్న విషయం స్పష్టమవుతోంది. ఈ ఉప ఎన్నిక ఫలితం మరో విషయాన్ని వెల్లడిస్తోంది. ముఖ్యమంత్రి ఆదిత్య నాథ్‌ని మోడీ తర్వాత బీజేపీలో ప్రకాశమానమైన వ్యక్తిగా

ఇంతవరకూ పార్టీ శ్రేణులు పరిగణిస్తున్నాయి. మోడీ తర్వాత ఆయనే పార్టీకి పెట్టనికోటగా ఉన్న ప్రచారసారథిగా కూడా పరిగణిస్తున్నారు. ఆయన గుజరాత్, కర్నాటకలలో హిందూ ఓటర్లను ఆకర్షించేందుకు ఆ రెండు రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించారు. గోరఖ్‌పూర్‌లో ఆయన ఐదు ర్యాలీల్లో ప్రసంగించారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ కేవలం ఒక్కసారి మాత్రమే పర్యటించారు. మాయావతి అయితే అసలు ఆ నియోజకవర్గానికి వెళ్ళనే లేదు. ఇది నిజంగా ఆశ్చర్యమే.

ఇప్పుడు అందరి ఆసక్తి 2019 ఎన్నికల మీద ఉంది. సమాజ్‌వాదీ, బీఎస్పీ ఈ ఉప ఎన్నికల్లో మాదిరిగా సమీకృత వ్యూహాన్ని అనుసరిస్తాయా? ఈ విషయంలో అఖిలేష్ తన ఆసక్తిని ఇప్పటికే బహిర్గతం చేసినప్పటికీ, మాయావతి మాత్రం ఇంకా బయటపడలేదు. బీహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానాన్ని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) మంచి మెజారిటీతో గెల్చుకోవడంతో మహాఘటబంధన్ చురుకైన పాత్ర వహిస్తుందా? ముస్లింలు, యాదవ్‌లు జత కట్టడం వల్ల 2019 ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయా? ఇప్పుడున్న పాలపొంగులాంటి పరిస్థితిని బట్టి అంచనా వేయడంచాలా కష్టం. ఎందుకంటే, క్షేత్ర స్థాయి పరిస్థితులు పరిగణనలోకి వచ్చేసరికి ఇలాంటి ఆశలన్నీ ఆవిరయిపోతాయి. ఇక్కడ మరో అంశం. ఈ ఉప ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోవడంతో కాంగ్రెస్ పూర్తిగా అట్టడుగు స్థాయికి చేరుకుంది. ఈ పరిస్థితిని ఆ పార్టీ సరిపెట్టుకుంటుందా? 2019 ఎన్నికల్లో మోడీకి ప్రత్యర్థిగా తమ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అని చెప్పుకుంటున్న కాంగ్రెస్.. ఆర్‌జేడి, సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీలు తమ పార్టీని లెక్క చేయకుండా పోతే ఊరుకుంటుందా? తమ పార్టీకి బాగా బలం ఉన్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో ఈ ప్రాంతీయ పార్టీల అడుగు పడనిస్తుందా? లోక్ సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు చాలా కష్టమైన కసరత్తు అవుతుంది. ముఖ్యంగా, ఢిల్లీ పీఠంపై కన్ను వేసిన కాంగ్రెస్ మిత్ర పక్షాల ఒత్తిడికి లొంగుతుందా? ఇవన్నీ ఎదురయ్యే ప్రశ్నలు.

బీజేపీ కూడా తన మిత్ర పక్షాలతో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోంది. శివసేన మోడీపై తరచూ ధ్వజమెత్తుతోంది. అకాలీదళ్ పంజాబ్‌లో అధికారం కోల్పోయినప్పటికీ, తన ప్రతిపత్తిని కోల్పోలేదు. అన్నింటికన్నా, బీజేపీ ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య ,కేంద్ర మంత్రివర్గం నుంచి తెలుగుదేశం మంత్రులు వైదొలగడం.ఆ పార్టీ ఎన్‌డిఏలో కొనసాగుతున్నప్పటికీ, ఏ క్షణంలోనైనా వైదొలవచ్చన్న వార్తలు వస్తున్నాయి. కేంద్ర మంత్రి

రామవిలాస్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ గతవారం పాట్నాలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించింది. ఆ పార్టీ అధ్యక్షుడు రామవిలాస్ పాశ్వాన్ తన మనసులో మాట బయటపెట్టడంలేదు. ఆయన బాగా పరిపక్వత గల నాయకుడు. ఎప్పుడూ గెలుపొందే కూటమి వైపే ఉంటారు. బీహార్‌లో మహాకూటమి సరైన రూపు తీసుకుని జనతాదళ్ (యు), బీజేపీ కూటమిని అధికారం నుంచి తొలగించగల స్థితికి చేరుకునే వరకూ పాశ్వాన్ తన మనసులోని మాట బయట పెట్టక పోవచ్చు.

తమిళనాడులో పరిస్థితి అంతా గందరగోళంగా ఉంది. ఉభయ డిఎంకెలు మోడీకి నమ్మకాన్ని కుదర్చలేకపోతున్నాయి. మోడీ ఆచితూచి నిర్ణయం తీసుకోవచ్చు. శివసేన నాయకులు అదే పనిగా విమర్శలు చేస్తున్నప్పటికీ, ఎన్‌డిఏలో ఆ పార్టీ కొనసాగేందుకు అంగీకరించవచ్చు. మహారాష్ట్రలో ఈ రెండు పార్టీల కూటమికి మంచిపునాదులున్నాయి. అందువల్ల అంత తేలిగ్గా అవి తెగతెంపులు చేసుకోకపోవచ్చు.

ప్రతిపక్షాలు కలిసి వెళ్లేందుకు ఇంకా చాలా వ్యవధి ఉంది. ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగా ఎస్పీ, బీఎస్పీ ఇతర ప్రాంతాల్లో పొత్తు కలిగి ఉంటాయా? ఈ రెండుపార్టీలూ తమ ఓటు బ్యాంకులను వదులుకోవడానికి సిద్ధంగా ఉంటాయా? సరైన సమాధానం కోసం 2019 వరకూ నిరీక్షించవల్సిందే. ఉత్కంఠ భరితమైన, ఆసక్తికరమైన సమరం ముందుంది.

ఆ చిత్ర తారార్కమూ స్క్రీన్‌ప్లేనే ప్రధానం




తోటపల్లి సాయినాథ్
9394449777

సినిమాకి కథ ప్రాణం.. కాని.. ఆ ప్రాణానికి స్వరూపం ఇచ్చేది స్క్రీన్‌ప్లే. ఏ మనిషి అయినా అందంగా ఆకర్షణతో ఉంటే.. పదిమందికి చూడగానే నచ్చేస్తారు. అలాగే స్క్రీన్ ప్లే బాగుంటే - సినిమా బాగుంటుంది. ఈ మాటలు మహేష్ భట్ చెప్పారు. క్రిమినల్ చిత్రం చేసేటప్పుడు బాంబే జుహూలో సన్ అండ్ సాండ్ హోటల్‌లో డిస్కషన్స్ జరుగుతున్నప్పుడు ఓ సాయంత్రం చెప్పిన నిజం నన్ను వెంటనే తక్కున ఆకట్టుకుంది.. ఆ మాటలకు ఎంతగొప్ప ప్రాధాన్యత ఉందో చాలాసార్లు నిరూపితమైంది - నేను చేసిన సితార అనే చిత్రానికి స్క్రీన్‌ప్లే ప్రాణం.. అలానే డబ్బు టు ది పవర్ ఆఫ్ డబ్బు అనే యండమూరి నవలను ఛాలెంజ్ సినిమాగా మలిచినప్పుడు - స్క్రీన్‌ప్లే ఆ చిత్రానికి హైలైట్..

స్క్రీన్ ప్లే అంటే ఏమిటనే విషయాన్ని విపులంగా చెప్పాలంటే 400 పేజీల పుస్తకమవుతుంది. నాలుగు మాటల్లో చెప్పాలంటే మొదటి ఫ్రేం నుండి ప్రేక్షకులలో ఉత్కంఠ రేపుతూ.. చిత్రాన్ని ఆసక్తికరంగా అద్భుతం అనిపించేలా మలుపులతో రసరమ్యంగా - తర్వాత కథ ఇది తర్వాత సీను ఇలా ఉంటుంది అని ప్రేక్షకుడు ఊహించలేని విధంగా మలిచే మహత్తర విద్య స్క్రీన్‌ప్లే.. కథని - అందంగా ఆకర్షణతో - ఉత్కంఠ తగ్గకుండా ఇది అద్భుతం అనిపించే ఫీల్ జోడించి - ఎక్కడికక్కడ - టెంపో పెంచుతూ - ఎప్పటికప్పుడు - ఏదో ఒక రసం పండిస్తూ విసుగు కలిగించకకుండా చెప్పేదే స్క్రీన్ ప్లే.. ఏ పాత్రయినా ఎప్పుడు ఎక్కడ ఎలా ప్రవేశపెట్టాలి అనే నిర్ణయం ఆచితూచి తీసుకోడం - ఆ పాత్ర ద్వారా ఆ కథలో - వేగం - ఉత్కంఠ పెంచుతూ - ఇలా ప్రతి నిముషం ప్రేక్షకుల మనసుని గెలుస్తూ వెళ్ళాల్సిన బాధ్యత స్క్రీన్‌ప్లే రచనది. ఈ మధ్యకాలంలో గొప్ప స్క్రీన్ ప్లే అనిపించే - చిత్రాలుగా తెలుగు సినిమాల పేర్లు చెప్పండి - అంటే. హిట్ అయిన ప్రతిచిత్రం వెనుక కచ్చితంగా గొప్ప స్క్రీన్‌ప్లే ముఖ్యకారణం అవుతుంది. పెళ్ళిచూపులు - క్షణం - ఆనందోబ్రహ్మ - హీరో 150, సోగ్గాడే చిన్నినాయన - భలే భలే మొగాడివోయ్.. దృశ్యం - బాహుబలి 1 మరియు 2 - సింహా - అర్జున్‌రెడ్డి - ఛలో - తొలిప్రేమ - ఫిదా - ఇలా ఏ సినిమా హిట్ అయినా ఖచ్చితంగా ఆ హిట్ చిత్రాలు వెనుక - ప్రధాన కారణం గొప్ప స్క్రీన్‌ప్లే... క్షణం

అనే సినిమా కథను డైరెక్టుగా చెప్పి ఉంటే ఆ విజయం ఖచ్చితంగా దక్కేదికాదు. బోర్ కొట్టేది.

ఆ కథలో ఉన్నన్ని లోటు పాట్లు కవర్ చేస్తూ అద్భుతం అనిపించేలా స్క్రీన్‌ప్లేలో రవికాంత్ తీర్చి దిద్దారు. గొప్పతనానికి మచ్చుతునకగా క్షణం సక్సెస్ - చెప్పచ్చు. అలాగే... బాహుబలి 1 తో చివర్లో సడెన్‌గా కట్టప్ప అమరేంద్ర బాహుబలిని ఎందుకు చంపాడన్న - వైరల్ అయిన పాయింట్ ఆ సినిమా సీక్వెల్‌కి ఆడియన్స్‌ని రప్పించిన స్క్రీన్‌ప్లే జిమ్మిక్‌గా చెప్పుకోవచ్చు. బాహుబలి సీక్వెల్ 2 కోసం ఆత్రంగా ప్రేక్షకులు ఎదురుచూసేలా ఆ ఒక్క ట్విస్ట్ చేసింది. బాహుబలి 1 సక్సెస్‌లో సగం కారణం ఆ చిత్రంలోని గ్రాండియర్ - క్యారెక్టర్స్ ఆ పాత్రలని పోషించిన అద్భుతమైన ఆ తారల నటన మ్యూజిక్ - డిఫరెంట్ నేపథ్యం అయితే అసలు సగం కారణం ఆ సినిమాని అంతగొప్ప సక్సెస్ చేసింది. ఆ చిత్ర స్క్రీన్‌ప్లే, కథ చెప్పిన విధానం బాహుబలి పార్ట్ 1 మరీ ముఖ్యంగా బాహుబలి పార్ట్ 2 - తెరమీద ఆవిష్కరించిన సన్నివేశాల సరళి తీరు - వాటిలోని - ఉత్కంఠ ఆ చిత్రంలోని ప్రతిపాత్ర ఔన్నత్యాన్ని - ప్రతిపాత్ర ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొన్న ఆ దిగ్దర్శకుడు రాజమౌళి స్క్రీన్‌ప్లేలో నిష్ణాతుడు. సింహాద్రి నించి - బాహుబలి దాకా - ఉత్కంఠ భరితంగా - అద్భుతమైన టెంపోలు ఒక వంక కథ చెబుతూ మరోవంక మానవత్వాన్ని హావభావాలనే లాలిత్యంతో ఎమోషన్‌ని కలగలుపుతూ స్క్రీన్ ప్లేని ఓ అస్త్రంలా



వాడుకోవడం రాజమౌళిది ప్రత్యేక పంథాగా చెప్పచ్చు. ఏ చిత్ర కథకైన అతని స్క్రీన్ ప్లే ప్రాణం ఆ పాత్ర చిత్రీకరణ - వాటిని సన్నివేశాలలో ఆవిష్కరించే ఆ నైపుణ్యం అతని గొప్ప స్క్రీన్‌ప్లే చతురతకి ఉదాహరణగా చెప్పచ్చు. అతని ప్రతిచిత్రం ప్రాధాన్యతలని మనం గమనిస్తే కథకున్న ప్రాధాన్యం కామెడీక న్న హ్యూమన్ ఎమోషన్స్ పైన అతను చేసే ఫోకస్ అద్భుతమైన డ్రామాని - స్క్రీన్‌ప్లేలో పండిస్తుంది.

సింహాద్రిలో మెంటల్లీ రిటార్టెడ్ కథానాయిక భూమిక పాత్ర బాగుకోరి పసిపిల్లలా భావించిన ఆ హీరో సింహాద్రి - గొప్పతనం - మనకి చూపిస్తూ - అనూహ్యంగా ఇంటర్వెల్ సీనులు - ఆ భూమిక - సింహాద్రిని పొడవడం అద్భుతమైన స్క్రీన్ ప్లే బ్యాంగ్ - ఇంటర్వెల్ ట్విస్ట్ ఒకవ్యక్తి చేతిలో ట్రైన్ మొత్తం పేలిపోయేంతటి బాంబు ఉన్న సూట్‌కేస్ ఉంది. అతనికి అది తెలీదని తెలిసి హీరో రైల్వే ప్లాట్‌ఫాం దాకా ఎక్కడ అతను ట్రైన్‌లో ఎక్కడం స్పీడందుకుని - 2

వేలమంది ప్రాణాలు కాపాడ్డానికి ఆ ట్రైన్ ఎక్కిన ఆ హీరోయిన్ తండ్రిని హీరోనే రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం పైనుంచి గన్‌తో గురిచూసి కాల్చడం అది హీరోయిన్ చూసి మతి చలించిపోవడం చిత్రానికి ప్రధాన మలుపు. స్క్రీన్‌ప్లే గొప్పదనం తెలిపే ఓ గొప్ప ఉదాహరణ ఇది- మగధీరలో రాజమౌళి ప్రదర్శించిన స్క్రీన్‌ప్లే జిమ్మిక్ హీరో చేతివేళ్ళ కొసలు హీరోయిన్‌కి తగలగానే అతనిలో స్పందన ప్రారంభమై పునర్జన్మ గుర్తు రావడం తద్వారా ఓ జానపద కథకి తెరతీసి - పూర్వజన్మలో రాకుమారి - సైనికుడికి మధ్య జరిగిన ప్రేమ కథ లోకి సినిమా తీసుకుని వెళ్ళడం రాజమౌళి స్క్రీన్‌ప్లే గొప్పదనం. ఆ కథని తెరమీద విజయవంతంగా ఆవిష్కరించిన తీరు స్క్రీన్ ప్లేకి నిర్వచనంలా నిలబడింది - స్థలాభావం వలన - క్లుప్తంగా చెప్పాల్సి వచ్చింది కనుక - ప్రపంచంలో - గొప్ప గొప్ప చిత్రాలు అనిపించే ప్రతి చిత్రం విజయం వెనుక ప్రధాన కారణమై నిలిచేది స్క్రీన్‌ప్లే - అని బల్లగుద్ధి చెప్పచ్చు.

ఇంగ్లీష్ ఫిలిం జాస్‌లో - ఒక షార్క్‌ని మొదటి రీలులో చూపించి ఆ తర్వాత ఎప్పుడు వస్తుందా అనేలా సస్పెన్స్ టెన్షన్స్‌ని షూట్ చేస్తూ అడుగు అడుగున ఉత్కంఠత పెంచిన తీరు - అద్భుతం - స్టీవెన్ స్పీల్‌బర్గ్‌కి స్టార్‌డమ్‌ని తెచ్చిపెట్టింది జాస్ స్క్రీన్‌ప్లే..


ఒక చీమ, దోమ కూడా హీరో కాగలడు - అని రాజమౌళి 'ఈగ' చిత్రం ద్వారా సుదీప్‌కు వాయిస్ ఫీట్ ప్లస్ లింక్‌ని అడుగు అడుగున చాలా సహజంగా బెదిరిస్తూ ప్రాణాంతకమైన ఓ శత్రువుగా - ఈగని ఆవిష్కరించి తెలుగు ప్రజలచేత శెభాష్ - అనిపించుకొన్నారంటే రాజమౌళి చేసిన స్క్రీన్ ప్లే కారణం. అప ్పట్లో కె.వి.రెడ్డి గారిని గొప్ప స్క్రీన్‌ప్లే రచయితగా చెప్పుకునేవారట - మాయాబజార్‌లో ఇప్పటికీ చిత్రాన్ని చూసేలా స్క్రీన్ ప్లేను సమకూర్చారు. ఉత్కంఠ భరితంగా, ఆసక్తికరంగా సాగిన స్క్రీన్‌ప్లే శశిరేఖ పరిణయం అనే మహాభారతంలోని ఒక ఘట్టాన్ని - ఘటోత్కచుని మాయలచుట్టూ రసరమ్యంగా అల్లిన స్క్రీన్‌ప్లే కనుక ప్రేక్షకుడిని అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ అలరిస్తూనే ఉంది. రీమేక్ అయినప్పటికీ గొప్పగా తీర్చిదిద్దారు. మాయాబజార్, అలానే దొంగరాముడు చిత్రాలలో కె.వి.రెడ్డిగారు కథలో సన్నివేశాలు ఆవిష్కరించిన తీరు మంచి స్క్రీన్‌ప్లేగా చెప్పవచ్చు. ఆ తర్వాత ఆదుర్తి సుబ్బారావ్ గారి, వెలుగునీడలు - చదువుకున్న అమ్మాయిలు - ముఖ్యంగా మూగమనసులు - గుడ్ స్క్రీన్‌ప్లే సినిమాలుకి ఉదాహరణలుగా నిలిచాయి.


ఆ తర్వాత కె.ఎస్.ప్రకాశరావ్ గారిని గొప్ప స్క్రీన్‌ప్లే రైటర్‌గా చెప్పవచ్చు. ఆయన ప్రేమనగర్ అనే యుద్దనపూడి నవలని ప్రేమనగర్ చిత్రంగా మలిచిన తీరు అద్భుతం ఆ తర్వాత - ఆ నటి కె.ఎస్.ఆర్.దాస్ గారి నించి రాఘవేంద్రరావ్, దాసరి, విశ్వనాథ్, బాపు, కోడి రామకృష్ణ వివిధ రకాలైన లెజెండ్స్‌తో తయారైన శైలిలో తమ దైన స్క్రీన్ ప్లే ముద్రతో ఎన్నో సూపర్‌హిట్స్ ఇచ్చారు. అరుంధతి, అంకుశం, తలంబ్రాలు, డిఫరెంట్ స్క్రీన్‌ప్లే అనడానికి కారణం ఈ తరంలో ప్రతి టాప్ డైరెక్టర్ వి.వి. వినాయక్ - శ్రీను వైట్ల - సురేంద్రరెడ్డి, శేఖర్ కమ్ముల, కృష్ణవంశీ - వై.వి.ఎస్.చౌదరి - త్రివిక్రమ్ శ్రీనివాస్ నుంచి తరుణ్ భాస్కర్ - రవికాంత్, వెంకి కురుముల (భాలు) వెంకి అట్లూరి (తండ్రిగారి) ప్రశాంత్ వర్మ (అ) దాకా అద్భుతమైన స్క్రీన్ ప్లే రైటర్స్ గా చెప్పవచ్చు.



సామాజిక, ఆర్థిక రంగాల్లో రాష్ట్రం భేష్

● జాతీయ తలసరి ఆదాయాన్ని మించిన రాష్ట్ర ఆదాయం ● జీఎస్టీ, నోట్ల రద్దు ప్రభావాలున్నా నిలకడగా వృద్ధి రేటు ● అభివృద్ధి కేంద్రాలుగా కొత్త జిల్లాలు





హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర వృద్ధి రేటు చెక్కుచెదరకుండా ఎప్పటికప్పుడు పుంజుకుంటోంది. వస్తుసేవల పన్ను (జీఎస్టీ), పెద్దనోట్ల రద్దు ప్రభావంతో జాతీయ స్థాయిలో అర్థికాభివృద్ధి మందగమనంతో సాగినప్పటికీ, రాష్ట్రంలో వృద్ధిరేటు కాస్తా నిలకడగానే సాగుతోంది. ఈ మేరకు సోషియో ఎకనామిక్ అవుట్ లుక్ -2018 నివేదిక స్పష్టం చేస్తోంది. దేశంలో ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్న రాష్ట్రంగా తెలంగాణ దూసుకువస్తోంది. ముఖ్యాంశాలు కొన్ని ఈ విధంగా ఉన్నాయి.

● తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014-15 నుంచి 2017-18 వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరధరల్లో 9 శాతంవృద్ధిరేటు నమోదు చేసుకుంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పటి కంటె 3.8 శాతం అధికంగా వృద్ధిరేటు నమోదయింది.

● జాతీయ వృద్ధి రేటు కంటె కూడా రాష్ట్రంలోనే ఎక్కువ నమోదు చేసుకుంది. రాష్ట్ర జీడీపీ 2014-15నుండి 2017-18 వరకు సగటున 9శాతం వృద్ధి రేటు నమోదు చేసుకుంది. ఇదే కాలానికి జాతీయ జీడీపీ సగటున 7.3 శాతమే నమోదైంది.

● తెలంగాణ రాష్ట్ర జీడీపీ 2016-17లో రూ. 6,41,985కోట్లు, 2017-18లో రూ.7,32,657కోట్లు కాగా, గత సంవత్సరం కంటె 14.1శాతం అధికం.

● జాతీయ జీడీపీ 2016-17 లో రూ. 1,30, 03, 897 కోట్లు కాగా, 2017-18లో రూ. 1,67, 51,688 కోట్లు నమోదు కాగా, గత సంవత్సరం కంటె 9.8 శాతం అధికం.

● జాతీయ జీడీపీలో 2013-14లో రాష్ట్ర వాటా 4.02 శాతం కాగా, 2017-18లో రాష్ట్ర వాటా 4.37 శాతానికి పెరిగింది.

● రాష్ట్ర తలసరి ఆదాయం, జాతీయ తలసరి కంటె ఎక్కువ. 2016-17లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,54,734 కాగా, 2017-18లో రూ. 1, 75,534కి పెరిగింది. జాతీయ తలసరి ఆదాయం 2016-17లో రూ. 1,03, 870 కాగా, 2017-18లో రూ. 1,12, 764 నమోదైంది.

● ఆర్థికాభివృద్ధిలో జాతీయ మందగమనానికి భిన్నంగా రాష్ట్రం వృద్ధి సాధించింది. జాతీయంగా 2015-16లో 8.2 శాతం, 2016-17లో అది కాస్తా తగ్గి 7.1 శాతం వృద్ధిరేటు నమోదు కాగా, 2017-18లో 6.6శాతం మాత్రమే నమోదైంది.అదే తెలంగాణలో గడచిన మూడేళ్లలో పెరుగుతూ వచ్చింది.

● గ్రాస్ వాల్యూయాడెడ్ (జీవీఏ)కి సంబంధించి 2017-18 సంవత్సరంలో రూ. 6,61,052 కోట్లు. అందులో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల వాటా 14.8 శాతం, పరిశ్రమల రంగం వాటా 19.8 శాతం, సేవారంగం వాటా 65. 4 శాతం.

● ప్రాథమిక రంగంలో రాష్ట్ర జీవీవీ వృద్ధి రేటు 2017-18 ప్రస్తుత ధరల్లో 9.2శాతంకాగా ఇది జాతీయవృద్ధిరేటు 5.3 శాతంకన్నా ఎక్కువ.ద్వితీయరంగంలో రాష్ట్ర జీవీఏ వృద్ధిరేటు 9 శాతంకాగా, తృతీయరంగంలో 15.3 శాతంగా నమోదు చేసుకుంది.

● వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలలో 2017-18 సంవత్సరంలో 9.8 శాతం వృద్ధి సాధించింది. ● పారిశ్రామికరంగంలో 2017- 18 లో 8.6 శాతం వృద్ధి నమోదైంది. ● 2016-17లో 34. 39 లక్షల హెక్టార్లలో ఆహార పంటలు వేశారు. రెండవ ముందస్తు అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2017-18లో 31.87 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. 2016-17 కంటె ఇది 7.33 శాతం తక్కువ.

● ఆహార దిగుబడుల విషయానికి వస్తే 2016-17లో 101.29 లక్షలటన్నులు కాగా, 2017-18 లో95.01లక్షల టన్నులు తరుగుదుల ఏర్పడింది.

● వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా, సాగునీటి రంగంలో ప్రగతి, రైతుల రుణాల మాఫీ, వ్యవసాయంలోయాంత్రికీకరణ, సూక్ష్మనీటి పారుదల విధానాల వల్ల భవిష్యత్తులో వ్యవసాయ దిగుబడులు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ● రాష్ట్రం నుంచి 2015-16లో రూ. 35,444 కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి చేయగా, 2016-17లో రూ. 40, 322 కోట్ల సరకులు ఎగుమతయ్యాయి.

● కొత్త జిల్లాల ఏర్పాటు అభివృద్ధి కేంద్రాలుగా మారాయి. రాష్ట్రాభివృద్ధి సమతుల్యంగా సాగేందుకు పూర్వ 10 జిల్లాలతో పాటు నూతనంగా ఏర్పడిన 21 జిల్లాలు దోహదపడుతున్నాయి.

రాబడిపై భారీ అంచనాలు

జీఎస్టీ అమలుతో పన్నుల ఆదాయం కోత పడినా సొంత వనరులపై ప్రభుత్వం ఈ ఏడాది భారీ అంచనాలనే పెట్టుకుంది. పన్నుల వసూళ్లలో ప్రగతి, లొసుగుల నివారణ, సమర్థత పెంపుతో రాష్ట్ర పన్నుల ఆదాయాన్ని 20శాతం పెంపుతో రూ.62,619 కోట్లనుంచి రూ.73,751 కోట్లకు పెంచుకుంది. అమ్మకం పన్నులు, ఆబ్కారీ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ రాబడులపైనే ఆశలు పెట్టుకుంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ సమస్యలను అధిగమిస్తూ ప్రస్తు ఆర్థిక ఏడాది 11 నెలల్లో 18.25 శాతం వృద్ధిరేటు సాధ్యమైంది. దీంతో రాష్ట్రపన్నుల ఆదాయం పెరుగుదలను 20 శాతం మేర పెంచుకుని 2018-19వార్షిక అంచనాలను రూపొందించింది. జీఎస్‌డిపిలో రెండంకెల వృద్ధి నేపథ్యం కూడా అంచనాల పెంపునకు కారణమైంది. పన్నులు, పన్నేతర రాబడులు, కేంద్ర పన్నుల వాటా, గ్రాంట్ల రూపంలో రూ.1,30,975 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. మిగిలిన మొత్తాన్ని అప్పులు, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక సాయం ద్వారా సమీకరించుకోనుంది. మొత్తంగా అభివృద్ధి వ్యయాలు రూ.92,837 కోట్లు, రుణాలు రూ.11791 కోట్లు, పరిపాలనా సేవలకు రూ.7066కోట్లు, పన్నుల వసూలు ఖర్చులు రూ.872కోట్లు, ఇతర ఖర్చులు రూ.12887కోట్లుగా సర్కార్ అంచనా వేసుకుంది. ఇది మొత్తం రూ. 1,25,454కోట్లుకాగా మిగులు రూ. 5529కోట్లుగా అంచనాలు వేసుకుంది.


వాణిజ్య పన్నుల రాబడి అంచనాలు రూ. 46, 499 కోట్లనుంచి రూ. 25,942 కోట్లకు కుదించారు. కేంద్ర వస్తువులపై సేవల పన్నును (సీజీఎస్టీ) రూ. 6181 కోట్లుగా, ఎస్జీఎస్టీ రూ. 26,040కోట్లు, ఐజీఎస్టీ రూ. 511కోట్లు, పరిహారం రూపంలో రూ. 1500 కోట్లు అంచనా వేశారు. ఆబ్కారీ శాఖ లక్ష్యం రూ. 8999 కోట్లనుంచి రూ. 10,600 కోట్లకు వర్తింపజేసింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్లశాఖ రాబడి లక్ష్యం రూ. 3వేల కోట్లనుంచి రూ. 4699 కోట్లకు లక్ష్యాన్ని పెంచుతూ నిర్ణయించారు. వాహన పన్నుల రాబడిని రూ. 3వేల కోట్లనుంచి రూ. 3950 కోట్లకు పెంచింది.

ఇది ఎన్నికల బడ్జెట్టే: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అంకెల గారడీ, మాటల గారెడీ తప్పా బడ్జెట్ వల్ల పెద్దగా ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమీలేదని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, పింఛన్‌దారుల కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ పథకానికి తూట్లు పొడిచేలా దానిని ఆరోగ్యశ్రీ కిందకు చేర్చడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రైతుల రుణ మాఫీ గురించి ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు.

ప్రజలను మభ్యపెట్టే కాకిలెక్కలు: కె. లక్ష్మణ్



రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టే కాకిలెక్కలతో బడ్జెట్‌ను రూపొందించారని ఆయన విమర్శించారు. అబద్దాల చిట్టాతో రూపొందించిన బడ్జెట్ వాస్తవాలకు చాలా దూరంగా ఉందని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, జీవం లేని బడ్జెట్‌గా అభివర్ణించారు.

ఎస్సీ, ఎస్టీలకు అరకొర నిధులే: సున్నం రాజయ్య




వ్యాట్, సేల్‌ట్యాక్స్‌ల పరిధి నుంచి పెట్రోల్, డీజిల్‌ను మినహాయించి వ్యాట్ పరిధిలోకి చేర్చితే సామాన్యుడికి అందుబాటులో పెట్రోల్ ధరలు వస్తాయని అన్నారు. భారీ బడ్జెట్ ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం చివరకు అందులో ఏమీ లేకుండానే చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీల బడ్జెట్‌లో అరకొర నిధులే కేటాయించారన్నారు.

బీసీలపై చిన్నచూపు: కృష్ణయ్య




హైదరాబాద్,ఆంధ్రప్రభ : అప్పుల మీద ఆధారపడి ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బీసీల సెంటిమెంట్ మీద దెబ్బకొట్టడానికే సీఎం ప్రయత్నిస్తున్నారన్నారు. బీసీ కార్పొరేషన్‌కు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. ఈ బడ్జెట్ ఏరకంగా చూసిన బీసీలకు అన్ని రకాలుగా అన్యాయమే జరిగిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి మరిన్ని నిధులు కేటాయించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సీఎం పెడచెవిన పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్ అంకెల గారడీతోనే నిండిపోయిందని, వాస్తవిక దృక్పథాన్ని ప్రతిబింబించేలా లేదని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి అన్నారు.

రైతుకు ఎలాంటి ఉపయోగం లేదు: సండ్ర




66 పేజీల నివేదిక చూడడానికేనని అందులో ఏమి లేదని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ బడ్జెట్ పుస్తకం బరువు ఎక్కువ ఉందని ఆయన ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో పేర్కొన్న అంశాలు ఏ మాత్రం చెప్పుకోదగినవిగా లేవన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా బడ్జెట్‌లో ఎలాంటి అంశాలను పొందుపరచలేదన్నారు.

ప్రధాన ప్రతిపక్షం లేకుండా ...



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే డీకే అరుణ మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం లేకుండా బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తారా..? అంటూ దుయ్యబట్టారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి గ్రహణం పట్టిందని, కేసీఆర్ బానిస పాలనకు స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే స్వేచ్ఛాయుత పాలన వస్తుందన్నారు. ఎమ్మెల్యేలు ఏమి చేశారని సభ్యత్వాలను రద్దు చేశారని ఆమె నిలదీశారు. ఇచ్చిన హామీలను నేరవేర్చమని అడిగినందుకు సభ నుంచే బహిష్కరణ చేయడం సిగ్గుచేటన్నారు. సభలో మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు హెడ్‌ఫోనే తగలలేదన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం తగిలినట్లు అబద్దాలు మాట్లాడుందన్నారు. విజువల్స్‌ను ఎందుకు చూపెట్టడం లేదన్నారు.

అంతా బోగస్: షబ్బీర్ అలీ




హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్థిక శాఖ మంత్రి ఈటల ప్రవేశపెట్టిన బడ్జెట్ అబద్దాల బడ్జెట్ అని, వాస్తవాలకు దూరంగా ఉన్నా బోగస్ బడ్జెట్ అని మండలిలో విపక్షనేత షబ్బీర్ అలీ అన్నారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో దాదాపు 60 శాతం ఖర్చు చేయలేదని ఆయన విమర్శించారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. గతంలో మైనార్టీలకు కేటాయించిన నిధులు పేపర్‌కే పరిమితమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బడ్జెట్‌లో నిధులు ఇవ్వలేదన్నారు.

అప్పులు చేయడంలో ప్రగతి సాధించారా..? : చిన్నారెడ్డి



బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయింపులు తప్పా ఖర్చులు మాత్రం శూన్యమని కాంగ్రెస్ ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం చెప్పే దొంగ లెక్కలపై నిలదీస్తామనే .. కాంగ్రెస్ పార్టీ సభ్యులను సభ నుంచి బయటకు పంపారని ఆయన విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదని సీఎం కేసీఆర్ చెప్పడంలో వాస్తవం లేదని, అప్పుల్లో మాత్రం ప్రగతి సాధించారని ఆరోపించారు. 60 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయని అప్పులు ఈ నాలుగేళ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందన్నారు. మూడు ఎకరాల భూమి కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏడు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఎదురు చూస్తున్నాయని ఆయన తెలిపారు.

అప్పులు తేవడం, అడ్డగోలుగా ఖర్చు చేయడం: రేవంత్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు అప్పులు తేవడం, అడ్డగోలుగా ఖర్చు చేయడమే తెలుసని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సమాజాన్ని మోసం చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. తప్పుడు లెక్కలతో మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

మభ్యపెట్టేదిగా ఉంది: మాజీ ఎంపి పొన్నం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గొప్పలు చెప్పి ప్రజలను మభ్యపెట్టేదిగా ఉందని, మోసపూరితంగా ఉందని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. బడ్జెట్ రైతులను ఆకర్షించేదిగా ఉంది తప్ప ఆచరణ సాధ్యం కానిదని పెదవి విరిచారు. దళితులకు మూడెకరాల భూపంపిణీకి అరకొర నిధులు కేటాయించారన్నారు. కెజి టు పిజి విద్య మానస పుత్రిక అని చెప్పుకుంటున్న కెసిఆర్ బడ్జెట్‌లో తగినన్ని నిధులను కేటాయించకుండా మొండిచేయి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాటలకు చేతలకు పొంతన లేదు: పొన్నాల లక్ష్మయ్య



నయీంనగర్ (వరంగల్), ప్రభన్యూస్ : 2018-19 వార్షిక బడ్జెట్ మాటలకు చేతలకు పొంతన లేనిదిగా ఉందని, ఇది అంకెల గారడి బడ్జెట్‌గా టీ పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అభివర్ణించారు. గురువారంనాడు హన్మకొండలో విలేకరుల సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు మాటలకు పరిమితమయ్యాయని విమర్శించారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను వంచనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో శూన్య హస్తం చూపారని ఆరోపించారు.

ఏఐసీసీ ప్లీనరీకి నేడు ఢిల్లీకి రాష్ట్ర నేతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏఐసీసీ ప్లీనరీ సమావేశానికి హాజరయ్యేందుకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లనున్నారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డితో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్లతో పాటు టీపీసీసీ పదాధికారులు తదితరులు శనివారం ఢిల్లీలో జరిగే పార్టీ ప్లీనరీ సమావేశానికి హాజరుకానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై పార్టీ హైకమాండ్ పెద్దల దృష్టికి తీసుకుపోనున్నారు. తెలంగాణ అసెంబ్లీలో నెలకొన్న పరిస్థితులు, ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు, బడ్జెట్ సమావేశాల మొత్తం పార్టీ సభ్యుల సస్పెన్షన్‌కు సంబంధించిన అంశాలపై వివరించనున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ తీరుపై భవిష్యత్‌లో అనుసరించే వ్యూహంపైన చర్చిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

తెలంగాణ ప్రభుత్వము, రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు కార్యాలయం, వికారాబాద్ జిల్లా

ఫారం-సి

(చట్టం యొక్క సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు)
(రూల్ 6/12 చూడుడు)

ప్రాథమిక ప్రకటన

ఆర్‌డిఓ వికారాబాద్ ఆఫీస్ ఫైల్ నెం.బి/264/2018 — తేది : 14-03-2018
కలెక్టర్ ఆఫీస్ ఫైల్ నెం.జి/2217/2017 — తేది : 14-03-2018
గెజిట్ నెం.వికెబి-07 — తేది : 14-03-2018

తెలంగాణ ప్రభుత్వం / కలెక్టరు వారు ప్రజా ప్రయోజనార్థం అనగా **ఎన్‌హెచ్-163** యొక్క హైదరాబాద్-మన్నెగూడ సెక్షన్ యొక్క నాలుగు వరుసల కొరకు వికారాబాద్ జిల్లా, పూడూరు మండలం, కండ్లపల్లి గ్రామంలో మొత్తం విస్తీర్ణం ఎ.**22-08**గుం.ల భూమి అవసరమై ఉన్నదని భావించుచున్నారు.

అందువలన తెలంగాణ ప్రభుత్వం ఆర్‌ఎఫ్‌సిటిఎల్‌ఎ ఆర్ & ఆర్ చట్టం (తెలంగాణ సవరణ చట్టం) 2016 యొక్క సెక్షన్ 10 (ఎ) క్రింద గల నిబంధనలకు అనుగుణంగా చట్టం 30 ఆఫ్ 2013 యొక్క చాప్టర్ -II & III యొక్క నిబంధనల యొక్క దరఖాస్తు నుండి ప్రాజెక్టు మినహాయిస్తూ నోటిఫికేషన్ జారీ చేయడమైనది. తదనుగుణంగా ప్రస్తుత స్వాధీనత సదరు నోటిఫికేషన్ యొక్క సెక్షన్ 10ఎ వర్తిస్తుంది.

ఈ ప్రాజెక్టు సామాజిక ప్రభావ మదింపు అధ్యాయం నుండి మినహాయించబడినది. ప్రామాణిక కొలతల యొక్క ఎ.22-08గుం.లు కొద్దిగా ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణంగల భూమి యొక్క భాగము వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం, కండ్లపల్లి గ్రామంలో పైన తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు ప్రకటించడమైనది. స్వాధీనత క్రింద దాని యొక్క వివరణాత్మక వివరము దిగువ తెలుపబడినది.

షెడ్యూల్

జిల్లా : వికారాబాద్ జిల్లా — మండలం : పూడూరు — గ్రామం : కండ్లపల్లి

క్రమ సంఖ్య	సర్వే నెం.	టైటిల్ రకం	భూమి రకం	సేకరణ క్రింద విస్తీర్ణం (ఎ. లలో)	ఆసక్తిగల వ్యక్తి పేరు & చిరునామా	సరిహద్దులు: ఉ	ద	తూ	ప	నిర్మాణములు: నిర్మాణం	ప్లింత్ ఏరియా	చెట్లు	రకం
1	110/2	పట్టా	మెట్ట	00-02	నడికుడి అంజయ్య తండ్రి జంగయ్య (క్షేత్రస్వాధీనత ప్రకారం)	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	111 మరియు గ్రామ సరిహద్దు కిష్టాపూర్	109/1	-	-	-	-
2	109/1	పట్టా	మెట్ట	00-03	నడికుడి అంజయ్య తండ్రి జంగయ్య	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	110/2	106/2	మెయిన్ గేటు & గది (టిన్‌షెడ్‌తో)	90 అడుగులు	-	-
3	109/1	పట్టా	మెట్ట	00-02	నడికుడి అంజయ్య తండ్రి చిన్నయ్య	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	110/2	106/2	-	-	-	-
4	109/1	పట్టా	మెట్ట	00-0.5	ఓంప్రకాష్ గౌడ్ తండ్రి అంజయ్య	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	110/2	106/2	-	-	-	-
5	109/1	పట్టా	మెట్ట	00-03	దొడ్ల సులోచన తండ్రి జంగయ్య	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	110/2	106/2	-	-	-	-
6	109/1	పట్టా	మెట్ట	00-02.5	తియ్యగూర మధుసూదన్ రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	110/2	106/2	-	-	-	-
7	106/2	పట్టా	మెట్ట	00-02	షేక్ యసీన్ తండ్రి నిజాం అహ్మద్	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	109/1	97/1	-	-	-	-
8	106/2	పట్టా	మెట్ట	00-01.5	జి.యాదయ్య తండ్రి సత్యనారాయణ	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	109/1	97/1	-	-	-	-
9	106/2	పట్టా	మెట్ట	00-01.5	ఎన్.విద్యాధరి భర్త మధుసూదన్ రావ్	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	109/1	97/1	-	-	-	-
10	106/2	పట్టా	మెట్ట	00-06.5	డి.సరిత భర్త శ్రీధర్ గౌడ్, ఎన్.జ్యోతి భర్త నరేందర్ రెడ్డి	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	109/1	97/1	-	-	-	-
11	97/1	పట్టా	మెట్ట	00-05.5	ఎండి అహ్మద్ షరీఫ్ తండ్రి ఇక్బాల్	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	106/2	93	-	-	-	-
12	97/1	పట్టా	మెట్ట	00-01.5	కంకనల్ పుష్పమ్మ భర్త జనార్ధన్ రెడ్డి, మల్లేపల్లి విజయమ్మ భర్త రామచంద్రా రెడ్డి	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	106/2	93	-	-	-	-
13	93	పట్టా	మెట్ట	00-02.5	బి.వైదేహి భర్త రమణారావు, అశోక్ భర్త శంకరయ్య, మధుసూదన్ తండ్రి పద్మనాభయ్య	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు, 94,96/2	92/1	97/1	ప్రహరీ గోడ	240 అడుగులు	-	-
14	96/2	పట్టా	మెట్ట	00-04	బి.వైదేహి భర్త రమణారావు, అశోక్ భర్త శంకరయ్య, మధుసూదన్ తండ్రి పద్మనాభయ్య	93	రోడ్డు	94	93	-	-	-	-
15	95/1	పట్టా	మెట్ట	00-07	పల్లె రామకృష్ణారెడ్డి తండ్రి నరసింహారెడ్డి	94	రోడ్డు	96/2	92/1	-	-	-	-
16	90/2	పట్టా	మెట్ట	00-05.5	బారడి రాజుభాయ్ తండ్రి హీరుషా	92/1	రోడ్డు	95/1	92/1	-	-	-	-
17	92/1	పట్టా	మెట్ట	00-09.5	చెన్నుపాటి వేణుమాధవ్ తండ్రి సాంబశివరావు	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	90/2, 95/1, 93, 94	57	-	-	-	-
18	57	పట్టా	మెట్ట	00-03.5	మీర్ మజారుద్దీన్ తండ్రి మీర్ బాబర్	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	92/1	51, 59/2	-	-	-	-
19	57		మెట్ట	00-03.5	కాలువ	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	92/1	51, 59/2	-	-	-	
20	59/2	పట్టా	మెట్ట	00-04	పొజిషన్ ప్రకారం బర్ల మల్లయ్య	58	రోడ్డు	57	58	-	-	మామిడి చెట్టు	1
21	51	గైరాన్	మెట్ట	01-19	అడవి మరియు ప్రభుత్వ భూమి	గ్రామ సరిహద్దు అంతారం	రోడ్డు	56, 57, 58,92/1	గ్రామ సరిహద్దు మీర్జాపూర్	-	-	-	-
22	51	గైరాన్	మెట్ట	07-24	అడవి	రోడ్డు	51 (అడవి), 52	59	గ్రామ సరిహద్దు మీర్జాపూర్	-	-	1)నీలగిరి చెట్టు 2)వేప చెట్లు	(2309) (45)
23	59/1	పట్టా	మెట్ట	00-29	బ్యాగరి రామచంద్రయ్య తండ్రి అంతయ్య	రోడ్డు	51	కాలువ	51	1)66 పైపు లైన్లు 2) డ్రిప్ పైపులు	(33)	-	-
24	59/1	పట్టా	మెట్ట	00-34	దండు జహంగీర్ ఖాన్ తండ్రి రెహమాన్ ఖాన్	రోడ్డు	51	కాలువ	51	-	-	-	-
25	59/1	పట్టా	మెట్ట	00-09	దండు షరీఫ్ ఖాన్ తండ్రి మహ్మద్‌ఖాన్	రోడ్డు	51	కాలువ	51	-	-	-	-
26	కాలువ	ప్రభుత్వ	మెట్ట	00-09	కాలువ	రోడ్డు	కాలువ	92/2	59	-	-	-	-
27	92/2	పట్టా	మెట్ట	00-04	అస్గార్ అహ్మద్ తండ్రి నసీరుద్దీన్ అహ్మద్	రోడ్డు	కాలువ	91	కాలువ			1. మామిడి చెట్లు 2. వేప చెట్లు	(23) 2
28	91	పట్టా	మెట్ట	00-04	మధుసూదన్ రెడ్డి తండ్రి సుభాన్ రెడ్డి	రోడ్డు	86	90/1	92/2	-	-	-	-
29	90/1	పట్టా	మెట్ట	00-07.5	బస్వా శివరాములు తండ్రి రామచంద్రయ్య	రోడ్డు 95/2	86	88, 89	91	-	-	-	-
30	90/1	పట్టా	మెట్ట	01-00	ఇమాముద్దీన్ తండ్రి అజీజుద్దీన్	రోడ్డు, 95/2	86	88, 89	91	నీటి సంపు		1. మామిడి చెట్లు 2. టేకు 3.కొబ్బరి 4. వేప	84 91 10 7
31	95/2	పట్టా	మెట్ట	00-06	పల్లె రామకృష్ణా రెడ్డి తండ్రి నరసింహారెడ్డి	రోడ్డు	90/1	96/1	రోడ్డు	-	-	-	-
32	96/1	పట్టా	మెట్ట	00-24	ఇమాముద్దీన్ తండ్రి అజీజుద్దీన్	రోడ్డు	89	97/2, 98	90/1, 95/2	బోరు బావి 6½ పైప్ లైన్	-	-	-
33	96/1	పట్టా	మెట్ట	00-08	అన్వర్ షరీఫ్ తండ్రి తండ్రి హస్సన్ షరీఫ్	రోడ్డు	89	97/2,98	90/1, 95/2	బోరు బావి 6½ పైప్ లైన్ 2) గది రేకులతో	25*25 అడుగులు	-	-
34	96/1	పట్టా	మెట్ట	00-10	సయ్యద్ రఫీదుద్దీన్ తండ్రి సయ్యద్ అజీజుద్దీన్	రోడ్డు	89	97/2, 98	90/1, 95/2	బోరు బావి 6½ పైప్ లైన్ 2) గది రేకులతో ప్రహరీ గోడ	25*25 ఎఫ్ కాంపౌండ్ వాల్ 100 అడుగులతో	-	-
35	97/2	పట్టా	మెట్ట	00-14	మోతీలాల్ జైన్ తండ్రి మంగిలాల్ జైన్	రోడ్డు	96/1, 98	106/1	రోడ్డు	-	-	-	-
36	97/2	పట్టా	మెట్ట	01-18	శిరీషా రెడ్డి భర్త జెరీమా రెడ్డి	రోడ్డు	96/1, 98	106/1	రోడ్డు, 96/1	-	-	-	-
37	97/2	పట్టా	మెట్ట	00-11.5	జి.షౌరెడ్డి తండ్రి కీర్తి రెడ్డి	రోడ్డు	96/1 98	106/1	రోడ్డు 96/1	-	-	-	-
38	97/2	పట్టా	మెట్ట	00-08	వై.మిథున్ తండ్రి మాధవ రెడ్డి	రోడ్డు	96/1, 98	106/1	రోడ్డు, 96/1	మెయిన్ గేటు & కాంపౌండ్ వాల్	-	-	-
39	97/2	పట్టా	మెట్ట	00-09	వై.కళ్యాణ్ తండ్రి మాధవ రావు	రోడ్డు	96/1 98	106/1	రోడ్డు 96/1	-	-	-	-
40	106/1	పట్టా	మెట్ట	00-11	డి.సరిత భర్త శ్రీధర్ గౌడ్	రోడ్డు	105	107, 108	97/2 98	-	-	-	-
41	106/1	పట్టా	మెట్ట	00-11	ఎన్.జ్యోతి భర్త నరేందర్‌రెడ్డి	రోడ్డు	105	107, 108	97/2 98	-	-	-	-
42	106/1	పట్టా	మెట్ట	00-11	ఎడ్గి లక్ష్మయ్య తండ్రి లేటు అంజయ్య	రోడ్డు	105	107, 108	97/2 98	-	-	-	-
43	106/1	పట్టా	మెట్ట	00-11.5	ఎడ్గి ఈశ్వరయ్య తండ్రి బాలా గౌడ్	రోడ్డు	105	107, 108	97/2 98	-	-	-	-
44	106/1	పట్టా	మెట్ట	00-21	ఎడ్గి రామచంద్రయ్య తండ్రి బాలా గౌడ్ జి.యాదయ్య తండ్రి సత్యనారాయణ	రోడ్డు	105	107, 108	97/2 98	-	-	-	-
45	109/2	పట్టా	మెట్ట	00-08	మల్లికా బేగం భర్త ఎం.డి.బషీర్ అహ్మద్	రోడ్డు	113	110/1	107, 108	-	-	-	-
46	109/2	పట్టా	మెట్ట	00-14.5	బషీర్ అహ్మద్ తండ్రి అబ్దుల్ అజీజ్	రోడ్డు	113	110/1	107, 108	-	-	-	-
47	109/2	పట్టా	మెట్ట	00-10	ఉప్పరి శ్రీను సుందర్ తండ్రి మాథ్యూస్	రోడ్డు	113	110/1	107, 108	-	-	-	-
48	109/2	పట్టా	మెట్ట	00-04	ఉప్పరి పద్మారావు తండ్రి చంద్రయ్య	రోడ్డు	113	110/1	107, 108	-	-	-	-
49	109/2	పట్టా	మెట్ట	00-03.5	ఉప్పరి ఎల్లయ్య తండ్రి వెంకయ్య	రోడ్డు	113	110/1	107, 108	-	-	-	-
50	109/2	పట్టా	మెట్ట	00-15	ఉప్పరి మాణిక్యరావు తండ్రి ఎల్లయ్య	రోడ్డు	113	110/1	107, 108	-	-	-	-
51	109/2	పట్టా	మెట్ట	00-17	కౌకుంట్ల సుదర్శన్ తండ్రి రామస్వామి	రోడ్డు	113	110/1	107, 108	-	-	-	-
52	110/1	పట్టా	మెట్ట	00-09.5	కంకటి రాములు తండ్రి అంతయ్య కంకటి బాలయ్య తండ్రి అంతయ్య కంకటి వెంకటయ్య తండ్రి అంతయ్య	రోడ్డు	111	గ్రామ సరిహద్దు కిష్టాపూర్	109/2	-	-	-	-
53	110/1	పట్టా	మెట్ట	00-22	బ్యాగరి రామచంద్రయ్య తండ్రి అంతయ్య	రోడ్డు	111	గ్రామ సరిహద్దు కిష్టాపూర్	109/2	-	-	-	-
			మొత్తం	22-08 గుం.లు									

భూసేకరణలో పారదర్శకం, న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ చట్టం, 2013 (చట్టం నెం. 30/2013) యొక్క హక్కు సెక్షన్ 11 (1) క్రింద మరియు భూసేకరణలో పారదర్శకం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంటు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21 ఆఫ్ 2017) ప్రకారం సంబంధించిన వారందరికీ తెలియచేయడమైనది.

భూమి యొక్క ప్లాను జిల్లా కలెక్టర్, వికారాబాద్ జిల్లా, రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, వికారాబాద్ డివిజన్, వికారాబాద్ జిల్లా వారి కార్యాలయములో ఏదేని పని దినమున కార్యాలయ వేళలయందు పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్ -కమ్-సరియగు ప్రభుత్వం సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని సరిగా నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే, ఏదేని భూమి యొక్క లెవెల్స్ చేపట్టుటకు, త్రవ్వుటకు లేదా సబ్‌సాయిల్‌లోకి బోరు వేయుటకు మరియు ప్రవేశించుటకు రెవెన్యూ డివిజనల్ అధికారి, వికారాబాద్ డివిజన్, వికారాబాద్ జిల్లా వారికి మరియు అతని సిబ్బందికి అధికారం మిచ్చియున్నారు.

చట్టం యొక్క సెక్షన్ 11 (4) క్రింద కలెక్టరు యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి అటువంటి భూమి యొక్క ప్రచురణ తేదీ నుండి అటువంటి భూములపై ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏవేని లావాదేవీ అనగా అమ్మకం / కొనుగోలు మొ॥/ లేదా ఏవేని తాకట్టు రుణభారాలను చేయరాదు.

సేకరణకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తిగల/ప్రభావిత వ్యక్తులందరి నుండి క్లెయింలను జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఇవ్వబడిన విధంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 (అరవై రోజులు) లోపు భూమిలో ఆసక్తిగల వ్యక్తులచే దాఖలు చేసుకోవచ్చును.

సం/-	సం/-	సం/-
సిఎఎల్ఎ/రెవిన్యూ డివిజనల్ అధికారి వికారాబాద్ డివిజన్, వికారాబాద్ జిల్లా	జాయింట్ కలెక్టర్ వికారాబాద్ జిల్లా	కలెక్టర్ వికారాబాద్ జిల్లా

సింగపూర్ కాస్ట్‌లీ! చెన్నై చీప్



ఢిల్లీ, బెంగళూరు కూడా



న్యూఢిల్లీ : ప్రపంచంలోని అత్యంత చౌకనగారల్లో భారత్‌కు చెందిన మూడు నగరాలు ఆక్రమించాయి. న్యూఢిల్లీ, బెంగళూరు, చెన్నైలని ఎనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయు) సర్వేలో పేర్కొంది. ప్రపంచలోనే అత్యంత ఖరీదైన నగరం సింగపూర్ దక్కించుకుంది.

కాగా 2018 కాస్ట్ ఆఫ్ లివింగ్ సర్వే ప్రకారం చూస్తే దక్షిణాసియా దేశాలకు చెందిన నగరాలు ప్రధానంగా భారత్, పాకిస్తాన్‌లు తమ డబ్బుకు తగ్గ విలువ సేవలందిస్తున్నాయని స్పష్టం చేసింది. ప్రపంచంలోనే టాప్ 10 అత్యంత చౌకనగరాల్లో బెంగళూరు, చెన్నై, కరాచీలు, న్యూఢిల్లీలు స్థానం దక్కించుకున్నాయి. ఇక భరత్ విషయానికి వస్తే వృద్ధిరేటులో శరవేగంగా దూసుకుపోతోంది. అయితే వేతనాలు, ఖర్చుల విషయంలో అతి తక్కువ వ్యయం చేస్తున్నారని, ఆదాయంలో వ్యత్యాసాలు ఎక్కువగా ఉన్నాయి. తక్కువ వేతనాల వల్ల కుటుంబాలు తమ అవసరాలకు తక్కువ వ్యయం చేయాల్సి వస్తోందని నివేదికలో వివరించింది.

చౌకరకం ఉత్పత్తులు మార్కెట్లను ముంచెత్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల నుంచి ఈ ఉత్పత్తులు తయారై పట్టణాలకు వస్తున్నాయని.. సరఫరా కూడా తక్కువగా ఉంటుందని, ప్రభుత్వం కొన్ని ఉత్పత్తులపై సబ్సిడిని ఇవ్వడంతో ధరలు చౌకగా ఉంటాయని పేర్కొంది. పాశ్చాత్యదేశాల నాణ్యత ప్రమాణాలతో పోల్చుకుంటే ఇక్కడ వస్తువుల ధరలు చాలా తక్కువగా ఉంటాయని తేల్చి చెప్పింది.

ప్రపంచలోనే అత్యంత చౌకనగరం.. సిరియా రాజధాని డమాస్కస్ రికార్డుల కెక్కింది. తర్వాత స్థానాలు వెనుజులా రాజధాని కారాకాస్, కజికిస్తాన్ బిజినెస్ సెంటర్ అల్‌మాటిలు రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. టాప్ 10 అత్యంత చౌకనగరాల విషయానికి వస్తే లాగోస్ నాలుగవ స్థానంలో బెంగళూరు 5వ స్థానం కరాచీ ఆరవ స్థానం, అల్జీర్స్ 7వ స్థానం, చెన్నై 8వ స్థానం బుకారెస్ట్ 9వ స్థానం, న్యూఢిల్లీ 10వ స్థానం ఆక్రమించాయి.


మొత్తానికి భారత ఉపఖండం మాత్రం ఇప్పటి చౌకధరలతోనే కొనసాగుతోంది. అస్థిరత్వం వల్ల వల్ల ధరలు తక్కువగా ఉంటున్నాయని నివేదికలో వివరించింది.

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్ వరుసగా ఐదో సంవత్సరం నిలిచింది. కాగా ప్యారిస్ రెండ స్థానం, జూరిచ్ మూడవ స్థానం, హాంగ్‌కాంగ్ 4వ స్థానంలో నిలిచాయి. ఒస్లో 5వ స్థానంలో జెనీవా ఆరవ స్థానంలో, సియోల్ 7వ స్థానం, కోపెన్‌హెగన్ 8వ స్థానం, టెల్‌అవీవ్ 9, సిడ్నీ 10వ స్థానంలో నిలిచాయి. వరల్డ్ కాస్ట్ ఆఫ్ లివింగ్ ప్రతి రెండు సంవత్సరాలకొకసారి ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ నిర్వహిస్తుంటుంది. మొత్తం 160 ప్రొడక్టులు, సర్వీసులపై 400 రకాల వసువుల ధరలపై వీటిని నిర్ణయిస్తారు. వాటిలో ఆహారం, పానీయాలు, బట్టలు, ఇంటికి కావాల్సిన వస్తువులు, పర్సనెల్ కేర్ వస్తువులు, ఇంటి అద్దెలు, రవాణా, యుటిలిటి బిల్లులు, ప్రైవేట్ స్కూలు, ఇంటి పనిమనిషులకు ఇచ్చే వేతనాలు, వినోదం కోసం చేసే ఖర్చులను పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందించారు.

Andhraprabha business 2018

బిజినెస్

కునుకు కరవైన భారత్ టెక్నాలజీతో నిద్రాలేమి



రోజు రోజుకు కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుండటంతో భారతీయులకు నిద్రాలేమి ఏర్పడుతోందని.. తాజా సర్వేలో తేల్చి చెప్పింది. ఫిలిప్స్ నిర్వహించిన గ్లోబల్ సర్వేలో 32 శాతం మంది పురుషులు కొత్త టెక్నాలజీ ద్వారా నిద్రకు దూరమవుతున్నారు. కాగా మరో 19 శాతం మంది ప్రజలు తరచూ షిఫ్ట్ సిస్టంలో ఉద్యోగాలు చేయడం వల్ల నిద్రకు దూరమవుతున్నారు. 66 శాతం మంది భారతీయులు వ్యాయామం చేడానికిపెద్దపీట వేస్తున్నారు. దీంతో ఆరోగ్యవంతంగా ఉండి మంచి నిద్రకు ఉపక్రమించవచ్చునని భావిస్తున్నారు. మంచి నిద్ర కోసం 45 శాతం భారతీయులు ధ్యానం ద్వారా మంచి నిద్రకు ఉపక్రమించవచ్చునని భావిస్తుంటే.. 24 శాతం మంది మాత్రం ప్రత్యేకమైన పరుపులు వినియోగించుకోవాలనుకుంటున్నారు. టెక్నాలజీ రాకతో ప్రజలకు నిద్రాభంగం కలుగుతోందని సర్వే స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే నిద్రలేమితో 26 శాతం మంది బాధపడుతుంటే 21 శాతం మంది గురక ద్వారా నిద్రా భంగం జరుగుతోంది. లేనిపోని భయాల వల్ల 58 శాతం మంది కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానం ద్వారా 26 శాతం మంది నిద్రకు దూరమవుతున్నారు. మంచి నిద్రకు శ్రావ్యమైన సంగీతం వింటూ నిద్రపోవచ్చు.. 36 శాతం మంది ఈ చిట్కాను పాటిస్తున్నారు. కాగా ఈ సర్వలే మొత్తం 13 దేశాల్లో 15,000 మంది పురుషుల నుంచి సమాచారం సేకరించి నివేదికను రూపొందించారు. అమెరికా, బ్రిటిన్, జర్మనీ, పోలండ్, ఫ్రాన్స్, ఇండియా, చైనా దేశాల ప్రజలనుంచి వారి అభిప్రాయాలను తీసుకొని నివేదిక రూపొందించారు. కాగా మార్చి 16ను ప్రపంచ స్లీప్ డేగా పిలుస్తారు. మంచి ఆరోగ్యానికి మంచి నిద్ర ఎంత ముఖ్యం అని నివేదికలో పేర్కొంది.

వచ్చే ఆర్థిక సంత్సరం వృద్ధి రేటు 7.3 శాతం

- 2019-20లో 7.5%



న్యూఢిల్లీ : భారత్ ఆర్థిక వ్యవస్థ క్రమంగా పుంజుకుంటోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7.3 శాతానికి, అటు తర్వాత 2019-20లో ఇది మరింతపైకి అంటే 7.5 శాతానికి ఎగబాకవచ్చునని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంచనా వేసింది. మౌలికరంగంలోకి పెద్దమొత్తంలో పెట్టుబడులు రావడంతో పాటు ఇప్పటి వరకు ఆర్థిక వ్యవస్థకు అడ్డంకిగా మారినా.. పెద్దనోట్ల రద్దు, జీఎస్టి ఇబ్బందులను భారత్ అధిగమించిందని ఫిచ్ రేటింగ్ వివరించింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా నమోదు కావచ్చునని, కేంద్ర గణాంకాల కార్యాలయం అంచనా 6.6 శాతంతో పోల్చుకుంటే కాస్తా తక్కువే. 2016-17లో వృద్ధిరేటు 7.1 శాతంగా నమోదైన విషయం తెలిసిందే.

వృద్ధిరేటు పుంజుకోవడానికి ప్రధాన కారణం ప్రభుత్వం పెద్దెత్తున సంస్కరణలు తీసుకురావడం, ఇప్పటి వరకు ప్రభుత్వం వీటిపై జాప్యం చేస్తూ వస్తోందని ఇప్పుడు ఇవన్నీ గాడినపడ్డాయని వివరించింది. ఇక గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే అమెరికా, యూరోజోన్, చైనాలు కూడా 2018లో వృద్ధిరేటులో దూసుకుపోతాయని ఫిచ్ అంచనా వేసింది. గ్లోబల్ వృద్ధిరేటు వరుసగా గత మూడు ఏళ్ల నుంచి యధావిధిగా 3 శాతానికి 2019 వరకు పరిమితమవుతుంది. 2000 సంవత్సరం నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ద్రవ్య చలామణి విషయానికి వస్తే పెద్దనోట్ల రద్దు తర్వాత కాస్తా ఇబ్బందులు ఎదుర్కొన్నా.. ప్రస్తుతం పరిస్థితులు గాడినపడ్డాయని తెలియజేసింది. జులై 2017 నుంచి అమల్లోకి తెచ్చిన జీఎస్టి వల్ల ఆర్థిక వ్యవస్థపై కొంత ప్రభావం కనిపించినా.. ప్రస్తుతం పరిస్థితులు కుదటపడ్డాయి. అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికంలో వృద్ధిరేటు గాడిన పడింది. ఐదు త్రైమాసికాల తర్వాత 7.2 శాతానికి ఎగబాకింది. ముఖ్యంగా కీలకరంగాలు వ్యవసాయం, నిర్మాణం, తయారీరంగం జోరందుకోవడమే కారణం. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ క్రమంగా స్థిరపడుతుందని, మధ్య కాలికం నుంచి క్రమంగా జోరందుకుంటుందని పేర్కొంది. బడ్జెట్‌లో ప్రభుత్వం అల్పాదాయం కలిగిన వారికి కనీస మద్దతు ధర ప్రకటించడంతో పాటు ఉచితంగా ఆరోగ్యబీమా పథకాన్ని ప్రకటించింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుతుంది. దీంతో పాటు ప్రభుత్వం మౌలికరంగంపై పెద్దమొత్తంలో కేటాయింపులు చేసింది. ముఖ్యంగా ప్రభుత్వరంగానికి చెందిన కంపెనీలకు పెద్దమొత్తంలో కేటాయింపులు చేసిందని ఫిచ్ గుర్తు చేసింది. ద్రవ్యోల్బణం గురించి ప్రస్తావిస్తూ.. ఆహార పదార్థాల ధరలు క్రమంగా పుంజుకునే అవకాశాలున్నాయి. దీంతో ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుందని వివరించింది. అయితే ఇంధన ధరలు పెరగకుండా ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి పెట్రోల్, డిజిల్ ధరలను పెంచకుండా అదుపు చేస్తోంది. తమ అంచనా ప్రకారం ఈ ఏడాది, వచ్చే ఏడాది ద్రవ్యోల్బణం 5 శాతం కంటే తక్కువగా నమోదు కావచ్చునని పేర్కొంది. ఆర్‌బీఐ వడ్డీరేట్ల గురించి ప్రస్తావిస్తూ.. వచ్చే ఏడాది నుంచి వడ్డీరేట్లను పెంచుతుందని, దీంతో వృద్ధిరేటు దెబ్బతింటుందని,, అలాగే ద్రవ్యోల్బణం కూడా మరింత పైకి వెళ్లే అవకాశాలున్నాయని తెలిపింది. కాగా వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభుత్వం కనీస మద్దతు ప్రకటించడంతో పాటు కొన్ని వస్తువులపై ఉదాహరణకు ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఆటో విడాభాగాలపై కస్టమ్స్ సుంకం పెంచుతోంది. దీంతో వస్తువుల ధర పెరుగుతాయి. అదే సమయంలో వృద్ధిరేటు కూడా పుంజుకుంటుందని స్పష్టం చేసింది.

అమెరికన్ సైకిల్ బ్రాండ్ ట్రెడ్ బైసికిల్ విడుదల



హైదరాబాద్ : ట్రెక్ బైసికిల్ ప్రపంచంలోని అతి పెద్ద సైకిల్ ఉత్పత్తి చేసే కంపెనీ గురువారం నాడు భారతీయ మార్కెట్లకోసం ఈసైకిల్‌ను విడుదల చేసింది. ఈ బైసికిల్ ద్వారా రోడ్లపై ప్రయాణించడంతో పాటు కొండలు, గుట్టలపై కూడా ప్రయాణించవచ్చునని, ఈ హైబ్రిడ్ బైసికిల్‌ను న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ట్రెడ్ ఇండియా కంట్రీ మేనేజర్ నవనీత్ బంకా, మాజీ జర్మనీ ప్రొఫెషనల్ రోడ్ బైసికిల్ రేసర్ జెన్స్ వోగిట్ హాజరయ్యారు. ఈ సైకిల్‌ను 1976లో వాటర్‌లూ, విస్కోన్‌సిన్ రిచర్డ్ బుర్కీ, బెవిల్ హాగ్‌లు అమెరికాలో ఆవిష్కరించారు. అటు నుంచి ప్రపంచంలోనే అత్యుత్తమ బైక్‌గా దీన్ని తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ ట్రెడ్ బైసికిల్ సుమారు 100 దేశాల్లో విక్రయాలు జరుగుతున్నాయి. కాగా ఈ బైసికిల్ తర్వలోనే 23 మోడల్స్‌ను ఢిల్లీ, ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఇండోర్ మార్కెట్లో విడుదల చేస్తామని ప్రకటించింది. కొనుగోలు దారులు తమ కావాల్సిన సైకిల్‌తో పాటు దాని యాక్సిసెరీస్‌ను కొనుగోలు ఏసుకోవచ్చునని, మరింత సమాచారం కోసం ట్రెక్ బైక్స్ డాట్‌కామ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

టెర్మినల్2 రెడీ

ఇండిగో, స్పైస్‌జెట్ ప్రయాణికుల కోసం

హైదరాబాద్ : పెరిగిపోతున్న విమా న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని.. ఢిల్లీలోని ఇంది రాగాం ధీ అంతర్జాతీయ విమానా శ్రయం (ఐజీఐఏ) కొత్త టెర్నినల్స్‌ను అత్యాధునిక పరిజ్ఞానంతో రూపుది ద్దుతున్నాయి. విమానయా నరంగం లో జీఎంఆర్ 1996లో టెర్మినల్ -3ని అందుబాటులోకి తెచ్చింది. దీంతో పాటు ప్రయాణికులు రద్దీ కూడా ప్రపంచరికార్డు 60 మిలియ న్‌లకు దాటిపోయింది. ఇదిలా ఉండ గా.. ఐజీఏఐ మరో కొత్త మైలురా యిని దాటిపోతోంది. పెరిగిపోతున్న ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని కొత్తగా టెర్మినల్ వన్ (టీ1)ను రీమోడిలింగ్ చేసే పనిలోపడింది.ఇక టెర్నినల్-2 ఇందిరాగాంధీ అంతర్జా తీయ విమానాశ్రం ఇక నుంచి ఇండిగో, స్పైస్‌జెట్ ప్రయాణికులు దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లేం దుకు ఈ టెర్నినల్ ద్వారా ప్రయా ణించవచ్చు. విశాలమైన ప్రాంగణం లో దీన్ని ఏర్పాటు చేశారు. కాగా టెర్నిరల్ 1 పూర్తిగా కిటకిటలాడు తుంటే.. మరో ప్రత్యామ్నం లేకపోవ డంతో టెర్నినల్ 2ను అభివృద్ధి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెరిగిపోతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని టీ2 టెర్మినల్‌ను అభివృద్ధి చేయాల్సి వచ్చింది, తాజాగా సుప్రీంకోర్టు ఆర్డరు నేపథ్యంలో ఎయిర్‌లైన్స్ తమ ఆపరేషన్స్ ఇక్కడి నుంచి నిర్వహించుకోవచ్చు. ఇండిగో, స్పైస్‌జెట్, గోఎయిర్ః ప్రయాణికులు టీ2 నుంచి ప్రయాణాలు సాగించవచ్చు.


ఎగుమతుల్లో 4.5% వృద్ధి

- ఫిబ్రవరిలో 2,580 కోట్ల డాలర్లకు
- వాణిజ్య లోటు 1200 కోట్ల డాలర్లు
- వాణిజ్యకార్యదర్శి రిటా టియోటియా



న్యూఢిల్లీ : దేశం నుంచి ఎగుమతులు క్రమంగా పుంజుకుంటున్నాయి. గత నెలలో 4.5శాతం పెరిగి 2580 కోట్ల డాలర్లకు చేరాయని వాణిజ్య కార్యదర్శి రిటా టియోటియా గురువారం నాడు చెప్పారు. దిగుమతుల విషయానికి వస్తే 10.4 శాతం పెరిగి 3,780 కోట్ల డాలర్లకు ఫిబ్రవరి నెలలో తాకాయి. దీంతో వాణిజ్యలోటు 1200 కోట్ల డాలర్లుగా తేలింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు ఎగుమతులు 11 శాతం పెరిగి 27,370 కోట్ల డాలర్లకు ఎగబాకితే.. దీనికి ప్రత్యామ్నయంగా దిగుమతులు 21 శాతం పెరిగి 41,687 కోట్ల డాలర్లకు చేరాయి. గత నెలలో చమురు దిగుమతులు 32 శాతం పెరిగాయి. మొత్తానికి ఎగుమతుల రంగానికి వస్తే మంచి పురోభివృద్దిని సాధించామని, ముఖ్యంగా రసాయనాలు, ఇంజినీరింగ్ పరికరాలు, పెట్రోలియం ప్రొడక్టులను పెద్దెత్తున ఎగుమతి చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

బిగ్‌సీ శ్యాంసంగ్ ఎస్9, ఎస్9ప్లస్



హైదరాబాద్: కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని బిగ్‌సీ షోరూంలో గురువారం నాడు జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు బాలు చౌదరి, సినీతార సమంత, శ్యాసంగ్ ఇండియా ప్రెసిడెంట్ ఉదయ్‌భట్‌లు శ్యాంసంగ్ ఎస్9, ఎస్9 ఫ్లస్ స్మార్ట్‌ఫోన్‌లను మార్కెట్లో విడుదల చేశారు. బాలుచౌదరి మాట్లాడుతూ, ఏపీ, తెలంగాణ మార్కెట్లో ఒకటేసారి ఈ రెండు మొబైల్‌ఫోన్లను విడుదల చేస్తున్నామని, హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకు, పేటియం మాల్ ద్వారా రూ.6,000 క్యాష్ బ్యాక్ అందిస్తున్నామని , దీంతో పాటు ఈఎంఐ పద్ధతిలో కూడా మొబైల్స్ కొనుగోలు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. కాగా శ్యాంసంగ్ ఎలక్ట్రానిక్స్ గురువారం నాడు గెలాక్స్ ఎస్9, ఎస్9 ఫ్లస్‌ను మార్కెట్లో విడుదల చేసింది.

సెంచురి మ్యాట్రెస్ రికార్డు

50 లక్షల పరుపుల విక్రయం

హైదరబాద్ : వరల్డ్ స్లీప్ డే సందర్భంగా సెంచురీ మ్యాట్రెసెస్ హైదరాబాద్ ప్లాంట్ నుంచి 50 లక్షల పరుపులను ఉత్పత్తి చేసినట్లు ప్రకటించింది. గత 30 సంవత్సరాల నుంచి పరుపుల వ్యాపారంలో ఉంది. కాగా కంపెనీ వివిధ రకాల పరుపులు, ఉదాహరణకు కాయిర్, ఫోమ్, స్ప్రింగ్, హైబ్రిడ్ పరుపులను ఉత్పత్తి చేస్తోంది. గత ఐదు సంవత్సరాల నుంచి అత్యధికంగా అమ్ముడుపోతున్న బ్రాండ్‌ల లో సెంచురీ చేరింది. కాగా సెంచరీ మ్యాట్రెసెస్ 1988లో హైదరాబాద్‌లో ఉత్పత్తి మొదలుపెట్టింది. అటు తర్వాత తమ హైదరాబాద్, భువనేశ్వర్, ఒరిస్సాలకు తమ వ్యాపారాలను విస్తరిం చింది. 12 సంవత్సరాల్లో 10 లక్షల పరుపులను విక్రయిస్తే.. చివరగా గత మూడు ఏళ్లలో పదిలక్షల పరుపులను విక్రయించింది.

మార్కెట్లకు మంత్రి వరం

● బ్యాంక్ గ్యారెంటీలకు సడలింపు ● వ్యవసాయ మార్కెట్లకు వర్తింపు ● ట్రేడర్లు, ఏజెంట్లకు ఊరట ● జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లుల యజమానులతో మంత్రి హరీష్ భేటీ ● మార్కెటింగ్ శాఖ నిర్ణయంపై సర్వత్రా హర్షం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయ మార్కెట్‌లలో బ్యాంకుగ్యారంటీలను రాష్ట్ర మార్కెటింగ్ శాఖా మంత్రి హరీష్‌రావు సడలించారు. టర్నోవర్‌ను బట్టి బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలన్న నిబంధనలపై ట్రేడర్లు, కమిషన్ ఏజెంట్ల అభ్యంతరాలకు మార్కెటింగ్ శాఖా మంత్రి సానుకూలంగా స్పందించారు. గురువారం అసెంబ్లీకమిటీ హాలులో జరిగిన సమావేశంలో జిన్నింగ్‌మిల్లులు, రైస్‌మిల్లుల యాజమానుల సంఘాల ప్రతినిధులతో ఆయన చర్చించారు. కొన్ని వ్యవసాయ మార్కెట్‌లలో సరుకు కొనుగోలు చేసిన తర్వాత రైతులకు డబ్బులు ఎగ్గొట్టిన సందర్భాలను దృష్టిలో పెట్టుకుని మార్కెటింగ్ శాఖ నిబంధన రూపొందించింది. అయితే ఈ నిబంధనల జీవోను వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు వ్యతిరేకిస్తున్నందున మినహాయింపులకు మంత్రి సానుకూలంగా స్పందించారు. రైస్ మిల్లర్లకు బియ్యంపై మార్కెట్ ఫీజు మినహాయించినందుకు రూ.25కోట్లు ప్రభుత్వం భరించిందన్నారు. సిఎం కెసిఆర్ విధానాల వల్ల తెలంగాణలో నష్టాలపాలై మూతపడ్డ 700రైస్‌మిల్లులు తిరిగి ప్రారంభమవుతున్నాయని, రైస్‌మిల్లర్లు ఇపుడిప్పుడే కోలుకుంటున్నారని మిల్లర్లు మంత్రికి తెలిపారు. 2300రైస్‌మిల్లులు తెలంగాణలో నడుస్తున్నాయని, ముఖ్యమంత్రి అనుమతిస్తే త్వరలో లక్షమందితో బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. దీనిపై తాను సిఎంతో మాట్లాడతానని హరీష్‌రావు చెప్పారు. కందిరైతులకు బకాయిలు చెల్లించాలని మార్కెటింగ్ అధికారులకు మంత్రి హరీష్‌రావు ఆదేశించారు.

ఈ అసెంబ్లీలోనే కొత్త పంచాయతీ చట్టం

ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే కొత్త పంచాయతీ చట్టం తీసుకువస్తున్నామని మంత్రి హరీష్ రావు ప్రకటించారు. జిల్లాకు వెయ్యి ఎకరాల చొప్పున సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 3వేల ఎకరాలను దళితులకు పంపిణీచేయాలని నిర్ణయించామని ఆయన అన్నారు. గురువారం అసెంబ్లీ హాలులో ఉమ్మడి మెదక్‌జిల్లా అభివృద్ధిపై ఆయన సమీక్ష జరిపారు. ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన భూమికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దళితుల భూపంపిణీ కార్యక్రమంలో విమర్శలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని మూడు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలను కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కొత్తగా నర్సాపూర్, నారాయణఖేడ్, తూప్రాన్, రామాయంపేట, చేర్యాల మునిసిపాలిటీలుగా ఏర్పాటుచేయబోతున్నానన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే మునిసిపాలిటీలకు స్టార్టప్‌నిధులు ఉన్నాయన్నారు. వాటితో అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే ప్రారంభించుకోవాలన్నారు.

మనది ప్రగతి తెలంగాణ

● అభివృద్ధికి చిరునామాగా రాష్ట్రం
● నాలుగేళ్లలో అపూర్వ ప్రగతి
● సిరిసిల్ల పర్యటనలో మంత్రి కేటీఆర్ వెల్లడి
● కమ్యూనిటీ హాళ్లు, చిల్డ్రన్ పార్కుల ప్రారంభం



పార్క్ ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, సిరిసిల్ల చైర్‌పర్సన్ పావని

సిరిసిల్ల, ప్రభన్యూస్ : దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి బాటన పయనిస్తూ.. అభివృద్ధికి చిరునామాగా మారిందని రాష్ట్ర ఐటి, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి వర్యులు కేటీఆర్ అన్నారు. గురువారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలో రూ.1కోటి64లక్షల55 వేలతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లు, రెండు చిల్డ్రన్ పార్క్‌లను మంత్రి ప్రారంభించారు. రూ.30 లక్షల వ్యయంతో పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కొనుగోలు చేసిన



కేటీఆర్ బాలానందం

ఊడ్చేయంత్రంను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో సుమారు నాలుగేళ్లలో అపూర్వ ప్రగతిని సాధించి దేశానికే తలమానీకంగా నిలిచిందన్నారు. అభివృద్ధి పరంపర మరింత వేగంగా కొనసాగించేందుకు గురువారం శాసనసభలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపకరించనుందన్నారు. పట్టణాలలో మౌలిక వసతుల కల్పన సదుపాయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మరోవైపు పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్ లేక్‌ను అభివృద్ధి ఏర్పరచి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దాలని మంత్రి కేటీఆర్ జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు సూచించారు. కార్గిల్‌లేఖ్ చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పట్టణంలో నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ భవనం పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గడ్డ నర్సయ్య, డిఆర్వో శ్యాంప్రసాద్‌లాల్ మున్సిపల్ కమీషనర్ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

యధావిధిగా వెల్‌నెస్ సెంటర్లు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వెల్‌నెస్ సెంటర్లను తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లుగా మారుస్తున్నామని క్యాబినెట్‌లో నిర్ణయం జరిగిందంటూ వచ్చిన వార్తలను నమ్మవద్దని, వెల్‌నెస్ సెంటర్లు యధావిధిగా కొనసాగుతాయని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఎంప్లాయీస్ హెల్త్‌స్కీంను ఆరోగ్య శ్రీలో కలుపుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరిగిందని, కానీ క్యాబినెట్‌లో అలాంటి నిర్ణయం జరగలేదన్నారు. ప్రస్తుతం ఎంప్లాయీస్ హెల్త్ స్కీం కింద ఉద్యోగులు, జర్నలిస్టులు, పింఛన్‌దారులు వైద్య సేవలు పొందుతారని వారికి ఇబ్బంది కలిగించే పనిని ప్రభుత్వం తీసుకోదని మంత్రి పేర్కొన్నారు. సంవత్సర కాలంగా ఈ స్కీమ్‌ను ఎలా నిర్వహిస్తున్నామో ఇప్పుడు కూడా అలాగే కొనసాగుతుందన్నారు. ఈ స్కీమ్ నిర్వహణకు కావాల్సిన ఉద్యోగులను నియమించుకోవడానికి క్యాబినెట్ ఆమోదముద్ర వేసిందన్నారు. దానిని కొందరు కావాలని వేరే రకంగా ప్రచారం చేశారన్నారు. ఈ విషయాన్ని జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, జర్నలిస్టు సంఘాలు గమనించాలని ఆయన కోరారు. ఈ స్కీమ్‌కింద సేవలు పొందే వారు ఈ విషయంలో ఎలాంటి అపోహలకు పోవద్దని, దుష్ప్రచారాలకు పోవద్దని మంత్రి విజ్ఞప్తిచేశారు.

విదేశాలకు మన చేపలు

ఆక్వా ఎక్స్‌పో ఇండియా సదస్సులో మంత్రి తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ : చేపల ఉత్పత్తి, మార్కెటింగ్ రంగంలో అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. అతిత్వరలో తెలంగాణ చేపల ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేసేస్థాయికి ఎదుగుతామని ధీమా వ్యక్తంచేశారు. గురువారం హైటెక్స్‌లో ఆక్వా ఎక్స్‌పో - 2018 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 46వేల చెరువుల్లో జరుగుతున్న చేపల ఉత్పత్తి ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ ఏడాది 80 కోట్ల చేపల పిల్లలను ఉచితంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్పత్తి అయిన చేపలను విక్రయించడానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో మార్కెట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. అత్యాధునిక సాంకేతిక విధానాలు ఉపయోగించి మత్స్య ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని మంత్రి తలసాని వెల్లడించారు. అందుకు మూడు రోజులపాటు హైదరాబాద్ కేంద్రంగా జరిగే ఈ సదస్సు ఉపయోగ పడాలని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్ర మత్స్యశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, చైనా



కంటే భారతదేశం ఆక్వా కల్చర్‌లో పదిరెట్లు వెనకబడి ఉందని తెలిపారు. చైనాలో ఏటా 66 మిలియన్ టన్నుల చేపలు ఉత్పత్తి చేస్తుండగా, మన దేశంలో కేవలం 6.5 మిలియన్ టన్నులు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇటలీ ఆక్వా నిపుణుడు రోహన్ శుభ్‌సింగ్, తెలంగాణ ప్రభుత్వ సాంకేతిక సలహాదారు ఎస్‌వి గుప్తా, సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ అధ్యక్షుడు రామచంద్రరాజు, మత్స్యశాఖ కమిషనర్ సి.సువర్ణ, సుమారు 12 దేశాల నుంచి వచ్చిన వేలాది మంది మత్స్యరంగ నిపుణులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యసభ బరిలో నలుగురు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజ్యసభ ఖాళీల భర్తీకి పోలింగ్ అనివార్యమైంది. మూడుస్థానాల కోసం నలుగురు అభ్యర్థులు పోటీచేస్తున్న నేపథ్యంలో.. ఈనెల 23న పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలో పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి హఠాన్మరణం, రాపోలు ఆనందభాస్కర్, సిఎం రమేష్‌ల పదవీకాలం పూర్తవడంతో రాజ్యసభ ఎన్నికలు జరగుతుండగా.. ఈ మూడు స్థానాల కోసం ఐదుగురు మొదట నామినేషన్లు వేశారు. స్క్రూటినీలో ఒక నామినేషన్‌ను తిరస్కరించగా, నలుగురు బరిలో నిలిచారు. గురువారం సాయంత్రం నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ముగియగా, ఎవరూ నామినేషన్లు ఉపసంహరించుకోలేదు. టిఆర్ఎస్ నుండి సంతోష్ కుమార్ జోగినిపల్లి, బండ ప్రకాష్, బడుగుల లింగయ్యయాదవ్‌లు, కాంగ్రెస్ నుండి పోరిక బలరాంలు పోటీలో ఉన్నారు.


'కాళేశ్వరం'పై విచారణ షురూ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అనుమతులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో విచారణ జరిగింది. పర్యావరణ అనుమతులను రద్దు చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ధర్మాసనం ఇచ్చిన అనుమతులను రద్దు చేయలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషనర్ అభ్యంతరాలపై పది రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణా ప్రభుత్వానికి ట్రిబ్యునల్ ఆదేశించింది.

స్వామి గౌడ్ డిశ్చార్జ్

వారం తర్వాత మళ్ళీ కంటి పరీక్షలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సరోజినీ ఆస్పత్రి సిబ్బందికి రుణపడి ఉంటానని, వారు తనను ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడు కున్నారని మండలి చైర్మన్ స్వామిగౌడ్ పేర్కొన్నారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఆయ న్ను డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వామిగౌడ్ మాట్లాడుతూ తాను ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిశ్చార్జి అయ్యే వరకు స్వీపర్ నుంచి డాక్టర్ల వరకు తనను ఇంటి సభ్యుడిలా చూసుకున్నారని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. అసెంబ్లీ మొదటిరోజు జరిగి సంఘటన దురదృష్టకరమని కానీ దానిని కూడా ప్రతిపక్ష సభ్యులు రాజకీయాలతో ముడిపెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మిత్రులు దెబ్బతా కకున్నా ఆస్పత్రిలో చేరారని, మరికొందరు హెడ్‌ఫోన్ తాకితే దెబ్బతగులుతుందా అంటూ వెటకారంగా మీడియా ముందు అన్న వారి విజ్ఞతకే వదిలిపెడుతున్నానన్నారు. దెబ్బతాకకున్నా ఆస్పత్రిలో చేరాల్సిన అవస రం లేదన్నారు. ప్రతిపక్షాలు సమన్వయం పాటించాలని ప్రజా సమస్యలపై పోరాడాలంటే పద్ధతి ఇది కాదని ఆయన సూచించారు. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి గవర్నర్, సీఎం రెండుసార్లు తనకు ఫోన్ చేసి పరామ ర్శించారు. మిగతా



ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు మంత్రులు, అభిమానులు రోజు తనను పరామర్శించి తనలో ఆత్మస్థైర్యాన్ని నింపారన్నారు. తతనకు దెబ్బతగిలిందో లేదో సరోజినీ సూపరింటెండెంట్ రవీందర్‌గౌడ్‌ను ప్రతిపక్షాలు అడిగి తెలుసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సూపరింటెం డెంట్ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం స్వామి గౌడ్ కోలుకున్నారని అన్ని రకాల పరీక్షల అనంతరం ఆయన్ను డిశ్చార్జి చేశామన్నారు.

దీక్ష విరమణ

ప్రతిపక్షం లేకుండా బడ్జెట్టా: ఉత్తమ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌లు చేపట్టిన 48 గంటల ప్రజాస్వామ్య పరిరక్షణ నిరహార దీక్ష గురువారం సాయంత్రం ముగిసింది. సీఎల్పీ నేత జానారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి గీతారెడ్డిలు దీక్షకు దిగిన ఎమ్మెల్యేలకు నిమ్మరం ఇచ్చి విరమింప చేశారు. ఈ సందర్భంగా టీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్న కేసీఆర్ కుటుంబాన్ని తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామనే భయంతోనే తమ పార్టీ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారని ఆయన మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించడం ఇదే మొదటిసారి ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు విలన్ అయితే.. తెలంగాణ వ్యతిరేకించిన వారే హీరోలా..? అంటూ ఉత్తమ్ ప్రశ్నించారు. నెహ్రూ గురించి మాట్లాడే అర్హత కేసీర్‌కు లేదన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన కోదండరామ్, గద్దర్, విమలక్కల గొంతు నొక్కడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. వచ్చే ఎన్నికలు తెలంగాణ సమాజానికి, కేసీఆర్ కుటుంబానికి మధ్య జరుగుతాయన్నారు. అసెంబ్లీ సమావేశాలను ప్రగతి భవన్ లేదా ఫాంహౌజ్‌లో నిర్వహించుకుంటే బాగుంటుందని ఆయన సూచించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు.

సభ్యత్వాల రద్దు దేనికి సంకేతం : కోదండరామ్

ప్రజాస్వామ్య దెబ్బతినే విధంగా ప్రభుత్వం వ్యవహరించొద్దని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ సూచించారు. ఒక వేళ శాసన సభ్యులు సభా సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఎథిక్స్ కమిటికి ఎందుకు సిఫారస్ చేయలేదని, ఏకపక్షంగా సభ్యుల సభ్యత్వాలను రద్దు చేయడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు.పార్లమెంట్‌లో నిరసనలు చెబుతున్న టీఆర్ఎస్ ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేస్తామంటే ఏం చేస్తారని కోదండరామ్ అన్నారు.

కేసీఆర్‌ది నాలుకా తాటి మట్టా : మాజీ మంత్రులు

తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ విలన్ అయితే ప్రత్యేక రాష్ట్రం ఎలా ఇచ్చిందని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. సీఎం కేసీర్‌ది నాలుకా లేక తాటి మట్టనో ఆర్థం కావడం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ సభ్యులను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు.గత ప్రభుత్వాల హయాంలో హరీశ్‌రావు అసెంబ్లీలో ఎలా ప్రవర్తించారో అందరికి తెలుసని మాజీ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అయినా అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు సర్ది చెప్పి హరీశ్‌రావుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

నాపై కక్ష కట్టారు : సంపత్‌కుమార్

టీఆర్ఎస్‌ను బొంద పెట్టటానికి దళితులను ఏకం చేస్తామని ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హెచ్చరించారు. నాకు కాంట్రాక్టు పనులు, కోట్ల రూపాయలు ఇస్తామన్నప్పటికి పార్టీ మారనందుకే ప్రభుత్వం కక్ష గట్టిందని ఆయన మండిపడ్డారు. నన్ను సభ నుంచి బయటకు పంపొచ్చు కానీ నాలుగు కోట్ల ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నానని అంటూ ఎమ్మెల్యే సంపత్ భావోద్వేగానికి గురయ్యారు. సీఎం కేసీఆర్‌కు రెడ్లు, దళితులు అంటే కోపం పెంచుకున్నారని ఆయన విమర్శించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. నేనే ఏ పాపం చేశానని సభ్యత్వాన్ని రద్దు చేశారంటూ సంపత్ ప్రశ్నించారు.

కేసీఆర్ నాపై పోటీ చేయాలి : కోమటిరెడ్డి

సీఎం కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో గద్దె దించడమే తన ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి కోమటిరెడ్డి అన్నారు. నా ప్రాణం ఉన్నంత వరకు టీఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. గజ్వేల్ నుంచి పోటి చేయడానికి కూడా సిద్ధమని ప్రకటించినందుకే తన సభ్యత్వాన్ని రద్దు చేశారని కోమటిరెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్‌కు ధైర్యం ఉంటే నాపై పోటి చేసి గెలువాని ఆయన సవాల్ విసిరారు. నేను ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన తెలిపారు. నల్లగొండ అంటేనే పోరాటాల గడ్డ అని విజయమో వీర స్వర్గమో తేల్చుకోవడానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

వీడియో కాలింగ్‌లో ఆత్మహత్య



నేరేడ్‌మెట్, ప్రభన్యూస్ : ప్రేమ విఫలమైందని మనస్తాపం చెందిన యువకుడు ఊరి వేసుకుని ఆత్మహత్మకు పాల్పడిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నేరేడ్‌మేట్ వినాయక్‌నగర్‌లో నివా సముం టున్న బంతిలాల్ తనయుడు సాగర్ (19) ఐటీఐ చదువుతున్నాడు. ఒ అమ్మాయితో ప్రేమలో పడ్డారు. విషయం అమ్మాయి తల్లిదండ్రులకు తెలియడంతో అమ్మాయికి మరో సంబంధం చూస్తున్నారు. ప్రేమించిన అమ్మాయి తనకు దక్కడం లేదని మనస్తాపం చెందిన సాగర్ ప్రియురాలుకు వీడియోకాలింగ్ చేసి ఫ్యాన్‌కు ఊరి వేసుకుని ఆత్మహత్మకు పాల్పడ్డారు. కుటుంభసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌పై మంత్రి ఫైర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వరద్దుపై ప్రజా క్షేత్రంలోకి రాకుండా కాంగ్రెస్ నేతలు కోర్టుకు ఎందుకు వెళ్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం టిఆర్ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ చేసిన ఆయన ప్రీ ఫైనల్‌లో గెలవలేని వారు ఫైనల్‌లో గెలుస్తారా అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్, ఎంఐఎం మాత్రమే శాసనసభలో అడుగుపెడతాయని.. మిగతా పార్టీలకు ప్రాతినిధ్యం ఉండదన్నారు. 2019శాసనసభ తమకు బోర్‌గానే ఉంటుందన్నారు.


బావికి అన్నదమ్ముల బలి

చిలుకూరు, ప్రభ న్యూస్ : సూర్యాపేట జిల్లా, చిలుకూరు మండలంలోని కొండాపురంలో మాజీ సర్పంచ్ పల్లా రంగయ్య కుమారులు పల్లా గోపాల్ (32) పల్లా నరేష్ (29) లు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందారు. దీంతో కొండాపురంలో విషాదఛాయలు నెలకొన్నాయి. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాల్, నరేష్ లు వారి పొలంలో పురుగుల ముందు పిచికారి చేసేందుకు ఉదయం ఆ గ్రామానికి చెందిన సైదులుతో కలిసి వెళ్లారు. సైదులు మందు పిచికారి చేస్తుండగా, గోపాల్ బావిలో నీళ్లను బిందెతో తీసుకవస్తూ నరేష్‌కు అందిస్తున్నాడు. ఆ క్రమంలో గోపాల్ కాలుజారీ బావిలో పడిపోవడంతో అతనికి ఈత రాక మునుగుతుండగా, గమనించిన నరేష్ అతన్ని కాపాడేందుకు బావిలో దూకాడు. దీంతో నరేష్‌ను గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరికి ఊపిరి ఆడక నీటిలో మునిగిపోయారు. మందు పిచికారి చేస్తున్న సైదులు వీరు ఇంకా రావడంలేదని హుటాహుటిన బావి వద్దకు వెళ్లాడు. ఈలోగా వారు ఇద్దరు నీటిలో మునిగిపోయారు.

హెచ్‌సీఏ అధ్యక్ష, కార్యదర్శులకు ఊరట

హైదరాబాద్, ఆంధ్రప్రభ :హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్ష,కార్యదర్శులు జి.వివేకానంద్, శేష్ నారాయణ్ లకు హైకోర్టులో ఊరట లభించింది. హెచ్‌సీఏ అధ్యక్ష, కార్యదర్శి పదవుల నుంచి జి.వివేకానంద్, శేష్ నారాయణ్‌లను తొలగిస్తూ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసింది. ఈ వ్యవ హారంలో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవి.శేషసాయి గురువారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

కేసీఆర్‌తో కాంగ్రెస్‌కే లాభం




న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ పాలనను నికృష్ట నియంతృత్వ పాలనగా అభివర్ణించారు. ఢిల్లీలో పార్లమెంటు భవనంలోని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తెలంగాణ అసెంబ్లీ పరిణామాలపై స్పందించారు. నిజానికి అసెంబ్లీలో తమ సభ్యుల నిరసన గవర్నర్‌కి వ్యతిరేకం కాదని, ఆయన ప్రసంగంలోని తప్పుడు సమాచారంపైనే ఆగ్రహం చెంది నిరసన తెలిపారని జైపాల్ రెడ్డి సమర్థించుకొచ్చారు. ఈ క్రమంలో తమ ఎమ్మె ల్యేలు కొందరు హద్దు మీరి ప్రవర్తించారని అంగీకరిస్తూనే, అందుకు వారి సభ్యత్వాల్ని రద్దు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇద్దరు కొద్దిగా హద్దు మీరితే, కేసీఆర్ ఏకంగా మొత్తానికే హద్దు మీరారాని అన్నారు. ఎమ్మెల్యేల చర్యకు సస్పెండ్ చేస్తే సరిపోయేదని, సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు.ఈ చర్యపై తాము తెలంగాణాలో తిరుగుబాటు చేస్తామని, జాతీయ స్థాయిలోనూ ఆందోళన చేపడతామని జైపాల్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ ధోరణి, ప్రవర్తనపై కేవలం కాంగ్రెస్ శ్రేణుల్లోనే కాదు, అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోందని అన్నారు. నిజానికి తమ ఎమ్మెల్యేలపై తీసుకున్న చర్యతో కాంగ్రెస్ పార్టీకే లాభం జరుగుతుందని జైపాల్ రెడ్డి అన్నారు. ఇందుకు తాము సంతోషపడాల్సిందేనని అంటూనే, ఇది లాభ, నష్టాల గురించి చర్చించుకునే అంశం కాదని, ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాల్సిన తరుణమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం బలహీనపడితే మనమెవరం బతికుండమని అన్నారు. ఏది అప్రజాస్వామికమో గుర్తించే పరిజ్ఞానం ప్రజలకుందని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుంటే మిన్నకుండలేరని చెప్పారు. ఎమ్మెల్యేలను కోర్టులకు పంపించే పరిస్థితి సృష్టించి కేసీఆర్ తప్పు చేస్తున్నారని జైపాల్ రెడ్డి మండిపడ్డారు.

థర్డ్ ఫ్రంట్ కాదు, అదొక స్టంట్

ఈ సందర్భంగా విలేకరులు థర్డ్ ఫ్రంట్‌పై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ''అది థర్డ్ ఫ్రంట్ కాదు, కేసీఆర్ స్టంట్'' అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఒక స్టంట్ మాస్టర్ అని తెలంగాణ ప్రజలందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మాటలకు రాష్ట్రంలోనే విలువ లేదని, ఇక దేశవ్యాప్తంగా ఆయన వెనుక ఎవరొస్తారని ఎద్దేవా చేశారు.

తెలంగాణ సర్కార్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : శాసన సభ్యుల సస్పెన్షన్, సభ్యత్వ రద్దు విషయంలో తెలంగాణా సర్కార్ తీసు కున్నది చట్ట, రాజ్యాంగ విరుద్ధ చర్య అని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌ల సభ్యత్వం రద్దు వ్యవహారంపై కాంగ్రెస్ నేతల బృందం గురువారం మధ్యాహ్నం మూడు న్నర గంటల సమయంలో ఢిల్లీలో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ ప్రజా ప్రతి నిధుల పట్ల అసెంబ్లీలో తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా, అప్రజాస్వామికంగా వ్యవహరించిందని ఈసీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆ పార్టీ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... వారిద్దరి సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం స్పీకర్‌కు లేదన్నారు. సభ్యుల పట్ల చర్య తీసుకోవాలంటే కండక్ట్ ఆఫ్ బిజినెస్ రూల్ ప్రకారం స్పీకర్‌కు అధికారం ఉందని తెలిపారు. గవర్నర్ అడ్రస్ చేసే సందర్భంలో కారణం చూపిస్తూ సభ్యులపై చర్య తీసుకున్నారు. అది పూర్తయ్యేంత వరకు శాసనసభ కార్యకలాపాలు ప్రారంభమైనట్లుగా పరిగణనలోకి తీసుకోవడానికి వీల్లేదని మర్రి శశిధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఎలాంటి అధికారం లేకుండా సభ్యత్వం రద్దు చేయడం దురదృష్టకరమని ఆయన చెప్పారు.కర్ణాటక ఎన్నికలతో పాటు ఇప్పుడు ఖాళీ అయిన సీట్లలో ఎన్నికలు జరుగుతాయని మంత్రి హరీష్ రావు చెప్పారన్న ఆయన, గెజిట్ నోటిఫికేషన్ వస్తుందని ఏ ఉద్దేశంతో చెప్పారో అర్థమవుతుందని అన్నారు.

బాబు అవినీతిపై పవన్ కళ్లు తెరిచారు

•వైసీపీ నేత బొత్స సత్యనారాయణ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవినీతిపై పవన్ కళ్యాణ్ ఇప్పటికైనా కళ్లు తెరవడం మంచి పరిణామం అని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ ఏపీలో ఎక్కడ చూసినా అవినీతే ఉందని, ప్రజలు అన్నిరకాలుగా మోసపోయారన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వారిలో ధైర్యం నింపేందుకే పార్టీ అధినేత జగన్ పాదయాత్ర చేస్తున్నారన్నారు. పార్లమెంటులో కేంద్రప్రభుత్వంపై శుక్రవారం తమ పార్టీ ఎంపీలు అవిశ్వాస తీర్మానం పెడుతున్నారన్నారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని పార్టీ అధినేత జగన్ ఇప్పటికే అన్నిపార్టీలకు లేఖలు రాశారన్నారు. బీజేపీ తప్ప అన్ని పార్టీలను మద్దతు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ అవినీతిపై గత నాలుగేళ్లుగా వైసీపీ చెబుతున్నదే పవన్ కూడా చెప్పారన్నారు. 2014లో పవన్ చంద్రబాబుకు ఎందుకు మద్దతు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పవన్ మద్దతు ఇవ్వటం వల్ల టీడీపీ, బీజేపీ ఎన్నికల్లో గెలిచి ప్రజల్ని మోసం చేశాయని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీకి రాష్ట్ర ప్రయోజనాలపట్ల చిత్తశుద్ధి ఉంటే అవిశ్వాస తీర్మానంకు మద్దతు ఇవ్వాలన్నారు. జగన్ నాయకత్వంలో కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదాను సాధించుకుంటామని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

చంద్రబాబుకు పవన్ క్షమాపణ చెప్పాలి

•టీడీపీ సీనియర్ నేత మోత్కుపల్లి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మోత్కు పల్లి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గుంటూరు సభలో పవన్ మాటలు చూస్తుంటే వాటి వెనుక బిజెపి ఉందన్న విషయం స్పష్టమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తన నివాసంలో పార్టీ సీనియర్ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు.కొన్నేళ్ళ క్రితం పవన్ సోదరుడు చిరంజీవి పార్టీ ఏర్పాటు చేశారని, ఆ పార్టీలో పవన్ యువ రాజ్యం అధ్యక్షుడిగా పని చేశారని, అప్పుడు కూడా రాజకీయాలలో మార్పులు తెస్తామని, నిజా యితీగా పని చేస్తామని చెప్పి తర్వాత చాప చుట్టేశారన్నారు. ప్రజారాజ్యం టికెట్లి స్తామని అనేక మందినుంచి కోట్ల రూపాయలను వసూలు చేసింది వాస్తవం కాదా అని నిలదీశారు. అలా వసూలు చేసిన ఎంత మందికి తిరిగి డబ్బులు చెల్లించారో పవన్ బహిరంగసభలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. సినిమా స్టైల్లో మాట్లాడి, యాక్షన్ చేస్తే ప్రజలు ఓట్లేస్తారనుకోవడం భ్రమ అని, ఆ విషయం ప్రజారాజ్యం ద్వారా తెలుసుకున్నా మరోసారి పవన్ యాక్షన్ చేయడం ఎమిటని అన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌లు అవినీతికి పాల్ప డుతున్నారని చెప్పిన పవన్ ఆధారాలను ఎందుకు ప్రజల ముందుంచలేకపోయారన్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ

•విశాఖ ఎంపీ హరిబాబు వెల్లడి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా పేరు మినహా ఆ ప్రయోజనాలన్నీ ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక శాఖ సిద్ధంగా ఉందని విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు తెలిపారు. విభజన హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం చాలా స్పష్టమైన వైఖరితో ఉందని చెప్పారు. ఏదో ఒక రూపంలో ఆ ప్రయోజనాలన్నీ కేంద్రం ఇస్తోందని ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కంభంపాటి వివరించారు. ఎయిమ్స్‌కి రూ. 1600 కోట్లు ఖర్చైతే అసలేమీ ఇవ్వలేదని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. విశాఖపట్నం ఐఐఎం తరగతులు ప్రారంభించి రెండు బ్యాచ్‌లు పూర్తైన విద్యార్థులకు నూటికి నూరు శాతం ఉద్యోగాలు వచ్చాయని ఆయన వెల్లడించారు. మిగతా సంస్థలన్నీ కూడా ఇదే దారిలో నడుస్తున్నాయని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఎన్డీఏలో కొనసాగుతూ, మిత్రపక్షంగా ఉంటూ పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకోవడం హర్షణీయం కాదని ఆయన హితవు పలికారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ పట్ల చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను గమనించాలని కోరారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కడప ఉక్కు కర్మాగారం అంశంపై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి చౌదరి బీరేంద్ర సింగ్, ఆ శాఖ కార్యదర్శి అరుణ తదితర అధికారులతో చర్చించారని హరిబాబు వెల్లడించారు.

నిజాం సాగర్ కాలువలో ఇద్దరు గల్లంతు

వర్ని, ప్రభ న్యూస్ :నిజామాబాద్ జిల్లా, వర్ని మండల కేంద్రం కోటయ్య క్యాంపు సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు గల్లంతయిన సంఘటన గురువారం సంచలనం సృష్టించింది. మండల కేంద్రంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఐదుగురు ఇంటర్ విద్యార్థులు స్నానం చేసేందుకు కోటయ్యక్యాంపు సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువవద్దకు వెళ్లారు. అందరు స్నానం చేస్తుండగా నీటి ఉధృతికి ప్రమాద వశాత్తు కొట్టుకుపోయారు. విషయాన్ని గమనించిన స్థానికులు ముగ్గురు విద్యార్థులను కాపాడగలిగారు. కాని అందులో ఇద్దరు మాత్రం గల్లంతయ్యారు. మండల కేంద్రానికి చెందిన ప్రభురాజ్(17), సోహాయిల్(17) అనే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులుగా గ్రామస్థులు గుర్తించారు. గల్లంతయిన విద్యార్థుల కోసం గ్రామస్తులు తీవ్రంగా గాలిస్తున్నారు. జాకోర గ్రామం వద్ద కాలువకు అడ్డంగా తాళ్లు కట్టి కాలువలో వారి ఆనవాళ్ల కోసం ప్రయత్నిస్తున్నారు.

అజ్మీర్ యాత్రికులకు 10 ప్రత్యేక రైళ్ళు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అజ్మీర్ ఉర్స్ ఉత్సవాలకు వెళ్ళే వారి సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) వేర్వేరు ప్రాంతాలలో నుంచి 10 ప్రత్యేక రైళ్ళను నడపనుంది. కాచిగూడ - మదర్ - కాచిగూడ జంక్షన్‌ల మధ్య రెండు, హైదరాబాద్ - అజ్మీర్ - హైదరాబాద్‌ల మధ్య రెండు, మచిలీపట్టణం - విజయవాడ - మచిలీపట్టణంల మధ్య రెండు, నెల్లూరు - అజ్మీర్ - నెల్లూరు మధ్య రెండు, హెచ్ఎస్ నాందేడ్ - అజ్మీర్ - హెచ్ఎస్ నాందేడ్‌ల మధ్య రెండు చొప్పున ప్రత్యేక రైళ్ళను ఈ నెల 20 వ తేదీ నుంచి నడుపనున్నట్లు ఎస్‌సిఆర్ జారీ చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

సంకల్పానికి అడ్డురాని అంగవైకల్యం

•నెన్నెలలో కాలితో టెన్త్ పరీక్ష రాసిన విద్యార్థి



బెల్లంపల్లి టౌన్, ప్రభన్యూస్ :సంకల్పం గొప్పదైతే ఎటువంటి అవాంతరాలు ఎదురైనా లక్ష్యాన్ని ఛేదిస్తారనడానికి నిదర్శనం ఈ పదవ తరగతి విద్యార్థి. రెండు చేతులు లేని దివ్యాంగుడైన విద్యార్థి ఒకరు తన కాలి వేళ్లతో పరీక్షను దిగ్విజయంగా రాయడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా, నెన్నెల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మండలంలోని కుష్నపల్లి గ్రామానికి చెందిన ఏలూరి శంకర్ అనే విద్యార్థికి రెండు చేతులు లేకపోవడంతో తన కాలితో పరీక్ష రాస్తున్నాడు. శంకర్‌కు ఇదే పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న సమయంలో ప్రమాదవశాత్తు స్కూల్ బిల్డింగ్ పై విద్యుదాఘాతం కావడంతో రెండు చేతులు పూర్తిగా తీసివేశారు. తన రెండు చేతులు తీసివేసినప్పటి నుంచి విద్యకు దూరం కాకుండా కాలితో రాయడం ప్రాక్టీస్ చేశారు. అప్పటి నుంచి ఏ ఒక్క రోజూ విడవకుండా పాఠశాలకు వచ్చి నేడు 10వ తరగతి పూర్తి చేస్తున్నాడు. అన్నీ సక్రమంగా ఉన్న తన తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడు. చదువు మీద ఉన్న ప్రేమే తనను ముందుకు నడిపిస్తోందని ఈ సందర్భంగా శంకర్ ఆంధ్రప్రభతో అన్నాడు. తను ఉన్నత చదువులను అభ్యసించి అత్యున్నత స్థాయికి ఎదుగుతానని, చదువుకు అంగ వైకల్యం అడ్డుకాదని అన్నాడు. శంకర్‌కు చిన్ననాటి నుంచి తండ్రి లేకపోవడంతో తల్లి అన్నీ తానై శంకర్‌ను పెంచుతోంది.

మోడీ మహా మోసం

• హోదా ఇవ్వకుండా కేంద్రం దగా • పవన్‌తో ఆరోపణలు గుప్పిస్తున్నారు • జనసేనాని విమర్శలతో మీకేంటి లాభం? • ప్రధాని మోడీ, జనసేన పవన్‌లపై ఆదరణ వర్క్‌షాప్‌లో ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం



అమరావతి, ఆంధ్రప్రభ:ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కొందరిని రెచ్చగొడుతున్నారని అన్నారు. ఎంతగా రెచ్చగొడితే అంతకు రెట్టింపుగా పోరాటం చేస్తామని చంద్రబాబు అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం జరిగిన ఆదరణ వర్క్‌షాప్‌నకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసం చేసిన కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధానిని నిలదీయకుండా నాపై విమర్శలా అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై నిప్పులు చెరిగారు. సంక్లిష్ట సమయంలో సంయమనం పాటించకుండా తనను విమర్శించడం వల్ల ఆయనకు వచ్చిన ప్రయోజనమేంటో చెప్పాలని నిలదీశారు. నాలుగేళ్లు మాట్లాడకుండా ఇప్పుడు అవినీతి జరిగిందంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రం పూర్తిగా సహకరించడం లేదని విభజన చట్టంలోని అంశాలు, పార్లమెంట్ హామీలను అమలు చేయడం లేదన్నారు. 40 ఏళ్లతన రాజకీయ అనుభవాన్ని పక్కకు పెట్టి 29సార్లు ఢిల్లీ వెళ్ళి ఇబ్బందులు చెప్పానన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ... నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రధాని మోడీ ... చెప్పారు. రాష్ట్రానికి చెందిన కొంత మంది నాయకులు ... ఒప్పందాలు చేసుకుంటూ ఇక్కడ కల్లబొల్లి మాటలు వల్లిస్తున్నాడని మండిపడ్డారు. వైకాపా అధినేత కేసుల మాఫీ కోసం రాష్ట్ర హక్కులను తాకట్టు పెట్టే పరిస్థితి తీసుకువచ్చారని ధ్వజమెత్తారు. భావితరాల జీవితాలు అంధకారమయ్యేలా వ్యవహరిస్తున్నారన్నారు. తమిళనాడు తరహా రాజకీయాలు చేస్తూ బీజేపీ కొంత మందిని తనపైకి ఉసిగొల్పుతూ రెచ్చగొడుతుందని ఆరోపించారు. నరేంద్ర మోడీని నిలదీయాల్సిన వ్యక్తులు నన్ను నిలదీస్తారా ..? ఇదెక్కడి న్యాయం అంటూ జనసేన అధినేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 ... తనకు భయమంటే తెలియదన్నారు. నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేసి జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించామని, ఆనాడు వీపీ సింగ్ ప్రధానిని చేయడంతో పాటు ఆ తరువాత మరో ఇద్దరు ప్రధానులను చేసిన ఘనత తమకు ఉందన్నారు. ఆనాడు అశాస్త్రీయ విభజన చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు భూస్థాపితం చేసి బీజేపీకి పట్టం కడితే రాష్ట్రానికి న్యాయం చేయాల్సింది పోయి పక్షపాతంగా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి పన్నులు కడుతున్నామని, దానిలో 42 శాతం మనకు వెనక్కు వస్తుందని, మిగిలిన 58 శాతం కేంద్రం ఖర్చు చేస్తుందన్నారు. బీజేపీ చేసిన అన్యాయం, న్యాయం కోసం తాను చేస్తున్న పోరాటంపై విమర్శలు చేసే వారిపై ప్రతి గ్రామంలో చర్చ జరగాలని అన్నారు. జపాన్ తరహాలో ఉద్యమించి అన్యాయం చేసిన వారు బుద్ధి తెచ్చుకునేలా పోరాటం చేద్దామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్ర హక్కుల సాధన అంశంలో రాజీ ఏ మాత్రం లేదని స్పష్టం చేశారు. ఐదు కోట్ల మంది ప్రజలు న్యాయం చేయకపోతే చూస్తు ఊరుకోరన్నారు. కేంద్రం ఎంత రెచ్చగొడితే అంత రెచ్చిపోతామని నిజం నిప్పు లాంటిదన్న విషయాన్ని గ్రహించాలన్నారు.

పవన్ పలుకుల వెనుక మోడీ హస్తం

•ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివిన పవన్ •తెలుగుదేశం ఎంపీల మిశ్రమ స్పందన
•గురువారం కొనసాగిన ఎంపీల ఆందోళన •ముస్లిం వేషధారణలో చిత్తూరు ఎంపీ శివప్రసాద్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలుగుదేశం ప్రభుత్వం సహా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్‌పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలపై తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా స్పందించారు. ప్రతి రోజూ చేస్తున్న మాదిరిగానే గురువారం కూడా తెలుగుదేశం పార్టీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీలంతా ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల అమలు కోసం నినాదాలు చేశారు.

బీజేపీకి అమ్ముడుపోయిన పవన్: సీఎం రమేశ్, రాజ్యసభ సభ్యులు

పవన్ కళ్యాణ్ బీజేపీతో లాలూచీ పడ్డారు. పది రోజుల్లోనే ఏమైంది? గత నాలుగేళ్లుగా చంద్రబాబు నాయుడు మంచోడు. కానీ ఒక్క రోజులోనే చెడ్డోడైపోయారు. అంటే బీజేపీ దగ్గర ఎంత తీసుకున్నావు? ఎంతకు అమ్ముడుపోయావు? ఎందుకంటే నీకు ఆ అల వాటుంది. పీఆర్పీ పెట్టి ఆరోజు టికెట్లు అమ్ము కున్నారు. ఆ తర్వాత పార్టీని అమ్ముకున్నారు. ఇప్పుడు ఇంకో రూపంలో వచ్చి బీజేపీతో కలిసి, వాళ్ల దగ్గర డబ్బులు తీసుకుని మళ్లీ అమ్ముకోవాలని చూస్తున్నావు. ఒక్క ఆధారం కూడా లేకుండా ఆరోపణలు చేశావు. ప్రజలంతా గమనిస్తున్నారు. నీ గురించి మాట్లా డాలంటే ఇంకా చాలా ఉంది. త్వరలోనే అన్ని వివ రాలతో ప్రజల ముందుకొస్తాం.

పవన్‌వి ఊహాజనిత ఆరోపణలు: తోట నర్సింహం, టీడీపీ లోక్‌సభాపక్ష నేత

పవన్ కళ్యాణ్ వెనుక ఎవరో ఉన్నారు. అదృశ్య శక్తులు ఆయన్ను నడిపిస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టిన ఆర్థిక నేరగాళ్ల గురించి మాట్లాడకుండా ఎవరో ఏదో చెప్పిన మాటలు పట్టుకుని పవన్ మాట్లాడుతున్నారు. మంత్రి లోకేశ్ మీద, ముఖ్యమంత్రి మీద, తెలుగుదేశం మీద ఊహాజనిత ఆరోపణలు చేస్తున్నారు.

మోడీ పేరెత్తలేదు ఎందుకు?: అవంతి శ్రీనివాస్, అనకాపల్లి ఎంపీ

రాష్ట్ర ప్రభుత్వం తప్పు చేస్తే ప్రజలు చూసుకుంటారు. కానీ రాష్ట్ర ప్రజల సమస్యను పక్కదోవ పట్టించేలా పవన్ కళ్యాణ్ వ్యవహరించారు. పవన్ ఎక్కడా ప్రధాని మోడీ పేరెత్తలేదు. పవన్ కళ్యాణ్ ఏ సమస్య తీసుకొచ్చినా రాష్ట్ర ప్రభుత్వం చాలా బాగా స్పందించింది. అవినీతి ఏదైనా ఉంటే, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సింది. ముఖ్యమంత్రి గారు కచ్చితంగా స్పందించేవారు. అసలు అవినీతి ఉందని నిరాధార ఆరోపణలు చేయడం కాదు, నిరూపించమనండి. ఎవరో స్క్రిప్టు రాసిస్తే చదవడం కాదు.

మీకిచ్చిన మర్యాదను మర్చిపోవద్దు: మాగంటి బాబు, ఏలూరు ఎంపీ

సీఎం తన హోదాను మరచి మరీ పవన్ కోసం కిందికొచ్చారు. ప్రత్యేక హోదా కోసం పోరాడుతుంటే, పవన్ ఇలా మాట్లాడడం సరికాదు. ఆధారాలుంటే చెప్పండి. ఎవరో రాసిన స్క్రిప్టు చదివితే ప్రజలు బాధ పడుతున్నారు. ముఖ్యమంత్రిని అలా అనడం బాధా కరం. మీకిచ్చిన మర్యాదను మర్చిపోవద్దు. ఇబ్బందులుంటే మాట్లాడుకోండి. సీఎం గారు మీకొక్కరికే అవకాశం ఇచ్చారు. మీరు చెబితే ఆలోచించుకుంటారు. మాతో పాటు ఉండి, ఒక్కసారే ఇలా మాటల దాడి చేశారంటే, ఒక పథకం ప్రకారం జరిగినట్టు అనిపిస్తోంది.

హైకోర్టును ఆశ్రయించిన కోమటిరెడ్డి, సంపత్‌కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తమ శాసన సభ్యత్వాలను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి .వెంకట్ రెడ్డి, ఎ.సంపత్ కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. తమ సభ్యత్వాలను రద్దు చేసే ప్రక్రియలో స్పీకర్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని, పేర్కొంటూ వారు గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ స్థానాలను ఖాళీ అయినట్లు ప్రకటించకుండా శాసనసభ, కేంద్ర ఎన్నికల సంఘాన్ని నిలువరించేలా ఆదేశాలు జారీ చేయాలని వారు హైకోర్టును అభ్యర్థించారు. ఎన్నికల హామీలు, ప్రజాసమస్యలపై నిలదీస్తారనే భయంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ దాడి నాటకాన్ని రచించారని తెలిపారు. తాము హెడ్ ఫోన్ విసిరి శాసనమండలి ఛైర్మన్ కంటికి గాయమయ్యేలా చేశామనే ఆరోపణను ఇరువురు ఎమ్మెల్యేలు ఖండించారు. తమ సభ్యత్వాల రద్దుకు కారణంగా చెబుతున్న వీడియో దృశ్యాలను ఇవ్వాలని కోరినా అధికారులు ఇవ్వలేదని నల్గొండ, అలంపూర్ ఎమ్మెల్యేలు తెలిపారు. వీడియో ఫుటేజ్ లే వాస్తవాలను బయటపెడ్తాయని తెలిపారు. సమావేశం ముగిసిన తర్వాత మండలి ఛైర్మన్ ,సభాపతి ఇద్దరూ గవర్నర్ కారు వద్దకు వచ్చి వీడ్కోలు ఎలా పలికారని ఆ శాసనసభ్యులు ప్రశ్నించారు. సభ్యత్వాల రద్దు విషయంలో సభాపతి సహజ న్యాయసూత్రాలను పాటించలేదని , రద్దు కు ముందు తమకెలాంటి నోటీసులు ఇవ్వలేదని వారు తెలిపారు.

మోడీ సర్కారుపై అవిశ్వాసానికి మేం మద్దతిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘంగా మాట్లాడారు. విభజన హామీల సాధనకు ముందు నుంచి పోరాడేది ఒక్క తెలుగుదేశం పార్టీనేనని ,విభజన హామీలు విషయంలో రాజీ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్రం ఇచ్చిన హామి మేరకు ప్రత్యేక హోదాతో పాటు అన్ని హామీలు నిలబెట్టుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి మేలు జరిగేంత వరకు టీడీపీ విశ్రమించేది లేదని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. అయితే కొన్ని పార్టీలు , వక్తులు లాలూచీపడి ఏవేవో మాట్లాడుతున్నారని, అయితే ఆ విషయాలు మాట్లాడడానికి ఇప్పుడు సమయం కాదని, అతి త్వరలోనే స్పందిస్తానని చెప్పారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా రాగద్వేషాలకు అతీతంగా పని చేస్తున్నా కొంత మంది కావాలని బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అయితే ప్రత్యేక హోదా కోసం అవిశ్వాస తీర్మానం పెడతామంటున్నారని, ఎవరు పెట్టినా బలపర్చడానికి టీడీపీ ఎప్పుడూ రెడీగానే ఉంటుందని స్పష్టం చేశారు.

ఏపీలో 'రెరా' రిజిస్ట్రేషన్లు ప్రారంభం

•కేంద్ర గృహనిర్మాణ శాఖామంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ఆచరణలోకి వచ్చి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా చేపట్టినట్లు కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి గురువారం రాజ్యసభకు తెలిపారు. రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) చట్టం 2016 కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో రెగ్యులేటరీ అథారిటీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయా? అని ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ, రెండు తెలుగు రాష్ట్రాలలోను చట్టానికి అనుగుణంగా నిబంధనలు రూపొందించుకుని రియల్ ఎస్టేట్ అథారిటీలను నెలకొల్పినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో రెరా రిజిస్ట్రేషన్లను ఇప్పటికే ప్రారంభించగా తెలంగాణలో మాత్రం ఆ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రియల్ ఎస్టేట్ వ్యవహారాల పర్యవేక్షణకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీ నేతృత్వంలో రెగ్యులేటరీ అథారిటీ ఏర్పాటైనట్లు హర్దీప్ తెలిపారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవడానికి వీలుగా అధికారిక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా రియల్ ఎస్టేట్ చట్టం కింద నిబంధనలను రూపొందించింది. రెగ్యులేటరీ అథారిటీకి స్పెషల్ చీఫ్ సెక్రటరీ హోదా గల అధికారి నియామకం కూడా జరిగింది. కానీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మాత్రం ఇంకా ఆరంభం కాలేదని హర్దీప్ వెల్లడించారు. కొత్త చట్టం కింద నిబంధనలను రూపొందించుకుని రియల్ ఎస్టేట్ అథారిటీ ఏర్పాటుతో పాటు రియల్ ఎస్టేట్ ట్రిబ్యునల్ కూడా నెలకొల్పి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్‌ను సత్వరమే ప్రారంభించాల్సిందిగా తమ మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 32 లక్షలు

కేంద్ర ప్రభుత్వంలోని మొత్తం 73 విభాగాలలో గెజిటెడ్, నాన్-గెజిటెడ్ ఉద్యోగుల సంఖ్య దాదాపు 32 లక్షల 33 వేలు ఉన్నట్లు పీఎంవో సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అందించిన గణాంకాలను బట్టి స్పష్టమవుతోంది. విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో పని చేస్తున్న మొత్తం సిబ్బంది సంఖ్యకు సంబంధించిన వివరాలు, సమాచారం తమ మంత్రిత్వ శాఖ వద్ద లేవని చెప్పారు. అయితే ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఎక్స్‌పెండిచర్ విభాగం కింద పనిచేసే పే అండ్ రీసెర్చి విభాగం పొందుపరచిన సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు మంజూరైన పోస్టుల సంఖ్య 36 లక్షల 33 వేలు ఉండగా ప్రస్తుతం 32 లక్షల 22 వేల మంది సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఇక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును యాన్యువల్ పెర్ఫార్మెన్స్ అసెస్‌మెంట్ రిపోర్టు (ఏపీఏఆర్) కింద ఏడాదికి ఒకసారి మదింపు చేయడం జరుగుతుందని జితేంద్ర సింగ్ చెప్పారు. ఉద్యోగుల వ్యక్తిగత గుణగణాలు, ఉత్పాదక సామర్థ్యం, పని సామర్థ్యం వంటి అంశాల ఆధారంగా ఏపీఏఆర్‌ను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. రద్దైన పోస్టులను కొన్ని షరతులకు లోబడి ఆ విభాగం తిరిగి పునరుద్ధరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

వైకాపా నోటీస్

(మొదటిపేజీ తరువాయి)

మల్లికార్జున ఖర్గే, టిఎంసి పక్ష నేత సౌగతా రాయ్, బీజేడీ నేత భర్తృహరి మెహతాబ్, అన్నాడిఎంకె ఫ్లోర్ లీడర్ తంబి దొరై, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ భగవంత్‌మన్, టిఆర్ఎస్ లోక్‌సభనేత జితేందర్‌రెడ్డి, టీడీపీ లోక్‌సభ నేత తోటనరసింహం, డిఎంకె నేతలను కలిశారు. ప్రత్యేకహోదా కోసం తాము లోక్‌సభలో ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని వారికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక హోదా అంశంపై తమ పోరాటానికి మద్దతివ్వాలని వైఎస్సార్సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ రాసిన లేఖలను ఆయా పార్టీల నేతలకు అందజేశారు. అనంతరం మీడియాతో పార్టీ ఎంపీలు మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా కోసం పార్లమెంటులో తమ ఆందోళన కొనసాగుతోందని వైస్సార్సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి అన్నారు. బీఏసీ సమావేశంలోనూ ప్రత్యేక హోదా కోసం అవిశ్వాస తీర్మానం అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఏపీ ప్రత్యేక హోదా కోసం తొలి నుంచి తామే ఆందోళన చేస్తున్నామన్నారు. విభజన చట్టం హామీలు ,ప్రత్యేక హోదా అమలు పరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలు ప్రత్యేక హోదా కోసం ఆందోళన చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం పై అవిశ్వాస తీర్మానం ఇచ్చామని చెప్పారు. హోదా కోసం రాజీనామాలు చేస్తామని స్పీకర్ కు తెలిపామన్నారు. యాభై మంది సభ్యులు అవిశ్వాసానికి మద్దతివ్వాల్సిన అవసరముందన్నారు. జగన్ ఇతర పార్టీ నేతలకు అవిశ్వాసానికి మద్దతివ్వాలని లేఖలు రాశారని, వాటిని వివిధ పార్టీల నేతలకు ఇచ్చామన్నారు. కొందరి సవాళ్ళ ను స్వీకరించి తాము అవిశ్వాసం పెట్టామని చెప్పారు. ప్రతిపక్షంగా తమ బాధ్యతను నెరవేర్చామన్నారు. ఎంత మంది మద్దతిస్తారో చూడాల్సి ఉందన్నారు. విభజన హామీలు,గత ప్రధాని ఇచ్చిన హామీలు నెరవేర్చమని కోరుతున్నామన్నారు. టిఎంసి, బీజేడీ, సీపీఎం, ఆప్, టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ నేతలను కలిసి అవిశ్వాసానికి మద్దతివ్వాలని కోరామని వైస్సార్సీపీ ఎంపీ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. తమ ప్రతిపాదనకు అన్ని పార్టీలు సానుకూలంగా ఉన్నాయన్నారు. కేంద్రం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయం దేశానికి తెలియజేయాలని అవిశ్వాం పెట్టామని చెప్పారు. తాము ఐదుగురు ఎంపీలం మాత్రమే ఉన్నా, ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్ష దేశానికి తెలియజేస్తామన్నారు. పార్లమెంటులో టీడీపీ ఎంపీలు అవిశ్వాసానికి మద్దతిస్తే ఇతర రాష్ట్రాల ఎంపీలు అవిశ్వాసానికి మద్దతిస్తారన్నారు. ఫైనాన్స్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ముందస్తుగానే ఆమోదించుకున్నందువల్లే తాము శుక్రవారమే అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు.

పార్లమెంటు భవనంపై విజయసాయిరెడ్డి నిరసన

అంతకుముందు వైఎస్సార్సిపి ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, వరప్రసాద్, అవినాశ్‌రెడ్డి, మిథున్‌రెడ్డి పార్లమెంటు మెయిన్ గేట్ వద్ద ధర్నాకు దిగారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం ఉభయ సభల్లోనూ తమ ఆందోళన కొనసాగించారు. వైఎస్సార్సిపి ఎంపీ విజయసాయిరెడ్డి వినూత్న రీతిలో పార్లమెంటు మొదటి అంతస్తుపైకి వెళ్లి ప్రత్యేక హోదా కోసం నిరసన తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రజల హక్కు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

అవిశ్వాసం తీర్మానానికి అనుమతిస్తారా?

వైఎస్సార్సిపి అవిశ్వాస తీర్మానానికి లోక్‌సభలో స్పీకర్ ప్రస్తావిస్తారా అనేది అనుమానంగానే ఉంది. రెండు వారాలుగా సభా కార్యక్రమాలే జరిగేపరిస్థితి లేకపోవడంతో ఈ నోటీస్‌ను చేపడతారా అనేది సందేహంగానే ఉంది.

పరిశీలనలోనే రైల్వేజోన్

•రైల్వే మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :విశాఖలో ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటు అంశం ఇంకా పరిశీలనలోనే ఉందని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. గురువారం ఆయన రైల్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక జోన్ విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. ఏపీ విభజన చట్టంలో విశాఖ రైల్వేజోన్ విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మాత్రమే కాంగ్రెస్ పార్టీ చట్టంలో పొందుపరిచిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రైల్వేజోన్ తమ పరిశీలనలో ఉందని, ఆర్థిక, సాంకేతిక, నిర్వహణ అంశాలను కమిటీ ఇంకా అధ్యయనం చేస్తోందన్నారు. టీడీపీ ఎంపీలెవరూ తన అపాయింట్‌మెంట్ అడగలేదని అన్నారు. టీడీపీ ఎంపీలను ఉద్దేశ్యపూర్వకంగానే కలవలేదన్న వార్తలోనిజం లేదన్నారు. ప్రతీ మంగళవారం సాయంత్రం 4గంటలనుండి 6గంటలవరకు ఎంపీలను కలుస్తుంటానని చెప్పారు. ఒడిశా ఎంపిలు వారి రాష్ట్రంలో మూడు కొత్త డివిజన్‌లు అడిగారని, అయితే అవి ఏర్పాటు చేయడం సాధ్యం కాదని చెప్పానని తెలిపారు.ఏపిలో రైల్వేజోన్ ఏర్పాటు చేయలేమని ఒడిశా ఎంపిలతో చెప్పలేదన్నారు..

విశాఖజోన్‌కి వ్యతిరేకం కాదు

•ఢిల్లీలో ఒడిశా బీజేడీ ఎంపీల స్పందన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం రాదని ఒడిశాకు చెందిన అధికార బిజూ జనతా దళ్ పార్టీ ఎంపీలు స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలోని సౌత్ ఎవెన్యూలో తెలుగు మీడియాకు ప్రత్యేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ క్లారిటీ ఇచ్చారు. తాము ఒడిశాలో కొత్తగా 3 డివిజన్లను ఏర్పాటు చేస్తూ, రాష్ట్రం మొత్తం ఒకే జోన్ (ఈస్ట్ కోస్ట్ జోన్) పరిధిలోకి వచ్చేలా చేయమని మాత్రమే కేంద్ర రైల్వే మంత్రిని కోరామని చెప్పారు. ఆ పార్టీకి చెందిన ఎంపీలు ఎన్. భాస్కర్ రావు, ప్రతాప్ కేసరిలు మీడియాతో మాట్లాడారు. తమ డిమాండ్‌పై రైల్వే మంత్రి పీయూష్ గోయల్ స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎక్కడా కొత్త డివిజన్లు, జోన్లు పెట్టడం లేదని చెప్పారని బీజేడీ ఎంపీలు తెలిపారు. మరోవైపు జోన్ విషయంలో తమ రాష్ట్ర ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంప్రదింపులు, చర్చలు జరుపుతున్నట్టు వస్తున్న వార్తలు కూడా నిజంగా కాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏపీ సర్కారు చెప్పేవన్నీ అవాస్తవాలని బీజేడీ ఎంపీలు అన్నారు. నిజానికి తమతో ఆంధ్రా సర్కారు అసలు సంప్రదింపులే జరపలేదని, తమను ఒప్పించే ప్రయత్నమేదీ చేయలేదని తెలిపారు.విశాఖపట్నం కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసినా, చేయకపోయినా తమకు సంబంధం లేదని బిజూ జనతా దళ్ ఎంపీలు తెలిపారు. విశాఖ జోన్‌కి ఒడిశా ప్రభుత్వం వ్యతిరేకం కానేకాదని, జోన్ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వమే విన్యాసాలు చేస్తోందని ఆరోపించారు.

మా నాన్నకు ప్రజలే ముఖ్యం

•శాసన సభలో మంత్రి నారా లోకేశ్



అమరావతి, ఆంధ్రప్రభ ; ఎప్పుడూ ప్రజా సేవలోనే మా నాన్నగారు మునిగిపోయారు.. మా గురించి పట్టించుకోలేదు..కుటుంబాన్ని పక్కకు పెట్టి,ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనయుడు , రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. ముఖ్యమంత్రి రాజకీయాల్లోకి వచ్చి 40 ఏళ్లు పూర్తయి, 41 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా గురువారం శాసనసభలో జరిగిన అభినందన తీర్మానంపై ఆయన మాట్లాడారు. 40 ఏళ్లు రాజకీయ జీవితంలో ఆయన ఇంకా 64 ఏళ్ల వయసులో కుర్రాడిలా చలాకీగా పని చేస్తున్నారని అన్నారు. వాస్తవానికి ఆయనకు కుటుంబ కంటే ప్రజలే ముందన్నారు. నా పుట్టిన రోజు ఎప్పుడో కూడా బహుశా ఆయనకు తెలుసో తెలియదన్నారు.

సీఎం కేసీఆర్ నుంచి ప్రాణహాని

•మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు నుంచి నాకు ప్రాణహాని ఉందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. తనకు ఎలాంటి హానీ జరిగినా కేసీఆర్‌తో పాటు కొంత మంది మంత్రులు, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అసెంబ్లీ సాక్షిగానే నన్ను అణిచివేశామని, భవిష్యత్‌లోనూ అణిచివేస్తామనడంలో ఆంతర్యమేమిటిని ఆయన నిలదీశారు. న్యాయ నిపుణులతో సంప్రదించి సీఎం కేసీఆర్‌పై కేసు పెడుతామని ఆయన తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై చేస్తున్న కుట్రలపై రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోంశాఖ మంత్రితో పాటు దేశంలోని వివిధ దళిత సంఘాల నాయకుల దృష్టికి తీసుకుపోనున్నట్లు వివరించారు. చావు, పుట్టుక అనేది ఒకే సారి వస్తాయని, అయితే కేసీఆర్ కుట్రలకు భయపడకుండా ఉద్యమాలను మరింత ఉదృతం చేస్తామన్నారు. వర్గీకరణ విషయంలో సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదని కృష్ణమాదిగ అన్నారు. నాలుగేళ్లుగా దళితులను మోసం చేస్తూనే ఉన్నారని అన్నారు.

ఏదీ శాశ్వతం కాదు:మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏదీ శాశ్వతం కాదని మరోసారి తేలిందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖా మంత్రి కెటిరామారావు అన్నారు. ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఫలితాలు ఆసక్తికరంగా ఉన్నాయంటూ ఆయన గురువారం ట్వీట్ చేశారు. బిజెపిని ఢిల్లీలో కూర్చోబెట్టిన రాష్ట్రం ఏదీ శాశ్వతం కాదని స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చిందన్నారు. మరో జాతీయపార్టీ ధరావతు కోల్పోయిందన్నారు.



పల్లెలకిక మహర్దశ

● బడ్జెట్‌లో రూ.1563 కోట్లు ● పంచాయతీల పటిష్టతకు రూ.1500 కోట్లు ● తండాలకు పంచాయతీ గుర్తింపు ఈ సమావేశాల్లోనే కొత్త చట్టం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం కల్పించే దిశగా రూపొందించిన ప్రణాళికలకు రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు గలగల సవ్వడులు వినిపించాయి. 2018-19 ప్రగతి బడ్జెట్‌లో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి రంగానికి రూ.15563కోట్లు కేటాయించింది .గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో ప్రభుత్వ పెద్దపీట వేసింది. దశాబ్దాల తరబడి ఎగుడు దిగుడు గుంతలలో నిలువెల్లా గాయాలపాలై నిరక్ష్యతకు గురైన గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టించింది. రాష్ట్రంలో అన్ని గ్రామాలకు రోడ్ల కనెక్టివిటీని పెంచేందుకు ప్రభుత్వ ప్రాధాన్యత ఇచ్చింది. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు , జిల్లా కేంద్రాలకు మద్యన ఇపుడున్న సింగిల్ లైన్ రోడ్లను డబుల్ లైన్ రోడ్లుగా విస్తరించే ప్రణాళికికు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది. అంతే కాకుండా గ్రామాలకు గ్రామాలకు మద్య ఉన్న మట్టిరోడ్లను తారు రోడ్లుగా మార్చేందకు ప్రాధాన్యత ఇచ్చింది. రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని 69500కిలోమీటర్ల మేరకు ఉన్న రోడ్లను ఆధునీకరించేందుకు నిధులు కేటాయించింది. అంతే కాకుండా 6617 కిలోమీటర్ల మట్టి రోడ్లను కూడా బీటీ రొడ్లుగా మార్చేందుకు ప్రాధాన్యత కల్పించింది. మరో 13581 కిలొమీటర్ల మేర రోడ్లను ఆధునీకరించనున్నారు.



పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి పద్దులో సీఆర్‌సీ కింద రూ.1080 కోట్లు కేటాయించింది. గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం ద్వారా గ్రామాలకు కొత్తశోభనివ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే నిధుల మేళవింపుతో పారిశుద్యం , తాగునీరు వంటి పథకాల పనులు పెద్ద ఎత్తున చేపట్టనుంది.

ఈ సమావేశాల్లోనే కొత్త పీఆర్ చట్టం:

రాష్ట్రంలో గ్రామీణ తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థకు పెద్ద ఎత్తున సవరణలు చేసింది. నూతన పంచాయతీరాజ్ ముసాయిదా బిలును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు తగ్గట్టుగానే పంచాయతీరాజ్ స్థానిక సంస్థల పటిష్టతకు 2018-19 బడ్జెట్‌లో రూ.1500కోట్లు కేటాయిం చింది. రాష్ట్రంలో గిరిజన తండాలు , ఆదివాసి గూడేలకు ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తింపు ఇవ్వనున్నట్టు బడ్జెట్లలో ప్ర భుత్వం స్పష్టంగా పేర్కొంది. గ్రామ పంచాయతీల బలోపేతానికి రాష్ట్రప్రభుత్వం ఇటీవల కొత్తగా తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమీషన్ ద్వారా నిధుల వినియోగంలో పారదర్శకత , జవాబుదారీతనం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామీణ సామాజిక వికాసం దిశగా వచ్చే ఏడాది కూడా ఆసరా పథకానికి అండగా నిలిచింది. ఆసరా పెన్సన్ల కింద ఒక్కొక్కరికి నెలకు వెయ్యిరూపాయలు అందచేస్తోంది. రాష్ట్రంలో 4198291 మందికి ఆసరా పెన్సన్ల కింద బడ్జెట్లో రూ.5300కోట్లు కేటాయించింది. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించటం ద్వారా వ్యక్తిగత ఆదాయాలను పెంచి తద్వారా గ్రామాల ఆర్థిక పటిష్టత లక్ష్యంగా ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయింపులు చేసింది.

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత

రూ.600 కోట్లతో అభివృద్ధి కార్యాచరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో చారిత్రాత్మక ప్రాశస్త్యం ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసేందుకు 2018-19 బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించింది. అత్యంత వైభవంగా తీర్చిదిద్దాలని నిర్ణయించిన యాదగిరిగుట్ట శ్రీ నరసింహస్వామి దేవస్థానం పునర్‌నిర్మాణ పనులను ఈ ఏడాది పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకోసం బడ్జెట్‌లో రూ.250 కోట్లు ప్రతిపాదించారు. అలాగే వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం అభివృద్ధికి రూ.100 కోట్లు, బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయం అభివృద్ధికి రూ.50 కోట్లు, ధ్మరపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు. అలాగే కామన్‌గుడ్ ఫండ్ నిధికి రూ.50 కోట్లు ప్రతిపాదించారు.

రూ.500 కోట్లతో కొత్త కలెక్టరేట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పరిపాలనా సౌలభ్యం కోసం, మెరుగైన పౌర సేవలు అందించేందుకోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం సమీకృత కలెక్టరేట్ల నిర్మాణంపై దృష్టి పెట్టింది. అందుకోసం గత ఏడాది బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించి నిర్మాణ ప్రక్రియను ప్రారంభించింది. ఈ ఏడాది (2018-19) వార్షిక బడ్జెట్ కేటాయింపుల్లో రూ.500 కోట్లు కేటాయించింది. 26 కొత్త జిల్లా కేంద్రాల్లో సమీకృత కొత్త కలెక్టర్ కార్యాలయాలు, 13 పోలీస్ కార్యాలయాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రహదారులు, భవనాల శాఖకు పెరిగిన కేటాయింపులు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ గురువారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రహదారులు, భవనాల శాఖకు కేటాయింపులు పెరిగాయి. 2017-18 బడ్జెట్‌లో రూ. 5,033.64 కోట్లు కేటాయించగా, 2018 -19 బడ్జెట్‌లో రూ. 5,575.23 కోట్లు కేటాయించారు. అందులో నిర్వహణ పద్దుకు రూ. 1,930.23 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ. 3,645.01 కోట్లు ప్రతిపాదించారు. గత బడ్జెట్ కంటె ఈ బడ్జెట్‌లో రూ. 541.59 కోట్లు ఎక్కువగా పెంచారు.

పట్టణ ప్రాంతాల్లో మీట్ ప్రాసెసింగ్ యూనిట్లు

● గొల్ల, కుర్మ సామాజికవర్గం

యువతకు ప్రాధాన్యత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన సబ్సిడీ గొర్రెల పథకం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలో ఉత్పత్తి చేసిన గొర్రెలను మాంసం రూపంలో విదేశాలకు ఎగుమతి చేసి గొల్ల, కుర్మ సామాజికవర్గానికి చెందిన రైతులు అధిక లాభాలు గడించే విధంగా ప్రోత్సహించాలని నిర్ణయించింది. అందుకోసం 2018-19 ఆర్థిక సంవత్సరంలో పట్టణ ప్రాంతాల్లో మీట్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలని ప్రతిపాదించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల గొర్రెలను 75శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. ఆ గొర్రెలకు 17 లక్షల పిల్లలు పుట్టడంతో గొర్రెలు మొత్తం 67 లక్షలకు పెరిగాయి. మొదటి దశలో 4 లక్షల కుటుంబాలకు 84 లక్షల గొర్రెలను పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం రూ.5వేల కోట్ల వ్యయంతో పథకాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది దాదాపు రూ.6వేల కోట్ల మొత్తాన్ని ఈ పథకం ద్వారా ఖర్చు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం బడ్జెట్‌యేతర పద్ధతిలో వివిధ ఆర్థిక సంస్థల నుంచి రుణం రూపంలో సమకూర్చుకోవాలని నిర్ణయించింది.

న్యాయశాఖకు రూ. 894.22 కోట్లు

బడ్జెట్‌లో న్యాయశాఖకు రూ. 894. 22 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. అందులో నిర్వహణ పద్దు కింద రూ. 834.18 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ. 60.04 కోట్లు ప్రతిపాదించారు.

పెన్‌గంగ ప్రాజెక్టులో మరో రెండు జలాశయాలు

- కడెం నదిపై కుప్టీ జలాశయం
- నిలుపుకున్న ముఖ్యమంత్రి హామీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా మూడుజలాశయాలు రానున్నాయి. కుప్టి, పిప్పల్‌కోటి, గోమూతి రిజర్వాయర్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం వేసి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఇచ్చిన మాట నిలుపుకోవడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత నెలలో ఆదిలాబాద్ పర్యటనకు వెళ్ళిన సిఎం అక్కడి ప్రజల దశాబ్దాల కల నెరవేర్చే పనులకు ప్రభుత్వ ఆమోదం వేయించారు. పిప్పల్‌కోటి వద్ద 1.42టిఎంసి, గోమూత్రి వాగుపై 0.7టిఎంసి, కుప్టీ 5.30టిఎంసిల సామర్థ్యంతో నిర్మించనున్నారు.

మణుగూరు-కొల్హాపూర్ రైలును ప్రారంభం

- ఏజెన్సీ ప్రాంత అదృష్టంః ఎమ్మెల్యే పాయం
- కొవ్వూరు రైలు సాధించుకుంటాంః ఎంపీ పొంగులేటి

మణుగూరు, ప్రభన్యూస్: మణుగూరు-కొల్హాపూర్ నూతన రైలును ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం సాయంత్రం 3.40 గంటలకు పచ్చజెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎంపీలు సీతారాంనాయక్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ.. కొల్హాపూర్ రైల్ సర్వీస్ మంజూరు కోసం ఎంతగానో కృషి చేశామన్నారు. మణుగూరు-కొల్హాపూర్ రైలును సాధించిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రజలు ఈ రైలు సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భద్రాచలంకు భక్తుల సౌకర్యార్థం ఈ రైలు ఏర్పాటు చేశామన్నారు. సారపాక నుండి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాండురంగాపురానికి రైల్వే లైన్ ఏర్పాటు చేసి శ్రీరామ స్వామి వారి సన్నిధికి చేరుకునేందుకు దేశం నుండి భక్తుల వెసులుబాటు కల్పిస్తామన్నారు. తిరుపతికి కూడా రైలు సదుపాయాన్ని కల్గించాలని ప్రజలు చేసిన విన్నపాన్ని దృష్టిలో ఉంచుకొని మరో రైలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రైల్వే ఎడిఆర్ఎం శైలేంధర్ మాట్లాడారు. కొల్హాపూర్ రైలు రూట్‌ను ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారికి వివరించారు.

ఏజెన్సీ ప్రాంత అదృష్టంః ఎమ్మెల్యే పాయం

కొల్హాపూర్ రైల్వే ఏర్పాటు ఏజెన్సీ ప్రాంత అదృష్టమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ రైల్వే ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతారాం నాయక్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా రైల్వే కేంద్ర మంత్రులకు, రైల్వే అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


కొవ్వూరు రైలు సాధించుకుంటాంః ఎంపీ పొంగులేటి

నాడు మణుగూరు-కొల్హాపూర్ రైలును సాధించుకున్నట్లే..కొవ్వూరు రైలును కూడా సాధించుకుంటామని ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ప్రజల కోరిక కార్మికులకు, అన్ని వర్గాల ప్రజలకు ఈ కొవ్వూరు రైలు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. కొవ్వూరు రైల్వే లైన్ సత్తుపల్లి వరకు వచ్చిందని..కొద్ది రోజుల్లోనే రైల్వే లైన్ ఏర్పాటు జరుగుతుందన్నారు. రైల్వే లైన్ ఏర్పాటుకు సహకరించిన రైల్వే మంత్రి, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ దిండిగల రాజేందర్, ఎడి అధికారి మణికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ఎఎంసీ ఛైర్‌పర్సన్ సూరపాక విజయనిర్మల, మండల అధ్యక్షులు ముత్యంబాబు, పట్టణ అధ్యక్షులు వలసాల వెంకటరామరావు, కార్యదర్శులు మాదాడి రాజేష్, పెద్ది నాగకృష్ణ, పల్లపు తిరుమలేష్,సొసైటీ ఉపాధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, పాయం ప్రమీల,కుంజా నాగేశ్వరరావు, మేడా నాగేశ్వరరావు, గాండ్ల సురేష్, బర్ల సురేష్ వావిలాల భుజంగరావు, ఎంపీటీసి జోగా సారయ్య, ఎడ్ల శ్రీనివాస్, రెడ్డి లక్ష్మీ, పణితి సామ్రాజ్యం, అబ్దుల్లా, మీరాసాహెబ్, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నీటి పారుదల రంగానికి నిధుల వరద

● వరుసగా మూడో ఏడాది.. పాతిక వేల కోట్లు ● గోదావరి, కృష్ణానదులపై ప్రాజెక్టుల పూర్తికి కంకణం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్న నీటిపారుదల రంగానికి మరోసారి నిధుల వరద పారింది. కోటిఎకరాల దారిలో వడివడిగా అడుగులు వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు వరదలెత్తించింది. వరుసగా మూడో ఏడాది.. నీటిపారుదలకు రూ.పాతిక వేల కోట్లు కేటాయించగా, ముఖ్యమంత్రి కెసిఆర్ ముందే చెప్పినట్లు నీటిపారుదల రంగానికి బడ్జెట్‌లో అగ్రతాంబూలమిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో లక్షఎకరాలకు సాగునీరందించాలన్న ఘనమైన లక్ష్యాన్ని నిర్దేశించుకున్న ప్రభుత్వం భారీ కేటాయింపులతో తన చిత్తశుద్దిని మరోమారు ప్రదర్శించింది. కేటాయింపులే అత్యంత భారీగా ఉండగా, వీటికి అదనంగా కార్పోరేషన్‌ల ద్వారా కూడా నిధుల సమీకరించి ఖర్చుచేయనున్నారు. గోదావరి, కృష్ణా నదులపై 23 మేజర్, 13మీడియం సాగునీటి ప్రాజెక్టులు ప్రభుత్వం చేపట్టిందని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న పాలమూరు ప్రాజెక్టులను శరవేగంగా పూర్తిచేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందుకు అనుగుణంగానే కేటాయింపులు చేశారు. పాతపాలమూరు జిల్లాలో ఇప్పటికే 6.5లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, ఈ ఏడాది 8లక్షల ఎకరాలకు సాగునీరు అందించబోతున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ఎత్తిపోతల పథకాల పూర్తికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నట్లు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వం పేర్కొంది. కల్వకుర్తి ప్రాజెక్టుకు రూ.499కోట్లు కేటాయించగా, నెట్టెంపాడుకు రూ.199కోట్లు, భీమాకు రూ.170కోట్లు కేటాయించారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రికార్డుస్థాయిలో రూ.5386.41కోట్లు కేటాయించింది. గత ఏడాది రూ.6వేల కోట్లకు పైగా కేటాయించగా, కార్పోరేషన్ ద్వారా చేసిన నిధుల సమీకరణతో రూ.10వేల కోట్లకు పైగా ఖర్చుచేశారు. ఈ ఏడాది కూడా కార్పోరేషన్ల ద్వారా పెద్దమొత్తంలో నిధుల సమీకరణ జరగనుంది. బడ్జెట్‌లో వరుసగా రూ.పాతికవేలు కోట్లు నీటిపారుదల రంగానికి, వ్యవసాయరంగానికి రంగానికి రూ.15వేల కోట్లకు పైగా చేసిన కుటుంబాలతో సింహభాగం రైతుసంక్షేమం చుట్టే తిరిగిందని బడ్జెట్ కేటాయింపులపై సాగునీటి పారుదల రంగ నిపుణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టులు పూర్తయితే బీడుభూములు సస్యశ్యామలమవుతాయని రైతులలో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం మొదటినుండీ చెబుతున్నట్లే బడ్జెట్ కేటాయింపులు చేయగా, కార్పోరేషన్‌ల ద్వారా నిధులసమీకరణను దృష్టిలో పెట్టుకుని కేటాయింపులను అవసరాలకంటే తగ్గించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామా ఎత్తిపోతల పథకాలు ఇదే కోవలో ఉన్నాయి. పాలమూరు-రంగారెడ్డికి రూ.3,035కోట్లు కేటాయించగా, సీతారామా ఎత్తిపోతల పథకానికి రూ.1200కోట్ల కేటాయింపులు చేసింది. భక్తరామదాసు ఎత్తిపోతల పథకానికి రూ.1225కోట్లు కేటాయించి సంచలనం సృష్టించింది. డిండి ఎత్తిపోతల పథకానికి తొలిసారి భారీ కేటాయింపులు చేసింది. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1349కోట్లు కేటాయించింది. దేవాదుల ప్రాజెక్టుకు గత ఏడాది కంటే భారీగా కేటాయింపులు పెంచింది. మైనర్ ఇరిగేషన్ రంగానికి కూడా ప్రాధాన్యం పెంచింది. కంతనపల్లి సుజలస్రవంతి పథకానికి కూడా భారీ కేటాయింపులు చేయడం విశేషం.



వడివడిగా..

తెలంగాణ ప్రభుత్వం ముందు ప్రకటించినట్లుగానే భారీ కేటాయింపులు చేయగా, ప్రభుత్వ ప్రాధాన్యతలు స్పష్టమయ్యాయి. రూ.10వేల కోట్ల వ్యయమయ్యే సీతారామ ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో రూ.1200కోట్లు మాత్రమే కేటాయించగా, తాజాగా ఏర్పాటుచేయనున్న కార్పోరేషన్ ద్వారా ప్రాజెక్టుకు నిధులసమీకరణ చేసి అదనంగా ఖర్చు చేయనున్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు ఈ ఏడాది ఖరీఫ్ నాటికి పూర్తిచేయాలన్న లక్ష్యాన్ని విధించుకోగా, రూ.5,386కోట్లు కేటాయించింది. పనుల వేగాన్ని బట్టి కార్పోరేషన్ ద్వారా నిధులు సమీకరించుకునే యోచనలో ప్రభుత్వం ఉంది. చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులకే ఈ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యమిచ్చారు. మొత్తంగా చూస్తే ప్రాజెక్టులపై వాస్తవిక దృక్పదంతో కేటాయింపులు చేశారని, పూర్తయ్యే ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించారని నీటిపారుదల రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మైనర్ ఇరిగేషన్‌కు పెద్దపీఠ

మైనర్ ఇరిగేషన్‌కు గత ఏడాది రూ. 1996.50కోట్లు ప్రభుత్వం కేటాయించగా, ఈ ఏడాది కేటాయింపులు పెంచింది. గత ఏడాదితో పోలిస్తే రూ.500కోట్లు పెంచింది. మిషన్ కాకతీయ తొలి మూడు దశలు అద్భుతంగా విజయవంతం కాగా, 2018-19లో నాలుగో విడత కార్యక్రమం జరగనుంది.

మొత్తం రూ.2413కోట్లను చిన్ననీటి పారుదల రంగానికి ప్రభుత్వం కేటాయించింది. చెరువుల, కుంటల అభివృద్ధితో పాటు ఈ ఏడాది ఫీడర్ ఛానళ్ళను అభివృద్ధి చేయనున్నారు. కొత్త చెరువుల నిర్మాణం కూడా చేపట్టారు.

ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు ఇలా..

ప్రాజెక్ట్ పేరు	కేటాయింపులు (రూ.కోట్లలో)
కాళేశ్వరం	5386.41
ఎస్ఎల్‌బిసి	699.86
కడెం ప్రాజెక్ట్	172.84
దేవాదుల	1965.46
కంతనపల్లి	700.17
సింగూరు	40.00
రాజోలిబండ డైవర్షన్	144.50
నెట్టెంపాడు	199.00
కల్వకుర్తి	499.00
రాజీవ్ భీమా	170.00
కోయలసాగర్	119.00
ఎస్ఆర్ఎస్‌పి-2	200.00
ఎస్సారెస్పీ	145.94
ఎల్లంపల్లి	993.63
పాలమూరు -రంగారెడ్డి	3035.10
సీతారామా	1200.81
ప్రాణహిత	350.00
పెన్‌గంగ	600.00
సంగంబండ	1192.50
గొల్లవాగు	3.500
వరదకాల్వ	279.00
మానేరు	1006.03
కొమరం భీం	100.00
నిజాంసాగర్	99.00
చౌటుపల్లిలిఫ్ట్	46.10
సింగూరు	40.00

ప్రజా సంక్షేమ బడ్జెట్



● ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ కాదని, ప్రజా సంక్షమ బడ్జెట్‌గా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ అభివర్ణించారు. అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా బడ్జెట్‌ను రూపొందిం చారని ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్‌ను కొనియాడారు. ఈ బడ్జెట్‌లో రైతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని, రైతు భీమా పథకానికి రూ. 500 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.2000 కోట్లు కేటాయించడంపై సిఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇది అద్భుత బడ్జెట్

● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఇది అద్భుత బడ్జెట్, అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని తయారుచేసిన బడ్జెట్ అని వైద్య ఆరోగ్యశాఖా మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయ వనరులు, అవసరాలు, లక్ష్యాలకు అను గుణంగా రూపొందించిన ఈ బడ్జెట్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతులకు పెట్టుబడులు, 24 గంటల పాటు విద్యుత్ వంటి ప్రోత్సా హకాలతో కేసీఆర్ రైతు పక్షపాతిగా మరోమారు నిరూపించుకున్నారన్నారు. ఆయా రంగాలకు అధికంగా నిధులు కేటాయించడం ద్వారా కచ్చితంగా ఈ బడ్జెట్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అలాగే విద్య, వైద్యం వంటి రంగాలకు కూడా అత్యంత ప్రాధాన్యత నిచ్చారన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఆరోగ్య తెలంగాణ సాధించి తీరుతామన్నారు. గతంలో రూ.6వేల కోట్లున్న వైద్య బడ్జెట్‌ని రూ.7,375 కోట్లకు పెంచారు. అమ్మ ఒడి పథకానికి అద నంగా రూ.560 కోట్లను కేటాయించారు. దీంతో మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, కొత్త నియామకాలు పూర్తవుతాయన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు పెద్ద పీట

● మంత్రి జోగు రామన్న




హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు పెద్ద పీట వేశారని బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో బిసిలకు స్వర్ణయుగం వచ్చిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తెలంగాణ రాష్ట్రంలో బిసిల బడ్జెట్ మూడింతలు పెరిగిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో బిసి శాఖకు రూ. 5,290 కోట్లను ప్రతిపాదించారన్నారు. గతేడాది బిసి శాఖ బడ్జెట్ 5,070 కోట్లు కాగా ప్రస్తుతం రూ. 850 కోట్లు పెంచారన్నారు. ఎంబిసిలకు వేయి కోట్లు, రజక, నాయి బ్రాహ్మణులకు రూ. 450 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిసిలందరూ సంతోషంగా ఉన్నారని, సిఎం కెసిఆర్ నాయకత్వంలో బంగారు తెలంగాణ వైపు అడుగులు వేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

ఇది సంపూర్ణ బడ్జెట్



బంగారు తెలంగాణ సాకారం చేసే దిశగా, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని, ఇది సంపూర్ణ బడ్జెట్ అని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవిక కోణంలో బడ్జెట్ ఉందన్నారు. తాను నిర్వహిస్తోన్న గృహ నిర్మాణ, దేవాదాయ, న్యాయశాఖలకు సముచితరీతిలో కేటాయింపులు జరిపారన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో రూ. 2,643 కోట్లు, యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులకు రూ. 250 కోట్లు, వేములవాడ దేవాలయాభివృద్ధికి రూ. 100 కోట్లు, భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులకు రూ. 100 కోట్లు, బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాభివృద్ధికి రూ. 50 కోట్లు, ధర్మపురి దేవాలయాభివృద్ధికి రూ. 50 కోట్లు కేటాయించారన్నారు. అర్చకులు, ఆలయ ఉద్యోగులకు 2015 పిఆర్‌సి ప్రకారం పేస్కేల్ చెల్లింపుల కోసం రూ. 72 కోట్లు కేటాయించారన్నారు. బలహీనవర్గాల కాలనీల్లో నూతన ఆలయ నిర్మాణం, ఆలయాల జీర్ణోద్ధరణకు వస్తున్న విజ్ఞప్తుల మేరకు కామన్ గుడ్ ఫండ్‌కు రూ. 50 కోట్లు, న్యాయవాదుల సంక్షేమానికి రూ. 100 కోట్లు కేటాయించారని వివరించారు.

సామాన్యుడి బడ్జెట్



హైదరాబాద్,ఆంధ్రప్రభ : బడ్జెట్ సామాన్యుడికి అను కూలంగా, సహజంగా ఉందని, ఎటువంటి విమర్శకులకు తావివ్వకుండా దీనిని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ రూపొందించారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ప్రశంసించారు. గురువారం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లా డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల విమర్శలకు తావులేకుండా ఈ బడ్జెట్ ఉందన్నారు. బడ్జెట్ అంకెలగారడీ కాదని, మభ్యపెట్టేది కాదని, చివరి వరకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందరికి అందించే విధంగా ఉందన్నారు.

సీఎం వాగ్ధానాలు అమలు



ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ సీఎం వాగ్ధా నాలు చేయడమే కాదు దానిని అమలు చేస్తారని ఈ బడ్జెట్‌ను చూస్తే అందరికీ అర్థమవుతుందన్నారు. తెలంగాణ ఏర్ప డిన తరువాత ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో నిధులను కేటా యిస్తూ వ్యవసాయానికి, రైతాంగాన్ని వృద్ధిలోకి తీసుకు రావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలకు అది కంటగింపుగా మారిందన్నారు.

అద్వితీయం..అమోఘం



ఎమ్మెల్యే బిగాలా గణేశ్ గుప్తా మాట్లాడుతూ ఈ బడ్జెట్ అద్వితీయం..అమోఘమన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. ప్రతిపక్షాలు ఎప్పుడూ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఈ బడ్జెట్ చూసైనా వారు కళ్లు తెరవాలన్నారు. అన్ని రం గాల అభివృద్ధికి సమానంగా నిధులను కేటాయిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



సంక్షేమానికి పెద్దపీట



మహిళా, శిశు సంక్షేమం

మహిళా, శిశు సంక్షేమాన్ని గ్రామీణ స్థాయి నుంచి చేపట్టి వారికి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఈ శాఖకు బడ్జెట్‌లో రూ.1,799 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల డిమాండ్‌ను సమర్థిస్తున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని ఈటల రాజేందర్ చెప్పారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు, ఆరేళ్ళలోపు పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. తల్లీబిడ్డల ఆరోగ్యం, శిశువుల సంపూర్ణ వికారం కోసం ఆరోగ్యలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఈ బడ్జెట్‌లో రూ.298 కోట్లు కేటాయిస్తున్నట్లు ఈటల తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమం

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి అనేక పథకాలు చేపట్టామని ఈ బడ్జెట్‌లో ఎస్సీ కులాల ప్రగతికి రూ.16,453 కోట్లు, ఎస్టీలకు రూ.9,693 కోట్లు ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. రెండున్నర లక్షల మంది ఎస్టీ విద్యార్థులకు లబ్ధి జరుగుతోందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు రూ.1,459 కోట్ల మేరకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చామని ఆయన తెలిపారు. ఈ వర్గాలకు కూడా కళ్యాణలక్ష్మీ అందిస్తున్నామని, విద్యార్థులను ఉన్నత విద్యకు ప్రోత్సహించేందుకు ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. షెడ్యూల్డ్ కులాల శాఖకు రూ.12,709 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు ఈటల తెలిపారు. ఎస్సీ యువత స్వయం ఉపాధికి సబ్సిడీ గరిష్ట పరిమితిని లక్ష నుంచి ఐదు లక్షల రూపాయలకు పెంచామని చెప్పారు. దళితులకు మూడెకరాలు పంపిణీ కింద 45 నెలల్లో 4,939 మంది దళితులకు 12,745 ఎకరాలు పంపిణీ చేశామని, ఈ భూమి కొనుగోలుకు ఈ బడ్జెట్‌లో రూ1,469 కోట్లు కేటాయిస్తున్నట్లు రాజేందర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టి.ప్రైడ్ ద్వారా ప్రోత్సహిస్తున్నామని, వీరికి విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు.

బీసీ సంక్షేమం

రాష్ట్ర జనాభాలో 52శాతం ఉన్న వెనకబడిన తరగతుల సర్వతోముఖాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నామని, వారి సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో రూ.5,920 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు ఆయన తెలిపారు. హాస్టల్స్, గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని చెప్పారు. ఎంబిసి కులాల సంక్షేమానికి రూ.1000 కోట్లు, రజకుల ఫెడరేషన్‌కు రూ.200 కోట్లు, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.250 కోట్లు ప్రతిపాదిస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలోని ఇతర వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, మైనారిటీ, బ్రాహ్మణులు, జనర్నలిస్టులకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మైనారిటీ సంక్షేమానికి రూ.2వేల కోట్లు, బ్రాహ్మణ సంక్షేమానికి రూ.100 కోట్లు, జర్నలిస్టు సంక్షేమానికి రూ.75 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

అందరి ఆరోగ్యమే మహాభాగ్యం

వ్యాధులపై అవగాహనకు 7,375.20 కోట్లు • గతేడాది కన్నా ఈసారి అదనంగా రూ.1299.03 కోట్లు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: వైద్య ఆరోగ్యానికి మరింత ఊతం ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టిని సారించింది. దీర్ఘకాలిక వ్యాధుల నిర్మూలనతో పాటు సీజనల్‌వ్యాధులపై ప్రజలను అప్ర మత్తం చేసేందుకు అవసరమైన అవగాహన, చైతన్యం కలిగించేందుకు పలు చర్యలను చేపడుతోంది. రోగాలు ప్రజల దరిచేరకుండా ముందస్తు జాగ్రత్తలను ప్రభుత్వం తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రజల చైతన్యంతో పాటు ఆస్పత్రుల అభివృద్ధి, నూతన పరికరాల కొను గోలు, కొత్త జిల్లాల నేపథ్యంలో జిల్లా ఆస్పత్రుల ఏర్పా టుతో వాటి అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తోంది. దీంతోపాటు పలురకాల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం కూడా బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేసింది. ఇందులో ప్రధానంగా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ కంటి వైద్యం చేయించడంతో పాటు అందరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిం చింది.



ప్రజారోగ్య వ్యవస్థను విస్తృత పరచడానికి

తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రభుత్వం అమలు చేసిన సమగ్ర ప్రణాళిక వల్ల ప్రజారోగ్య వ్యవస్థ ఎంతో మెరు గుపడింది. ప్రజారోగ్య వ్యవస్థను విస్తృత పరచడానికి, సౌకర్యాలను మెరుగుపరచడానికి అనేక చర్యలు తీసుకుంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకొని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల వరకు అన్ని వైద్య శాలలకు నేరుగా నిధులను అందిస్తోంది. ఆస్పత్రుల్లో బెడ్ల సంఖ్యను బట్టి నిధులను కేటాయించి నేరుగా ఆస్పత్రులకే విడుదల చేస్తోంది. ఆస్పత్రుల్లో మందుల కొనుగోళ్లకు నిధులను రెట్టింపు చేసింది.

రాష్ట్ర వ్యాప్తంగా 1,78,048 కేసీఆర్ కిట్ల పంపిణీ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచడానికి కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. గర్భం దాల్చినప్ప టి నుంచి ప్రసవం జరిగే శిశువుకు 3 నెలల వయస్సు వచ్చేంతవరకు మూడు విడతల్లో ప్రతి విడతకు నాలు గువేల చొప్పున మొత్తం 12 వేల రూపాయలను, ఆడ పిల్లను కన్నతల్లికి అదనంగా మరో వెయ్యి రూపాయ లను అందిస్తోంది. ఇప్పటిదాకా 8,26,143 మంది గర్భి ణులు తమ పేర్లు నమోదు చేసుకోగా 1,78,048 కేసీఆర్ కిట్ల పంపిణీ జరిగింది.

రాష్ట్ర వ్యాప్తంగా 12 క్యాన్సర్ పరీక్షా కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా 34 ఆస్పత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి ఉచితంగా డయాలసిస్ సేవలను అందిస్తోంది. దీంతోపాటు 22 ప్రభుత్వాసుపత్రుల్లో ఐసీ యూలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 12 చోట్ల క్యాన్సర్ పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసి లక్షలాదిమందికి పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రాథమిక స్థాయిలోనే రోగాన్ని గుర్తించి వైద్యం అందించడానికి ఈ కేంద్రాలు మరింత ఉపయోగపడతాయని ప్రభుత్వం ముందస్తు ఆలోచన.

తక్షణం వైద్యం అందించడానికి బైక్‌లు

తక్షణం వైద్యం అందించడానికి నగరంలో ఎమర్జెన్సీ మోటార్ సైకిల్ సేవలను ప్రారంభించింది. దీనికోసం 50టీకా ద్విచక్రవాహనాలను బస్తీల్లో తిప్పుతూ పేదలకు వ్యాధినిరోధక టీకాలను ప్రభుత్వం వేయిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎఎన్ఎంలకు 10 నుంచి 25 వేల సబ్సిడీతో స్కూటీలను అందించారు.

102 నెంబర్‌కు గర్భిణులు ఫోన్ చేస్తే..

గర్భిణులకు ప్రత్యేక రక్షణ, అదనపు జాగ్రత్తలు, సౌకర్యాలు అవసరం. అయితే పేదరికం వల్ల ఎంతోమంది మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. నిరుపేద గర్భిణుల సమస్యల దృష్టిలో ఉంచుకొని అమ్మ ఒడి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. గర్భిణులు ఆస్పత్రికి వెళ్లడానికి, ప్రసవానంతరం క్షేమంగా ఇంటికి తిరిగి రావడానికి ప్రత్యేక వాహన సదుపాయాన్ని ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తోంది. 102 నెంబర్‌కు ఫోన్ చేస్తే గర్భిణుల కోసం ఈ వాహనం వస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 250 వాహనాలు గర్భిణులకు సేవలను అందిస్తున్నాయి. ఈ పథకానికి ప్రభుత్వం 2018-19 సంవత్సరానికి గాను రూ.561 కోట్లు కేటాయించింది.



నిర్వహణ పద్దు కింద రూ.3,522.71 కోట్లు

ఈ నేపథ్యంలోనే 2018-19 సంవత్సరానికి గాను బడ్జెట్లో భారీగా నిధులను కేటాయించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో వైద్య ఆరోగ్యం కోసం 7,375.20 కోట్లను కేటాయించిన ప్రభుత్వం నిర్వహణ పద్దు కింద రూ.3,522.71 కోట్లు కాగా ప్రగతి పద్దు కింద రూ.3,852.49 కోట్లను కేటా యించింది. గతేడాదితో పోలిస్తే ఈసారి వైద్య ఆరోగ్య శాఖకు రూ.1299.03 కోట్లను అధికంగా కేటాయించింది. ఇందులో ఎంఎన్‌జే ప్రాంతీయ క్యాన్సర్ కేంద్రానికి రూ.15 కోట్లు, వైద్య విధాన పరిషత్‌లో ఆస్పత్రుల స్థాయిని పెంచేందుకు రూ.46.70 కోట్లు, నూతన పరికరాల కోసం రూ.30 కోట్లు, రోగ నిర్ధారణ కోసం రూ.40 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

హెల్త్ యూనివర్సిటీ నిర్వహణకు రూ.10 కోట్లు

ఆరోగ్యశ్రీ పథకంలోకి రానివారు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందేవారి కోసం రూ.10 కోట్లను కేటాయించింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నిర్వహణ కు రూ.10 కోట్లు, భవనాలు ఇతర పనుల కోసం రూ.511 కోట్లు, యోగాధ్యాయన పరిషత్‌కు రూ.12 కోట్లు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి 439.67 కోట్లను కేటాయించారు. గతంతో పోలిస్తే సొసైటీకి 50 శాతం మేర పెంచారు.

ప్రివెన్షన్ కంట్రోల్‌కు రూ.62 కోట్లు

రంగాపూర్‌లోని నిమ్స్ విశ్వ విద్యాలయం కోసం రూ.8 కోట్లను కేటాయించారు. ప్రివెన్షన్ కంట్రోల్‌కు రూ.62 కోట్లు, అంటువ్యాధుల నిర్మూలనకు రూ.105 కోట్లను కేటాయించారు. గతేడాదితో పోల్చితే సుమారు రూ.45 కోట్లను అదనంగా కేటాయించారు. ఆయుష్ కాలేజీల బలోపేతానికి రూ.45 కోట్లు, డ్రగ్ కంట్రోలర్ విభాగానికి రూ.30 కోట్లను కేటాయించారు.

అమ్మ ఒడి పథకానికి రూ.561 కోట్లు

రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులతో పాటు కంటి అద్దాలు, శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించేందుకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేశారు. దీంతోపాటు ఆరోగ్య శ్రీ రూ.699.44 కోట్లు, కేసీఆర్ కిట్ల కోసం రూ.560.50, ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్‌స్కీం కోసం రూ.300 కోట్లను కేటాయించారు. దీంతోపాటు రాష్ట్రంలో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించాలని గత బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 34 డయాలసిస్ కేంద్రాలు, 22 ఐసియూ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 12 క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం లక్షమందికి పరీక్షలు నిర్వహించింది. ఇందులో క్యాన్సర్‌కు గురైన వారిని గుర్తించి వారికి ఉచితంగా వైద్యాన్ని అంది స్తోంది. గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేకమైన చర్యలు చేపట్టింది. ఇందుకోసం అమ్మ ఒడి పథకాన్ని చేపట్టిన ప్రభుత్వం దానిని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. దీనికోసం రూ.561 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

చదువుకు దండిగా నిధులు

• ప్రాధాన్యతా క్రమంలో నిధుల కేటాయింపు • పాఠశాల విద్యకు పెరిగిన నిధులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: విద్యారంగానికి ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు పెంచుతూ ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. విద్యారంగానికి పెరిగిన నిధుల్లో ట్విస్ట్ ఉంది. కేవలం పాఠశాల విద్యకు మాత్రమే గతం కంటే నిధులను ఈ ఏడాది పెంచింది. మిగిలిన పెంచిన సర్కార్... యూనివర్సిటీలు, కళాశాల విద్యకు అభివృద్ధి నిధులను తగ్గించింది. సాంకేతిక విద్యకు గతం కంటే రూ. 46 కోట్లు పెంచింది. పెంచిన నిధులు మొత్తం కొత్త పాలిటెక్నిక్ కాలేజీల భవనాల నిర్మాణానికి కేటాయించినవే కావడం గమనార్హం. అయితే జెఎన్‌టియుకు ఆర్‌జీకెయుటీకి, జెఎన్‌ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీకి, బాసరలోని త్రిపుల్ ఐటీకి టెక్నికల్ విద్యలో కేవలం వేతనాల కోసమే నిధులు కేటాయించారు గానీ ప్రగతి పద్దు కింద ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ప్రధానంగా యూనివర్సిటీలు, కళాశాల విద్యకు గత ఏడాది కంటే ఈ ఏడాదిలో ప్రగతి పద్దు కింద అభివృద్ధి నిధులను తగ్గించేశారు. యూనివర్సిటీలు, కళాశాల విద్యకు వేతనాల కోసం కేటాయించిన నిధుల్లో గత ఏడాది కంటే ఈ ఏడాది నిధులు పెంచారు తప్ప అభివృద్ధి కోసం ఇచ్చే ప్రగతి పద్దు నిధులను పెంచకపోగా తగ్గించడం పట్ల విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయసంఘాలు విమర్శిస్తున్నాయి. అయితే రూసా పథకం కింద కేటాయించే నిధుల్లో ప్రగతి పద్దు కింద గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ నిధులను కేటాయించారు.





పాఠశాల విద్యకు ప్రగతి పద్దులో గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 104 కోట్లు మాత్రమే పెంచింది. మొత్తం బడ్జెట్‌లో వేతనాలు ఎస్టాబ్లిష్‌మెంట్‌కు కేటాయించిన నిధులే ఎక్కువ శాతం ఉన్నాయి.

విద్యారంగానికి కేటాయించిన నిధులు...

2017-18	2018-19	(రూ. కోట్లలో)
పాఠశాలవిద్య	రూ. 10,197	రూ. 10,829
కళాశాల విద్య	రూ. 2060	రూ. 2024(రూ. 36 కోట్లు ప్రగతిపద్దు తగ్గించారు)
యూనివర్సిటీలు	రూ. 757	రూ. 695(రూ. 62 కోట్లు ప్రగతిపద్దులో తగ్గించారు)
టెక్నికల్ విద్య	రూ. 375	రూ. 421

యూనివర్సిటీలకు కేటాయించిన నిధుల వివరాలు...

యూనివర్సిటీ	2017-18	2018-19(రూ. కోట్లలో)
ఉస్మానియా యూనివర్సిటీ	రూ. 200	రూ. 60
కాకతీయ యూనివర్సిటీ	రూ. 30	రూ. 25.30
అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ	రూ. 20	రూ. 20
పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ	రూ. 20	రూ. 20.02
తెలంగాణ యూనివర్సిటీ	రూ. 20	రూ. 20
మహాత్మాగాంధీ యూనివర్సిటీ	రూ. 35	రూ. 25
శాతావాహన యూనివర్సిటీ	రూ. 20	రూ. 20
పాలమూరు యూనివర్సిటీ	రూ. 30.59	రూ. 20
రూసా పథకానికి కేటాయించిన నిధులు	రూ. 62.64	రూ. 72.04

అభివృద్ధి కోసం కేటాయించే ప్రగతిపద్దులో నిధులు వేటికి గత ఏడాది కంటే పెంచలేదు. పాఠశాల విద్యకు మొత్తం బడ్జెట్‌లో కేవలం 6.2 శాతం నిధులు మాత్రమే కేటాయించారని ఉపాధ్యాయ సంఘాలతోపాటు, విద్యార్థి సంఘాలు విమర్శించాయి. పాఠశాల విద్యకు ప్రభుత్వం సరైన కేటాయింపులు చేయలేదని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి విమర్శించారు. కొఠారీ కమిషన్ ప్రకారం బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉండగా గత ఏడాది కేటాయించిన నిధుల కంటే కూడా 3 శాతం నిధులను తగ్గిస్తూ బడ్జెట్‌ను కేటాయించారని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి జి సదానందగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యలో మొత్తం బడ్జెట్‌లో కేవలం 10 శాతం నిధులే కేటాయించారని, ఉమ్మడి రాష్ట్రంలో విద్యకు 13 శాతం నిధులు కేటాయించారని పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి చెన్నకేశవరెడ్డి విమర్శించారు. బడ్జెట్‌లో రెసిడెన్షియల్ స్కూల్స్‌కి రూ. 2832 కోట్లు కేటాయించిన ప్రభుత్వం అదే నిష్పత్తిలో ఎక్కువ మంది విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలలకు అదే మోతాదులో నిధులు కేటాయించలేదని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్లాల లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముప్పిడి లక్ష్మయ్య విమర్శించారు. బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగానికి మరోసారి నిరాశ కలిగించిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మైన శ్రీనివాసులు విమర్శించారు. ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తామని చెబుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది యూనివర్సిటీలకు నిధులను తగ్గిస్తే నాణ్యమైన విద్య ఎలా సాధ్యమవుతుందని కేజీటు పీజీ జేఏసీ కన్వీనర్ గౌరీ సతీష్ మండిపడ్డారు. ప్రభుత్వం యూనివర్సిటీలకు నిధులను పెంచితే పరిశోధనలు పెరుగుతాయి, తద్వారా నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. విద్యరంగానికి మొత్తం బడ్జెట్‌లో కేవలం 9.2 శాతం మాత్రమే కేటాయించి విద్యారంగాన్ని విస్మరించిందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్ విమర్శించారు. కోఠారి కమిషన్ సూచనల ప్రకారం విద్యకు బడ్జెట్‌లో 30 శాతం కేటాయించాల్సి ఉండగా కేవలం 9.2 శాతం కేటాయించారని విమర్శించారు.

డబుల్ బెడ్‌రూమ్‌కు పెరిగిన ప్రాధాన్యత

2018-19 బడ్జెట్‌లో రూ.2,643 కోట్లు కేటాయింపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రతిష్టను దేశం నలుమూలలకు చాటి పొరుగు రాష్ట్రాలకు ఆదర్శవంతంగా నిలిచిన డబుల్ బెడ్‌రూమ్ పథకానికి ప్రభుత్వం 2018-19 బడ్జెట్ కేటాయింపుల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించింది. ప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ నుంచి ఐదేళ్ళు పూర్తయ్యే కాలానికి లక్ష్యంగా ఎంచుకున్న మూడు లక్షల ఇళ్ళ నిర్మాణానికి ప్రతియేటా రూ.2వేల కోట్లకుపైగా కేటాయిస్తూ వస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది రూ.2,643 కోట్లు కేటాయించింది. గడిచిన మూడేళ్ళలో వివిధ స్థాయిల్లో పురోగతి దిశగా కొనసాగుతున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు ఇప్పటి వరకు 2,72,768 మంజూరయ్యాయి. వాటిలో 9,522 ఇళ్ళు ఇప్పటి వరకు పూర్తయ్యాయి. 1,68,981 ఇళ్ళు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. వీటిని త్వరితగతిన పూర్తిచేసి ఈ ఏడాది చివరిలోగా లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో మిగతా లక్ష పైచిలుకు ఇళ్ళ నిర్మాణానికి పునాదులువేసి వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని సంకల్పించింది. ఆ మేరకు 2018-19 బడ్జెట్ కేటాయింపుల్లో రూ.2,643 కోట్లు ప్రతిపాదించారు. ఈ మొత్తం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా మాత్రమేనని ఆర్థికమంత్రి అసెంబ్లీ స్పష్టంచేశారు. దాదాపు మూడు లక్షల ఇళ్ళ నిర్మాణానికి అవసరమయ్యే మిగతా మొత్తాన్ని వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణ రూపంలో సమకూర్చుకోనున్నారు. గత ఏడాది (2017-18లో) ప్రతిష్టాత్మకమైన ఈ డబుల్ బెడ్‌రూమ్ పథకానికి రూ.1,952.14 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల ప్రకారం రూ,1,898.39 కోట్లు ఖర్చు చేశారు.

బీసీ ఫెడరేషన్లకు నిధుల పెంపు

- రూ. 5920 కోట్లు కేటాయింపు - ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ. 1000 కోట్లు

- బడ్జెట్‌లో బీసీలకు పెద్ద పీటః జోగు రామన్న

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీలకు నిధుల కేటాయింపు పెరిగింది. గత ఏడాది కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో ఫెడరేషన్లకు అన్నింటికీ నిధులను కేటాయించారు. మార్జిన్‌మనీ, రాజీవ్ అభ్యుదయ యోజన పథకాల ద్వారా రుణాలు ఇవ్వడానికి రూ. 100 కోట్లు కేటాయించారు. వాటితోపాటు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు మరో రూ. 100 కోట్లను కేటాయించారు. ప్రత్యేకంగా ఎంబీసీల కోసం రూ. 1000 కోట్లు ఈ ఏడాది కూడా కొనసాగించారు. దీనికి తోడు సంచార ఫెడరేషన్‌కు రూ. 5 కోట్లు కేటాయించారు. బీసీలకు గతం కంటే బడ్జెట్‌లో నిధులను పెంచినప్పటికీ బీసీ సబ్‌ప్లాన్ గురించి బడ్జెట్‌లో ప్రకటించలేదు. బీసీ సబ్‌ప్లాన్‌కు నిధులను కేటాయించలేదు. దీంతో బీసీ సంఘాలు, కుల సంఘాలు కొన్ని బీసీలకు ప్రత్యేకంగా సబ్‌ప్లాన్ వస్తుందని ఆశించామని, కానీ బడ్జెట్ ప్రసంగంలో దాని ఊసేలేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో నిధులు గతం కంటే పెంచి బీసీలకు పెద్దపీట వేసిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు స్వర్ణయుగం వచ్చిందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు బీసీలకు పెన్నిధి అన్నారు. గత ఏడాది కంటే బీసీ బడ్జెట్ మూడింతలు పెరిగిందన్నారు. గత ఏడాదిలో రూ. 5070 కోట్లు ప్రతిపాదించగా ఈ ఏడాది దానిని కాస్త రూ. 850 కోట్లు పెంచి రూ. 5920 కోట్లతో బీసీ బడ్జెట్ పెట్టారని అన్నారు.

వివిధ ఫెడరేషన్లకు, కార్పొరేషన్‌కు కేటాయించిన నిధుల వివరాలు...

ఎంబీసీ కార్పొరేషన్ రూ. 1000 కోట్లు
చేనేత కార్మికులకు రూ. 1200 కోట్లు
నోమాడిక్, డినోటిఫైడ్ ట్రైబ్స్ రూ. 3 కోట్లు
తెలంగాణ స్టడీ సర్కిల్ రూ. 25 కోట్లు
బీసీ కార్పొరేషన్‌కు రూ. 100 కోట్లు
రుణాలకు రాజీవ్ అభ్యుదయ యోజనకు రూ. 50 కోట్లు
నాయిబ్రాహ్మణుల ఫెడరేషన్‌కు రూ. 250.51 కోట్లు
రజక ఫెడరేషన్‌కు రూ. 208.43 కోట్లు
కులాంతర వివాహాలు చేసుకునే వారికి
ఆర్థిక సాయం రూ. కోటి
వడ్డెర ఫెడరేషన్ రూ. 5.45 కోట్లు
కృష్ణబలిజ, పూసల ఫెడరేషన్ రూ. 5 కోట్లు
వాల్మీకి బోయ ఫెడరేషన్ రూ. 2.10 కోట్లు
బట్రాజ ఫెడరేషన్ రూ. 2 కోట్లు
మేదర ఫెడరేషన్ రూ. 3 కోట్లు
విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్ రూ. 10 కోట్లు
కుమ్మరి, శాలివాహన ఫెడరేషన్ రూ. 8 కోట్లు
గీత కార్మిక ఫెడరేషన్ రూ. 10 కోట్లు
సంచార జాతుల ఫెడరేషన్ రూ. 10 కోట్లు
సగర, ఉప్పర ఫెడరేషన్ రూ. 10 కోట్లు

దేవాదులకు నిధులివ్వండి

కేంద్ర మంత్రి హరీష్‌రావు వినతి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఏఐబీపీ పథకంలో భాగంగా దేవాదుల ప్రాజెక్టుకు రావాల్సిన నిధులు విడుదల చేయాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు కోరారు. గురువారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్న ఆయన, టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్‌తో కలిసి ఇద్దరు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. గడ్కరీతో జరిగిన సమావేశంలో దేవాదుల ప్రాజెక్టుకు రావాల్సిన నిధులపై చర్చించగా, అందుకాయన సానుకూలంగా స్పందించారని సమావేశం అనంతరం హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్రలోని విదర్భ నుంచి తెలంగాణలోని కాళేశ్వరం మీదుగా ప్రాణహిత, గోదావరి నదులపై రివర్ నావిగేషన్‌పై గడ్కరీతో చర్చించామని తెలిపారు. త్వరలోనే దీనిపై ఒక మీటింగ్ ఏర్పాటు చేస్తానని, రివర్ నావిగేషన్ కోసం ప్రాజెక్టు రిపోర్టును తయారుచేయాలని గడ్కరీ సూచించారని హరీశ్ రావు వెల్లడించారు. మరోవైపు మిషన్ కాకతీయలో భాగంగా రూ. 185 కోట్లతో 176 చెరువుల మరమ్మతు పనులకు ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర మంత్రికి అందజేశామని హరీశ్ తెలిపారు. తమ ప్రతిపాదనలను పరిశీలించి, వెంటనే నిధులు మంజూరు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారని తెలిపారు.



కేంద్ర మంత్రి నితిష్ గడ్కరితో మంత్రి హరీష్‌రావు

టార్గెట్ బీజేపీ



- యూపీ, బీహార్ ఉప ఎన్నికల ఫలితాలతో ప్రతిపక్షాల దూకుడు
- 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా వ్యూహాలు
- ఒక్కొక్కటిగా ఏకమౌతున్న విపక్ష పార్టీలు
- ఎన్సీపీతో కాంగ్రెస్ అధినేత కీలక భేటీ
- బీజేపీయేతర పార్టీలను ఏకం చేసే దిశగా చర్చలు
- త్వరలో ఇతర పార్టీల నేతలతో మంతనాలు

న్యూఢిల్లీ: ఉత్తర్ ప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికలు ప్రతిపక్షాల్లో కొత్త ఊపును నింపాయి. అదే ఊపుతో విపక్షపార్టీలన్నీ 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కూడా వ్యూహాలకు పదును పెంచింది. కలిసివచ్చే అన్ని పార్టీలకు స్నేహహస్తం అందిస్తూ..బీజేపీయేతర శక్తులను ఏకం చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇటీవల ఆయా రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ వ్యతిరేక పార్టీల విజయంతో వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి మహాకూటమి ఏర్పాటు దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బీజేపీ వ్యతిరేక పార్టీల నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరుపుతున్నారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ తో భేటీ అయిన రాహుల్ గాంధీ 2019 సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఓటించేందుకు అవసరమైన వ్యూహాలపై గంటపాటు సుధీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలని ఈ సమావేశంలో రాహుల్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. యూపీఏ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ ప్రతిపక్ష పార్టీలకు చెందిన 20 మంది నాయకులకు విందు ఏర్పాటు చేసిన మరుసటి రోజే రాహుల్ శరద్ పవార్ తో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణ ఎన్నికల నాటికి ప్రతిపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి బీజేపీ కూటమికి గట్టి షాక్ ఇవ్వాలని భావిస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ... తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతో కూడా సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఈనెల 28న శరద్ పవార్ ఏర్పాటు చేసే సంయుక్త ప్రతిపక్షాల సమావేశానికి ఆమె హాజరుకానున్న నేపథ్యంలో ముందుగానే రాహుల్ పవార్ తో సమావేశం కావడం ఆసక్తికరంగా మారింది. ఉత్తర్ ప్రదేశ్ సీఎం, డిప్యూటీ సీఎంలు రాజీనామాలతో ఖాళీ అయిన గోరఖ్ పూర్, ఫుల్పూర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీఎస్పీ మద్దతుతో సమాజ్ వాదీ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ ప్రతిపక్ష పార్టీలన్నీ బీజేపీ వ్యతిరేక కూటమిగా ఏర్పడి కమలనాథులకు షాక్ ఇవ్వాలని కాంగ్రెస్ అధినేత భావిస్తున్నారు.

కాన్షీరాంపై ప్రశంసల జల్లు

బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాంపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రశంసల జల్లు కురిపించారు. కాన్షీరాం జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కాన్షీరాం చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కిందిస్థాయి కులస్థులను కూడా క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావడం తో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కాన్షీరాంను సంఘ సంస్కర్తగా అభివర్ణించిన రాహుల్.. సమాజంలో మచ్చ లేని నాయకుడి గా పేరు తెచ్చుకున్నారని అన్నారు.



నితిశ్ రాజీనామాకు ఆర్జేడీ డిమాండ్

బీహార్ ఉప ఎన్నికల్లో ఆర్జేడీ విజయంతో ఆ పార్టీ నేతలు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. రాష్ట్రంలో నితీష్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూ పాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్నారనేందుకు ఉప ఎన్నికలే నిదర్శన మని ఆర్జేడీ ఆరోపించింది. బీజేపీ పొత్తుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నితీష్ వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని ఆర్జేడీ ఎమ్మెల్యేలు రాష్ట్ర అసెంబ్లీ ముందు ఆందోళనకు దిగారు. రెండు ఇంజిన్ల ప్రభుత్వాన్ని ప్రజలు వ్యతిరేకిసున్నారని ఉప ఎన్నికలతో తేలిపోయిందని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ అన్నారు.

అరారియాను ఆర్జేడీ ఉగ్రవాద స్థావరంగా మారుస్తోంది: కేంద్రమంత్రి



కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీహార్ లోని అరారియా లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఆర్జేడీ గెలుపుతో ఆర్జేడీ ఆ ప్రాంతాన్ని ఉగ్రవాదస్థా వరంగా మారుస్తుందని వ్యాఖ్యానించారు. ఆర్జేడీ నాయకుడు సర్ఫరాజ్ ఆలం అరారియాను ఉగ్రవాదులకు అడ్డాగా మారుస్తారని ఆరోపించారు. గిరిరాజ్ వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబడు తున్నాయి.. ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ స్పందిస్తూ... ఇలాంటి వ్యక్తి కేంద్ర మంత్రిగా ఉన్నారు.. దురదుష్టవ శాత్తు బీహార్, ఢిల్లీలో ఆయన తమ ప్రభుత్వం ఉందని అనుకుంటున్నారు. ఒకవేళ బీజేపీ నితీష్ నాయకత్వంపై నమ్మకం కోల్పోతే ఆయనకు మద్దతు ఉపసంహరించు కోవచ్చు అని వ్యాఖ్యానించారు.

2019 నాటికి బీజేపీ, కాంగ్రెస్ బలాబలాలు మారిపోతాయి: శివసేన



2019 నాటికి బీజేపీ,కాంగ్రెస్ బలాబలాలు ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికల్లో బీజేపీకి పరాభవం ఎదురైన నేపథ్యం లో శివసేన తనదైన శైలిలో స్పందించింది. ఉప ఎన్నికల ఫలితాలే 2019 సాధారణ ఎన్నికల్లో ప్రస్ఫుటించవచ్చని అధికార పత్రికసామ్నాలో వ్యాఖ్యానించింది. ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాల ముందు బీజేపీ నిలబడలేకపోయిందని.. 2019 నాటికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పార్లమెంటరీ బలాబలాలు తారుమారయ్యే అవకాశం ఉందని...

కగా డా మారి పోవచ్చ ని పేర్కొం ది. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మరింతగా శ్రమించి ప్రధాని నరేంద్ర మోడీని దీటుగా ఎదుర్కో వాలని సూచించింది. రెండు రాష్ట్రాల ఉప ఎన్నిక లు ప్రతిపక్ష పార్టీ లన్నింటికీ ఊపునిచ్చాయ ని శివసేన వ్యాఖ్యా నించింది.

గతం గతః అఖిలేష్



లక్నో: ఉత్తర్ ప్రదేశ్ ఉప ఎన్నికల్లో గోరఖ్ పూర్, ఫుల్పూర్ లోక్ సభ స్థానాలను బీఎస్పీ సహాయంతో కైవశం చేసుకుని బీజేపీకి గట్టి షాకిచ్చిన సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ బీఎస్పీ- ఎస్పీ మధ్య జరిగిన గత సంఘటనలను మరిచిపోదా మంటు న్నారు. గతం గతః అంటూ కాంగ్రెస్ పార్టీతోనే తమ బంధం అలాగే కొనసాగుతుందని చెప్పారు. సమాజ్ వాదీ పార్టీ అన్ని వర్గాల సంక్షేమం గురించి ఆలోచిస్తుంది కాబట్టి ఆయా పార్టీలు తమతో కలిసిపనిచేస్తున్నా యని చెప్పారు. ఎస్పీ- బీఎస్పీ ల మధ్య జరిగిన గత సంఘటనలను ప్రజలు గుర్తు చేస్తున్న ప్పటికీ ప్రస్తుత లక్ష్యాల దృష్ట్యా వాటన్నింటినీ మరచిపోవాలని సూచించారు. పలు ప్రాం తాల్లో ఈవీఎంల మొరాయిం చాయ ని.. ఈవీఎం సమస్యలు లేకుండా మెజారిటీ మరింత ఎక్కువ గా ఉండే దని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

కార్తికి సుప్రీంలో ఊరట



న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో కార్తి చిదంబరానికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. గురువారం సుప్రీంకోర్టు కార్తీ చిదంబరాన్ని ఈడీ అధికారులు తమ కస్టడీలోకి తీసుకోకుండా ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను మార్చి 26వరకూ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా దేశ అత్యున్నత న్యాయస్థానం కార్తీ చిదంబరం కేసును ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఈడీ అధికార పరిధిపై హైకోర్టుల్లో ఉన్న అస్పష్టతపై చర్చిస్తూ ఈడీ అధికార పరిధిపై స్పష్టతకు రావాలని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా మాట్లాడుతూఅరెస్టునుంచి హైకోర్టు రక్షణ కలిపించగలదనే అంశంపై , ఈడీ అధికారానికి సంబంధించి మనీ లాండరింగ్ చట్టం (పిఎంఎల్ఏ) సెక్షన్19 వివరణ గురించి సమాధానం ఇస్తామని అత్యున్నత న్యాయమూర్తి పేర్కొన్నారు.

టీటీవీ దినకరన్ కొత్త పార్టీ



మధురై: తమిళనాడులో అన్నాడీఎంకే తిరుగుబాటు నేత టీటీవీ దినకరన్ కొత్తపార్టీని స్థాపించారు. గురువారం ఆయన తన పార్టీ పేరు, జెండాను వెల్లడిచేశారు. దివంగత ముఖ్యమంత్రి జయలలిత పేరు స్ఫురించేలా అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం పార్టీని స్థాపించారు. ఈ సందర్భంగా భారీగా తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు, నేతల నడుమ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండాపైన నలుపురంగు, నడుమ తెలుపు, చివర ఎరుపు రంగు, జెండా మధ్యలో చిరునవ్వుతో ఉన్న జయలలిత చిత్రంతో కూడిన జెండాను అభిమానుల ఆనందోత్సహాల మధ్య ఆవిష్కరించారు. దినకరన్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గుర్తుగా ప్రెజర్ కుక్కర్‌ను ఎన్ని కల సంఘం కేటాయించేలా ఆదేశాలు జారీ చేయాలని ఢిల్లీ హైకోర్టును అభ్యర్థిం చామన్నారు. ప్రెజర్ కుక్కర్ ఎన్నికల గుర్తుతోనే జయలలిత మరణంతో జరిగిన ఆర్‌కే నగర్ ఉప ఎన్నికలో ఆయన భారీ మెజార్టీతో విజయం సాధించిన సంగతి విదితమే.

దేశ వ్యాప్తంగా 1,4976మంది ఐఏఎస్‌ల కొరత

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఐఏఎస్ అధికారులకొరత ఉందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. అధీకృత ఇండి యన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) అధికారుల సంఖ్య 6,500 ఉండగా దేశవ్యా ప్తంగా జనవరి 1, 2017నాటికి 5,004 మంది ఐఏఎస్ అధికారులు మాత్రమే ఉన్నారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభలో వెల్లడించారు. దేశంలో సుమారు 1,496 మంది ఐఏఎస్‌ల కొరత నెలకొందన్నారు. ఐఏఎస్‌ల ఖాళీలు ఏర్ప డటం, ఖాళీ స్థానా లు భర్తీ చేయటం నిరంతర ప్రక్రియగా జరగుతోందన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం 2012 నుంచి సివిల్ సర్వీస్ పరీక్షల ద్వారా ప్రతీ సంవత్సరం 180మంది కొత్త ఐఏఎస్‌లను ఎంపిక చేస్తుందన్నారు. ఈ ఏడాది కూడా 180మంది కొత్త ఐఏఎస్‌లను ఎంపిక చేస్తామని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ అన్నారు.

మడ్‌గాస్కర్‌లో వ్యవసాయానికి భారత్ సాయం

మడ్గాస్కర్: రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ మడ్గాస్కర్ పర్యటన సందర్భంగా ఆదేశంలో వ్యవసాయానికి 80.7 మిలియన్ డాలర్ల సాయాన్నిప్రకటించా రు.వ్యవసాయ రంగంలో యంత్రీకరణలనుప్రవేశపెట్టాలని సూచించారు. రాష్ట్రపతికి మడ్గాస్కర్‌లో అత్యున్నతమైన పౌర పురస్కారాన్ని ఆ దేశ అధ్యక్షుడు ప్రదానం చేశారు.హిందూమహాసముద్రంలో ద్వీపమైన ఆ దేశం భద్రతకు తీర రక్షణ దళాన్ని మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరాన్ని రాష్ట్రపతి గుర్తు చేశారు.అంతకముందు,ఆయన భారత్ మడ్గాస్కర్ వాణిజ్య ప్రతినిధులతో ఇష్టాగోష్టి జరిపారు

తీవ్రస్థాయిలో తెరాస నిరసన

- జై తెలంగాణా, జై ఆంధ్ర, జై తమిళనాడు నినాదం అందుకున్న కవిత
- ఇరుగు పొరుగు రాష్ట్రాల ఎంపీలతో కలిసి ఆందోళన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తొమ్మిదో రోజు తెరాస తీవ్ర స్థాయిలో నిరసన తెలిపింది. ఒకే దేశం - ఒకే నీతి ఉండాలంటూ, రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలంటూ ఆ పార్టీ ఎంపీలు చేపట్టిన ఆందోళనను ఉధృతం చేశారు. గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ధర్నా చేపట్టకుండా లోక్‌సభలో నిరసన తెలిపారు. ఎంపీ కవిత సహ సభ్యులతో కలిసి జై తెలంగాణా, జై ఆంధ్ర, జై తమిళనాడు అంటూ నినాదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అనంతరం భువనగిరి పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ పాత్రికేయులతో మాట్లాడుతూ... రాజకీయాం శాలతో ముడి పెట్టకుండా రిజర్వేషన్‌లపై కేంద్రం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల అంశం అన్ని రాష్ట్రాల సమస్య : ఎంపీ బూర

తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్న రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో ఎంపీలందరం వెల్‌లోకి వెళ్లి నిరసన తెలిపాము. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశాము. పరిష్కారం దిశగా పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతున్నాం. రాజకీయ అంశాలతో ముడి పెట్టకుండా రిజర్వేషన్‌లపై కేంద్రం వెంటనే స్పందించాలి. కేంద్రం మొండి వైఖరితో ఉంది. మా డిమాండ్‌కు అన్ని రాజకీయ పార్టీలు కూడా మద్దతు తెలుపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఉన్న రిజర్వేషన్లకే ఎసరు పెట్టింది. కేంద్రం రిజర్వేషన్లకు వెన్నుపోటు పొడుస్తోంది. వైఎస్సార్‌సీపీ ఎంపీలు పార్లమెంట్‌లో పెడుతున్న అవిశ్వాస తీర్మానం కోసం టీఆరెస్ ఎంపీలను సంప్రదించలేదు. తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చేలా ఉంది. విద్య, వైద్య, రైతు, హైటెక్ అన్నివర్గాల వారికి బడ్జెట్ ఆశాజనకంగా ఉంది. పల్లెలకు, పట్టణాలకు సమానంగా బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. తెలంగాణాను అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. విద్యుత్ ఇవ్వడంలో తెలంగాణా మొదటి స్థానంలో నిలిచింది. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది.

పీఎన్బీలో మరో రూ.9కోట్ల మోసం

న్యూఢిల్లీ: పీఎన్బీ కుంభకోణ పరంపరలో తాజాగా సీబీఐ మరో రూ.9.కోట్ల మోసాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. ఏ బ్రాంచ్‌లో నీరవ్ మోదీ, చోక్సీ కుంభకోణానికి పాల్పడ్డారో అదే పీఎన్బీ బ్రాంచ్‌లో తాజా మోసం వెలుగు చూడటం ప్రాధాన్యం సంతరించుకుంది. చాంద్రీ పేపర్, అల్లయిడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కొందరు అధికారులు ఈ బ్రాంచ్‌లో రూ.9కోట్ల మోసపూరిత లావాదేవీలకు పాల్పడ్డారని ఆరోపణలు రావటంతో సీబీఐ కేసు నమోదు చేసింది. రిటైర్డ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) ఉద్యోగి గోకుల్‌నాథ్ షెట్టీ, అదేశాఖలో సింగిల్‌విండో ఆపరేటర్ మనోజ్ కారత్ వీరిద్దరిపై సిబీఐ నీరవ్‌మోదీ, చోక్సీ కేసులో దర్యాప్తు చేస్తుండగా తాజాగా వీరిపై రూ.9కోట్ల కేసువిషయంపై మరో కేసు సీబీఐ నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేసింది. ఈ నెల 9న వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ అధికారులు అనంతరం పలుప్రాంతాల్లో తనిఖీలు చేసినట్టు అధికారులు వెల్లడించారు. షెట్టీ మే31, 2017న పదవీ విరమణ పొందారన్నారు. కారత్ కుట్రలో భాగస్వామిగా మారినతరువాత షెట్టీ కూడా పాలుపంచుకున్నారని సీబీఐ అధికారులు ఆరోపించారు.అక్రమంగా రెండు లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌లు తీసుకుని బెల్జియంలోని భారతీయ బ్యాంకుల నుంచి 1.4 మిలియన్ల అమెరికన్ డాలర్లు (0.09 కోట్ల రూపాయలు) పొందినట్టు సీబీఐ ఆరోపించింది. కాగా షెట్టీ, కారత్ ఇంతకుముందే ఇదే తరహాలో జరిగిన 13,000కోట్ల కుంభకోణం కేసులో సీబీఐ విచారణ ఎదుర్కొంటున్నారు.

బ్యాంకు కుంభకోణాలపై పార్లమెంటులో చర్చించాలి



న్యూఢిల్లీ: పార్లమెంటులో చర్చించాలని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు అన్నారు. భారీ కుంభకోణాలపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే పర్యవసానంగా దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుందని, అంతేకాక మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థపైనే ప్రజలకు సందేహం కలుగుతుందని గురువారం ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు మార్చి5న ప్రారంభమైన తరువాత పలు అంశాలపై ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటును ప్రతిష్టింభింపచేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) కుంభకోణంపై కూడా ఈ సమావేశాల్లో చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయన్నారు. రియల్ ఎస్టేట్ సమాఖ్య క్రెడాయ్ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యసభ అధ్యక్షుడి హోదాలో పీఎన్బీ తదితర కుంభకోణాలపై రాజ్యసభలో చర్చించేందుకు అనుమతించేందుకు అంగీకరిద్దామనుకున్నా దురదృష్టవశాత్తూ చర్చ జరగలేదన్నారు. సభ్యులు చర్చించాలని కోరుకున్నారు, ప్రభుత్వం చర్చించాలని కోరుకుంది, ఛైర్మన్ చర్చించాలని కోరుకున్నారు ఇలా అందరూ ఆర్థిక కుట్రలపై చర్చను స్వాగతించినా చర్చమాత్రం పార్లమెంటులో జరగకపోవటం శోచనీయం అన్నారు. నీరవ్ మోదీ, చోక్సీ, విజయ్‌మాల్యా ఇలా ఆర్థిక కుట్రకు పాల్పడుతున్నవారు ఇద్దరు లేదా ముగ్గురే ఉంటున్నారు అయితే వీరి చర్యల వల్ల మొత్తం దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుంది, అదేవిధంగా బ్యాంకింగ్ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. ప్రజలు తాజాగా బ్యాంకింగ్ విధానాన్నే ప్రశ్నిస్తున్నారన్నారు. విధానపరమైన లోపమా, లేక కుట్రా ఒకవేళ అవే నిజమైతే ఎందుకు దిద్దుబాటు చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఎవరి పాలనలో కుంభకోణం జరిగిందనే విషయానికి ప్రాధాన్యం ఇవ్వటం వల్ల ఉపయోగం లేదన్నారు. ఇకముందైనా పార్లమెంటులో ఫలప్రదమైన, నిర్మాణాత్మక చర్చ జరుగుతుందని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

సంతోషంలో భారత్‌ను మించిన పాక్!

ఇండియాకు 133వ ర్యాంకు..పాక్‌కు 75వ ర్యాంకు

న్యూఢిల్లీ: ఒకప్పుడు సంతోషానికి చిరునామాగా భారతదేశం వుండేది. ప్రపంచదేశాల చూపు భారత్ వైపే వుండేది. అందమైన కాశ్మీరం...ఉల్లాసాన్ని, హాయినిచ్చే హిమాలయాలు..తాజ్‌మహల్ లాంటి చారిత్రక కట్టడాలకు పుట్టినిల్లైన భారతావనిని ఎప్పుడెప్పుడు సందర్శిద్దామాని పర్యాటకులు ఉవ్విళ్ళూరుతుంటారు. అలాంటి అందమైన ఆనందాలకు నిలయమైన భారతదేశం క్రమ క్రమేణ తన స్థానాన్ని దిగజార్చుకుంటూ సంతోషజీవనాన్ని కోల్పోతుందనడానికి... ఐక్యరాజ్య సమితి బుధవారం విడుదల చేసిన సంతోషకర దేశాల జాబితాయే నిదర్శనం. ఈ జాబితా ప్రకారం భారత్ 133 వ ర్యాంకు, మన పొరుగు దేశమైన పాకిస్థాన్ 75 వ ర్యాంకు సాధించాయి. అన్నింటికన్న సంతోషకరమైన దేశంగా ఫిన్‌ల్యాండ్ నిలవగా, సంతోషంలో అట్టడుగున వున్న దేశంగా బురిండీ నిలిచాయి. మొత్తం 156 దేశాలను పరిశీలించి ఐరాస విడుదల చేసిన వరల్డ్ హ్యాపినెస్ ఇండెక్స్-2018 ప్రకారం మన పొరుగున వున్న సార్క్ దేశాలైన పాక్, నేపాల్(101ర్యాంకు), భూటాన్(97), శ్రీలంక(116), బంగ్లాదేశ్(115) ర్యాంకులను కైవసం చేసుకోవడం ఆసియా దేశాలను విస్మయానికి గురిచేసింది. ఇటవల అంతర్గత కలహాలతో అట్టుడికిన మయన్మార్ మనకన్నా మూడు స్థానాలు ముందుగా 130 వ ర్యాంకు సాధించడం మరీ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. సంతోషానికి కొలమానంగా ఐక్యరాజ్య సమితి కొన్ని ప్రమాణాలను ప్రాతిపదికా తీసుకున్నది. వాటిలో ఆరు అంశాలు ముఖ్యమైనవి. దేశ తలసరి ఆదాయం (జిడిపి), సాంఘిక మద్దతు, సాంఘిక స్వేచ్ఛ, ఆరోగ్యకర జీవనం, దాతృత్వం మరియూ అవినీతి రహితంగా వుండడం వంటి అంశాల ప్రాతిపదికగా సంతోషకర దేశాల ర్యాంకులను నిర్ణయించారు.

కార్యకర్తలపైనే దృష్టి

- రాజకీయ, ఆర్థిక, విదేశీ సంబంధాలపై వేర్వేరు తీర్మానాలు
- వ్యవసాయం, నిరుద్యోగం, పేదరిక నిర్మూలనపై మరో తీర్మానం
- నేడు స్టీరింగ్ కమిటీ సమావేశం
- ప్లీనరీ సమావేశాలకు భారీ సన్నాహాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రాహుల్ గాంధీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలు నేడు ప్రారం భం కానున్నాయి. ప్రతిసారీ జరిగే ప్లీనరీకి భిన్నంగా ఈసారి కార్యకర్తలపైనే దృష్టి కేంద్రీకరించనుంది. వరుసగా 3 రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాల్లో తొలి రోజు వ్యూహాలపై పార్టీ సీనియర్ల మేథోమథనం జరగనుంది. ప్లీనరీలో భాగంగా 4 కీలక తీర్మానాలను ఆమోదించనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తాజా రాజకీయ పరిస్థితులపై ఒక తీర్మానంతో పాటు ఆర్థిక, విదేశీ వ్యవహారాలపై విడివిడిగా తీర్మానాలను పార్టీ ఆమోదించనుందని తెలుస్తోంది. వీటితో పాటు వ్యవసాయం, నిరుద్యోగం, పేదరిక నిర్మూల నపై కూడా కాంగ్రెస్ పార్టీ తీర్మానం ప్రవేశపెట్ట నుంది. ఆయా అంశాల్లో కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రస్తావించడంతో, ప్రస్తుత స్థితిగతులను లోతుగా విశ్లేషించనుంది.ప్లీనరీలో భాగంగా నేటి సాయంత్రం కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణాయకమండలిస్టీరింగ్ కమిటీ సమావేశం కానుంది. ఈ కమిటీ సమావేశంలో పార్టీ ప్రవేశపెట్టబోయే తీర్మానాలకు తుది రూపునిచ్చే అవకాశం ఉంది. శనివారం ఉదయం పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రసంగంతో ప్లీనరీ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. రెండ్రోజుల పాటు జరిగే మేథోమథనంలో తొలి రోజు రెండు తీర్మానాలు, రెండో రోజు మరో రెండు తీర్మానాలపై చర్చించి ఆమోదించే అవకాశం ఉంది. ప్లీనరీ ముగింపు కూడా పార్టీ అధ్యక్షుడి ప్రసంగంతోనే జరగనుంది. అయితే ప్రారంభోపన్యాసం కంటే ముగింపు ఉపన్యాసంలోనే పార్టీ వ్యూహాలను, ప్రాథమ్యాలను రాహుల్ గాంధీ వివరించనున్నారని తెలుస్తోంది. రాజకీయ తీర్మానం సందర్భంగా జరిగే చర్చలోనే పొత్తులు, కూటముల గురించి నేతలు చర్చించనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు విస్తరించిన భారతీయ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు భావసారూప్యత కల్గిన అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఒక మహా కూటమిని ఏర్పాటు చేయాల్సిన అవసరంపైనా ఈ ప్లీనరీలో చర్చించనున్నారు.

కాంగ్రెస్ పార్టీ స్టీరింగ్ కమిటీ కాల పరిమితి ప్లీనరీ సమావేశాల నిర్వహణ వరకే ఉన్నందున, పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని పునర్మించనున్నారు. అయితే ఈ సమావేశాల్లోనే కొత్త కమిటీని ఏర్పాటు చేస్తారా లేక, సమావేశాల అనంతరం ఏర్పాటు చేస్తారా అన్న విషయంపై మాత్రం పార్టీ వర్గాల్లో స్పష్టత లేదు. ఏదేమైనా కొత్త అధ్యక్షుడు రాహుల్ గాంధీ తనదైన బృందాన్ని తయారు చేసుకుంటున్నట్టు సమాచారం. కొన్ని దశాబ్దాలుగా పార్టీ అగ్ర నాయకత్వంలో పాతుకుపోయిన పాత తరం వృద్ధ నేతలకు ఇందులో చోటు కల్పిస్తారా లేదా అన్న విషయం ఆసక్తి రేపుతోంది.

పార్లమెంటులో ప్రతిష్టంభన

- తొమ్మిదో రోజు పార్లమెంట్ సమావేశాలు వాయిదా
- విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- లోక్‌సభలో అశోక్‌గజపతి రాజు ప్రసంగం
- రాజ్యసభలో సుజానాచౌదరి ప్రసంగం, అడ్డుపడ్డ కేవీపీ, జైరాం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విపక్షాలు, మిత్రపక్షాల ఆందోళనలతో వరుసగా తొమ్మిదోరోజు పార్లమెంటు సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయి. వివిధ అంశాలపై జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎంపీలు నినాదాలతో హోరెత్తించడతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. గురువారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే విపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, అన్నాడిఎంకె, టిఆర్ఎస్ టిడిపి ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చించాలని వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపాయి. రిజర్వేషన్ల కోటా పెంచాలని టిఆర్ఎస్, ఏపి విభజన చట్టం హామీలు అమలు చేయాలని టిడిపి, ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్సిపి, కావేరి నదీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. సభ కార్యకలాపాలు సాగేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పదే పదే విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు పట్టించుకోకపోవడంతో సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత, స్పీకర్ సుమిత్రా మహాజన్ మంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్‌గజపతి రాజుకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ విభజన అశాస్త్రీయంగా జరిగిందని, దాని వల్ల అవశేష ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతులు, వనరులు, సంస్థలు లేకుండాపోయాయని వాపోయారు. కరువు, వరదలతో రాష్ట్రం ఇక్కట్లు ఎదుర్కొంటోందన్నారు. ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా విభజన జరిగిందన్నారు. అయితే నాటి ప్రతిపక్షంలోని పార్టీ కొన్ని హామీలను పొంది, భవిష్యత్‌పై ఆశలు రేపిందన్నారు. వ్యవసాయాధార రాష్ట్రంగా మారిన ఏపీ వృద్ధిరేటులో జాతీయస్థాయిని మించిపోయిందన్నారు. రాజధాని నిర్మాణానికి రైతులు ఉదారంగా తమ భూమి ఇచ్చారని చెప్పారు. పార్లమెంటు లో ఇచ్చిన హామీలు అమలుకాక పోవడం పై రైతులు, ప్రజలు తీవ్ర నిరాశతో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా జాతీయస్థాయిలో కూటమి నిర్మించిన చరిత్ర తమ పార్టీది, ఎన్టీఆర్‌ది అని చెప్పారు. వివిధ రాజకీయ పక్షా లను ఏకతాటిపైకి తీసుకురావడం మామూలు విషయం కాదన్నారు. విభజన సమయంలో చెప్పిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంత రం సభలో కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి పిపి.చౌదరి స్పెసిఫిక్ రిలీఫ్ చట్ట సవరణ బిల్లును ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. సభలో గందరగోళం మధ్యనే బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు.ఇటు రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళన హోరెత్తించాయి. సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్‌కాంగ్రెస్, అన్నాడిఎంకె, టిఆర్ ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. మంత్రి పదవికి రాజీనామా చేసిన టీడీపీ ఎంపీ సుజనా చౌదరికి రూల్ 241 కింద సభలో మాట్లాడే అవకాశం కల్పించారు. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలని డిమామడ్ చేశారు. ప్రజల సెంటిమెంట్‌ను గుర్తించాలని, ఆర్థికపరమైన సమస్యలను గుర్తించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో అవశేష ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందన్నారు. 2014 ఫిబ్రవరిలో భయానక విభజన చేశారని అన్నారు.

క్రీడాప్రభ



ముదిరిన ముసలం

• ఆఫీస్ బేరర్ల అధికారాలకు ఎసరు • ఆటగాళ్ల జీతాలు తెచ్చిన తంటా

న్యూఢిల్లీ: బీసీసీఐలో రాను రాను సమస్యలు మరింత జటిలమవుతూ వస్తున్నాయి. బీసీసీఐని సక్రమంగా నడిపించేందుకు సుప్రీంకోర్టు ఓ కమిటీని నియమిస్తే... ఆ కమిటీకి, ఆఫీస్ బేరర్లకు పొసగకపోవడం వల్ల కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. తాజాగా సీఓఏ(కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్) ఆఫీస్ బేరర్ల అధికారాలను లాగేసుకోవడం సమస్యలకు కొనసాగింపు. వినోద్ రాయ్ నేతృత్వంలో కొనసాగుతున్న కమిటీ.. బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారుల అధికారాలను సస్పెండ్ చేస్తూ 12 పాయింట్లతో కూడిన ఆర్డర్ జారీ చేసింది. నిర్ణీతకాలం కంటే ఎక్కువగా ఆఫీసులో కొనసాగుతున్నారనే కారణంగా ఆఫీస్ బేరర్లను తొలగించాలని ఇప్పటికే సుప్రీంకోర్టును కోరిన సీఓఏ.. ఆ విషయం ఓ కొలిక్కి రాకముందే ఆఫీస్ బేరర్లకు ఎటువంటి నిర్ణయాలూ తీసుకునే హక్కు లేదంటూ కమిటీ ఆదేశాలిచ్చింది. సీఓఏ నిర్ణయాలతో బోర్డు అధికారులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోనున్నారు. బీసీసీఐ డబ్బులతో విమాన ప్రయాణాలు చెయ్యడం లాంటివి బంద్ కానున్నాయి. కనీసం లోధా ప్యానెల్‌కు సంబంధించి సుప్రీం కోర్టులో ఉన్న కేసుల ఖర్చులు భరించేందుకు కూడా బీసీసీఐ డబ్బులు వాడుకోలేని పరిస్థితి ఏర్పడింది.

అసలు సమస్య అక్కడే వచ్చింది

వారం కిందట ఆటగాళ్ల కొత్త కాంట్రాక్టు లెక్కలు విడుదల చేసింది బీసీసీఐ. ఏప్లస్ ఆటగాళ్లకు 7 కోట్ల దాకా పెంచింది సీఓఏ. అయితే ఈ నిర్ణయాలన్నీ ఏకపక్ష నిర్ణయాలనీ, వాటిని అంగీకరించబోయేది లేదంటూ ఆఫీస్ బేరర్లు మొండికేసుక్కూర్చున్నారు. ఇవన్నీ నచ్చని వినోద్ రాయ్ ఇప్పటికే పదవీకాలం ముగిసిపోయిన వాళ్ల పెత్తనం ఏంటంటూ వారి అధికారాలకే ఎసరు పెట్టారు.

ఈ విషయమై స్పందించిన బీసీసీఐ సెక్రటరీ అమితాబ్ చౌదరి "అసలు జీతాలు పెంచే అంశంలో మమ్మల్ని కనీసం సంప్రదించారా? అసలు కమిటీ అభిప్రాయం ఏంటో అర్థం కావడం లేదు. వాళ్లు చెప్పిన చోటల్లా సంతకాలు చేయడమే మా పని అనుకుంటున్నారా? కనీసం ఆ ఫైలును చదవాలా, లేదా" అని ప్రశ్నించారు.

క్వార్టర్ ఫైనల్స్‌కు సింధు



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఒలింపిక్ పతక విజేత పి వి సింధు క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. గురువారం జరిగిన సింగిల్స్ మ్యాచ్‌లో సింధు(ప్రపంచ ర్యాంక్ 3) థాయ్‌లాండ్‌కు చెందిన నిట్చోవన్ జిందా పోల్‌ను(ప్రపంచ ర్యాంక్ 11) 21-13, 13-21, 21-18 తేడాతో ఓడించింది. జిందాపోల్‌ను ఓడించడానికి సింధు చెమటోడ్చాల్సి వచ్చింది. బుధవారం రాత్రి జరిగిన పురుషుల సింగిల్స్‌లో హెచ్ ఎస్ ప్రణయ్ (ప్రపంచ ర్యాంక్ 16) ఎనిమిదో సీడెడ్ తైవాన్ షట్లర్ చో టెయిన్‌ను 9-21,21-18, 21-18 తేడాతో ఓడించి రెండో రౌండ్లోకి ప్రవేశించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రీ చోప్రా, ఎన్ సిక్కిరెడ్డి జంట జర్మనీకి చెందిన మార్విన్ ఎమిల్ సీడెల్, లిండా ఎఫ్లర్‌లను 21-19, 21-13 తేడాతో ఓడించి రెండో రౌండ్లోకి ప్రవేశించింది.

షమి ఎదురుదాడి

న్యూఢిల్లీ: ఇప్పటివరకూ భార్య హసీన్‌తో రాజీ ప్రయత్నాలు చేసిన షమి.. లాభం లేదనుకున్నాడో ఏమో ఎదురుదాడి మొదలుపెట్టాడు. హసీన్‌కు గతంలోనే పెళ్లయిందనీ, ఆ విషయం దాచిపెట్టితనను మోసం చేసిందనీ.. మొదటి వివాహం ద్వారా కలిగిన సంతానాన్ని తన అక్క పిల్లలుగా పరిచయం చేసిందనీ తెలిపాడు. హసీన్‌కు 2002లో బెంగాల్‌కు చెందిన సైఫుద్దీన్ అనే వ్యక్తితో పెళ్లయిందనీ, వారిద్దరికీ కలిగిన ఇద్దరు ఆడపిల్లలు అతని వద్దే వున్నట్టూ తెలుస్తోంది. మరోవైపు ఎలక్ట్రానిక్ మీడియా హసీన్ మొదటి భర్తను పలకరించగా.. షమి, హసీన్ ల మధ్య విభేదాలు సమసిపోవాలని అతను ఆకాంక్షించాడు. హసీన్ ఆరోపణల కారణంగా తన వ్యక్తిగతంగానే గాక వృత్తిపరంగానూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని షమి వాపోయాడు. హసీన ఆరోపణలతో బీసీసీఐతో కాంట్రాక్టుకోల్పో వడంతో పాటూ ఐపీఎల్ ఆడటం కూడా ప్రశ్నార్థకం అయింది. ఇక మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు అదనం.

ఆసియన్ క్రాస్ కంట్రీ రేసులో సంజీవనికి కాంస్యం

గుయ్ యాంగ్(చైనా): భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ సంజీవని జాదవ్ 14వ ఆసియన్ క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ రేసులో భారత్‌కు కాంస్యం సంపాదించి పెట్టింది. గురువారం జరిగిన 8 కిలోమీటర్ల క్రాస్ కంట్రీ రేసులో సంజీవని మూడో స్థానంలో నిలిచి కాంస్యంను గెలుచుకోగా, టీం ఈవెంట్‌లో భారత్ మరో కాంస్యాన్ని గెలుచుకుంది. 20 ఏళ్ల సంజీవని 8 కిలోమీటర్ల దూరాన్ని పరెగెత్తడానికి 28 నిమిషాల 19 సెకండ్లను తీసుకోగా, స్వర్ణ పతకాన్ని గెలిచిన చైనా జట్టు రన్నర్ లి డాన్ 28.03 నిమిషాల్లో రేస్‌ను పూర్తి చేయగా, జపాన్ రన్నర్ అబే యుకిరి 28.06 నిమిషాల్లో పరుగెత్తి రజత పతకాన్ని సాధించింది. భారత్ టీంలో సంజీవనితోపాటు, స్వాతి గాధ్వె, జుమా ఖాటున్, లలిత బాబార్‌లు కూడా కాంస్యాలను గెలుపొందారు. వ్యక్తిగత పరుగులో గాధ్వె 30.18 నిమిషాల్లో పూర్తి చేసి 11వ స్థానంలో నిలవగా, ఖుటన్ 32.14 నిమిషాల్లో రేస్‌ను పూర్తి చేసి 14వ స్థానంలో నిలిచింది. లలితా 32.53 నిమిషాల్లో పూర్తి చేసి 15వ స్థానంలో నిలిచింది.

ఫైనల్‌కు ఎవరో?

భారత్ ఇప్పటికే ఫైనల్‌కు చేరిపోయింది. ఇంకో ఫైనలిస్టు ఎవరా అన్నది నేడు జరిగే బంగ్లాదేశ్, శ్రీలంకల మ్యాచ్‌తో తేలిపోనుంది. ఇక్కడ డక్‌వర్త్ లూయిస్ లాంటి అర్థం ఫార్ములాలు లేవు. ఎవరు గెలిస్తే వారే ఫైనల్లో వుంటారు. పొరపాటున వర్షం లేదా ఇతర కారణాల వల్ల మ్యాచ్ రద్దయితే మాత్రం నెట్ రన్ రేట్ ఎక్కువగా వున్న శ్రీలంకకు లాభదాయకం అవుతుంది.


షకిబుల్ హసన్

టైటిల్ ఫేవరేట్ భారత్‌పై విజయంతో సిరీస్‌ను ఘనంగా ఆరంభించిన ఆతిథ్య శ్రీలంక జట్టు ఫైనల్‌లో స్థానం కోసం ఆఖరి మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతాయంటే ఇదే కాబోలు. అంతేనా కర్ణుడి చావుకి వంద కారణాలు అన్నట్టు శ్రీలంకను మరిన్ని కష్టాలు వెంటాడుతున్నాయి. మరోవైపు బంగ్లాదేశ్ భారత్‌తో ఓడిన రెండు మ్యాచుల్లోనూ స్వయంకృతాపరాధాల కారణంగానే ఓడడం ఆ జట్టు సాంకేతికంగా బలంగా వుందనే విషయాన్ని చెప్పకనే చెపుతోంది. శ్రీలంకపై భారీ లక్ష్యాన్ని ఛేదించి విజయం సాధించడం దాన్ని మరింత బలపరుస్తోంది.

చండిమాల్ గయా-షకిబుల్ ఆగయా

స్లో ఓవర్ రేట్ కారణంగా లంక జట్టు కెప్టెన్ చండిమాల్ దూరమవడం ఆ జట్టును ఇబ్బంది పెట్టే విషయం. మరోవైపు సిరీస్‌లో ఇప్పటివరకూ బంగ్లాదేశ్ జట్టుకు అందుబాటులో లేని రెగ్యులర్ కెప్టెన్ షకిబుల్ హసన్ నేటి మ్యాచ్‌లో తిరిగి ఆడనుండడం ఆ జట్టుకు లాభించే విషయం. షకిబుల్ రాకతో అన్ని విభాగాల్లోనూ బంగ్లా బలం పెరగనుంది. ముఖ్యంగా ఆ జట్టు బౌలింగ్ సామర్థ్యం ఎంతో కొంత పెరగనుంది. షకిబుల్ రాకతో మహ్మదుల్లా మీద అనవసర ఒత్తిడి తగ్గి అతడు రాణించేందుకు అవకాశం కూడా వుంది. ఇప్పటి వరకూ సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపని మహ్మదుల్లానుంచి నేటి మ్యాచ్‌లో చక్కటి ఇన్నింగ్స్‌నుంచి ఆ జట్టు ఆశిస్తోంది.

బ్యాటింగ్‌లో ఇబ్బందులు లేవు

టీ20ల్లో ఆడాల్సిన ఓవర్లు పెద్దగా వుండవు కాబోలు రెండు జట్ల బ్యాటింగ్‌లోనూ పెద్దగా లోపాలు కనిపించడం లేదు. ఏ ఒక్క బ్యాట్స్‌మన్ క్రీజులో కాసేపు కుదురుకున్నా కావలసినన్ని పరుగులు చేయొచ్చు. బంగ్లా, శ్రీలంక జట్లు అదే ఫార్ములాను కొనసాగిస్తున్నాయి. ఓపెనర్లు బంతిని బలంగా బాదేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆరంభంలో వేగంగా పరుగులు చేయడం ద్వారా ఒకవేళ వాళ్లు తొందరగా ఔటైనా తర్వాత బ్యాట్స్‌మన్ ఒత్తిడి లేకుండా ఆడేందుకు ప్రయత్నిస్తున్నారు. దాంతో పోరాడేందుకు కావలసిన స్కోరు అయితే చేయగలుగుతున్నారు. బ్యాట్స్‌మన్‌ని ఇబ్బందిపెట్టే పిచ్‌లు కూడా లేకపోవడంతో బ్యాటింగ్ వరకూ రెండు జట్లూ మామూలుగా కంటే బలంగా కనిపిస్తున్నాయి.

కుశాల్ మెండిస్ రూపంలో శ్రీలంకకు, ముష్ఫికర్ రూపంలో బంగ్లాదేశ్‌కూ ప్రతి మ్యాచ్‌లోనూ ఓ పది ఓవర్ల పాటూ నిలదొక్కుకుంటుండడం వల్లనే సిరీస్‌లో ఎవరు ఎవరి మీదైనా గెలిచేందుకు అవకాశం దక్కింది. అదే నేటి మ్యాచ్ ఫలితాన్ని అంచనా వేయడాన్ని మరింత కష్టతరం చేస్తుంది.

సాంకేతికంగా బంగ్లాదేశ్ ఆతిథ్య జట్టు కంటే ఒక మెట్టు పైనే వుంటుంది అని చెప్పాలి. బ్యాటింగ్, బౌలింగ్, అనుభవం, కొత్తగా నిరూపించుకోవాల్సిన అవసరం లేకపోవడం, ఇప్పటికే లంకపై భారీ స్కోరు ఛేదించి మరీ గెలవడం.. ఇలా అన్నీ చూసుకుంటే బంగ్లాదేశ్‌కే మార్కులు ఎక్కువ పడతాయి.

DSPORT

సాయంత్రం 7 గంటలకు ప్రత్యక్ష ప్రసారం డీ స్పోర్ట్ జియో టీవీలో

జట్ల వివరాలు..

శ్రీలంక: తిసార పెరీరా(కె), సురంగ లక్మల్, ఉపుల్ తరంగ, దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, దసున్ శనక, కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, జీవన్ మెండిస్, ఇసురు ఉదాన, అకిల దనంజయ, అమిల అపోంసో, నువాన్ ప్రదీప్, చమీరా, ధనంజయ డిసిల్వా

బంగ్లాదేశ్ : మహ్మదుల్లా(కె), తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ఇమ్రుల్ కేస్, ముష్ఫికర్ రహీమ్, సబ్బీర్ రహ్మాన్, ముస్తఫిజుర్ రహ్మాన్, రూబెల్ హుసేన్, తస్కిన్ అహ్మద్, అబు హైదర్, అబు జాయద్, ఆరిఫుల్ హక్, నజ్మల్ ఇస్లామ్, నూరుల్ హసన్, మెహిదీ హసన్, లిటన్ దాస్

బౌలింగ్‌లో నిలకడ లేదు


వాల్ష్

బంగ్లా బౌలర్లలో నిలకడ లోపించిందని ఆ జట్టు బౌలింగ్ కోచ్ వాల్ష్‌వ్యాఖ్యానించాడు. బౌలర్లు అనుకున్న విధంగా బంతులేయలేకపోతు న్నారు. దానర్థం వాళ్లు రాత్రికిరాత్రి చెత్త బౌలర్లు అయిపోయారని కాదు అని వాల్ష్ అన్నాడు. బంగ్లాదేశ్ తమ ట్రంప్ కార్డ్‌గా భావించిన ముస్తాఫిజుర్ ధారాలంగా పరుగులిస్తుండడంతో ఆ జట్టు బాగా ఇబ్బంది పడుతోంది. ఉన్నంతలో రూబెల్ హుసేన్ పర్వాలేదనిపిస్తున్నాడు. బౌలర్లు అనుకున్నంత వేగంగా మెరుగవ్వలేకపోవడం లేదన వాల్ష్ ఆందోళన వ్యక్తం చేశాడు.

ఇండియన్ వెల్స్‌లో సెమీస్‌కు హలెప్



ఇండియన్ వెల్స్(యునైటెడ్ స్టేట్స్): రుమేనియా క్రీడాకారిణి ప్రపంచ నం.1 సిమోనా హెలెప్ ఇండియన్ వెల్స్ టోర్నీలో సెమీస్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో హెలెప్, క్రొయేషియాకు చెందిన పెట్రా మార్టిక్‌పై 6-4, 6-7(5/7), 6-3 తేడాతో విజయం సాధించడంతో హెలెప్ సెమీస్ బెర్త్ ఖాయమైంది. ఈ సీజన్ ప్రారంభంలో హెలెప్ ఆడిన మ్యాచుల్లో 18 గెలువగా 1 మ్యాచ్‌లో ఓడింది. ఇండియన్ వెల్స్ టైటిల్ లక్ష్యంగా ఆమె రెండోసారి ఈ టైటిల్‌ను సొంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. 2015లో ఒకసారి హెలెప్ ఈ టైటిల్‌ను గెలిచింది. సెమీస్‌లో హెలెప్, జపాన్ క్రీడాకారిణి నవోమి ఓసాకాతో తలపడనుంది. ఒసాకా సెమీస్‌లో అడుగుపెట్టడానికి ఐదో సీడెడ్ కరొలినా ప్లిస్‌కోవాను 6-2,6-3 తేడాతో ఓడించింది.

క్వార్టర్స్ ఫైనల్స్‌కు ఫెదరర్

స్విస్ టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్ ఇండియన్ వెల్స్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టాడు. ఫ్రాన్స్ క్రీడాకారుడు జెరెమి చార్డిని 7-5, 6-4 తేడాతో ఓడించిన 36 ఏళ్ల ఫెదరర్ ఈ ఏడాది మరో టైటిల్ వేటలో ఉన్నాడు. జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను గెలిచి ఫెదరర్ శుభారంభం చేసిన ఫెదరర్ ఇప్పటివరకు ఆడిన 15 మ్యాచ్‌ల్లో గెలిచాడు. 2006 నుంచి చూస్తే ఫెదరర్‌కు ఇదే అత్యుత్తమ కెరియర్ గ్రాఫ్. 'ఈ ఏడాది నాకు కలసి వచ్చిన సంవత్సరం. ఈ విజయాలు ఎన్నో ఏళ్ల తర్వాత చూస్తున్నాను' అని ఫెదరర్ వ్యాఖ్యానించాడు. క్వార్టర్స్ ఫైనల్స్‌లో ఫెదరర్, దక్షిణ కొరియాకు చెందిన చుంగ్ హైయోన్‌ను ఢీకొన నున్నాడు. 30వ సీడెడ్ చుంగ్ ఉరుగ్వే క్రీడాకా రుడు పాబ్లో క్యువాస్‌పై 6-1, 6-3 తేడా తో విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరాడు.



బోల్టన్ బోల్తా కొట్టించింది

• 60 పరుగుల తేడాతో ఆసీస్ గెలుపు

• సిరీస్ 2-0తో కైవసం


ఆస్ట్రేలియా - భారత్ మహిళల రెండో వన్డే

వడోదరా: బోల్టన్ అద్భుత ఇన్నింగ్స్ తోడుగా ఫెర్రీ, మూనిల సహకారంతో మంచి లక్ష్యాన్ని మిథాలి సేనముందించిన ఆసీస్ మహిళా జట్టు మరోసారి తన ఆధిక్యాన్ని చాటింది. మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం భారత జట్టుతో ఆడిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా 60 పరుగుల తేడాతో మిథాలి సేనను ఓడించి సిరీస్‌ను 2-0 ఆధిక్యంతో కైవసం చేసుకుంది. సిరీస్‌లో చివరి వన్డే ఆదివారం జరుగనుంది. భారత బ్యాట్స్‌మన్లు, ఆసీస్ బౌలర్లను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 287 పరుగుల లక్ష్యాన్ని భారత్ ముందుంచింది. ఆస్ట్రేలియాపై భారత్ ఇప్పటివరకు 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన దాఖలాలు లేవు. ఈ మ్యాచ్‌లో కూడా భారత్ 49.2 ఓవర్లలోనే 227 పరుగులకు ఆలౌటయి చేతులెత్తేసింది. భారత ఓపెనర్లు స్మృతి మంధాన, పూనం రౌత్‌లు దాటిగా బ్యాటింగ్ చేసి మంచి ఆరంభాన్ని అందించారు. మంధాన 53 బంతుల్లో 64 పరుగులు చేసి ఔట్ కాగా, రౌత్ మందకొడిగా బ్యాటింగ్ చేసింది. 61 బంతుల్లో 27 పరుగులు చేసి ఔటయింది. కెప్టెన్ మిథాలి రాజ్ ఔట్ కావడం మ్యాచ్ టర్నింగ్ పాయింట్‌గా చెప్పవచ్చు. మిథాలి కేవలం 15 పరుగులు మాత్రమే చేసి ఫెర్రీ బౌలింగ్‌లో హేలీకి క్యాచిచ్చి ఔటయింది. మొత్తానికి మిడిలార్డర్ ఘోరంగా విఫలమైంది. కౌర్ 17, వేదా కృష్ణమూర్తి 2, సుష్మా వర్మ 8 పరుగులు చేసి ఔటయ్యారు. పూజా వస్త్రాకర్ 30, దీప్తి శర్మ 26 పరుగులు చేసి పర్వాలేదనిపించారు. ఆసీస్ స్పిన్నర్ జెస్ జొనాస్సెన్ 3 వికెట్లు తీయగా, మరో స్పిన్నర్ వెల్లింగ్టన్ రెండు వికెట్లు, పేసర్ ఫెర్రీ 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు టాస్ గెలిచిన భారత్ బౌలింగ్‌ను ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో ఆస్ట్రేలియా జట్టు 9 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. ఓపెనర్ నికోలే బోల్టన్ మరోసారి విజృంభించి ఆడి 84 పరుగులు చేసింది. ఆసీస్ బ్యాట్స్‌మన్లలో ఎలీస్ ఫెర్రీ 70 పరుగులు చేయగా, బెత్ మూని 56 పరుగులు చేసింది. భారత బౌలర్లలో శిఖా పాండే 3 వికెట్లు, పూనం యాదవ్ రెండు, ఎక్తా బిస్త్, కౌర్ తలో వికెట్ తీశారు. బ్యాటింగ్‌లో రాణించిన నికోలె బోల్టన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకుంది.

సంక్షిప్త స్కోర్లు: ఆస్ట్రేలియా 287/9,(50 ఓవర్లు) (నికోలె బోల్టన్ 84, ఫెర్రీ 70, బెత్ మూని 56) బౌలింగ్: శిఖాపాండె 61/3, పూనం 52/2, భారత్: 227 ఆలౌట్ (49.2 ఓవర్లు) (స్మృతి మంధాన 67, దీప్తి శర్మ 26, పూనం రౌత్ 27) **బౌలింగ్:** జెస్ జొనాస్సెన్ 3/51, ఫెర్రీ 2/41



'నేను వైరల్ జ్వరంతో తొలి మ్యాచ్‌కు దూరమయ్యాను. విరాట్ కోహ్లీ అన్నట్లు మనం మానవులం కొన్ని సార్లు అనుకున్నట్టు జరగదు. తొలి స్పెల్‌లో వచ్చిన అవకాశాలను ఉపయోగించుకోలేక పోయాము. బౌలర్లు తమ లైన్, లెంగ్త్‌లను తప్పిపోయి బౌలింగ్ చేశారు. స్మృతి, పూజాలు చక్కగా బ్యాటింగ్ చేసినప్పటికి మిగతావారు విఫలమయ్యాము. మొత్తానికి బ్యాటింగ్‌లో మా జట్టు విఫలమైంది' - మిథాలి రాజ్



'మేము టాస్ గెలిస్తే బ్యాటింగ్ చేయాలని అనుకుని వ్యూహాన్ని రచించాము. టాస్ ఓడినప్పటికి మాకు బ్యాటింగ్ చేసే అవకాశం లభించింది. మా బ్యాట్స్‌మన్లు రాణించారు. నికోలె బోల్టన్ ఈ సారీ కూడా రాణించి మంచి లక్ష్యాన్ని భారత్ ముందుంచడంలో తోడ్పడింది. బౌలింగ్ కూడా అద్భుతంగా చేశాము. స్పిన్నర్లు, పేసర్లు పకడ్బంధీగా బంతులు వేశారు. మొత్తానికి మేము బాగా ఆడాము' - ఆసీస్ కెప్టెన్ లానింగ్



టాప్ 100లో భారత్ ఫుట్‌బాల్ టీం

న్యూఢిల్లీ: భారత్ ఫుట్‌బాల్ జట్టు తిరిగి టాప్ 100 జాబితాలో ప్రవేశించింది. గురువారం ఫిఫా విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌ల్లో భారత జట్టు 99వ స్థానంలో నిలిచింది. ఈ ర్యాంకింగ్ పీరియడ్‌లో భారత జట్టు ఒక్క అంతర్జాతీయ మ్యాచ్‌ను ఆడలేకపోయినప్పటికి మూడు స్థానాలు ఎగబాకి టాప్ 100 స్థానాల్లో చోటు దక్కించుకుంది. 339 పాయింట్లతో భారత్, లిబియాతో కలిసి ఉమ్మడిగా 99వ ర్యాంకులో ఉంది. గత ఏడాది కూడా భారత జట్టు టాప్-100 ర్యాంకుల్లోకి మూడు సార్లు ప్రవేశించింది. కాగా గతజూలైలో 96వ స్థానంలో నిలిచింది. భారత్ నమోదు చేసుకున్న అత్యుత్తమ 94వ ర్యాంకు 1996లో నమోదైంది. అయితే.. ఆ ఏడాది చివరి నాటికి భారత్ 105కు దిగజారింది. ఆసియన్ దేశాల పరంగా చూస్తే.. భారత జట్టు 13వ స్థానంలో ఉంది. కతార్, ఒమన్, జోర్డాన్, బహ్రెయిన్, ఉత్తర కొరియాలు భారత్‌కు దిగువన ఉన్నాయి. ఓవరాల్ ర్యాంకుల్లో ఆసియా దేశం ఇరాన్ 33వస్థానం పొంది ముందుండగా, ఆస్రేలియా 37 వ స్థానంలో, జపాన్ 55వ స్థానంలో ఉన్నాయి. ప్రపంచ ఛాంపియన్ జర్మనీ జాబితాలో అగ్ర స్థానంలో ఉండగా, బ్రెజిల్, పోర్చుగల్, అర్జెంటీనా, బెల్జియం, పోలండ్, స్పెయిన్, ఫ్రాన్స్, చిలీలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. మార్చి 27న బిష్‌కెక్ వేదికగా, భారత జట్టు ఏఎఫ్‌సీ ఆసియన్ కప్ క్వాలిఫైయర్ మ్యాచ్‌ను కిర్గిజ్ రిపబ్లిక్‌తో ఆడనుంది. భారత్ ఇప్పటికే 2019 ఏఎఫ్‌సీ ఆసియన్ కప్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

తెలుగింటి పండుగకు చీరలు



మనకు అత్యంత ఇష్టమైన మన తెలుగు సంవత్సరాది...ఉగాదిని ఎల్లుండి జరుపుకోబోతున్నాం. తెలుగువారికి మాత్రమే ప్రత్యేకమైన ఈ పండుగనాడు...రెండు తెలుగు రాష్ట్రాలనుండి తయారవుతూ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న చీరలను ధరిస్తే...మరింత సముచితంగా ఉంటుంది కదూ. అందుకే ఆ చీరలను మీముందుకు తెస్తూ..వాటి వివరాలను అందిస్తున్నాం. ఉగాదిని ఇలా అచ్చమైన తెలుగు కట్టుబొట్టుతో ఆహ్వానించాలని....ఆంధ్రప్రభ తరపున ఆకాంక్షిస్తున్నాం-

ఉప్పాడ

ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా నుండి వస్తున్న ఉప్పాడ పట్టు చీరలు...ఫంక్షన్లకు కట్టుకుంటే చాలా గ్రాండ్ లుక్ ఇస్తాయి. వీటిని ఉప్పాడ జామ్‌దానీ చీరలంటారు. జామ్ అంటే పువ్వు...దానీ అంటే వేజ్. అంటే ఫ్లవర్‌వేజని అర్థం. ఈ పదం పర్షియన్ భాషకు సంబంధించినది. ఈ నేతకు సంబంధించిన నైపుణ్యం బెంగాల్ మూలాల నుండి వచ్చిందని అంటారు. జామదానీ టెక్నిక్‌ని గురించి మొట్టమొదట కౌటిల్యుని అర్థశాస్త్రంలో కనుగొన్నారు. ఈ చీరలకు వాడే బట్టని మస్లిన్ క్లాతని కూడా అంటారు. వీటి నేత బంగ్లాదేశ్‌లో ఎక్కువగా కనబడుతుంది. ఉప్పాడ చీరల్లో రేఖాగణితంతో పాటు జంతువులు చెట్లకు సంబంధించిన డిజైన్లు ఎక్కువగా కనబడతాయి. ఇవి ఎక్కువగా పరస్పర వ్యతిరేక రంగుల్లో ఉంటాయి. ఈ చీరలు కూడా కట్టుకుంటే చాలా అందంగా గ్రాండ్‌గా అనిపిస్తాయి.

నారాయణ్ పేట్

తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా, నారాయణ పేట్ నుండి ఈ చీరలను తయారుచేస్తున్నారు. వీటి డిజైన్లు చాలావరకు గళ్లలో ఉండి చాలా సాంప్రదాయంగా అనిపిస్తాయి. అయితే నేటికీ ఈ డిజైన్లకు ఫ్యాషన్ ప్రపంచంలో పదిలమైన స్థానం ఉంది. 1630లో మరాఠీ రాజు చత్రపతి శివాజీ నారాయణ్‌పేట్ ప్రాంతానికి వచ్చి కొన్నాళ్లు విడిది చేశాడని...ఆయనతో పాటు వచ్చిన కొంతమంది నేతకారులు ఇక్కడ ఉండిపోయారని...వారే నారాయణపేట్ సిల్క్ చీరల సృష్టికర్తలని అంటారు. అందులో ఆశ్చర్యం లేదు. ఈ చీరల డిజైన్లపై మహారాష్ట్ర ప్రభావం కనబడుతుంది.

ధర్మవరం

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా, ధర్మవరం...నుండి ఇవి తయారవుతున్నాయి. ధర్మవరం పట్టుచీరలది ఒక అరుదైన స్టైల్‌గా చెప్పవచ్చు. నిండురంగుల బోర్డర్లు, షేడెడ్ రంగుల్లో పల్లుతో ఈ చీరలు చాలా హుందాగా రాజసం ఉట్టిపడుతుంటాయి. ముఖ్యంగా పెళ్లి కూతుళ్లకు మరింత అందాన్ని తెచ్చే చీరలు ఇవి. మొదట వీటిని పసుపు మెరూన్ రంగుల కాంబినేషన్‌లో పెళ్లి చీరలుగానే నేసేవారు. రెండువేల నుండి లక్షరూపాయల వరకు ధరల్లో ఇవి లభిస్తున్నాయి.

పొందూరు ఖాదీ

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పొందూరు నుండి ఈ ఖాదీ చీరలు తయారవుతున్నాయి. అందుకే పొందూరుని ఖాదీ గ్రామం అని కూడా అంటారు. దాదాపు ఈ ఊళ్లో ప్రతి ఇంట్లోనూ బట్టను నేసే మగ్గం ఉంటుంది. ఇంట్లో ఉన్నవారంతా నేతపనిలో నిమగ్నమవుతారు. అయితే ఈ తరం పిల్లలు ఈ పనిచేయకుండా ఇతర ఉపాధి వెతుక్కుంటున్నారు. ఇక్కడ దొరికే సాదా బట్టని తీసుకుని మనకు నచ్చినట్టుగా దుస్తులను కుట్టించుకునే వీలుంది. పొందూరు ఖద్దరుని దేశభక్తికి చిహ్నంగా భావిస్తుంటారు.

కలంకారీ

ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం శ్రీకాకుళం...ఇవి రెండూ ఈ చీరలకు ప్రసిద్ధి. బట్టని నేయటం పూర్తయిన తరువాత దాన్ని ఆవుపాలు, రంగుల మిశ్రమంలో ముంచి రంగులు వేసి తరువాత ప్రత్యేకమైన పెన్నుతో చిత్రాలు వేస్తారు. కలంతో వేస్తారు కనుకనే కలంకారీ అన్నారు. హిందూమత చిహ్నాలు, పురాణ గాథలకు సంబంధించిన బొమ్మలు కలంకారీ దుస్తులపై మనకు కనబడతాయి. కలంకారీ అద్దకాలను వేసే బట్ట ఎంతో నాణ్యమైనదై ఉంటుంది. పూర్తిగా కూరగాయల ద్వారా వచ్చే రంగులతోనే అద్దకాలు వేస్తారు. కృత్రిమ రంగులు అసలు వాడరు.

అహింసా సిల్క్

'నువ్వు పట్టుచీర కడితే ఓ పుత్తడి బొమ్మ...ఆ కట్టుబడికి తరియించును పట్టుపురుగు జన్మ' అంటారు ఒక సినీకవి ఒక పాటలో. అవును పట్టుపురుగు తన జన్మని పణంగా పెడితేనే పట్టుచీర తయారవుతుంది. అయితే అహింసా సిల్క్ చీరలు మాత్రం పట్టుపురుగు ప్రాణం తీయకుండానే తయారవుతున్నాయి. అందుకే ఇవి అహింసా సిల్క్ చీరలు అయ్యాయి. హైదరాబాద్‌కి చెందిన కుసుమ రాజయ్య ఈ వినూత్న నైపుణ్యాన్ని కనుగొన్నారు.

గద్వాల్

భారతీయ నేత పనివారి ప్రావీణ్యాన్ని ప్రపంచానికి చాటిన చీరలు ఇవి. తెలంగాణలోని జోగులాంబ గద్వాల్ జిల్లా గద్వాల్ నుండి వీటిని తయారుచేస్తున్నారు. 5.5 మీటర్ల చీరని అగ్గిపెట్టెలో పెట్టగలిగినంత పలుచగా రూపొందించి...అసమాన ఖ్యాతిని పొందిన ఘనత ఇక్కడి నేతపనివారి సొంతం.

పోచంపల్లి

తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి నుండి ఇవి తయారవుతున్నాయి. వీటిమీద కనిపించే రేఖా గణితం డిజైన్లతో ఇవి బాగా గుర్తింపు పొందాయి. ముందుగా నూలుకి రంగులు వేసి బట్టను నేసే ఇక్కత్ పద్ధతిలో వీటిని తయారుచేస్తున్నారు. ఐశ్వర్యారాయ్ తన పెళ్లికి పోచంపల్లి చీరనే కట్టుకుంది.

వెంకటగిరి

ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా లోని వెంకటగిరి నుండి ఇవి తయారవుతున్నాయి. కాటన్ సిల్క్ రెండు రకాల్లోనూ లభిస్తున్నాయి. మృదువుగా తేలిగ్గా ఉండే ఈ చీరలు అత్యంత సౌకర్యవంతంగా అనిపిస్తాయి. అంతేకాదు..వీటి రంగులు డిజైన్లు అట్టహాసంగా కాకుండా సింపుల్‌గా ఉంటాయి. జరీకాటన్‌తో డిజైన్లతోపాటు ఉప్పాడలాగే జామదానీ స్టైల్ ఈ చీరల్లో కనబడుతుంది. నెమళ్లు, చిలుకలు, హంసలు మామిడి పిందెలు, ఆకులు లాంటి డిజైన్లతో ఇవి ఎంతో అందంగా కనబడతాయి. 1700 సంవత్సరాల్లో ఇవి ప్రాచుర్యంలోకి వచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ చీరల నేతపనివారు వీటిని రాజకుటుంబాల కోసం మాత్రమే నేసేవారు. ఇందుకు గానూ చాలా పెద్దమొత్తంలో పారితోషకం అందుకునే వారు. మళ్లీ రాజకుటుంబం నుండి ఆర్డరు వచ్చేవరకు, వారు అదే డబ్బుతో జీవనం సాగించేవారు. వెంకటగిరిలో కూడా మనకు నచ్చిన డిజైన్లను ప్రత్యేకంగా డిజైన్ చేసి...నేసే నేతపనివారు ఉంటారు. ఇక్కడ 40వేల మంది జనాభా ఉంటే అందులో 20వేలమంది నేతపనివారే.

మంగళగిరి

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంగళగిరి ఈ చీరల పుట్టినిల్లు. బంగారు రాగి థ్రెడ్ వర్క్‌తో ఈ మంగళగిరి కాటన్ చీరలు ఎంతో అందంగా ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని మనకు కావలసినట్టుగా డిజైన్ చేయించుకునే అవకాశం ఉంది. ఖుతుబ్ షాహీ కాలం నుండి దాదాపు ఐదు శతాబ్దాలుగా ఇవి....మంగళగిరి పట్టణ సంస్కృతిలో ఒక భాగంగా నిలిచిపోయాయి.

ఎరుపు..మైమరపిస్తుందా!



మనుషులకు ఉన్నట్టే రంగులకు సైతం లక్షణాలు గుణాలు ఉన్నాయంటారు మానసిక నిపుణులు. ఒక్కో రంగు మనమీద ఒక్కోరకమైన ప్రభావాన్ని చూపుతుందని ఎప్పటినుండో చెబుతున్నారు. అలాగే ఎరుపు రంగు దుస్తులను మగవారు ధరిస్తే...ఆడవాళ్లను, ఆడవాళ్లు ధరిస్తే మగవారిని విపరీతంగా ఆకర్షిస్తారని ఒక అధ్యయనంలో తేలిందని పరిశోధకులు అంటున్నారు. ఈ వివరాలతో కూడిన సమాచారాన్ని పర్సనాలిటీ సోషల్ సైకాలజీ అనే పత్రిక ప్రచురించింది.

మగవారు ఎరుపు రంగుతో కూడిన దుస్తులు ధరిస్తే...తమ హోదాని, ఆధిపత్యాన్ని ఇతరులకు సూచిస్తున్నట్టు కనబడుతుందట. ఈ అధ్యయనం కోసం పరిశోధకులు గ్రాడ్యుయేషన్ చదువుతున్న కొంతమంది అమ్మాయిలను ఎంపిక చేసుకున్నారు. వారిలో కొందరికి...మగవారి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలను తెలుపు బ్యాగ్రౌండ్‌తో ఉన్నవాటిని చూపించారు. మరికొందరికి అవే ఫొటోలు ఎరుపు బ్యాగ్రౌండ్‌తో ఉన్నవాటిని చూపారు. ఈ ఫొటోల్లో ఉన్నవారిలో ఎవరు ఆకర్షణీయంగా ఉన్నారని అడిగినప్పుడు ...ఎక్కువమంది ఎరుపు బ్యాక్‌గ్రౌండ్‌గా ఉన్న ఫొటోల్లోని మగవారే బాగున్నారని చెప్పారు. ఎరుపు రంగు దుస్తులను ధరించిన మగవారు డబ్బు బాగా సంపాదిస్తారని, వారికి సామాజికంగా కూడా పేరు ఉంటుందని చాలామంది భావించారని అధ్యయన నిర్వాహకుల్లో ఒకరైన ప్రొఫెసర్ ఆండ్రూ ఇలియట్ అన్నారు. మొత్తానికి మగవారు ఎరుపురంగు దుస్తులు ధరిస్తే...స్త్రీలకు మరింత అందంగా ఆకర్షణీయంగా, శక్తిమంతులుగా కనిపిస్తారని ఈ అధ్యయనవేత్తలు అంటున్నారు.


మేకప్ వేసుకునే మహిళలు..లీడర్లు కాలేరా?



అవునంటున్న అధ్యయనం

అలంకరణ, మేకప్..వీటిని ఎంతోకొంత ఇష్టపడని మహిళలు ఉండరు. కొంతమందికి వీటిపట్ల మరింత ఎక్కువ మక్కువుంటుంది. అయితే మరీ ఎక్కువ మేకప్ వేసుకునే మహిళలు...సమాజం దృష్టిలో మంచి లీడర్లు కాలేరని ఒక అధ్యయనంలో వెల్లడైంది. ఇందుకోసం... కొంతమంది వ్యక్తులకు... మహిళల చిత్రాలను మేకప్‌తోనూ మేకప్ లేకుండానూ చూపించారు. యుకెలోని అబర్టే యూనివర్శిటీ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. మహిళల మోహాలు... మేకప్‌తో మేకప్ లేకుండా చూపించేందుకు వారు ప్రత్యేకమైన కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగించారు. అధ్యయనంలో పాల్గొన్న వ్యక్తులు... పదహారు జంట ముఖాల చిత్రాలను ఎంపిక చేశారు. ఒక్కో జంట మొహాల్లో ఒకటి మేకప్ ఉన్నదాన్ని మరొకటి మేకప్ లేనిదాన్ని ఎంపిక చేసుకుని...మేకప్ లేని మహిళలు, మేకప్ వేసుకున్నవారికంటే ఎందుకు మంచి లీడర్లో వారు పోల్చి చెప్పారు. అధ్యయనంలో పాల్గొన్నవారంతా కూడా...విపరీతంగా మేకప్ వేసుకుని ఉన్న చిత్రాల్లోని మహిళల్లో నాయకత్వ లక్షణాలు కనిపించడం లేదని చెప్పారు. మేకప్ పెరుగుతున్న కొద్దీ మహిళల్లో స్త్రీత్వం తాలూకూ చిహ్నాలు మరింత ఎక్కువగా కనిపించడం వల్లనే ఇలా జరిగిఉంటుందని భావించవచ్చు.

తక్షణశక్తి కోసం!



ఒక్కోసారి మనకు పని ఎక్కువైతే శరీరంలోని శక్తి మొత్తం హరించుకు పోయినట్టుగా ఉంటుంది. అలాంటప్పుడు శక్తిని ఉత్సాహాన్ని అప్పటికప్పుడు తిరిగి పొందడానికి ఈ చిట్కాలు పాటించవచ్చు-

-శ్వాసని పూర్తిగా తీసుకుని పూర్తిగా వదలటం ... మనలో ఎనర్జీని పెంచుతుంది. నేలమీద కూర్చుని వెన్నుని నిటారుగా ఉంచాలి. కళ్లు మూసుకోవాలి. దృష్టినిమొత్తం శ్వాసమీద ఉంచాలి. శ్వాస దీర్ఘంగా పీల్చుకుంటూ ఆరు లెక్కపెట్టాలి. మూడు అంకెలు లెక్కపెట్టేవరకు శ్వాసని అలాగే నిలిపి ఉంచాలి. ఇలా చేస్తున్నపుడు శరీరంలోని కండరాలను బిగించి ఉంచాలి. తరువాత ఒకటి నుండి ఆరువరకు లెక్కపెడుతూ... నిదానంగా శ్వాసని పూర్తిగా విడవాలి. శ్వాస వదిలేటప్పుడు బిగించిన కండరాలన్నింటినీ సడలించాలి. ఇప్పుడు శ్వాస లయబద్ధంగా ఉండేలా చూసుకుంటూ దానిపైనే ధ్యాస ఉంచాలి.


-అప్పటికప్పుడు శక్తి కావాలంటే...మన శరీరభంగమని మార్చుకుని... శరీరమంతా నిటారుగా ఉండేలా చూసుకోవాలి. సాదారణంగా మనం నిలుచున్నపుడు కానీ కూర్చున్నపుడు కానీ. ..భుజాలు నడుము వెన్ను.. .వీటన్నింటినీ వంచేస్తుంటాం. ఇలా చేసినప్పుడు మెదడుకి రక్తప్రసరణ సరిగ్గా జరిగే అవకాశం ఉండదు. మన శరీరంలోని శక్తి కూడా వృథా అవుతుంది. అలాకాకుండా ఉండాలంటే కూర్చున్నా నిలబడినా....శరీరం నిటారుగా ఉండేలా చూసుకోవాలి.

-శరీరంలో శక్తి తగ్గినప్పుడు స్వీట్లు చాక్‌లేట్లు తినాలపిస్తుంది. అలాగే చేస్తుంటారు చాలామంది. కానీ.. .తక్షణశక్తి కోసం యాపిల్ తినటం మేలు. ఇందులో విటమిన్ సి, పీచు, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఉన్నాయి. యాపిల్ రక్తంలో చెక్కెర శాతాన్ని సైతం స్థిరంగా ఉంచుతుంది.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

జ్ఞానదృష్టి



శ్రీరమణాశ్రమం
20-7-47

భగవాన్ తమకు అప్పుడప్పుడు స్ఫురించి వ్రాసినవి గాని, ఎవరైనా అడిగినప్పుడు వ్రాసినవిగాని పద్య శ్లోకగద్యాదులు ఎందుకూ పనికిరాని చిన్ని చిన్ని చిత్తు కాగితాలలో వ్రాసేవారు. పోయినవి పోగా మిగిలినవన్నీ ఈ మధ్య ఏరివుంచాం. చిన్న పుస్తకం ఒకటి కుట్టి అవన్నీ అతికించి వుంచాలని నా వుబలాటం. అప్పుడప్పుడు భగవానునితో మనవి చేస్తూ వచ్చాను. ''ఊ ఎందుకది?'' అంటూ వచ్చారు భగవాన్.

నిన్న మధ్యాహ్నం తప్పక అతికింతామని వచ్చి మనవి చేస్తే ''ఎందుకూ అన్నీ ఒకదానిలోనే వుంటే స్వామి వ్రాసిందిగా వుందే అని ఎవరో ఒకరు పట్టుకొని పోతామంటారు. మనమేమీ చెప్పేందుకు లేదు. స్వామి అందరికీ ఉమ్మడే గదూ. విడిగా వుంటేనే మంచిది'' అన్నారు భగవాన్. ఈ సూక్ష్మం ఉండుట వల్లనే భగవాన్ అంగీకరించలేదు గాబోలని అంతటితో విరమించాను.

ఇంతలో దడబిడలుగా వచ్చిన యువకుడొకడు ''స్వామీ! జ్ఞానికి ఈ బాహ్య దృష్టిగాక జ్ఞానదృష్టి వేరే వుంటుందట. ఆ దృష్టి నాకు అలవడునట్లను గ్రహిస్తారా? లేక అట్లా అనుగ్రహించే వారున్న స్థలం చూపిస్తారా?'' అన్నాడు. ''ఆ జ్ఞానదృష్టి ఎవరంతట వారు సంపాదించుకోవలసిందే కాని ఒకరిచ్చేది కాదండీ'' అన్నారు భగవాన్. ''గురువే అన్నీ అనుగ్రహిస్తాడంటారు గదా?'' అన్నారా భక్తులు. ''ఈ మార్గమననుసరించి పోతే జ్ఞానదృష్టి కలుగుతుందనీ చెపుతారు. పోతే గదా. జ్ఞానియైన గురువు మార్గదర్శకుడేగాని నడవటం మనమే నడవాలి'' అన్నారు భగవాన్. ఆ యువకుడు తెల్లబోయి ''అంతేనా?'' అంటూ లేచి వెళ్లాడు.

మరికాస్సేపటికి రమణపురనివాసిగా నున్న ఒక భక్తుని బిడ్డ అయిదారేండ్లది తమ తోటలోనివి పచ్చి జామపండ్లు రెండు తెచ్చి భగవానునికిచ్చింది. ఆ పిల్ల అప్పుడప్పుడు భక్ష్యాలూ పండ్లూ తెచ్చి భగవానునకిస్తూ వుంటుంది. తెచ్చినప్పుడల్లా ''ఎందుకమ్మా ఇవన్నీను'' అంటూనే తినేవారు భగవాన్. నిన్న ఈ పండ్లు తినక ''ఇది భగవానుకు, ఇది భగవానుకు'' అంటూ అందరికీ పెట్టి నీవూ తినమ్మా. అందరిలోనూ భగవానున్నారు. నిత్యం తెస్తావెందుకు? వద్దని చెప్పాను గదూ? అందరికీ అక్కడే పెట్టు. అందరిలోనూ భగవానున్నారు పో అమ్మా'' అని చెప్పి పంపారు. ఆ పిల్ల చిన్నబుచ్చుకొని వెళ్లింది. భగవాన్ నావైపు చూచి ''పిల్లలకు అదొక సరదా. స్వామికి ఇస్తానంటే తమకూ వస్తుందని ఆశ. నేను కొండమీద వుండగా సెలవు వచ్చిందంటే సరి, ఆడపిల్లలూ, మగపిల్లలూ నావద్దకు వచ్చేవారు. ఇంట్లో వాళ్లను డబ్బుడిగి మిఠాయి పొట్లాలూ బిస్కత్తులూ మొదలైనవన్నీ తెచ్చేవారు. నేనందరితో కలిసి కూర్చునేవాణ్ణి. అన్నిటిలోనూ నాకొక భాగం వచ్చేది'' అన్నారు భగవాన్.

''బాలగోపాలునివలె భగవాన్ వారితో విందారగించే వారన్నమాట'' అన్నా నేను. భగవాన్ నవ్వుతూ ''స్వామికి తీసుకొనిపోతామంటే తమకూ వస్తుందని వాళ్ల ఆశ. ఎప్పుడో ఒకసారైతే సరిగాని రోజూ ఎందుకు? వాళ్లంతా తింటే నేను తిన్నట్టు కాదా యేమి?'' అన్నారు. అందరిలోనూ నేనున్నానని భగవాన్ ఎంత స్పష్టంగా నిరూపిస్తున్నారో అని నాకు హర్షామోదములు కలిగినవి.

వారం పదిరోజుల క్రిందట ఏమయిందనుకున్నావ్. ఉదయం ఫలహార సమయంలో వడ్డన చేసేవారిలో ఎవరో ఒకరు బత్తాయి తొనలు భగవాన్ విస్తట్లో ఎక్కువగానూ ఇతరులకు కొంచెం తక్కువగానూ వడ్డించారట. భగవాన్ అది చూచి ''నేనిక బత్తాయి తొనలు తిననే తిన''నని మానివేశారు. నాల్గయిదు రోజుల క్రిందట భక్తులంతా మళ్లీ గ్రహించవలసిందని బ్రతిమలాడితే ''మీరంతా తింటే చాలదా. నాకెందుకు?'' అన్నారు భగవాన్. ''మేమంతా తింటూ భగవాన్ తినకుంటే మాకు బాధ కాదా. అందుకే ప్రార్థిస్తున్నాం. క్షమించి అనుగ్రహించాలి'' అన్నారు భక్తులు. ''భగవాన్ శరీరారోగ్యానికి మంచిది. మా నిమిత్తం, తినం''దని వారంటే భగవాన్ ''ఇదుగో చూడండి. ఇప్పుడిక్కడ ఫలహారం చేసేవారు నూరుకు పైగా వున్నారు గదా. ఇన్ని ముఖాలతో తింటున్నాను చాలదూ? ఈముఖంతో తింటేనే తిన్నట్టా యేమి?'' అన్నారు. అది గదా జ్ఞానదృష్టి. అది ఎవరిస్తే వస్తుంది చెప్పు.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో ప్రతికూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు లేకపోలేదు. శత్రువృద్ధి ఉంటుంది.

వృషభ రాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మానసిక రుగ్మతలు ప్రబలమవుతాయి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో దూకుడు నిర్ణయాలు పనికిరావు. కోర్టు వ్యవహారాల్లో మాత్రం నెగ్గుకురాగలుగుతారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: దూరప్రయాణాలు రాణిస్తాయి. వ్యాపార నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు లాభిస్తాయి. అవమానకర సంఘటనలు బాధిస్తాయి. ఆరోగ్యం అనుకూలం. దురుసు మాటలు సమస్యలను తెస్తాయి. విద్యా పరమైన విషయాల్లో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. గృహసంబంధిత కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. విమర్శలు ఉన్నా పనులను పూర్తిచేయగలుగుతారు. ఆరోగ్యం ఖర్చులు తగ్గుతాయి. శత్రుభీతి తగ్గుతుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. వాహన నిర్ణయాలు లాభిస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. విదేశీ ఒప్పందాలు లాభిస్తాయి. ఖర్చులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆర్థిక నష్టాలను భర్తీ చేసుకొనే ప్రయత్నాలు కొనసాగుతాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. స్థిరాస్తి కొనుగోళ్లు కలసి వస్తాయి. రాజకీయ ప్రతిబంధకాలు పెరుగుతాయి. ఆరోగ్యంలో చిరుసమస్యలు ఉంటాయి. రాజకీయ ప్రతికూలత ఉంటుంది. ఆదాయంలో ఆశించిన విజయాలు సాధించగలుగుతారు.

తులా రాశి: నూతన వస్తు కొనుగోళ్ళు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. శారీరిక శ్రమ ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అపార్థాలకి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: దూర ప్రయాణాలు ఆశించిన ప్రయోజనాలని కలిగిస్తాయి. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. శారీరిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. ఆరోగ్య పరీక్షలు రక్షణను కలిపిస్తాయి. సహనం తగ్గుతుంది. గతంలోని ఒత్తిడులు ఇంకా కొనసాగుతాయి. వ్యాపార ప్రయత్నాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు మాత్రం దగ్గరవుతాయి.

మకర రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. నూతన ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. మంచి కార్యాలలో విజయాలు ఏర్పడతాయి. వరస ప్రయత్నాలతో ఆదాయం పెరుగుతుంది.

కుంభరాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు ఉపకరి స్తాయి. చిరు ఆరోగ్య సమస్యలు వెలుగు చూస్తాయి. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. ఒత్తిడులను తట్టుకోగ లుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.


మీనరాశి: వ్యాపార ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిరుసమస్యలు గృహరీత్యా కొనసాగుతాయి. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పనులలో గతంలోని వేగం తగ్గుతుంది. ఆదాయం పర్వాలేదు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com


జంతువులకూ మోక్షం!

ముక్తి మానవులకే అతి కష్టసాధ్యం. అయితే జంతు జన్మలో ఉండి మహాత్ముల కారుణ్యం వల్ల ముక్తి పొందిన జీవులు ఉన్నాయి. అటువంటి జీవులు ఇతిహాసాల్లోనే కాదు. కలియుగంలోనూ ఉన్నాయి.



మహాత్ముల భూతదయ చూస్తున్నాము. వారు కారుణ్యం చూపటమే కాదు. వారికి జంతువులు, మానవులు అన్న తేడా కూడా ఉండదు. జంతువులను బతికించటమే కాదు వాటికి ముక్తిని కూడా వారు ప్రసాదించిన సందర్భాలు ఉన్నాయి. ముక్తి మానవులకే అతి కష్టసాధ్యం. అయితే జంతు జన్మలో ఉండి మహాత్ముల కారుణ్యం వల్ల ముక్తి పొందిన జీవులు ఉన్నాయి. అటువంటి జీవులు ఇతిహాసాల్లోనే కాదు. కలియుగంలోనూ ఉన్నాయి.

మాయి అమ్మ ఒక గొప్ప అవధూత. ఆమె 1993లో మహాసమాధి పొందారు. జీవించి ఉండగా ఆమె కొంత కాలం కన్యాకుమారిలో ఉన్నారు. ఒకసారి అమ్మ సముద్ర తీరం నుంచి బస్టాండుకు వెడుతోంది. దారిలో ఒక కుక్క పడిపోయి ఉంది. ఆ కుక్క పై నుంచి ఒక బస్సు వెళ్ళింది. ఆ కుక్క పొట్టలో నుంచి పేగులు బయటపడి ఈ క్షణమో, మరో క్షణమో అన్నట్లుంది. అమ్మ చూసింది. ఆ కుక్క వద్దకు వెళ్ళి కర్రతో దాని పేగులను పొట్టలోకి తోసివేసింది. పోయిన ఆ కుక్క ప్రాణం తిరిగి వచ్చింది. ఆ కుక్క లేచి తిరిగింది. అంతే కాదు చాలా కాలం జీవించింది. అది అంతా అమ్మ చలవే.



మాయి అమ్మ

నల్ల మస్తాన్ ఒక అవధూత. ఆయన గుంటూరుకు వచ్చిన తొలి దినాలలో మెడికల్ కాలేజి దగ్గరున్న ఒక మునగ చెట్టు కింద ఉండేవారు. ఒక సారి ఉరుములతో, మెరుపులతో కుంభ వృష్టిగా వర్షం కురిసింది. విశేషం ఏమంటే ధ్యానం చేస్తున్న మస్తాన్ గారి శరీరంపై ఒక్క వర్షం చుక్క కూడా పడలేదు. ఇంతలో దగ్గరలో పిడుగు పడింది. ఒక మేక పిల్ల, మనిషి మరణించారు. కొంత సేపటికి వర్షం తగ్గింది. ధ్యానంలో ఉన్న మస్తాన్ గారు లేచారు. ఆయనకు మరణించిన మేక పిల్ల కనపడింది. మస్తాన్ దాని వద్ద కాసేపు కూర్చుండి, ధ్యానం చేసి దాని చుట్టూ ముమ్మారు తిరిగారు. 'ఉఠో' అన్నారు. ఆ మేక పిల్ల నిద్రలో నుంచి లేచినట్లు లేచి ఒంటి మీద ఉన్న నీటిని దులుపుకుని మస్తాన్ గారి కాళ్ళ మధ్య నుంచి పారిపోయింది. ఈ విషయం క్షణాల్లో ఊరంతా పాకింది.

పిడుగుపాటు వల్ల మరణించిన వ్యక్తి తల్లి మస్తాన్ వద్దకు వచ్చి తన కుమారుని కూడా బతికించమని కోరింది. కరుణా సముద్రుడు ఆ తల్లి కన్నీటిని చూడలేకపోయాడు. శవం వద్దకు వెళ్ళి దైవ ధ్యానం చేసి,ఆ శరీరాన్ని తాకాడు. వెంటనే మరణించిన వ్యక్తి లేచి కూచున్నాడు. సంగతి గ్రహించి మస్తాన్ గారి పాదాలపై పడ్డాడు. మహనీయుల కరుణకు పాత్రమైన జీవి అదృష్టంతుడే. యముడు సైతం మహనీయుల మాటలను జవదాటడు.

మహనీయుల జీవకారుణ్యం

ముక్తి ప్రదాత

తిరువణ్ణామలైలో రమణ మహర్షి తమ ఆశ్రమం బయట వరండాలో కూర్చున్నారు. హఠాత్తుగా ఒక కాకి వారి పాదాలపై పడింది. వారు దానిని చేతితో తీసి చూచారు. దాని శరీరం మీద బలమైన గాయం ఉంది. దానిని ఒడిలో పెట్టుకుని నిమురుతూ కూచున్నారు. అది ప్రాణం విడిచింది. ఈ సంఘటనను అనేకులు చూచారు. 'ఎవరో సిద్ధపురుషులు ఈనాడిక్కడ ప్రాణం విడిచినారు' అన్నారు రమణులు. దానిని సమాధి చేయించారు. అక్కడే ఉన్న సర్వేపల్లి నరసింహం గారితో రమణులు 'కాకిని సమాధి చేయించాము' అన్నారు. దానికి నరసింహం గారు 'ఏదో ఘన కార్యం చేసినట్లు చెబుతున్నారు. అదంత గొప్ప విషయమా?' అన్నారు. నరసింహం గారు రమణులను అలా చులకన చేసి మాట్లాడటం చూసి నివ్వెరపోయారు అందరూ. ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. రమణుల ముఖ కవళికలలో ఎటువంటి మార్పు లేదు. మరుక్షణం నరసింహం గారు రుద్ధ కంఠంతో, సజల నయనాలతో 'పూర్వం ఒక యుగంలో రామావతార కాలంలో జటాయువుకు ముక్తి ప్రసాదించారు. ఈ యుగంలో రమణావతార కాలంలో కాకికి ముక్తినిచ్చారు. ఇదేమి ఘన కార్యమా? ఇది స్వభావమే కదా' అంటూ జల జల కన్నీరు కార్చారు. నరసింహంగారి భక్తి భావాన్ని అందరూ హర్షించారు. తరువాతి కాలంలో నరసింహం గారే స్వామి ప్రణవానందులు అయ్యారు. ముక్తిని ప్రసాదించటం మహనీయులకు ఘన కార్యం కాదు.

- ముళ్లపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

భూమిపైకి దిగి వచ్చిన దేవతా అంశలు

ఆధ్యాత్మిక రహస్యాలు

మనకు రెండు ఇతిహాసాలు ఉన్నాయి. వాటిలో మొదటిది రామాయణం కాగా, రెండోది మహాభారతం. రామాయణానికి ఆది కావ్యంగా పేరు ఉంది. దానికి ఇంకా ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఆ కథలో సీతారామ లక్ష్మణులు, భరత శత్రుఘ్నులు అవతార పురుషులే. రావణ వధ నిమిత్తం విష్ణుమూర్తి ఈ భూమిపై అవతరించాడు. ఆయనకు బాసటగా దేవ గణాలన్నీ వానరుల రూపంలో వివిధ అప్సరసలందు ప్రవేశించి ఈ భూమి పైకి వచ్చారు. రావణాసురునికి నర వానరుల చేతిలో మినహా ఇంకెవరి చేతిలో మరణం లేనందున ఆ రూపాల్లోనే వారంతా భూమి పైకి వచ్చారు. ఆ వానరుల్లో ఆంజనేయుడు ముఖ్యుడు. వాయుదేవుని అంశతో ఆంజనేయుడు జన్మించాడు. ఇంద్రుని అంశగా వాలి జన్మించాడు. సూర్యుని అంశగా సుగ్రీవుడు



జన్మించాడు. హనుమంతుని జన్మ వృత్తాంతం ప్రచారంలో ఉన్నా వాలి, సుగ్రీవుల ఆవిర్భావం వెనుక ఉన్న కథ అంతగా ప్రచారంలో లేదు. వాలి తన తమ్ముని విషయంలో అధర్మా నికి పాల్పడ్డాడు. అదే సమయంలో సుగ్రీవునితో రామునికి మైత్రి ఏర్పడడం, వారిద్దరూ ఉపకారప్రత్యుపకారాలలో భాగంగా వాలి వధ జరగడం తెలిసిందే. దానితో రాముడు తన మిత్రునికి ఉపకారంగానే కాక ధర్మ సంస్థాపనలో భాగంగా వాలిని వధించాడు. అయితే వాలి సుగ్రీవులు ఏ విధంగా జన్మించారనే దానికి పురాణప్రతిపాదితమైన ఒక కథ ఉంది. ఈ పురాణం కథ విచిత్రంగా ఉన్నా ఒక అవతార ప్రయోజనం కోసం అవతరిస్తున్న పరమాత్మకు బాసటగా ఉండేందుకు వివిధ కారణాలతో, పద్ధతుల్లో దేవతా అంశలు భూమిపై అవతరించాల్సి వచ్చింది. దానిలో వారంతా వేర్వేరు పద్ధతులలో ఈ భూమిపై అవతరించారు. వాలి, సుగ్రీవుల జన్మ వృత్తాంతం ఈ విధంగా ఉంది.

ఒక పర్యాయం సృష్టికర్త అయిన బ్రహ్మ చిన్న కోతి రూపాన్ని సృష్టించాడు. అయితే అతడు మహాబలంతుడుగా తయారయ్యాడు. దానితో పాటు చంచల స్వభావం కూడా వచ్చింది. బ్రహ్మ అతనికి ఋక్షరాజు అని పేరు పెట్టాడు. ఆ వానరుడు బ్రహ్మను తన కర్తవ్యం ఏమిటని అడిగాడు. దానికి బ్రహ్మ 'నువ్వు దక్షిణ దిశకు వెళ్లి, అక్కడ ఫల వృక్షాల పళ్లు తింటూ జీవిస్తూ లోక కంటకులైన రాక్షసులను సంహరించు' అని ఆజ్ఞాపించాడు. వెంటనే ఋక్షరాజు దక్షిణ దిశకు వెళ్లి అక్కడి వనాల్లో నివసిస్తూ స్వేచ్ఛగా విహరించసాగాడు. ఒక రోజు అతను కొలనులో నీరు తాగుతూ నీటిలో తన ప్రతిబింబాన్ని చూసుకున్నాడు. దానిని చూసి అదేదో నీటిలో ఉన్న జంతువు అనుకున్నాడు. అయితే దాని ముఖకవళికలు తనలా ఉన్నాయని ఆశ్చర్యపడ్డాడు. అతను ఎవరా అని ఆలోచిస్తూ అరుపులతో ఆ సరస్సు చుట్టూ తిరిగాడు. అయితే తన ముఖ కవళికలను మారిస్తే ప్రతిబింబం కూడా అలా చేయడం అతని ఆగ్రహానికి కారణమైంది. ఆ జీవిని చంపేయాలని కోపంతో నీటిలోకి దిగాడు. వెంటనే ఆశ్చర్యంగా అతను వానర స్త్రీగా మారిపోయాడు. తనలో వచ్చిన మార్పునకు ఋక్షరాజు చాలా బాధపడి, నీటి నుంచి బయటకు వచ్చి సూర్యుని వైపు తిరిగి, 'ఓ దేవా! ఏమి ఈ విచిత్రం. నేనెందుకిలా మారిపోయాను? నా కర్తవ్యమేమి?' అని ప్రార్థించాడు. అలాగే ఇంద్రుని ధ్యానిస్తూ కూడా ప్రార్థించాడు. అప్పుడు ఒక చిత్రం జరిగింది. మహిళగా ఉన్న ఋక్షరాజుకు సూర్యప్రసాదంగా ఒక కుమారుడు, ఇంద్ర ప్రసాదంగా మరో కుమారుడు కలిగారు. ఇంద్రుని ప్రసాదంగా పుట్టిన వానికి వాలి అని. సూర్యుని ప్రసాదంగా పుట్టిన వానికి సుగ్రీవుడని పేరు పెట్టాడు. (సృష్టిలో జన్మకు కారణం స్త్రీయే అనే దానికి సంకేతంగానే ఋక్షుడు స్త్రీగా మారాడని ఒక వ్యాఖ్యాత వివరణ). ఇరువురు పుత్రులు జన్మించగానే ఋక్షరాజు తిరిగి పురుషునిగా మారిపోయాడు. ఆ తర్వాత అనతు తన కుమారులను వెంట బెట్టుకుని బ్రహ్మ వద్దకు వెళ్ళి జరిగిన దంతా చెప్పాడు. అపుడు బ్రహ్మవారిని చూసి, 'ఓ వాలి సుగ్రీవులారా! మీరిద్దరూ అన్నదమ్ములు. మీరు దక్షిణ దిశలో ఉన్న కిష్కింధా నగరంలో జీవించండి. కొంత కాలానికి జగన్నాథుడైన పరమాత్మ, దశరథునికి పుత్రునిగా జన్మించి తండ్రి ఆజ్ఞ మేరకు వనసంచారి అయి వచ్చి అనేక చిత్రాలు చేస్తాడు. రాక్షస సంహారం చేస్తాడు. అతడి భార్య అయిన సీతను రావణుడనే రాక్షసుడు అపహరించగా ఆమె వెతుకుతూ మీ ప్రాంతానికి వస్తాడు. మీకు అతడితో స్నేహం ఏర్పడి దర్శన, స్పర్శన, సంభాషణలు కలిగి మీ జన్మ సార్థకమవుతుంది అని చెప్పాడు. బ్రహ్మ వచనాలు వాస్తవమై వారికి శ్రీరామచంద్రుని దర్శనం లభించి ముక్తి పొందుతారు' అని చెప్పాడు.

(భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి ఉపన్యాసాల ఆధారంగా)

సేకరణ: ఆదూరి హైమావతి (చికాగో)



భగవద్గీత

అనన్య భక్తి చేతనే పరమాత్మ లభ్యం

అధ్యాయం 8
శ్లోకం 22

పురుషః స పరః పార్థ
భక్త్యా లభ్యస్త్వనన్యయా।
యస్యాంతఃస్థాని భూతాని
యేన సర్వమిదం తతమ్॥

తాత్పర్యం

సర్వులకన్న అధికుడైన దేవదేవుడు అనన్య భక్తి చేతనే పొందబడును. అతడు తన ధామమునందు నిలిచియున్నా సర్వవ్యాపియై యున్నాడు. అతని యందే సమస్తము స్థితిని కలిగియున్నది.

భాష్యం: ఈ శ్లోకము నందు అత్యున్నత ధామము, మనము మరలా తిరిగి రాని ధామము శ్రీకృష్ణుని ధామమేనని స్పష్టపరచబడినది. శ్రీకృష్ణుడు తన ధామములోనే ఉంటూ తన ఆధ్యాత్మిక, భౌతిక శక్తుల ద్వారా సర్వత్రా విస్తరించియున్నాడు. ఆయన ధామము ఆధ్యాత్మిక శక్తితో ఆనంద చిన్మయ రసముతో నిండి ఉంటుంది. అక్కడ ఏదైనా భౌతికము కాక ఆధ్యాత్మిక ఆనంద లక్షణాన్ని కలిగి ఉంటుంది. అలాగే ఏడవ అధ్యాయములో చెప్పుకున్నట్లు భగవంతుని ఆధీనములోనే భౌతిక శక్తి ద్వారా ఈ జగత్తు అంతా నడపబడుతుంది. ఈ విధంగా తన ధామములోనే ఉంటూ తన ఆధ్యాత్మిక భౌతిక శక్తుల ద్వారా ఆధ్యాత్మిక భౌతిక జగత్తులంతా విస్తరించి ఉన్నాడు. దీనిని బ్రహ్మసంహిత, గోపాల తపని ఉపనిషత్తు, శ్వేతశ్వతర ఉపనిషత్తులు బలంగా సమర్థిస్తూ ఉన్నాయి. అయితే ఈ శ్లోకములో తెలుపబడినట్లు 'భక్త్యా' - భక్తి ద్వారా మాత్రమే మనము కృష్ణుని ధామమునకు గాని, ఏదేని వైకుంఠలోకములకు గాని వెళ్ళగలము.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.





వ్యక్తిగత రుణాలు..స్మార్ట్‌గా!

వ్యక్తిగత రుణాలు జీవితంలో ప్రతి ఒక్కరికి అవసరమవుతాయి. పెళ్లికోసమో, ఇంటి మరమ్మత్తుల కోసమో, పర్యాటక ప్రాంతాలు సందర్శించేందుకో, మెడికల్ బిల్స్ చెల్లింపులకోసమో, చేసిన అప్పులు చెల్లింపుకో వ్యక్తిగత రుణాలను ఆశ్రయిస్తారు. ఒకే రుణం ద్వారా పలు ప్రయోజనాలు పొందడం, ఆర్థిక అవసరాలను తీర్చుకోవడం సాధ్యమవుతుంది. మీ ఆదాయం, క్రెడిట్ స్కోర్‌ను బట్టి వ్యక్తిగత రుణాలు పొందవచ్చు. పూచీకత్తు లేకుండానే రుణ సదుపాయం దొరుకుతుంది. అందుకే కాస్త వడ్డీ రేటు ఎక్కువే.

కాబట్టి వ్యక్తిగత రుణాలను స్మార్ట్‌గా పొందడం ఎలాగో ఓసారి చూద్దాం. ఉగాది లాంటి పండగలొస్తే ఇంట్లో కొత్తదనం నింపేందుకు ఏదో ఒక ఖర్చు చేస్తాం. కంపెనీలు ఈ అవకాశాలను చక్కగా ఉపయోగించుకుంటాయి. ఆకర్షణీయమైన ఆఫర్లతో ఊదరగొడతాయి. తక్కువ వడ్డీకే వ్యక్తిగత రుణాలు అందించేందుకు బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు ముందుకు వస్తాయి. ఇ కామర్స్ కంపెనీలు వ్యక్తిగత రుణాల పేరుతో విరివిగా విక్రయాలు కొనసాగిస్తాయి.

ఈ నేపథ్యంల పలు బ్యాంకులు అందించే వ్యక్తిగత రుణాల రేట్లను పరిశీలించి తక్కువ వడ్డీ రేటు రుణం పొందే అవకాశం ఉంటుంది. తక్కువ రేటుకే రుణాలు దొరుకుతున్నాయని తొందరపడకుండా రుణ నియమ నిబంధనలు జాగ్రత్తగా గమనించాలి. లేదంటే అడ్డదిడ్డంగా వడ్డీతో బాదుతారు.

సులభతరమైన రుణాలు

వ్యక్తిగత రుణాలు అందించడంలో ఆర్థిక సంస్థలు సులభతరమైన పద్ధతులు పాటిస్తున్నాయి. వీటినే పెక్సిబుల్ పర్సనల్ లోన్స్ అంటారు. మన అవసరాలకు తగ్గట్టుగా, సులభతర వాయిదా పద్ధతుల్లో ఈ రుణాలు లభిస్తున్నాయి.

వినియోగదారుడు కావాలనుకుంటే ఒకేసారి రుణం మొత్తం చెల్లింపులేకుంటే విడతల వారీగా చెల్లింపు అదే సమయంలో అసలు వడ్డీపై చెల్లింపు చివర్లో పూర్తి చెల్లింపులు ఇలా పలు ఆప్షన్స్‌ను అందిస్తున్నాయి.

ఇలాంటి సులభతరమైన వ్యక్తిగత రుణాలు వినియోగదారుడిపై భారం తగ్గిస్తున్నాయి. ఉదాహరణకి ఓ వ్యక్తి 5 లక్షల రూపాయల వ్యక్తిగత రుణం తీసుకున్నాడనుకుందాం. అందులో కొంత మాత్రమే వినియోగదారుడు వాడుకున్నట్లయితే ఆ మేరకే వడ్డీ కట్టే సదుపాయాన్ని బ్యాంకులు కల్పిస్తున్నాయి.

అంటే నీ వెంతరుణం తీసుకున్నా ఖర్చుచేసిన మేరకే వడ్డీ కడతావన్నమాట. ఒకప్పుడు ఇలాంటి సదుపాయం ఉండేది కాదు. ఎంత రుణం తీసుకుంటే ఖర్చుచేసినా, చేయకపోయినా పూర్తి వడ్డీ కట్టాల్సి వచ్చేది. సులభతరమైన రుణాల్లో మరో ఆసక్తికరమైన అంశం వ్యక్తిగత రుణాన్ని టర్మ్‌లోన్‌గా మార్చుకోవచ్చు. వ్యక్తిగత రుణం తీసుకుని గడువు ముగిసేలోగా ఆ రుణం తీర్చలేకపోతే టర్మ్ లోన్‌గా మార్చుకోవచ్చు. టర్మ్ లోన్‌లో నిర్ణీత సమయం వరకూ రుణాలు చెల్లించే సానుకూలత ఉంటుంది.

క్రెడిట్ హిస్టరీ చాలా ముఖ్యం

మహిందర్ కూతరు పెళ్లికోసం వ్యక్తిగత రుణం తీసుకుందామని బ్యాంకుకు వెళ్లాడు. సదరు బ్యాంకురుణం ఇచ్చేందుకు తిరస్కరించిందో ఆయనకు అర్థం కాలేదు. చివరికి ఆరాతీస్తే గతంలో తాను వినియోగించిన క్రెడిట్ కార్డుకు పూర్తి చెల్లింపులు చేయకపోవడం వల్లనే క్రెడిట్ స్కోర్ తగ్గడం ఇందుక్కారణం అని తెలుసుకున్నాడు. వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేస్తే నీ స్థిరమైన ఆదాయంతో పాటు గతంలో నీ క్రెడిట్ హిస్టరీనీ బ్యాంకులు బయటకు తీస్తాయి. దానిని బట్టీ నీకు క్రెడిట్ స్కోర్ అందిస్తాయి. అంటే గతంలో నీవు తీసుకున్న



రుణాలు, చెల్లింపు వివరాల చిట్టా అంతా బ్యాంకుల వద్ద ఉంటుంది.

ఇప్పుడు ప్రతి ఆర్థిక లావాదేవీకి పాన్‌కార్డ్ ,ఆధార్ కార్డ్ అనుసంధానం చేయడంతో ఎక్కడ రుణాలు ఎగ్గొట్టినా ఇట్టే తెలిసిపోతుంది. క్రెడిట్ ఇన్‌ఫర్మేషన్ కంపెనీలు ఈ వివరాలన్నీ బ్యాంకులకు అందిస్తున్నాయి. దీనితో రుణాలు ఇచ్చే ముందు సదరు వినియోగదారుడు మళ్లీ చెల్లిస్తాడా, లేదా అని బ్యాంకులు అంచనా వేస్తాయి.

నీ రుణ చరిత్రను బట్టి 300 నుంచి 900 వరకు క్రెడిట్ స్కోర్ లభిస్తుంది. కనీసం 750పైన స్కోర్ ఉంటే రుణం సులువుగా వస్తుంది. 900 మార్కులు వస్తే నీకు రుణం అందించేందుకు బ్యాంకులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.

కాబట్టి నీ క్రెడిట్ స్కోర్ ఎలా ఉందో తెలుసుకోవడం చాలామంచిది. ఇది రుణం తీసుకునే ముందే చేయాల్సిన పని. నీవు ఇంతవరకూ రుణం తీసుకోనట్లయితే క్రెడిట్ హిస్టరీ లేకపోవడం వల్ల బ్యాంకులు రుణం తిరస్కరించకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రుణ సదుపాయం పొందవచ్చు. నీ ఎఫ్‌డి నీకు సెక్యూరిటీగా పనిచేస్తుంది.

ఈ జాగ్రత్తలు పాటించాలి

✶ ఒకేసారి ఎక్కువరుణాలు తీసుకోకూడదు. మరో రుణం కోసం వెళ్లే ముందు ప్రస్తుతమున్న రుణాన్ని పూర్తిగా చెల్లించడం ఎంతో ముఖ్యం.

✶ క్రెడిట్ కార్డును విచ్చలవిడిగా వినియోగించి ఆ తర్వాత రుణాల చెల్లింపులో అలసత్వం వహిస్తే నీ క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది.

✶ రుణాలను సకాలంలో చెల్లించడం భవిష్యత్తులో రుణాలు తెచ్చుకోవడానికి సులువైన మార్గం.

✶ నీ జీతంలో రుణాలపై నెలసరి చెల్లిపులు (ఇఎమ్ఐ) 50శాతం లోపే ఉండేలా చూసుకోవాలి. ఎన్ని నెలసరి చెల్లింపులు ఎగ్గొడితే అన్ని నెగెటివ్ పాయింట్లు వస్తాయి.

✶ పండుగ ఆఫర్లు ఉన్నాయి గదా అని హద్దు అదుపులేని షాపింగ్ చేయవద్దు. అది మీ క్రెడిట్ స్కోర్‌ను దెబ్బతీస్తుంది.

✶ క్రెడిట్ బ్యూరో ద్వారా మీ క్రెడిట్ స్కోర్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఏమైనా వ్యత్యాసం కనిపిస్తే క్రెడిట్ బ్యూరో ద్వారా సరిచేసుకోవచ్చు.

పొదుపుకు పెద్దపీట

సేవింగ్ లేని ఆదాయం ఖర్చుతో సమానం. కాబట్టి వ్యక్తిగత రుణాలు తీసుకునే ముందు నీ ఆదాయంలో కొంతైనా పొదుపు చేయడం నేర్చుకోవాలి. 25 ఏళ్ల వయసులో సేవింగ్ మొదలు పెడితే నెల జీతంలో కనీసం 10శాతం అన్నా పొదుపే చేయాలి. వయసు పైబడే కొలదీ అది 35శాతానికి చేరుకోవాలి. దీన్నే 50-20-30 రూల్‌గా చెబుతారు. నెల జీతంలో 50శాతం నెలవారీ ఖర్చులకు, 20శాతం పొదుపుకు, మరో 20శాతం కుటుంబం ఆనందం, ఆహ్లాదానికి ఖర్చు చేయాలి. మన వయస్సును బట్టీ, ఆదాయాన్ని బట్టీ కాస్త రూల్‌ను అటు ఇటు మార్చుకోవచ్చు.

పర్సనల్ లోన్స్ అందుబాటులో ఉన్నాయి కదా అని తొందరపడకుండా కాస్త స్మార్ట్‌గా బిహేవ్ చేస్తే రుణాల ద్వారా లబ్ది పొందే అవకాశం ఉందని మర్చిపోవద్దు.



- స్టెర్లి రాజన్ బందెల
ఆర్థిక విశ్లేషకులు

టీడీఎస్ ప్రభుత్వానికి జమ అవడం లేదా?


టీడీఎస్ గురించి ప్రతీ వేతన జీవులు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన విషయం. టీడీఎస్ అంటే మూల ఆదాయం మీద పన్ను. అంటే మీరు పనిచేస్తున్న సంస్థలో మీరు పొందుతున్న వేతనం నుంచి యాజమాన్యం కొంత సొమ్ము మినహాయించి ఇస్తుంది. ఈ మినహాయించిన సొమ్మును టీడీఎస్ రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. టీడీఎస్ మినహాయింపు అనంతరం సంస్థలు ఫారం 16ను జారీ చేస్తాయి. అందులో మీ వేతనం ఎంత, పన్నులు ఎంత, ఆదాయ సర్టిఫికేట్ వంటివి ఉంటాయి.

మూడునెలలకోసారి కంపెనీ యాజమాన్యాలు టీడీఎస్ మొత్తాన్ని ప్రభుత్వానికి పంపిస్తాయి. ఫారం 16ను మార్చి నెలాఖరు అంటే ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి జారీ చేస్తారు.

అయితే ఈ మధ్య ఐటీ శాఖ టీడీఎస్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పలు అవకతవకలను గుర్తించింది. దాదాపు 447 కంపెనీలు ఉద్యోగులకు టీడీఎస్ మినహాయించి దాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా పక్కదారి పట్టించినట్లు ఆదాయపన్ను శాఖ జరిపిన దర్యాప్తులో తేలింది. దేశవ్యాప్తంగా ఈ కుంభకోణం విలువ రూ 3, 200 కోట్లుగా అంచనా వేశారు. దీంతో వేతన జీవులు నిండా మునిగారు. అయితే చాలా మంది ఉద్యోగులకు ఇలాంటి ఆర్థిక పరమైన అవగాహన ఉండదు. దీంతో టీడీఎస్ విషయంపై సగటు వేతన జీవులు ఆందోళన చెందుతున్నారు.

టీడీఎస్ ఎంత కట్ చేశారో తెలుసుకోండి..

పన్ను చెల్లింపుదారుడు ఒక ఆర్థిక సంవత్సరంలో పొందే ఆదాయాలపై టీడీఎస్ కట్ అవుతుంది. పనిచేస్తున్న సంస్థల నుంచి టీడీఎస్‌కు సంబంధించిన సర్టిఫికేట్స్ తీసుకుంటే ఎంత టీడీఎస్ చెల్లిస్తున్నారో తెలుస్తుంది. లేనిపక్షంలో ఆదాయపు పన్ను వెబ్‌సైట్‌లోకి వెళ్లికూడా 26ఎఎస్‌ఫారం డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా తెలుసుకోవచ్చు. అంతేకాదు ఇన్‌కంటాక్స్ ఈఫైలింగ్ పోర్టల్ ద్వారా ప్రతీ మూణ్ణెళ్లకొకసారి టీడీఎస్ వివరాలను తెలుసుకోవచ్చు. మీ పాన్‌నెంబర్, లాగిన్ యూజర్ ఐడీ, పాస్ వర్డ్ ద్వారా ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వొచ్చు.



లాగిన్ అయిన తర్వాత ఫారం 26 ఏఎస్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే ట్రేసెస్ వెబ్‌సైట్ నుంచి ఫారం 26 ఏఎస్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నెట్ బ్యాంకింగ్ ఉన్నట్లయితే నేరుగానే ఈ ఫైలింగ్ సైట్‌లోకి వెళ్లి ఈ ఫారం పొందవచ్చు.

అయితే సాధారణంగా టీడీఎస్ కట్ చేసిన అనంతరం సంస్థ ఆ మొత్తాన్ని ఐటీ శాఖకు జమ చేస్తే ఏ ప్రాబ్లం ఉండదు. టీడీఎస్ ఎగ్గొట్టినప్పుడే అసలు సమస్య మొదలవుతుంది. పనిచేస్తున్న సంస్థ టీడీఎస్ జమచేయకపోతే రిటర్న్‌లో లెక్కలకు, అసలు లెక్కలకు పొంతన ఉండదు. టీడీఎస్‌ను ఎప్పటికప్పుడు సంస్థ ఆదాయ పన్నుల శాఖకు చెల్లిస్తే ఇబ్బంది ఉండదు. అలా చెల్లించకుండా మీ టీడీఎస్‌ను కట్ చేసి ఆ సొమ్మును ఇతర అవసరాలను ఉపయోగిస్తే అసలు సమస్య. అప్పుడు ఆన్‌లైన్‌లో మీరు చేసుకున్నప్పుడు పన్ను బకాయిలు ఉన్నట్లు వెబ్‌సైట్‌లో కనిపిస్తుంది. అప్పుడు సెక్షన్ 143 (1) ఇన్‌కంటాక్స్ చట్టం, 1961 ప్రకారం చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుంది. ఇది చివరకు మీ జేబుకు చిల్లుపడే పరిస్థితికి దారితీయవచ్చు.

జాగ్రత్త పడితే మేలు

ఇలాంటి కార్పొరేట్ మోసాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి వేతన జీవులకు టీడీఎస్ మొత్తం జమ అవుతుందా, లేదా తెలుసుకునేందుకు వీలుగా అలర్ట్ సర్వీసును ప్రారంభించాలి. దీన్ని బట్టీ ఉద్యోగులు తమ సాలరీ స్లిప్‌లో కట్ అవుతున్న టీడీఎస్ మొత్తంను ఐటీశాఖలో జమ అవుతుందో లేదో సరిపోల్చుకోవచ్చు. లేదంటే ఆదాయ పన్ను శాఖకు ఫిర్యాదు చేయవచ్చు.

ఫారం 26 ఏఎస్

ఫారం 26 ఏఎస్ టీడీఎస్ మినహాయింపులు చెక్ చేసుకునేందుకు చాలా కీలకమైనది. ఫారం 26 ఏఎస్‌ని ఎలా చూడాలంటే ఐటీ వెబ్‌సైట్ ఈ ఫైలింగ్ లోకి వెళ్లి మీ అకౌంట్‌తో లాగిన్ అవ్వండి. మీ అకౌంట్‌కి వెళ్లిన తర్వాత వ్యూ ఫామ్ 26ఏఎస్ లోకి వెళ్లండి. అసెస్‌మెంట్ సంవత్సరాన్ని సెలక్ట్ చేసుకోవాలి. ఫైల్ డౌన్ లోడ్ చేసుకోండి. అది ఓపెన్ అవ్వాలంటే పాస్‌వర్డ్ కావాలి. అది మీ పుట్టిన రోజు. అలా క్లిక్ చేయగానే మీ ముందు కనిపిస్తుంది. మీ అకౌంట్, మీ ఆదాయం జమ చేసిన పన్ను వివరాలుంటాయి. ఫారం 16, 16ఏ సమాచారాన్ని 26ఏ ఎస్ సమాచారంతో పోల్చి చూడండి. అందులో ఏమైనా తేడాలుంటే వెంటనే మీ సంస్థకు తెలియజేయండి అప్పుడు సవరించిన ఫారం 16ను పొందండి.

హోం, కార్ లోన్స్... ఈఎంఐ పెరుగుతుందా?

మార్కెట్ నుంచి నిధుల సేకరణ ఖర్చులు పెరగడంతో మార్జిన్లను కాపాడుకునేందుకు బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపు వైపు దృష్టిసారిస్తున్నాయి. డిపాజిట్ రేట్లను ఆకర్షణీయంగా మార్చుకునేందుకు వడ్డీ రేట్ల పెంపు తప్పనిసరి. ఇదే సమయంలో రుణాలపై వడ్డీ రేట్లు కూడా పెరిగిపోవడం ఖాయం. మార్చ్ లేదా ఏప్రిల్‌లలో వడ్డీ రేట్లను పెంపునకు బ్యాంకులు సిద్ధపడవచ్చని నిపుణులు అంటున్నారు.


బేస్‌రేటును ఎంసీఎల్ఆర్‌తో లింక్ చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకున్నా.. ఇది ఏప్రిల్ 1 నుంచి అమలు కానుంది.

నాలుగేళ్లపాటు తగ్గుతూ వచ్చిన వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ఉందని మానిటరీ పాలసీ కమిటీ భేటి అనంతరం సూచనాప్రాయంగా తెలిసింది. గత కొన్ని నెలలలో బాండ్ ఈల్డ్స్ ఒక శాతం మేర పెరిగాయి. దీంతో డిపాజిట్ సర్టిఫికేట్స్‌ను జారీ చేయడం బ్యాంకులకు ఖరీదుగామారింది. అంతేకాదు మార్కెట్ బారోయింగ్స్ ఖర్చు పెరగడంతో అధిక రేటెడ్ కార్పొరేట్ కంపెనీలు కూడా బ్యాంకులకు క్యూ కడుతున్నాయి. దీంతో వడ్డీ రేట్ల పెంపువైపునకు బ్యాంకులు సమాలోచనలు జరుపుతున్నాయి.

ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్ల మేర పెంచుతూ హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ప్రయివేటు బ్యాంకులు అయిన యాక్సిస్ కోటక్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎస్ బ్యాంక్‌లు 5 నుంచి 10 బేసిస్ పాయింట్ల మేర ఎంసీఎల్ఆర్ రేటును పెంచాయి.

వడ్డీ పెంపుకు సిద్ధం

పదేళ్ల ఈల్డ్ 7.5శాతం.. ఎస్‌బీఐ హోమ్‌లోన్ రేట్ 8.3శాతంగా ఉన్నాయి. ఈ రెండింటి మధ్య ఇంత తక్కువ అంతరం ఉండడం.. గత నాలుగేళ్లలో ఇదే ప్రథమం. ఇలాంటి అధిక ఈల్డ్ కారణంగా ప్రభుత్వ నిధుల సేకరణ ఖర్చులు పెరుగుతాయి. అవి మానిటరీ పాలసీపై ప్రభావం చూపుతాయి. అందుకే ఎంసీఎల్ఆర్ పెరగడం ప్రారంభమైంది.



బల్క్ డిపాజిట్ రేట్లను బ్యాంకులు పెంచడం ప్రారంభించడాన్ని.. వడ్డీ రేట్లు పెరగడానికి ప్రారంభంగా చెప్పవచ్చు. ఏడాదికి పైబడ్డ కాలవ్యవది గల రూ 1 కోటికి పైగా డిపాజిట్లపై వడ్డీ రేటును.. కేవలం రెండు నెలల వ్యవధిలోనే 200 బేసిన్ పాయింట్ల మేర పెంచి 6.25శాతానికి చేర్చింది. డిపాజిట్స్ వృద్ధి రేటు 4.5శాతంగా ఉండగా.. లోన్స్ వృద్ధి 1శాతంగా ఉన్నట్లు జనవరి 5 నాటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు చెబుతున్నాయి.

ఈ లిక్విడిటీ పరిస్థితుల ప్రకారం వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని మనీ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకూ మార్కెట్ లీడర్ ఎస్‌బీఐ, ఎంసీఎల్ఆర్ రేట్‌ను పెంచలేదు. కానీ గతనెలలో బేస్ రేటును 30 బేసిస్ పాయింట్లు తగ్గించినా..ఇతర బ్యాంకులు ఏవీ ఈ చర్యను అనుసరించలేదు. బ్యాంకులు తాము అందించే రుణాలను బేస్‌రేటుకు మాత్రమే లింక్ చేసి ఉన్నాయి. ఇవి వడ్డీ రేట్ల పెంపునకు మాత్రమే సిద్ధమవుతున్నాయని క్రిసిల్ అంటోంది.

వంశపారంపర్య ఆస్తులు కొనేముందు..




వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తుల్లోంచి ఓ వ్యక్తి తన వాటాను అమ్మదలుచుకున్నప్పుడు కొనే వ్యక్తి జాగ్రత్తలు తీసుకోవాలి. ఉమ్మడి ఆస్తుల పంపకానికి సంబంధించిన దస్తావేజులను (పార్టీషన్ డీడ్) కచ్చితంగా పరిశీలించాలి. దానిలో ఎవరి వాటాను వారికి క్లియర్‌గా డీమార్కేషన్ చేశారా, లేదా నిబంధనల ప్రకారమే వాటాల విభజన జరిగిందా లేదా అన్నదీ సరిచూసుకోవాలి.

నిబంధనలకు అనుగుణంగానే పంపిణీ జరిగినప్పటికీ వంశపారంపర్యంగా వచ్చే ఆస్తుల్లో పిల్లలకు పుట్టుకతోనే హక్కు ఉంటుంది. 1985 తర్వాత ఆడపిల్లలకు కూడా మన రాష్ట్రంలో ఆస్తి హక్కు కల్పించారు. 2005 తర్వాత దేశవ్యాప్తంగా పురుషులతో సమానంగా స్త్రీలకు ఆస్తిలో సమాన ఆస్తి హక్కును అమలు చేస్తున్నారు. అందువల్ల ఇలాంటి ఆస్తులను కొనుగోలు చేస్తున్నప్పుడు అమ్మే వాళ్లకు ఇంకా భాగస్వాములుగానీ.. మైనర్ హక్కులకు సంబంధించి ఏమైనా సమస్యలు గానీ వున్నాయేమో తెలుసుకోవడం మంచిది.

పిల్లలు మైనర్లుగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆస్తులను తండ్రి అమ్మే ప్రయత్నం చేసినప్పుడు కూడా వాటిని కొనడం మంచిది కాదు.

ఉమ్మడి ఆస్తులను అమ్మేటప్పుడు ఆ వ్యక్తికి అన్‌డివైడెడ్ షేర్‌లో రైట్ మాత్రమే ఉంటుంది తప్ప మొత్తం ఆస్తి అమ్మే హక్కు ఉండదు.



గూడా వెంకటేశ్వరరావు
న్యాయవాది

అవన్నీ తెరపై చూడాల్సిందే...!

నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం కిర్రాక్ పార్టీ. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణంలో శరణ్ కొప్పిశెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. కిర్రాక్ పార్టీలో సందడి చేసిన నాయికలు సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జా తమ అనుభవాలు చెప్పుకొచ్చారు. సంయుక్త హెగ్డే మాట్లాడుతూ....మాది బెంగళూరు. సైకాలజీ చదువుకున్నాను. పలు టీవీ కార్యక్రమాల్లో నటించాను. ఆ తర్వాత సినిమాల్లో అవకాశాలు దక్కాయి. తొలి చిత్రం కిరిక్ పార్టీ మంచి పేరు తీసుకొచ్చింది. అందులో నా నటన బాగుందని తెలుగులోనూ తీసుకున్నారు. నాకు తెలిసిన కథ, పాత్ర అయినా సవాలుగా తీసుకుని నటించాను. సత్య అనే పాత్రలో కనిపిస్తాను. అల్లరి పిల్లలా ఉంటాను. నా నిజ జీవితానికి దగ్గరైన పాత్ర ఇది. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థినిగా నటించాను. కథానాయకుడితో ప్రేమలో పడతాను. నా పాత్ర కథలో కీలకంగా ఉంటుంది. సినిమాలో అనేక మలుపులుంటాయి. అవన్నీ తెరపైనే చూడాలి. కిరక్ పార్టీ కంటే తెలుగులోనే ఎక్కువ పరిపక్వతతో నటించాను. తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా నా పాత్ర తీరుతెన్నులు ఉంటాయి. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను.

ప్రస్తుతం మరిన్ని అవకాశాలు వస్తున్నాయి. అని చెప్పింది. మరో నాయిక సిమ్రాన్ పరీన్జా మాట్లాడుతూ...నేను హిందీలో పలు బుల్లితెర ధారావాహికల్లో నటించాను. అవి నాకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. ఆ గుర్తింపుతోనే తెలుగులో కిర్రాక్ పార్టీలో నటించే అవకాశం వచ్చింది. ఇందులో మీరా అనే పాత్రలో నటించాను. చాలా సాధారణంగా ఉండే అమ్మాయిగా కనిపిస్తాను. కన్నడలో రశ్మిక పోషించిన పాత్రను తెలుగులో నేను చేశాను. ఆమె ఎలా నటించిందో కిరిక్ పార్టీ చూసి తెలుసుకున్నాను. ఆమె నటనను గమనించినా....నా తరహాలో నటిస్తూ వెళ్లాను. నా పాత్ర అందరికీ నచ్చుతుంది. కళాశాల నేపథ్యం కాబట్టి యువతరం అంతా మా సినిమాను ఇష్టపడతారు. అని చెప్పింది.



సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీన్జా



పూజాహెగ్డే

జిగేల్ రాణి నాకు ప్రత్యేకం

టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన వరుస సినిమాలను దక్కించుకుంటూ హాట్‌టాపిక్‌గా నిలిచింది పూజాహెగ్డే. కెరీర్ ఆరంభంలో విజయాలు లభించక కాస్త నిరాశ ఎదురైనా అల్లు అర్జున్ సరసన నటించిన డీజే చిత్రం నుంచి ఆమె కెరీర్ ఒక్కసారిగా మలుపు తిరిగింది. బెల్లంకొండ శ్రీనివాస్ సరసన నటించిన సాక్ష్యం చిత్రం విడుదల కావాల్సి ఉండగా...ఇప్పుడు ఎంచక్కా ఎన్టీఆర్, త్రివిక్రమ్‌ల కలయికలో రూపొందుతున్న చిత్రంలోనూ, మహేష్‌బాబు, వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కబోయే చిత్రంలోనూ అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. సాహో తర్వాత ప్రభాస్, రాధాకృష్ణ (జిల్ ఫేమ్) కలయికలో రూపొందబోయే గోపీకృష్ణా మూవీస్ చిత్రంలో కూడా పూజాహెగ్డేను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు పరిశ్రమ వర్గాల భోగట్టా. ఇలా టాలీవుడ్‌లో సినిమాలపై సినిమాలు ఆమెకు లభిస్తున్నాయి. మరోవైపు బాలీవుడ్‌లో అవకాశాలు వచ్చినా ఆమె ఒదిలిపెట్టడం లేదు. ఇప్పటికే అక్కడ మొహంజదారో సినిమాలో ఆమె నటించిన విషయం తెలియంది కాదు. తాజాగా సల్మాన్‌ఖాన్ రేస్-3లో కూడా ఆమె నటిస్తోంది. ఇదిలావుండగా...రామ్‌చరణ్, సమంత జంటగా నటించిన రంగస్థలం చిత్రం విడుదలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఇందులో నేను డ్యాన్స్ చేసిన ప్రత్యేక గీతం...జిగేల్‌రాణి...నాకు ప్రత్యేకం అని పూజ అంటోంది. ఆ పాట తనకు గుర్తుకొస్తూనే ఉంటుందని, అలా గుర్తుకొచ్చినపుడల్లా తనకు ఉరకలేసే ఉత్సాహం కలుగుతుంటుందని ఆమె చెబుతోంది. ఆడియో పరంగానే కాకుండా విజువల్ పరంగా కూడా ఆ పాట తనను అంతగా ఆకట్టుకుందన్న అభిప్రాయాన్ని ఆమె వ్యక్తంచేస్తోంది.



రంగస్థలం కొత్త అనుభూతినిస్తుంది

- దర్శకుడు సుకుమార్

గ్రామీణ నేపథ్యంలో 80ల నాటి కథతో తాను రూపొందిస్తున్న రంగస్థలం సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుందని దర్శకుడు సుకుమార్ అన్నారు. ఈ చిత్రంతో గ్రామంలో ఉండే తన ఆత్మను వెతుక్కుంటూ వెళ్లానని ఆయన చెప్పారు. రామ్ చరణ్, సమంత జంటగా మైత్రీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఆది పినిశెట్టి కీలక పాత్రలో నటించారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించిన రంగస్థలం పాటలు ఒక్కొక్కటిగా విడుదలై శ్రోతలను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఇంటర్నెట్‌లో ఎక్కువ ఆదరణ పొందుతున్నాయి. మార్చి 30న రంగస్థలం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ నెల 18న ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని మెగాస్టార్ చిరంజీవి అతిథిగా వైజాగ్ ఆర్కే బీచ్‌లో నిర్వహించబోతున్నారు. ఈ వివరాలు చిత్రయూనిట్ తెలుపింది. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ....రంగస్థలం ఆడియో మార్కెట్‌లోకి ఇవాళ్టి నుంచి నేరుగా విడుదలవుతోంది. ఇప్పటికే సినిమాలో ఎంత సక్కగున్నావే, రంగా రంగ రంగస్థలానా, రంగమ్మ, మంగమ్మ మూడు పాటలు విడుదలయ్యాయి. వీటికి మంచి ఆదరణ దక్కుతోంది. మరో రెండు పాటలు ఆడియోలో ఉంటాయి. ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఓ పాట సినిమాలో ఉంటుంది. దాన్ని చంద్రబోస్‌గారు పాడారు. ఈ సినిమా 80వ దశకం కాలంలో సాగుతుంది. ప్రతి ఊరిలో రకరకాల వ్యక్తులుంటారు. భిన్నమైన మనస్తత్వాలు ఉంటాయి. వాళ్లలో గొప్ప దర్శకులు కావాల్సిన వాళ్లూ ఉంటారు. ఒక ఊరినే తీసుకుంటే చాలా కథలు దొరుకుతాయి. అవన్నీ కలిపి రంగస్థలం అనుకుని ఈ సినిమా రూపొందించాను. ఇప్పటిదాకా పట్టణాల్లో విదేశాల నేపథ్యంతో సినిమాలు చేశాను. కానీ ఈ సినిమా నా ఆత్మను వెతుక్కుంటూ వెళ్లిన ప్రయాణం. నాకు మంచి సాంకేతిక నిపుణులు దొరకడం వల్ల అనుకున్నట్లు సినిమా చేయగలిగాను. ముఖ్యంగా ఆర్ట్ విభాగం పనితనం అద్భుతంగా ఉంటుంది. రంగమ్మ మంగమ్మ పాటలో గొల్లభామ అనే పదం ఒక కీటకాన్ని ఊహించి పెట్టింది. ఎవరూ ఆపార్థం చేసుకోరని ఆశిస్తున్నా. నిర్మాతల కోరిక మేరకే ఈ చిత్రంలో ప్రత్యేక గీతం పెట్టాను అన్నారు.

ఆర్ట్ డైరక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ...నాకు రంగస్థలం సినిమా చేసే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. రేపు సినిమా చూశాక ప్రేక్షకులు కొత్తదనాన్ని ఆస్వాదిస్తారు. నేను చేసిన చిత్రాల్లో ఉత్తమ ప్రదర్శన అవుతుంది. అన్నారు. చంద్రబోస్ మాట్లాడుతూ....మంచి సాహిత్యానికి సంగీతం కుదిరాయి కాబట్టే పాటలు ఆకట్టుకుంటున్నాయి. మనలో చాలా మంది గ్రామాల్లో నుంచి వచ్చినవారే కాబట్టి పాటలు అందరికీ నచ్చుతున్నాయి అన్నారు.



పిల్లల ప్రతిభను చూపిస్తూ

ప్రభుదేవా, ఐశ్వర్యా రాజేష్ నటించిన తమిళ చిత్రం లక్ష్మీ తెలుగులో అదే పేరుతో అనువాదమవుతోంది. ట్రిడెంట్ ఆర్ట్, ప్రమోద్ ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఏఎల్ విజయ్ దర్శకత్వం వహించారు. నృత్యాల నేపథ్యంతో సాగే లక్ష్మీ సినిమాలో పిల్లలు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దిత్యా భండే టైటిల్ రోల్ పోషించింది. లక్ష్మీ చిత్ర టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రభుదేవా మాట్లాడుతూ....పిల్లలతో హారర్, కామెడీ, యాక్షన్ సినిమాలు వస్తుంటాయి...కానీ నృత్యాల నేపథ్యంతో సినిమా రావడం అరుదు. ఇలాంటి ప్రయత్నం చేసిన నిర్మాతలను అభినందించాలి. పిల్లల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంటుంది. ముఖ్యంగా నృత్యాలు చేయడంలో వాళ్లు నన్ను మించిపోయారు. లక్ష్మీ పాత్రలో నటించిన దిత్యా భండే నా కంటే బాగా డాన్సులు చేసింది. ఎన్ని నృత్యాలు చేసినా...దానికి సరిపోయే భావోద్వేగాలు కథలో ఉండాలి. దర్శకుడు ఏఎల్ విజయ్ ఆ జాగ్రత్త తీసుకున్నారు. చిత్రాన్ని చక్కగా మలిచారు. అతనితో నేను గతంలో అభినేత్రి సినిమా చేశాను. ఆ సినిమా సీక్వెల్ చేయాల్సి ఉంది. అయితే ఆ ప్రాజెక్ట్ కుదరలేదు. లక్ష్మీ కథ చెప్పగానే చాలా బాగుందనిపించింది. ఈ సినిమా చూస్తున్నంత సేపు మీరు నవ్వుకుంటారు, ఏడుస్తారు, ఆస్వాదిస్తారు. అన్నారు. దర్శకుడు ఏఎల్ విజయ్ మాట్లాడుతూ....ప్రభుదేవా గారు ఎంత మంచి నృత్యకారుడో అందరికీ తెలుసు. ఆయనతో రెండో సినిమా చేయడం సంతోషంగా ఉంది. ప్రభుదేవా డాన్సర్ మాత్రమే కాదు మంచి దర్శకుడు, కథపై పట్టున్న నటుడు. మాకు చాలా సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సినిమా కోసం దేశవ్యాప్తంగా పిల్లలను ఎంపిక చేసి నటింపజేశాం. టైటిల్ పాత్రలో దిత్యా భండే ఆకట్టుకుంటుంది అన్నారు.



రామ్

అవార్డు రావడం ఆనందం

- దర్శకురాలు జయ.బి.

ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ వి టీమ్, జె వరల్డ్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విశాఖపట్నంలో నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 13 మంది మహిళలకు పురస్కారాలు అందజేశారు. నటి, దర్శకురాలు విజయనిర్మలకు జీవనసాఫల్య పురస్కారాన్ని అందించారు. ఈ అవార్డును ఆమె తరుపున తనయుడు నరేష్ స్వీకరించారు. దర్శకత్వ విభాగంలో అవార్డును జయ.బి, సంప్రదాయ నృత్యంలో అమెరికాకు చెందిన సీత మాడభూషి, నటి సన తదితరులు పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా దర్శకురాలు జయ.బి. మాట్లాడుతూ విజయనిర్మలగారికి లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు వచ్చిన ఈ వేడుకలో, విశాక ప్రజల సమక్షంలో దర్శకురాలిగా నేను అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది అన్నారు.

ఈ కార్యక్రమంలో నటులు శరత్‌కుమార్, నరేష్, మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, దర్శకురాలు జయ.బి, గంటా శారద, డా.రఘు, నటుడు గంటా రవితేజ, నిర్మాత బి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.



పొంతన లేని విభిన్నమైన సినిమాలు...వైవిధ్యమైన పాత్రలు చేయాలని ఆర్టిస్టులు కోరుకుంటుంటారు. ఈ కోవలో రామ్ కూడా సినిమా సినిమాకు కొత్తగా కనిపించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఉన్నది ఒకటే జిందగీ చిత్రం తర్వాత ఆయన నటిస్తున్న హలో గురు ప్రేమకోసమే చిత్రం ఇటీవల ప్రారంభమైంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం సెట్స్‌పైకి ఇలా వచ్చిన వెంటనే రామ్ తన

అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్

కొత్త చిత్రం గురించి చర్చిస్తున్నారని సమాచారం. ఈ మధ్య రాజశేఖర్ కథానాయకుడిగా గరుడవేగ వంటి విజయవంతమైన చిత్రానికి దర్శకత్వం వహించిన ప్రవీణ్ సత్తారు తన కొత్త చిత్రం పనిలో పడ్డారు. అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో తాజా చిత్రాన్ని తీయాలని ప్రవీణ్ సత్తారు అనుకుంటున్నారని, అందులో భాగంగా రామ్ ఆ కథను విన్నారని, ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ చిత్రం ప్రకటన రావచ్చునన్న అభిప్రాయాలు పరిశ్రమలో వ్యక్తమవుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్ అధికభాగం విదేశాల్లో ఉంటుందని కూడా అంటున్నారు.

